
'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 | వెల: ₹ 5.50

సంపుటి: 18 | సంచిక: 85

సోమవారం | 16-6-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కలలోనూ ఊహించలేదు

భారత టెస్టు జట్టు కెప్టెన్సీపై శుబ్‌మన్ గిల్ వ్యాఖ్య -14లో



ఆస్తుల బదిలీ సాఫీగా..

ఆస్తుల పంపకం సులభమే. అందుబాటులో ఎన్నో మార్గాలు -15లో



తరాలు మారి.. అంతరాలు పెరిగి..

యువతకు, వయోధికులకు మధ్య దూరం పెరుగుతోందని హైదరాబాద్ సహా 10 నగరాల్లో జరిగిన సర్వేలో తేలింది.

వివరాలు 2లో ▸



ఇంతింతై.. కాస్తంతై..

భారత ఐటీ పరిశ్రమలోని ఐదు అగ్రశేణి సంస్థల్లోని మొత్తం ఉద్యోగుల్లో మహిళా ఉద్యోగుల సంఖ్య స్వల్పంగా తగ్గింది.

వివరాలు 3లో ▸



శాటిలైట్ లెక్క.. సాగు పక్కా

దేశంలో శాటిలైట్ ఆధారిత సాగు లెక్కల సేకరణ ప్రారంభమవడంతో కచ్చితత్వంతో కూడిన గణాంకాలకు మార్గం సుగమమైంది.

వివరాలు 5లో ▸



ఎండ ప్రచండం!

2030కి హైదరాబాద్, ఢిల్లీ వంటి నగరాల్లో వడగాడ్పులు వీచే రోజుల సంఖ్య రెట్టింపు కానుందని తాజా అధ్యయనంలో వెల్లడైంది.

వివరాలు 12లో ▸

జూలై రెండో వారంలో..

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు



- ఈ నెలాఖరులో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్
- తర్వాత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే యోచన
- త్వరలో జరిగే మంత్రివర్గ భేటీలో స్పష్టత వచ్చే అవకాశం
- ఈ వారంలోనే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు
- వీలున్నంత త్వరగా సన్న ధాన్యానికి బోనస్
- తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చేందుకు సర్కారు సిద్ధం!
- రిజర్వేషన్ల పెంపు లేకుండానే..?
- కాంగ్రెస్‌లో మొదలైన హడావుడి

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నగారా త్వరలో మోగనుంది. వచ్చే నెల రెండో వారంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. తొలిదశలో ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఆ తర్వాత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలను నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఎంపీటీసీలు, జెడ్పీటీసీల ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ ఈనెల చివరి వారంలోనే వస్తుందని సమాచారం. కాగా స్థానిక ఎన్నికల నిర్వహణ అంశంపై త్వరలో జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో స్పష్టత వస్తుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

ఎప్పుడో ముగిసిన పాలకవర్గాల గడువు

రాష్ట్రంలోని స్థానిక సంస్థల గడువు ఎప్పుడో ముగిసింది. గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు 2024, జనవరిలోనే అయిపోయింది. జిల్లా, మండల పరిషత్ పాలకవర్గాల గడువు గత ఏడాది జూన్‌లో పూర్తయింది. ఇక పురపాలక సంఘాలకు ఈ ఏడాది జనవరిలో గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో వీలున్నంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ అన్ని వర్గాల నుంచి వస్తోంది. మరోవైపు కేంద్రం ప్రతి ఏటా స్థానిక సంస్థలకు రూ.1,500 కోట్ల నుంచి రూ.2,000 కోట్ల వరకు నిధులు ఇచ్చే అవకాశాలున్నాయి. అయితే పాలకవర్గాలు లేని కారణంగా ఈ నిధులను రాష్ట్రం కోల్పోవాల్సి వస్తోంది. ఇంకోవైపు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర తర్వాత కూడా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించలేకపోతోందని రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో స్థానిక సమరానికి ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు కనిపిస్తోంది. కాగా ఎన్నికల నోటిఫికేషన్ వెలువరించే ముందే రైతులకు పెట్టుబడి

మిగతా 5వ పేజీలో ▶

నేడు మంత్రులతో సీఎం కీలక చర్చలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అందుబాటులో ఉన్న మంత్రులతో సమావేశం కానున్నారు. పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ప్రధానంగా స్థానిక ఎన్నికల నిర్వహణ, రైతు భరోసా నిధుల పంపిణీ తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. వాస్తవానికి ప్రతి 15 రోజులకు ఒకసారి కేబినెట్ భేటీ నిర్వహించాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే సోమవారం మాత్రం అందుబాటులో ఉన్న మంత్రులతో సమావేశం నిర్వహించాలని సీఎం నిర్ణయించినట్లు తెలిసింది.

టెహ్రాన్‌లోని చమురు నిల్వ కేంద్రంపై ఇజ్రాయెల్ క్షిపణి దాడితో చెలరేగుతున్న మంటలు



దాడులే దాడులు

వెనక్కి తగ్గని ఇజ్రాయెల్, ఇరాన్

- ఇరాన్‌లోని గ్యాస్, చమురు కర్మాగారాలపై బాంబులు
- రక్షణ శాఖ ప్రధాన కార్యాలయంపై క్షిపణి దాడులు
- 406 మంది మృతి.. ఒక్క భవనంలోనే 60 మంది!
- ఇజ్రాయెల్ నగరాలపై ఇరాన్ భారీ దాడులు
- అపార్ట్‌మెంట్ ధ్వంసమై ఏడుగురి దుర్మరణం
- క్షతగాత్రులు 390 మందికి పైగానే..
- అమెరికాతో ఇరాన్ ఆరో విడత అణు చర్చలు రద్దు
- మాపై దాడి చేస్తే ఇరాన్‌ను తుడిచిపెట్టేస్తాం: ట్రంప్
- కొడుకు పెళ్లి వాయిదా వేసుకున్న నెతన్యాహూ

6 లో

తెలుగువారంతా

క్షేమమే

- ఇజ్రాయెల్ తెలుగు అసోసియేషన్ వెల్లడి
- ఇరాన్– ఇజ్రాయెల్ యుద్ధంతో పెరిగిన ఉద్రిక్తతలు

2 లో

న్యూస్‌రీల్

ఆగస్టు 15 కల్లా పరిష్కారం



రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో వస్తున్న భూసమస్యలను ఆగస్టు 15కల్లా పరిష్కరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి పొంగులేటి చెప్పారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై ఆదివారం అధికారులతో సమీక్షించారు.

- వివరాలు 8లో▶

బనకచర్లతో తీవ్ర నష్టం



గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్టుతో గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులకు తీవ్ర నష్టం కలుగుతుందని హరీశ్‌రావు హెచ్చరించారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్‌కు ఆయన లేఖ రాశారు.

- వివరాలు 8లో▶

నడక వంతెన కూలి... నలుగురి దుర్మరణం



మహారాష్ట్రలోని ఇంద్రయాణి నదిపై 30 ఏళ్ల నాటి ఓ చిన్న వంతెన పాక్షికంగా కూలడంతో దానిపై నడుస్తున్న పర్యాటకులు నదిలో పడిపోయారు. ఈ ప్రమాదంలో నలుగురు మరణించగా 38 మందిని కాపాడారు.

- వివరాలు 6లో▶

బసంత్‌నగర్ కాదు.. అంతర్‌గావ్



రామగుండం సమీపంలోని బసంత్‌నగర్‌లో ఉన్న పాత ఎయిర్‌స్ట్రిప్‌ను విమానాశ్రయంగా మార్చడం సాధ్యం కాదని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ తేల్చింది. దానికి బదులు 18 కి.మీ. దూరంలోని అంతర్‌గావ్‌ను ఎంపిక చేసింది.

- వివరాలు 2లో▶



ఎంవోయూలు కుదుర్చుకున్న సందర్భంగా ఎన్జీవోల ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు

ప్రభుత్వ బడుల్లో టెక్ కోర్సులు

- ఆరు సంస్థలతో సర్కారు అవగాహన ఒప్పందాలు
- సీఎం రేవంత్ సమక్షంలో ఎంవోయూలు
- ఏఐ, కంప్యూటేషనల్ థింకింగ్, కోడింగ్‌తోపాటు జేఈఈ, నీట్ శిక్షణ
- బాలికల అక్షరాస్యత పెంపునకూ కృషి

సాక్షి, హైదరాబాద్: సర్కారు బడుల్లో అత్యాధునిక బోధన సేవలను ఉచితంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆరు ప్రముఖ సంస్థలతో ఒప్పందం చేసుకుంది. ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో విద్యాశాఖ అధికారులు ఎంవోయూలు కుదుర్చుకున్నారు. దీంతో పాఠశాలల్లో ఆధునిక బోధన సదుపాయాలు అందనున్నాయని ప్రభుత్వం తెలిపింది. ప్రముఖ వాణిజ్యవేత్త నందన్ నీలేకని సారథ్యంలోని ఎక్‌స్టెప్ ఫౌండేషన్, డాక్టర్ సునీతా కృష్ణన్ సారథ్యంలోని ప్రజ్వల ఫౌండేషన్, అలక్ పాండే ఆధ్వర్యంలోని ఫిజిక్స్‌వాలా, ఖాన్ అకాడమీ, షోయబ్దార్ నిర్వహిస్తున్న పైజామ్ ఫౌండేషన్, సఫీనా హుస్సేన్ ఆధ్వర్యంలోని ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థలతో ఈ ఒప్పందాలు జరిగాయి. ఎంవోయూ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి

మిగతా 5వ పేజీలో ▶



హోరెత్తిన 'నో కింగ్స్' నినాదం

- ట్రంప్ వ్యతిరేక నిరసనలతో దద్దరిల్లిన అమెరికా
- లక్షలాదిగా రోడ్లపైకి వచ్చిన ఆందోళనకారులు

- వివరాలు 6లో

భారతీయుని విషాదాంతం

- గొంతుపై మోకాలితో తొక్కి.. ఆస్ట్రేలియాలో పోలీసు జులుం
- రెండు వారాలు కోమాలోకి వెళ్లి గౌరవ్ మృతి..
- అమెరికా 'ఫ్లాయిడ్' తరహా ఘటనపై దుమారం

- వివరాలు 6లో

నాన్నా.. డబ్బు పంపండి!

తల్లిదండ్రులకు అమెరికా నుంచి పిల్లల ఫోన్లు



- డాలర్ దెబ్బకు మన విద్యార్థుల విలవిల
- భారీగా పెరిగిన ట్యూషన్ ఫీజులు
- సన్నగిల్లిన పార్ట్ టైం ఉద్యోగాలు.. ఆదాయం నిల్.. డబ్బులు పంపితే తప్ప గడవని పరిస్థితి
- హడలిపోతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

అప్పులు చేస్తున్నాం... డబ్బులు పంపుతున్నాం

మా బాబును అమెరికా పంపినప్పుడు ఎంతో సంతోషించాం. కానీ ఇప్పుడు ప్రతీ రోజూ ఏడుస్తున్నాం. ఫీజులు పెరిగాయి. ఉద్యోగాల్లేవు. అమ్మా డబ్బులు పంపు అనడం మాత్రమే ప్రతీ ఫోన్ కాల్‌లో విన్పిస్తోంది. అప్పులు చేసి మరీ పంపుతున్నాం. ఈ పరిస్థితి ఎక్కడి వరకూ వెళ్తుందో అనే ఆందోళన ఉంది.

- వరలక్ష్మి పల్లవ (విద్యార్థి తల్లి, హైదరాబాద్)

సాక్షి, హైదరాబాద్: అమెరికాలో మన విద్యార్థులు అనుకున్నదొకటి... అక్కడ జరుగుతున్నది మరొకటి. భౌగోళిక పరిస్థితులు, అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాలు మన విద్యార్థులను తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నాయి. ఈ ఇబ్బందులు భారత్‌లో ఉన్న తల్లిదండ్రులకూ కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. రానురాను డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ క్షీణిస్తోంది. దీంతో విద్య కోసం అమెరికాకు వెళ్లిన విద్యార్థులకు ఊహించని విధంగా ఖర్చులు పెరిగిపోతున్నాయి. 2014లో డాలర్ విలువ రూ.60.95 ఉంటే, ఇప్పుడు రూ.86.25కు చేరింది. దీంతో విదేశీ విద్య కోసం వెళ్లిన మన విద్యార్థులు తిప్పలు పడుతున్నారు. దీనికితోడు పార్ట్ టైం ఉద్యోగాలకు అవకాశాలు సన్నగిల్లడంతో భారత్‌లోని తల్లిదండ్రుల వైపు విద్యార్థులు దీనంగా చూసే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఫోన్ చేసి డబ్బులు పంపండి అని అడుగుతున్నారు. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్ అన్ని దేశాల్లోనూ భారత విద్యార్థుల పరిస్థితి ఈ విధంగానే ఉందనే వార్తలొస్తున్నాయి. విదేశీ విద్యకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్న విద్యార్థులూ ఇప్పుడు వెనుకడుగు వేస్తున్నారు. పెరిగిన మారకం

మిగతా 3వ పేజీలో ▶





కుప్పకూలిన హెలికాప్టర్

రెండేళ్ల పాప సహా ఏడుగురు దుర్మరణం

- కేదార్‌నాథ్ నుంచి తిరిగి వస్తుండగా దుర్ఘటన
- ఆర్యన్ ఏవియేషన్ కార్యకలాపాలపై నిషేధం
- సమగ్ర దర్యాప్తునకు ఆదేశించిన సర్కార్

6 లో

47 మృతదేహాల గుర్తింపు

- ఎయిరిండియా ప్రమాద ఘటనలో 24 మృతదేహాలు బంధువులకు అప్పగింత..

-6లో

గోదావరిలో ఘోరం

నదిలో మునిగి ఐదుగురు యువకుల దుర్మరణం

- అంతా బంధువులే.. వీరిలో ముగ్గురు సోదరులు
- హైదరాబాద్‌కు చెందిన రాజస్తానీ కుటుంబాల్లో విషాదం
- నిర్మల్ జిల్లా బాసరలో ఘటన





కుమారుడు మదన్‌కు సీపీఆర్ చేసేందుకు ప్రయత్నిస్తున్న తల్లి సోను. కుమారుల మృతితో విలపిస్తున్న తండ్రి

భైంసా/బాసర/భైంసా టౌన్/చింతల్ (హైదరాబాద్): నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరిలో ఆదివారం ఘోరం జరిగింది. దైవ దర్శనం చేసుకోవడంతో పాటు సరదాగా గడపాలని వచ్చిన హైదరాబాద్‌కు చెందిన యువకులు నదిలో స్నానం చేస్తూ నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. మూడు కుటుంబాలకు చెందిన వీరంతా బంధువులే అని తెలిసింది. కాగా ఊహించని విధంగా జరిగిన ఈ దుర్ఘటనతో రోదనలు మిన్నంటాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని బేగంబజార్, చింతల్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల నుంచి, రాజస్తానీ కుటుంబాలకు చెందిన సుమారు 30 మంది ఆదివారం ఉదయం ఇంటర్ సిటీ రైలులో బాసర చేరుకున్నారు. తొలుత స్నానాలు చేయాలని భావించారు. ఘాట్ వద్ద నీరు మురికిగా ఉండడంతో బోటు ద్వారా నది మధ్యలోని ఇసుక తిన్నెల వద్దకు వెళ్లారు. అంతా కేరింతలు కొడుతూ సంతోషంగా గడుపుతుండగా, రాథోడ్ రాకేశ్ (20), భరత్ (16), మదన్ (18), వినోద్ (19), రుత్విక్ (22) స్నానానికి నదిలో దిగారు. అయితే అక్కడ నది లోతు అంచనా లేకపోవడం వారి ప్రాణాలకు ముప్పు తెచ్చింది. కుటుంబీకులు చూస్తుండగానే ఒకరి వెనుక ఒకరు ఐదుగురూ నీట మునిగిపోయారు. అంతా కేకలు పెట్టడంతో అక్కడే ఉన్న కొందరు స్పందించి కొద్దిసేపటికే రాకేశ్, భరత్, మదన్, రుత్విక్‌లను ఒడ్డుకు

మిగతా 5వ పేజీలో ▶

విద్యుదాఘాతానికి

నలుగురు బలి

- జగిత్యాల జిల్లాలో గణపతి విగ్రహం తరలిస్తుండగా పది మందికి షాక్.. ఇద్దరు మృతి
- హైదరాబాద్‌లో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వారిపై పడిన వైరు.. ఇద్దరు దుర్మరణం

5 లో

తరాలు మారి.. అంతరాలు పెరిగి..



వయోధికులకు దూరమవుతున్న యువత

తాతలు, బామ్మలతో తగ్గుతున్న అనుబంధం

కుటుంబాల్లో కొరవడుతున్న ఆత్మీయ పలకరింపు

హెల్పేజ్ ఇండియా అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్ సహా 10 నగరాల్లో సర్వే

సాక్షి, హైదరాబాద్

ఈ తరం యువతకు, నిన్నటి తరం వయోధికులకు నడుమ దూరం పెరుగుతోంది. పెద్దవాళ్లను బాగా చూసుకోవడమంటే వాళ్లకు కావలసిన వైద్య సదుపాయాలను కల్పించడం, సమయానికి మందులు, భోజనం వంటివి అందజేయడమే అనే భావన పెరిగిపోతోంది. తమ భావోద్వేగాలను పిల్లలతో పంచుకోవాలని పెద్దలు ఆశిస్తుండగా, యువత మాత్రం అందుకు సిద్ధంగా లేదు. ఈ నెల 15వ తేదీన అంతర్జాతీయ వయోధికుల వేధింపుల నివారణ అవగాహన దినం సందర్భంగా హెల్పేజ్ ఇండియా 'ప్రస్తుత డిజిటల్ యుగంలో వృద్ధాప్యంపై యువత దృక్కోణం'అనే అంశంపై సర్వే నిర్వహించింది. ఈ అధ్యయనంలో యువత, వయోధికుల అభిప్రాయాలను సేకరించారు. హైదరాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా 10 నగరాల్లో 5,798 మంది ఈ సర్వేలో పాల్గొన్నారు.

సర్వేలోని ముఖ్యాంశాలు..

- సర్వేలో వృద్ధాప్యం అంటే ఏమిటి అన్న ప్రశ్నకు 56 శాతం యువత 'ఒంటరితనం'అని, మరో 48 శాతం 'ఇతరులపై ఆధారపడేవారు'అని బదులిచ్చారు. అపార అనుభవం కలిగినవారు అని 51 శాతం యువత పేర్కొనగా, 'గౌరవించవలసిన వాళ్లు' అని 43 శాతం మంది అభిప్రాయపడ్డారు.
- సర్వేలో పాల్గొన్న వయోధికుల్లో 54 శాతం మంది తాము ఒంటరితనానికి గురవుతున్నట్లు చెప్పారు. 47 శాతం మంది తమ బాధలను పూర్తిగా అర్థం చేసుకోవడం లేదని వాపోయారు.
- ఉమ్మడి కుటుంబాల్లో మాత్రం పెద్దవాళ్లకు, పిల్లలకు మధ్య అనుబంధాలు కొంతవరకు బలంగానే ఉన్నాయి. 49 శాతం యువత తమ తాత, ముత్తాతలతో ఎక్కువ సమయం గడుపుతున్నామని చెప్పారు. 50 శాతం మంది వృద్ధులు తమ కొడుకులతో ఎక్కువ అనుబంధాన్ని, 40 శాతం మంది తమ మనవళ్లతో ఎక్కువ అనుబంధాన్ని కలిగి ఉన్నామని వెల్లడించారు.
- చిన్న కుటుంబాల్లో వయోధికులకు సముచితమైన గౌరవం లభిస్తున్నట్లు సర్వేలో తేలింది. సర్వేలో పాల్గొన్న 75 శాతం వయోధికుల్లో 46 శాతం మంది కుటుంబం తమ మాట వింటుందని, మరో 28 శాతం మంది అప్పుడప్పుడు మాత్రమే వింటుందని తెలిపారు.
- 71 శాతం వృద్ధులు సాధారణ మొబైల్ ఫోన్లు వాడుతుండగా, 13 శాతం మంది కంప్యూటర్లు, ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తున్నట్లు తేలింది. 66 శాతం వయోధికులు మొబైల్ ఫోన్‌ను 'సాంకేతిక గందరగోళం'గా భావిస్తున్నారు.
- 51 శాతం యువత, 45 శాతం వయోధికులు తరాల మధ్య అతి పెద్ద అంతరం ఉన్నట్లు పేర్కొన్నారు. 57 శాతం యువత, 49 శాతం వయోధికులు మాత్రం మనం ఒకరినొకరు బాగా అర్థం చేసుకోవచ్చుననే ఆశావహ దృక్పథాన్ని కలిగి ఉన్నారు.
- సర్వేలో పాల్గొన్న 86 శాతం వయోధికులు కుటుంబమే తమకు అండగా ఉందని తెలిపారు.



సంతోషకరమైన వృద్ధాప్యం కావాలి

జీవితంలో ప్రతి ఒక్కరికి వృద్ధాప్యం అనివార్యమైన దశ. పెద్దలను అర్థం చేసుకోవడంలో యువత విఫలం కావడం వల్ల చాలామంది వయోధికులు సంతోషకరమైన వృద్ధాప్యానికి దూరమవుతున్నారు. కుటుంబ సంబంధాలు బలోపేతంగా ఉంటేనే ఆ సంతోషం లభిస్తుంది.

- శ్యామ్, స్టేట్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్, హెల్పేజ్ ఇండియా

మూడు రోజులు మోస్తరు వర్షాలు

దక్షిణ, మధ్య మహారాష్ట్ర మీదుగా కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ, మధ్య మహారాష్ట్ర మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సముద్రమట్టం నుంచి సగటున 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉంది. ఈ ఉపరితల ఆవర్తనం ఎత్తు పెరిగే కొద్దీ నైరుతి దిక్కుకు వాలి ఉండగా, మరోవైపు వాయవ్య బంగాళాఖాతంలో ఒక ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. శనివారం ఉత్తరాంధ్ర తీరం, దాని పరిసర ప్రాంతాల్లోని పశ్చిమ మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, తాజాగా వాయవ్య బంగాళాఖాతం దాని పరిసరాల్లో ఏర్పడ్డ ఉపరితల ఆవర్తనంలో విలీనమైంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. దక్షిణ ప్రాంత జిల్లాల తోపాటు ఉత్తర ప్రాంతంలోని కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. రాష్ట్రంలోని ఉత్తర ప్రాంత జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు సోమవారం కురిసే అవకాశం ఉన్నట్టు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో చాలా చోట్ల సాధారణం కంటే 4డిగ్రీల సెల్సియస్ తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు వాతావరణ శాఖ అధికారులు చెప్పారు.

ఘనంగా భట్టి జన్మదిన వేడుకలు

శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు, ఎమ్మెల్యేలు



భట్టి విక్రమార్కకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి సీతక్క తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం ఆయన పుట్టినరోజు సందర్భంగా ప్రజలు, అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రజాభవన్‌కు చేరుకుని భట్టికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, ఎంపీ మల్లు రవి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు భట్టికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ సినీనటుడు మురళీ మోహన్ సైతం ప్రజాభ వన్‌కు వెళ్లి ఉప ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. వివిధ ఆలయాల నుంచి వచ్చిన వేద పండితులు, అర్చకులు భట్టి విక్రమార్కకు ఆశీర్వాదాలు అందించారు. ఓయూ విద్యార్థి నాయకులు ప్రత్యేకంగా చేయించిన భారీ కేక్‌ను భట్టితో కట్ చేయించారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ సేవా సంఘం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 91,720 మంది స్వామివారిని దర్శించుకోగా 44,678 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.80 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది.

భూగర్భ జలాలకు మేలు!

ముందస్తు వర్షాలతో మే నెలలో పెరిగిన భూగర్భ జలమట్టం

ఏప్రిల్‌లో రాష్ట్ర భూగర్భ జలాల సగటు లోతు 10.17 మీటర్లు

మేలో 10.07 మీటర్ల సగటు లోతుకే భూగర్భ జలాల లభ్యత



సాక్షి, హైదరాబాద్: ముందస్తు వర్షాలతో వేసవి ముగియక ముందే రాష్ట్రంలో భూగర్భ జలమట్టాల్లో పెరుగుదల ప్రారంభమైంది. మండుటెండలు, సాగు, తాగు, ఇతర అవసరాలకు నీటి వినియోగం అధికంగా ఉండటంతో గత ఏప్రిల్ నాటికి భూగర్భ జలాల రాష్ట్ర సగటు మట్టం 10.17 మీటర్ల లోతుకు పడిపోయింది. ముందస్తుగా రుతుపవనాల రాకతో ఆ తర్వాతి మే నెలలో భారీ వర్షాలు కురిశాయి. దీంతో ఆ నెలలో రాష్ట్ర భూగర్భ జలమట్టాల సగటు లోతు 10.07 మీటర్లకు తగ్గింది. 2024 మేతో పోల్చితే 2025 మేలో 0.30 మీటర్ల పెరుగుదల కనిపించింది. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో భూగర్భ జల మట్టాలు మరింతగా పెరగనున్నాయి. రాష్ట్ర భూగర్భ జలవనరుల శాఖ ఏప్రిల్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో భూగర్భ జలాల స్థితిగతులను పరిశీలించి రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి.

15 జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరం

రాష్ట్రంలోనే అత్యధికంగా వికారాబాద్ జిల్లాలో 15.44 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. అత్యల్పంగా జగిత్యాల జిల్లాలో 5.68 మీటర్ల లోతులోనే భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలను సగటు భూగర్భ జలమట్టం 0–5 మీటర్లు, 5–10 మీటర్లు, 10 మీటర్లపైన లోతు.. అనే మూడు కేటగిరీలుగా వర్గీకరిస్తారు.

- భూగర్భ జలాలు 0– 5 మీటర్లలోపు లోతులో ఉంటే సురక్షిత స్థాయిలో ఉన్నట్టు భావిస్తారు. ఒక్క జిల్లాలో కూడా 0–5 మీటర్ల లోతులో భూగర్భ జలమట్టం లేదని గుర్తించారు.
- 17 జిల్లాల్లో 5–10 మీటర్ల లోతులో, 13 జిల్లాల్లో 10–15 మీటర్ల లోతులో, 3 జిల్లాల్లో 15 మీటర్లకి మించిన లోతులో భూగర్భ జలాలున్నట్టు తేలింది.
- 10 మీటర్లకన్నా లోతుకు భూగర్భ జలాలు పడిపోయిన జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టుగా భావిస్తారు. 15 జిల్లాల్లో ఇలాంటి పరిస్థితులు నెలకొని ఉన్నాయి.

సాధారణానికి మించి 32% అధిక వర్షపాతం

గతేడాది రాష్ట్ర వార్షిక సగటు వర్షపాతం 919 మి.మీ.లు కాగా, 2024–25 నీటి సంవత్సరంలో 1,216 మి.మీ.ల సగటు వర్షపాతం నమోదైంది. అంటే, 2024 జూన్ నుంచి 2025 మే చివరి వరకు రాష్ట్రంలో సాధారణం కంటే 32శాతం అధిక వర్షం కురిసింది.

ఈ ప్రాంతాల్లో ప్రమాదకర స్థాయిలో..

రంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల నైరుతి, మధ్య ప్రాంతాలు, వికారాబాద్, యాదాద్రి జిల్లాల్లోని ఉత్తర, దక్షిణ ప్రాంతాలు, నాగర్‌కర్నూల్ జిల్లాలోని దక్షిణాది ప్రాంతాలు, నిర్మల్, సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లోని పశ్చిమ ప్రాంతాలు, భూపాలపల్లి జిల్లాలోని ఉత్తర, భద్రాద్రి జిల్లాలోని ఆగ్నేయ ప్రాంతాల్లో అత్యంత ప్రమాదకర స్థాయికి భూగర్భ జలమట్టాలు పడిపోయాయి. ఈ ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు 15–20 మీటర్ల మధ్య, కొన్నిచోట్ల 20 మీటర్లకన్నా లోతుకు వెళ్లిపోయినట్టు తేల్చారు. రాష్ట్ర భూభాగం ఈ ప్రాంతాల వాటా 14 శాతం కావడం గమనార్హం.

19 జిల్లాల్లో భూగర్భ జలాల వృద్ధి

2024 మేతో పోల్చితే 2025 మేలో 19 జిల్లాల్లో భూగర్భ జలమట్టాల్లో వృద్ధి నమోదు కాగా, మరో 14 జిల్లాల్లో క్షీణత కనిపించింది. గత ఏడాది మేలో రాష్ట్ర సగటు భూగర్భ జలాల లోతు 10.36 మీటర్లు కాగా.. ఈ ఏడాది మేలో 10.07 మీటర్లుగా నమోదైంది. అత్యధికంగా సిద్దిపేట జిల్లాలో 2.3 మీటర్లు, అత్యల్పంగా గద్వాల జిల్లాలో 0.05 మీటర్ల వృద్ధి నమోదైంది. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో 3.02 మీటర్లు, అత్యల్పంగా ఖమ్మం జిల్లాలో 0.01 మీటర్ల క్షీణత కనిపించింది.

తెలుగువారంతా క్షేమమే

ఇజ్రాయెల్‌లో పెద్ద సంఖ్యలో మనోళ్లు

ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధంతో పెరిగిన ఉద్రిక్తతలు



ఓ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న తెలుగువారు

సాక్షి, హైదరాబాద్: 'రాత్రింబవళ్లు సైరన్‌లు మోగుతున్నాయి. క్షిపణుల వర్షం కురుస్తోంది. అయినా ఎ లాంటి భయం లేదు. నిశ్చింతగానే ఉన్నాం 'అని ఇజ్రాయెల్‌లో ఉంటున్న పలువురు తెలుగువారు తెలిపారు. రెండు రోజులుగా ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం తీవ్రస్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో వెళ్లి ఇజ్రాయెల్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉంటున్నారు. ప్రస్తుత యుద్ధం కారణంగా భయాందోళనలు నెలకొన్నాయి. యుద్ధ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్‌కు తిరిగివచ్చేందుకు ప్రయత్నిస్తున్నా, సాధారణ పరిస్థితులు నెలకొనేవరకు అక్కడే ఉండిపోవాల్సి వస్తుందని ఇజ్రాయెల్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధి రవి తెలిపారు. సుమారు 1,000 మంది కార్మికులు ఇజ్రాయెల్‌లోని ఒక్క రమన్‌గాన్ ప్రాంతంలోనే ఉంటున్నట్టు చెప్పారు.

20 క్షిపణులు పడ్డాయి

'ఈ నెల 14వ తేదీ ఒక్కరోజే 2,000 క్షిపణులు ఇరాన్ వైపు నుంచి దూసుకొచ్చాయి. అన్నింటిని ఐరన్‌డోమ్‌లు ధ్వంసం చేశాయి. కానీ 20 క్షిపణులు మాత్రం అక్కడక్కడా పలు ప్రాంతాల్లో పడ్డాయి. దీంతో రిషోల్ లిజియో ప్రాంతంలో ముగ్గురు చనిపోయారు. వివిధ చోట్ల మరో 70 మందికి పైగా గాయపడ్డారు'అని హర్జ్లియాలో ఉంటున్న చర్చి ఫాదర్ కొల్లాబత్తుల లాజరస్ తెలిపారు. ఇజ్రాయెల్‌లోని వివిధ నగరాల్లో స్థిరపడ్డ తెలుగువారిలో కొందరు ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్‌కు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని, యూరప్ మీదుగా ప్రయాణం చేయాల్సి రావడం వల్ల చార్జీలు పెరిగాయని లాజరస్ చెప్పారు.

ఇంటింటికీ స్ట్రాంగ్ రూమ్‌లు..

తెలుగు రాష్ట్రాల నుంచి ఇజ్రాయెల్‌కు వెళ్లిన వారిలో చాలామంది కేర్‌గివర్స్‌గా పని చేస్తున్నారు. వయోధికులకు సేవలు చేసేందుకు మేల్ నర్స్ తరహాలో పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు. మహిళలు సైతం కేర్‌గివర్స్‌గా అక్కడి వృద్ధ మహిళలకు సేవలందజేస్తున్నారు. హౌస్‌కీపింగ్ వర్కర్లుగా కూడా చాలామంది ఉన్నారు. డ్రైవర్లుగా, సహాయకులుగా పనిచేసేవారు సైతం ఎక్కువ సంఖ్యలోనే ఉన్నారు. టెల్ అవీవ్‌కు దూరంగా ఉండే చిన్న పట్టణాలు, నగరాల్లో ఎక్కువగా ఉన్నట్టు పలువురు తెలుగువారు చెప్పారు. 'ప్రతి ఇంటికి, అపార్ట్‌మెంట్‌కు బాంబ్‌షెల్టర్స్, స్ట్రాంగ్‌రూమ్‌లు ఉన్నాయి. యుద్ధం మరింత తీవ్రంగా మారి ప్రజల ప్రాణాలకు నష్టం జరుగుతుందని భావిస్తే బాంబ్‌షెల్టర్లు, స్ట్రాంగ్ రూమ్‌లలో తలదాచుకోవచ్చు'అని స్థానికులు తెలిపారు.

తొమ్మిదేళ్లుగా 'పెండింగే'

2015-16లోనే 56 కొత్త ఎక్సైజ్ భవనాల నిర్మాణానికి అనుమతులు

- ఇప్పటివరకు పూర్తయినవి 18 మాత్రమే.. అందులోనూ 10 స్టేషన్లే వినియోగంలోకి
- ఇంకా రూ.3 కోట్ల పెండింగ్ బిల్లులు... ఆ నిధులివ్వాలని ప్రభుత్వానికి ఎక్సైజ్ శాఖ ప్రతిపాదన
- 14 కొత్త ఎక్సైజ్ స్టేషన్ల ప్రారంభం ప్రతిసారీ వాయిదానే



సాక్షి, హైదరాబాద్: ఎక్సైజ్ స్టేషన్లకు శాశ్వత భవనాల నిర్మాణం ఏళ్లకేళ్లుగా పెండింగ్‌లోనే ఉంది. 2015–16లో రాష్ట్ర వ్యాప్తంగా 56 కొత్త ఎక్సైజ్ స్టేషన్ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వాటిలో కేవలం 18 మాత్రమే పూర్తి కాగా, అందులోనూ 10 మాత్రమే వినియోగంలోకి వచ్చాయి. ప్రతి ఎక్సైజ్ స్టేషన్ భవన నిర్మాణానికి అప్పట్లోనే రూ.40 లక్షల చొప్పున మంజూరు చేసింది. ఇందుకుగాను రూ.20 కోట్లకు పైగా నిధులు అవసరం కాగా, అందులో కేవలం రూ.5 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. ఈ నిధులతో 18 భవనాల నిర్మాణాలు ప్రారంభం కాగా, మిగిలిన చోట్ల స్థలాల సమస్య, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం లాంటి కారణాలు అడ్డంకిగా మారాయి. అప్పట్లో నిర్మించిన భవనాలకు సంబంధించిన రూ.3 కోట్ల పెండింగ్ బిల్లులున్నాయని, వాటిని మంజూరు చేయాలని ఎక్సైజ్ శాఖ ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది.

స్టేషన్లు ప్రారంభించేదెప్పుడు?

ఎక్సైజ్ స్టేషన్లకు భవనాల నిర్మాణం మాట అటుంచితే కొత్త ఎక్సైజ్ స్టేషన్ల ప్రారంభం ఎప్పటికప్పుడు వాయిదా పడుతూనే ఉంది. కొన్ని ఎక్సైజ్ స్టేషన్ల పరిధి చాలా ఎక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో కొత్త ఎక్సైజ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా, వాటి పరిధిని తగ్గించాలనే ప్రతిపాదనలు కూడా 2016లోనే వచ్చాయి. ఇందుకు సంబంధించిన జీవో కూడా అప్పుడే వెలువడింది. అప్పటి నుంచి ఎక్సైజ్ అధికారుల అలసత్వం, ప్రభుత్వ ఉదాసీనత కారణంగా ఈ స్టేషన్ల ఏర్పాటు ఆగిపోయింది. అయితే, ఇటీవల ఎక్సైజ్ అధికారులు కొంత చొరవ తీసుకొని వీటి పరిధిని నిర్ణయించడం, ఆయా స్టేషన్లకు హౌస్ ఆఫీసర్లను, సిబ్బందిని నియమించడం లాంటివి జరిగాయి. అద్దె భవనాలు అందుబాటులో ఉంటే కొత్త స్టేషన్లను కొత్త భవనాల్లో ఏర్పాటు చేయాలని, లేదంటే పాత స్టేషన్‌లోనే కొత్త స్టేషన్‌ను కూడా నడిపించాలని ఎక్సైజ్ శాఖ ఆదేశాలిచ్చింది. దీంతో అధికారికంగానే బంజారాహిల్స్, మారేడుపల్లి, చిక్కడపల్లి, గండిపేట, కొండాపూర్, మీర్‌పేట, పెద్ద అంబర్‌పేట, కొంపల్లి, కూకట్‌పల్లి, కాప్రా, నాగారం, అల్వాల్, అమీన్‌పూర్, హసన్‌పర్తిలలో కొత్త ఎక్సైజ్ స్టేషన్లు ఏర్పాటయ్యాయి. కానీ వాటిని ప్రభుత్వం ప్రారంభించడం ఇప్పటికే పలుమార్లు వాయిదా పడింది. హైదరాబాద్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నిక కారణంతో ఒకసారి, మే, జూన్ నెలల్లో రెండుసార్లు వాయిదా పడ్డాయి. అయితే, ఇటీవల ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా ఈ నెలలోనే వాటిని ప్రారంభిస్తామని చెప్పిన నేపథ్యంలో ఇప్పుడైనా అవి అధికారికంగా ప్రారంభమవుతాయని ఎక్సైజ్ వర్గాలు ఆశిస్తున్నాయి.

నేడు 1,034 రైతు వేదికల్లో 'రైతు నేస్తం'

ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

- వ్యవసాయ వర్సిటీలో ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి తుమ్మల
- రైతు వేదికలలో ఏర్పాట్లపై కలెక్టర్లకు ఆదేశాలు జారీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా సోమవారం 1,034 రైతు వేదికల్లో 'రైతునేస్తం'కార్యక్రమం ప్రారంభం కానుంది. సాయంత్రం 4 గంటలకు ప్రొ.జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం యూనివర్సిటీ ఆడిటోరియంలో అధికారులతో కలసి సమీక్షించారు. రైతు వేదికలలో చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లాల కలెక్టర్లకు మంత్రి తుమ్మల పలు ఆదేశాలు జారీ చేశారు. రైతునేస్తం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా రైతువేదికలలో ప్రసారం చేయడానికి తగిన ఏర్పాట్లు చేశామని, విశ్వవిద్యాలయంలోని ఆడిటోరియంలో దాదాపు 1,500 మంది రైతులు పాల్గొంటారని ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి తెలిపారు. ఏర్పాట్లను పర్యవేక్షించిన అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ, ఇప్పటికే 566 రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించామని, ప్రతీ మంగళవారం రైతునేస్తం కార్యక్రమం ద్వారా శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా ముఖాముఖి, ఆదర్శరైతుల అనుభవాలు, వ్యవసాయరంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలను రైతులకు తెలియజేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 6.35 లక్షల మంది రైతులు ప్రతీ మంగళవారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంతోపాటు ఇతర రైతుల అనుభవాలను తెలుసుకొన్నారని చెప్పారు. తాజాగా ఈ 'వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని', మరొక 1,034 రైతు వేదికలకు కల్పించబోతున్నామని, వీటిని ప్రారంభించాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలను వ్యవసాయ శాఖ తరపున ఆహ్వానించామని తెలిపారు. కాగా, రైతు వేదికలకు హాజరైన రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖిగా మాట్లాడనున్నట్లు తుమ్మల తెలిపారు. ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

బసంత్‌నగర్ కాదు.. అంతర్‌గావ్

రామగుండం పాత ఎయిర్‌స్ట్రిప్ పునరుద్ధరణ సాధ్యం కాదన్న ఏఏఐ

- అక్కడకు 18 కి.మీ. దూరంలో ఉన్న అంతర్‌గావ్ వద్ద స్థలం గుర్తింపు
- 600 ఎకరాలు సిద్ధం.. నెలరోజుల్లో సాధ్యాసాధ్యాల అధ్యయనం
- ఏఏఐ ఓకే అంటే ఈ ఎయిర్‌పోర్టు కూడా పట్టాలెక్కినట్టే



సాక్షి, హైదరాబాద్: నిజాం కాలంనాటి పాత విమానాశ్రయాలను పునరుద్ధరించే క్రమంలో రామగుండం ఎయిర్‌స్ట్రిప్ స్థానంలో కూడా కొత్త విమానాశ్రయం నిర్మించాలన్న ఆలోచనను అధికారులు విరమించుకున్నారు. రామగుండం సమీపంలోని బసంత్‌నగర్‌లోని ఓ ప్రముఖ సిమెంటు కర్మాగారం చెంత ఉన్న ఆ పురాతన ఎయిర్‌స్ట్రిప్‌ను విమానాశ్రయంగా మార్చటం సాధ్యం కాదని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) తేల్చింది. ఇప్పుడు దానికి బదులు పాత ఎయిర్‌స్ట్రిప్‌నకు 18 కి.మీ. దూరంలో ఉన్న అంతర్‌గావ్‌ను ఎంపిక చేశారు. ఇక్కడ 600 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. మరో నెలరోజుల్లో ఏఏఐ ప్రతినిధులు ఆ స్థలాన్ని పరిశీలించి సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇస్తారు.

బసంత్‌నగర్ చుట్టూ ఇళ్లు రావటంతో..

నిజాం కాలంలో బసంత్‌నగర్‌లో ఎయిర్‌స్ట్రిప్ ఉండేది. ఇక్కడకు వాయుదూత్ విమాన సర్వీసులు నడిచేవి. 1980లో దీనిని మూసేశారు. బొగ్గు గనులు, సిమెంటు పరిశ్రమలకు కేంద్రమైన రామగుండంకు మళ్లీ విమాన సర్వీసులు ప్రారంభించాలన్న ఉద్దేశంతో పాత ఎయిర్‌స్ట్రిప్‌ను ఆధునిక విమానాశ్రయంగా మార్చాలని గతంలో ప్రతిపాదించారు. కానీ, ఎయిర్‌స్ట్రిప్ ఉన్న బసంత్‌నగర్ ప్రాంతంలో భారీగా నిర్మాణాలు వెలిశాయి. ఎయిర్‌స్ట్రిప్‌ను ఆనుకునే భారీ సంఖ్యలో జనావాసాలు ఉండటంతో వాటిని తొలగించటం సాధ్యం కాదని తేల్చారు. తాజాగా అంతర్‌గావ్ ప్రాంతం విమానాశ్రయానికి అనుకూలమని, రాష్ట్ర యంత్రాంగం ఏఏఐకి ప్రతిపాదించింది. నెల రోజుల్లో ఫీజిబిలిటీ స్టడీ నిర్వహించి దానిపై ఏఏఐ నిర్ణయం తీసుకోనుంది. వరంగల్, ఆదిలాబాద్ తరహాలో ఇక్కడ కూడా బోయింగ్ 737 విమానం దిగగలిగేలా 3 వేల మీటర్ల రన్‌వే, నైట్ ల్యాండింగ్ వసతితో విమానాశ్రయం నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. స్థలం అనుకూలమని తేలితే ఈ విమానాశ్రయానికి కూడా సానుకూలత ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

'కొత్తగూడెం'పై మరోసారి చర్చలు..

కొత్తగూడెం విమానాశ్రయం విషయంలో పీటముడి నెలకొంది. ఇప్పటికి రెండు ప్రాంతాల్లో గుర్తించిన స్థలాలు అనువు కాదని ఏఏఐ అధికారులు తేల్చటంతో మూడోసారి స్థల సేకరణ కోసం ఏర్పాట్లు ప్రారంభించారు. కానీ, మరోసారి ఏఏఐ అధికారులతో భేటీ అయి, ఆ స్థలం విషయంలో వ్యక్తమైన అభ్యంతరాలపై చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు త్వరలో ఢిల్లీ వెళ్లనున్నారు. సుజాతనగర్, చుంచుపల్లి , కొత్తగూడెం మండలం రామవరం గ్రామాల సరిహద్దుల్లో 950 ఎకరాల భూమిని గుర్తించిన విషయం తెలిసిందే. కానీ ఆ సమీపంలోనే ఉన్న ఎత్తయిన గుట్టలు గాలి వాటాన్ని మారుస్తాయని, తద్వారా భారీ విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌లో సమస్యలు తలెత్తుతాయని ఏఏఐ నిపుణులు ఇటీవల ఫీజిబిలిటీ స్టడీలో గుర్తించారు. దీంతో అది యోగ్యమైన స్థలం కాదని నివేదిక సమర్పించారు. ఇప్పుడు తమ వద్ద అందుబాటులో ఉన్న పదేళ్ల కాలానికి చెందిన వాతావరణ నివేదికలు, విండ్‌రోజ్ డయాగ్రామ్ తదితరాలను తీసుకెళ్లి, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ తాజాగా గుర్తించిన వివరాలతో బేరీజు వేసుకొని చర్చించనున్నారు. ఏఏఐ ప్రతినిధులు గుర్తించిన విషయాల్లో మరీ పెద్ద సమస్య లేదని తేలితే, ఆ స్థలాన్నే కొనసాగించాలని కోరుతారు. అభ్యంతరాల్లో తీవ్రత వ్యక్తమైతే మాత్రం మరో స్థలాన్ని గుర్తించకతప్పదు. తొలిసారి పాల్వంచ సమీపంలోని గుడిపాడు–బంగారుజాల మధ్య స్థలాన్ని గుర్తించగా అది అనువుకాదని అప్పట్లోనే ఏఏఐ తేల్చింది. కొత్తగూడెం పరిసరాల్లో ఎత్తయిన గుట్టలతో కూడిన ప్రాంతాలే ఉన్నాయి. దీంతో జిల్లా సరిహద్దు దాటి మరో చోట స్థలాన్ని చూడాల్సి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇంతింతై.. కాస్తంతై..



భారత ఐటీ పరిశ్రమలోని 5 అగ్రశ్రేణి సంస్థల్లోని మొత్తం ఉద్యోగుల్లో.. నాలుగింట మహిళా ఉద్యోగుల సంఖ్య స్వల్పంగా తగ్గింది. అదే సమయంలో మొత్తం మహిళా ఉద్యోగుల సంఖ్య మూడింట పెరిగింది. ప్రారంభ స్థాయి ఉద్యోగాల్లో మహిళల వాటా మూడింట ఒక వంతు కంటే ఎక్కువే ఉంది. కానీ సీనియర్ స్థాయిల్లో మాత్రం బాగా తగ్గింది. ఐటీ కంపెనీల్లో స్త్రీ, పురుష ఉద్యోగుల మధ్య వేతన అంతరం కూడా ఎక్కువగా ఉంది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

దేశీయ ఐటీ రంగంలో మహిళలు గట్టిపోటీని ఎదుర్కొంటున్నారు. మనదేశంలోని అగ్రశ్రేణి 5 కంపెనీల్లో నాలుగు సంస్థలు 2024–25లో తమ ఉద్యోగుల్లో మహిళల వాటా తగ్గినట్లు నివేదించాయి. మొత్తం మీద ఈ ఐదు కంపెనీలు 2024 మార్చి నుండి 2025 మార్చి వరకు నికరంగా 27,000 మందికిపైగా మహిళలను కొత్తగా చేర్చుకున్నట్లు వెల్లడించాయి.

విప్రో మినహా...: మహిళా సిబ్బంది వాటా 2023–24లో 35.6 శాతం నుండి 2024–25లో 35.3 శాతానికి తగ్గిందని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నివేదించింది. ఇన్ఫోసిస్‌లో ఈ సంఖ్య 39.3 నుండి 39 శాతానికి వచ్చి చేరింది. హెచ్‌సీఎల్ టెక్‌లో మహిళా ఉద్యోగుల వాటా 29.1 నుండి 28.8 శాతానికి తగ్గింది. క్యాలెండర్ ఇయర్ అకౌంటింగ్ (జనవరి–డిసెంబర్)ను అనుసరించే కాగ్నిజెంట్‌లో మొత్తం ఉద్యోగుల్లో మహిళా సిబ్బంది వాటా 2023లో 38.8 నుంచి 2024లో 38 శాతానికి పరిమితమైంది. విప్రో మాత్రమే ఈ విషయంలో మినహాయింపు. ఈ సంస్థలో మహిళామణుల సంఖ్య 2023–24తో పోలిస్తే 36.6 నుండి గత ఆర్థిక సంవత్సరంలో 37.1 శాతానికి పెరిగింది.

సీనియర్ స్థాయిల్లో తగ్గుతోంది..: మన సమాజంలోని లింగ అసమానతలు, సాంస్కృతిక సవాళ్ల కారణంగా మహిళా ఉద్యోగుల వాటా స్తబ్దుగా ఉందని క్వెస్ ఐటీ స్టాఫింగ్ చెబుతోంది. ప్రారంభ స్థాయి ఉద్యోగాల్లో మహిళల వాటా మూడింట ఒక వంతు కంటే ఎక్కువ మందిని కలిగి ఉన్నప్పటికీ.. సీనియర్ స్థాయిల్లో వారి సంఖ్య బాగా తగ్గుతోందని వెల్లడించింది. సీనియర్ నాయకత్వం విషయంలో చాలా సంస్థలలో మహిళల నిష్పత్తి సింగిల్ డిజిట్‌లోనే ఉంది. టీసీఎస్‌లో అగ్రశ్రేణి జట్టులో మహిళలు 3.6 శాతం మాత్రమే ఉన్నారు. కాగ్నిజెంట్ ఈ విషయంలో 20 శాతం మార్కును దాటింది. చాలా సంస్థలు శ్రామిక శక్తిలో మహిళల వాటా విషయంలో మూడింట ఒక వంతు (33 శాతం) సంఖ్యకు కట్టుబడి ఉన్నాయి. సాంకేతిక రంగంలో సందర్భం, మార్కెట్ తీరు, యజమానుల విచక్షణపైనే మహిళల నియామకాలు ఉంటాయని స్టాఫింగ్ కంపెనీ ఎక్స్‌ఫెనో అంటోంది.

టాప్-5 కంపెనీల్లో మహిళా ఉద్యోగుల సంఖ్య

కంపెనీ	2023-24	2024-25	వ్యత్యాసం
టీసీఎస్	2,14,098	2,14,039	-0.03
ఇన్ఫోసిస్	1,24,569	1,26,332	1.4
విప్రో	82,595	85,330	3.3
హెచ్‌సీఎల్	66,057	64,345	-2.6
కాగ్నిజెంట్	1,02,600	1,27,864	24.6


వేతనాల్లోనూ అంతరమే..



స్త్రీ, పురుష నిష్పత్తితోపాటు ఐటీ కంపెనీల్లో వేతన అంతరం కూడా పెద్ద ఎత్తున ఉంది. టీసీఎస్‌లో బోర్డు సభ్యులు, సీనియర్ మేనేజ్‌మెంట్ మినహా మహిళా ఉద్యోగుల సగటు వార్షిక జీతం 2024–25లో రూ.10.6 లక్షలు మాత్రమే. ఈ కంపెనీలో ఇదే స్థాయి ఉద్యోగాల్లో పురుషులకు ఏకంగా రూ.16.7 లక్షల వేతనం ఉంది. అలాగే ఇన్ఫోసిస్‌లో మహిళా ఉద్యోగుల సగటు వార్షిక జీతం రూ.8 లక్షలు ఉంది. పురుష సహోద్యోగులకు ఇది రూ.11 లక్షలు.

ఇతర దిగ్గజ కంపెనీల్లో ఇలా..

యాక్సెంచర్, క్యాప్‌జెమిని వంటి గ్లోబల్ కంపెనీలలో మహిళా ప్రాతినిధ్యం బలంగా ఉంది. 2024లో యాక్సెంచర్ మొత్తం సిబ్బందిలో మహిళా సిబ్బంది వాటా 48 శాతం కావడం విశేషం. క్యాప్‌జెమినిలో మహిళా సిబ్బంది వాటా 38.8 శాతం నుండి 39.7 శాతానికి పెరిగింది. మేనేజర్ స్థాయి రోల్స్‌లోకి వెళ్లే అవకాశాలు పురుషుల కంటే మహిళలకు 2.1 రెట్లు తక్కువగా ఉన్నాయని క్వెస్ చెబుతోంది. కరోనా మహమ్మారి తరువాత వచ్చిన వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం మహిళా ఉద్యోగులకు లాభిస్తుందని భావించినప్పటికీ.. అది ఆశించిన ఫలితాలు అందించలేదని నిపుణులు అంటున్నారు. ఇంటి నుంచే పని వల్ల ఇంటి పని భారం మరింత పెరిగిందని.. దానివల్ల వృత్తి, ఉద్యోగాలపై శ్రద్ధ పెట్టడం చాలా మందికి కష్టమైందని చెబుతున్నారు.



- దేశీయ ఐటీ రంగంలో తగ్గిన అతివలు
- టాప్-5 కంపెనీల్లో నాలుగింట తగ్గుదల
- మేనేజర్ స్థాయిలోనూ పురుషుల కంటే తక్కువే
- మగవాళ్లతో పోలిస్తే వేతనాల్లోనూ భారీ అంతరం

మొత్తం సిబ్బందిలో మహిళల వాటా

కంపెనీ	2023-24	2024-25	2024-25లో మేనేజ్‌మెంట్ టీమ్స్‌లో మహిళల వాటా
టీసీఎస్	35.6	35.3	3.6
ఇన్ఫోసిస్	39.3	39	7.5
విప్రో	36.6	37.1	15.3
హెచ్‌సీఎల్	29.1	28.8	11.1
కాగ్నిజెంట్	38.8	38	25

కిషన్‌రెడ్డికి ప్రధాని మోదీ జన్మదిన శుభాకాంక్షలు

ధన్యవాదాలు తెలిపిన కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కిషన్‌రెడ్డి ఆయురారోగ్యాల తో ఉండాలని కోరుకుంటూ ఆదివారం ఎక్స్ లో పోస్ట్ చేశారు. 'కిషన్‌రెడ్డికి హార్దిక జన్మదిన శుభాకాంక్షలు. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణా నికి ఎంతో కీలకమైన బొగ్గు, గనుల రంగాన్ని బలోపేతం చేయడంలో మీరు ముందంజలో ఉన్నారు. మీరు దీర్ఘాయుష్షుతో, ఆరోగ్యంగా జీవించాలని కోరుకుంటున్నాను' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

ఆశీస్సులకు ధన్యవాదాలు..

తన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు చెప్పిన ప్రధాని మోదీకి కిషన్‌రెడ్డి ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ పోస్ట్‌కు స్పందిస్తూ.. 'మీ శుభాకాంక్షలు, ఆశీస్సులతో పాటు.. నిరంతర మార్గదర్శకత్వానికి ధన్యవాదాలు. మీ నాయకత్వంలో దేశానికి సేవ చేసే భాగ్యం లభించినందుకు నేను కృతజ్ఞుడిని' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

కిషన్‌రెడ్డికి వైఎస్ జగన్ జన్మదిన శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: 'నా మిత్రుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు. మీరు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అంటూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

నాన్నా.. డబ్బు పంపండి!

▶ మొదటి పేజీ తరువాయి

విలువకు తగ్గట్టుగా బ్యాంకులు అదనంగా రుణాలు ఇచ్చేందుకు సిద్ధపడటం లేదు. ఇప్పటికే అప్పులు చేసిన విద్యార్థులు పెరిగిన ఖర్చును ఎలా సమకూర్చుకోవాలో పాలుపోని స్థితిలో ఉన్నారు.



ఏటా రూ.4.32 లక్షల కోట్లు..

ఏటా 13 లక్షల మంది భారతీయులు వివిధ దేశాలకు వెళ్తున్నారు. 2025లో ఈ సంఖ్య 15 లక్షలకు చేరుతుందని అంచనా. ఇందులో టూరిస్టులు, విద్యార్థులూ ఉన్నారు. అయితే, విదేశీ చదువుల కోసం వెళ్లే వారిలో 38 శాతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులే ఉన్నారు. 2019లో విదేశీ విద్యకు భారతీయులు చేసిన ఖర్చు రూ. 3.10 లక్షల కోట్లు ఉంటే.. 2022 నాటికి ఇది రూ.3.93 లక్షల కోట్లకు చేరింది. రూపాయి మారకం విలువ పెరగడంతో 2024లో చేస్తున్న ఖర్చు 8 నుంచి 10 శాతం మేర పెరిగి రూ.4.32 లక్షల కోట్లకు చేరుతుందని భారత ప్రభుత్వం లెక్కగట్టింది. ఇటీవల కాలంలో రూపాయి విలువ ఊహించని విధంగా పతనమవ్వడంతో 2025లో విదేశాలకు వెళ్లే విద్యార్థులపై 14 శాతం అదనపు భారం పడే వీలుంది. అంటే, రూ.5.86 లక్షల మేర భారం ఉండొచ్చని విదేశాంగ శాఖ అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. అమెరికాకు వెళ్లడానికి ముందు విద్యార్థులు అక్కడి వర్సిటీల ఫీజు సగటున రూ.24 లక్షలుగా అంచనా వేసుకున్నారు. డాలర్ ముందు రూపాయి నేల చూపులు చూడటంతో ఇప్పుడు కనీసం రూ.2.40 లక్షలు అదనంగా చెల్లించాల్సి వస్తోంది. కెనడాలో రూ.1.60 లక్షలు, ఆస్ట్రేలియాలో రూ.1.80 లక్షలు, బ్రిటన్‌లో రూ.2 లక్షలకు పైగా అదనపు వ్యయం సమకూర్చుకోవాల్సిన పరిస్థితి. దీనికితోడు వసతి ఖర్చులు 15 శాతం వరకు పెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ఇతర సంక్షోభాల నేపథ్యంలో జీవన వ్యయం ఏకంగా 22 శాతం పెరిగింది. అమెరికాలో రూ.43 లక్షలతో ఎంఎస్ పూర్తవుతుందని అంచనా వేసుకుంటే, ఇప్పుడది రూ.52 లక్షల వరకూ వెళ్లింది.

ప్రధాన సమస్య అదే..

అమెరికాలో చదవడం కంటే ముందు పార్ట్‌టైం ఉద్యోగం పైనే మన దేశ విద్యార్థులు ఆధారపడుతున్నారు. భారత్‌లో ఉద్యోగాలు రాని వాళ్లు, వస్తాయనే నమ్మకం లేని వాళ్లు ఎక్కువగా అమెరికా వెళ్తున్నారు. 2019కి ముందుతో పోలిస్తే 2023లో ఈ అవకాశాలు 40 శాతం తగ్గాయని విదేశాంగ శాఖ అధ్యయనంలో గుర్తించారు. అమెరికాకు దాదాపు 3 లక్షల మంది భారతీయులు వెళ్తుంటే, వారిలో 1.25 లక్షల మంది తెలుగువాళ్లే ఉంటున్నారు. 2024లో భారత్‌తోపాటు ఇతర దేశాల విద్యార్థుల సంఖ్య పెరిగింది. కరోనా తర్వాత ఏ దేశం నుంచి వచ్చిన విద్యార్థి అయినా పార్ట్‌టైం ఉద్యోగం కోసం పోటీ పడాల్సి వస్తోంది. దీంతో అవకాశాలకు భారీగా గండి పడింది. కెనడాలో 2.22 లక్షల మంది భారత విద్యార్థులున్నారు. ఇక్కడ అమెరికాతో పోలిస్తే 30 శాతం ఫీజులు తక్కువ ఉంటాయి. దీంతో ఈ దేశానికి వెళ్లేవారి సంఖ్య పెరుగుతోంది. అయితే ఇటీవల అక్కడ అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. వీసా నిబంధనల్లో మార్పులు వచ్చాయి. 2020–21లో చదువు పూర్తి చేసిన వారికి పార్ట్‌టైం ఉద్యోగాలు వచ్చే పరిస్థితి తగ్గింది. బ్రిటన్, ఆస్ట్రేలియాలోనూ ప్రతికూల పరిస్థితులే కన్పిస్తున్నాయి.

ఏ దేశంలో భారతీయులు ఎంత మంది? (ఇందులో 38 శాతం తెలుగు రాష్ట్రాల వారే)

సంవత్సరం	అమెరికా	కెనడా	ఆస్ట్రేలియా	బ్రిటన్	ఇతర దేశాలు	మొత్తం
2019	1,93,124	2,17,410	75,791	52,545	5,51,130	10,90,000
2022	2,10,000	2,00,000	1,00,009	1,50,000	5,20,379	11,80,388
2025	3,00,000	2,50,000	1,70,000	1,70,000	6,10,000	15,00,000

విదేశీ విద్యకు అవుతున్న సగటు వ్యయం (రూ. లక్షల్లో)

దేశం	వర్సిటీ ఫీజు	వసతి	ఇతరాలు	మొత్తం
అమెరికా	24.90	9.90	8.30	43.10
కెనడా	16.60	8.30	7.40	32.30
ఆస్ట్రేలియా	18.20	10.70	13.20	42.10
బ్రిటన్	21.50	8.05	7.70	37.25

దిగితే గానీ లోతు తెలియదు

అమెరికా చదువు కోసం కలలు కన్నాం. ఇక్కడికి వస్తే చాలు ఎన్ని అప్పులు చేసినా తీర్చి, ఎంతో కొంత వెనకేసుకుని వెళ్తామని ఆశించాం. కానీ ఇప్పుడు పరిస్థితి వేరు. పార్ట్‌టైం ఉద్యోగాల్లేవు. డాలర్ ధర పెరగడంతో ఫీజులూ ఊహించని విధంగా పెరుగుతున్నాయి. పరిస్థితి ఏంటో మాకే అంతుబట్టడం లేదు.

- కూర్మం దామోదర్ (అమెరికాలో ఎంఎస్ చేస్తున్న వరంగల్ విద్యార్థి)

రాష్ట్రంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ప్రారంభించండి

- సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి జయంత్ చౌదరి సూచన
- ఐటీఐలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని విజ్ఞప్తి
- స్కిల్ యూనివర్సిటీకి మద్దతు ఇవ్వాలని కేంద్ర మంత్రిని కోరిన సీఎం



రేవంత్‌రెడ్డితో కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వీఎఫ్ఎక్స్, గేమింగ్, ఆడియో విజువల్స్ రంగాలకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి సూచించారు. ముఖ్యమంత్రితో ఆయన నివాసంలో కేంద్ర మంత్రి ఆదివారం సమావేశమయ్యారు. ఐటీఐ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఉపయోగపడుతుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. తాము ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేసి.. దానిని ఐటీఐలతో అనుసంధానించనున్నామని రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు. జాతీయ నైపుణ్య శిక్షణ కింద యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి మద్దతు ఇవ్వాలని జయంత్ చౌదరికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఐటీఐలన్నింటికీ ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని కేంద్ర మంత్రి సీఎంను కోరగా, ఐటీఐల్లో సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం వెంటనే అధికారులను ఆదేశించారు.

టీచర్లు సాంకేతికతకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఉపాధ్యాయులు తరగతి గదిలో ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వాడేందుకు ప్రయత్నించాలని కేంద్ర మంత్రి జయంత్ చౌదరి టీచర్లను కోరారు. ప్రపంచంలోనే తెలంగాణకు ఐటీ కేంద్రంగా గుర్తింపు ఉందని, ఇందుకు అనుగుణంగా విద్యా బోధనలోనూ వినూత్నత అవసరమని ఆయన అన్నారు. హైదరాబాద్‌లోని ఎస్‌సీఈఆర్‌టీ నేతృత్వంలో ఏర్పాటు చేసిన పాటో ప్రదర్శనను కేంద్ర మంత్రి ఆదివారం తిలకించారు.

60 ఏళ్లు దాటితేనే మోకాలి శస్త్రచికిత్స!

- యువతకు ఇది మంచిది కాదు
- అందుకే ఆయుష్మాన్ భారత్ యోజన కింద దీన్ని తొలగించారు
- 'సాక్షి'తో డాక్టర్ ప్రతీమేష్ జైన్



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స 60 ఏళ్లు దాటిన వారికి మాత్రమే మంచిదని... యువతకు ఇది మంచిదికాదని అహ్మదాబాద్‌లోని అడ్వాన్స్‌డ్ నీ అండ్ షోల్డర్ హాస్పిటల్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ప్రతీమేష్ జైన్ తెలిపారు. 60 ఏళ్ల వయసులోపు ఉన్న వారికి ప్రధానంగా మోకాళ్లకు, తుంటి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స (జాయింట్ రీ-ప్లేస్‌మెంట్ సర్జరీ) చేయడం కంటే... మోకాలిని సంరక్షించుకునే పద్ధతి మెరుగైనదని పేర్కొన్నారు. ఈ కారణంగానే కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ యోజన పథకం కింద 60 ఏళ్ల లోపు వారికి జాయింట్ రీ-ప్లేస్‌మెంట్ సర్జరీలను చేయవద్దని స్పష్టంగా ఆదేశాలిచ్చిందని తెలిపారు. 60 ఏళ్ల లోపు వయసు ఉన్న వారికి మోకాలి, తుంటి సంరక్షణపైనే ప్రధానంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. వైర్‌లెస్ ఆర్థోస్కోపీ ద్వారా చేసే శస్త్రచికిత్సల వల్ల తక్కువ గాయం, రక్తస్రావంతో సర్జరీ చేసే వీలుందని, అయితే, భారతదేశంలో ఇప్పటివరకు కేవలం కొచ్చిలో మాత్రమే ఈ పద్ధతి ద్వారా చికిత్స చేసినట్లు తెలిపారు. దీనిపై మరింతగా అధ్యయనం జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. విశాఖపట్నంలో జరుగుతున్న 'అడ్వాన్స్‌డ్ నీ ఆర్థోస్కోపీ కోర్స్'సదస్సుకు హాజరైన సందర్భంగా ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...!

యువత విషయంలో ఇది బెటర్..


యువతకు గాయమైన సందర్భాల్లో మొత్తం మోకాలి మార్పిడికి పోకుండా పనితీరును పునరుద్ధరించడానికి ఉద్దేశించిన ఇతర పద్ధతులను ఆశ్రయించాల్సిన అవసరం ఉంది. ఫిజియోథెరపీ, పెయిన్ రిలీఫ్, యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ మందులు, ఇంజెక్షన్లు వంటి వాటిని వినియోగించడం వంటి పద్ధతులపైనే ఆధారపడితే మంచిది.

యూరప్‌కు ఎగుమతులు

గతంలో మనం ప్రధానంగా ఎముకలకు సంబంధించిన సర్జరీలకు, చికిత్సలకు అవసరమైన పరికరాలను దిగుమతి చేసుకోవాల్సి వచ్చేది. అయితే, ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. మన అవసరాలకు మనం ఉత్పత్తి చేసుకోవడంతో పాటు యూరప్ వంటి దేశాలకు కూడా మనం పరికరాలను ఎగుమతి చేస్తున్నాం. ఇప్పటికే మనం నూరుకుపైగా దేశాలకు ఆర్థోపెడిక్ ఉపకరణాలను మనం దేశం నుంచి ఎగుమతి చేస్తున్నాం. ప్రపంచ మార్కెట్‌లో చైనాది కూడా మన తర్వాతి స్థానమే. ప్రధానంగా మేకిన్ ఇండియాలో భాగంగా స్థానికంగా ఉత్పత్తి చేయడం పెరుగుతోంది.

పెరుగుతున్న క్రీడాగాయాలు

మన దేశంలో క్రీడల ద్వారా జరుగుతున్న ప్రమాదాల వల్ల ఎముకల శస్త్రచికిత్సలు పెరుగుతున్నాయి. క్రీడాకారుల సంఖ్య పెరగడంతో పాటు సరైన శిక్షణ లేకుండా ఆటలు ఆడటం కూడా ఇందుకు కారణం. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, మిగిలిన ప్రాంతాల కంటే విశాఖలో క్రీడాగాయాల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. అందుకే ఇక్కడ సర్జరీలు కూడా ఎక్కువ. 2036 సంవత్సరంలో అహ్మదాబాద్‌లో జరగనున్న ఒలంపిక్స్ నేపథ్యంలో ప్రధానంగా ఈ క్రీడా గాయాలపై ఎక్కువ దృష్టి సారించి... మెరుగైన వైద్యసేవలను అందించాల్సిన అవసరం ఉంది. ఇటువంటి సదస్సులు యువ డాక్టర్లకు మరింతగా అత్యాధునిక వైద్యపద్ధతులకు తెలియజేసేందుకు ఉపయోగపడతాయి.



నాన్నా.. నా ప్రతి అడుగులో నువ్వే నా స్ఫూర్తి

మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫాదర్స్‌డే సందర్భంగా తన తండ్రి దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిని స్మరించుకున్నారు. 'నాన్నా.. ఎల్లప్పుడూ నువ్వే నాకు స్ఫూర్తి, ఆదర్శం. నా ప్రతి అడుగులోనూ నువ్వే నా స్ఫూర్తి. హ్యాపీ ఫాదర్స్ డే నాన్నా. చారిత్రాత్మకమైన మీ పాదయాత్ర ముగింపు రోజును కూడా గుర్తు చేసుకుంటున్నా' అంటూ తండ్రి వైఎస్సార్ తో కలిసి ఉన్న ఫొటోను వైఎస్ జగన్ ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

విద్య కోసం ఎంతైనా ఖర్చుచేస్తాం

డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న భట్టి విక్రమార్క

హుడా కాంప్లెక్స్ (హైదరాబాద్): విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తుగా ప్రజా ప్రభుత్వం భావిస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఆదివారం ఆయన తన పుట్టినరోజు సందర్భంగా సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోంలో విద్యార్థులు, అధికారులు, స్థానిక నేతలను ఉద్దేశించి మాట్లాడారు. విద్య ద్వారానే మానవ వనరులు మెరుగుపడి రాష్ట్రం ప్రపంచంతో పోటీ పడుతుందన్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న విద్యారంగానికి ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని యావత్ కేబినెట్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో విద్యను అందించాలనే గొప్ప సంకల్పంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. రాష్ట్రంలో మొదటి దశలో రూ.11,600 కోట్లతో వంద పాఠశాలలు నిర్మిస్తున్నామన్నారు. విలువైన విక్టోరియా మెమోరియల్ రెసిడెన్షియల్ స్కూల్ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడతామని పేర్కొన్నారు. హోం చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు వెంటనే రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం విక్టోరియా మెమోరియల్‌లో చదువుకుంటున్న అనాథ విద్యార్థులతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం చేశారు.



పుస్తకాన్ని విడుదల చేస్తున్న పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్ రెడ్డి, తెలంగాణ హైకోర్టు అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్ రెడ్డి, తదితరులు

సుప్రీంకోర్టు తీర్పులు మైలురాళ్లు

పట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ ఎ.అభిషేక్ రెడ్డి

సిటీ కోర్టులు: సుప్రీంకోర్టు 75 ఏళ్లలో ఇచ్చిన తీర్పులు చరిత్రలో మైలు రాళ్లుగా నిలిచిపోతాయని పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్ రెడ్డి తెలిపారు. సుప్రీంకోర్టు ఏర్పాటై 75 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో మార్వాడి శిక్షా సమితి (ఎంఎస్ఎస్) న్యాయ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. ముఖ్యఅతిథులుగా జస్టిస్ ఎ.అభిషేక్ రెడ్డి, తెలంగాణ హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ సూరేపల్లి నందా, హైకోర్టు అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. జస్టిస్ అభిషేక్‌రెడ్డి సుప్రీంకోర్టు పరిణామం, కేసుల తీర్పులు, మహిళల పాత్ర, లింగ న్యాయం, న్యాయశాస్త్రం, సవరణలు మొదలైన వాటి గురించి మాట్లాడారు. జస్టిస్ సూరేపల్లి నందా మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు అనేక సంచలనాత్మక తీర్పులు వెలువరించిందని, వాటి ఆధారంగా నేడు అనేక కేసులు పరిష్కారమవుతున్నాయని తెలిపారు. మన రాజ్యాంగం పురాతనమైందని భారత దేశం ఈ రాజ్యాంగంపైనే ఆధారపడి నడుస్తోందని ఏజీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఇందులో సుప్రీంకోర్టుకు అత్యున్నతస్థానం దక్కిందని గుర్తుచేశారు.

తాబేలుకు ఫాదర్స్ డే

135వ ఏట తొలి సంతానం!



మనకు తెలిసి ఈ భూమ్మీద అత్యంత ఎక్కువ కాలం బతికే జీవి తాబేలు. దాదాపు 300 ఏళ్లు బతుకుతుందని అంచనా. అలాంటి ఓ తాబేలు అమెరికాలోని దక్షిణ ఫ్లోరిడాలో ఉన్న మయామీ జూలో ఓ తాబేలు 135వ బర్త్‌డేను, మొదటి ఫాదర్స్‌డేను కూడా జరుపుకొంది. వృద్ధాప్యంలో మొదటిసారి తండ్రయిన తాబేలుగా గిన్నిస్ రికార్డులకూ ఎక్కనుంది. 234 కిలోల బరువున్న గాలాపాగోస్‌కు చెందిన ఈ తాబేలు పేరు గోలియత్. ఇది 1890లో జన్మించి ఉంటుందని భావిస్తున్నారు. ఈ జాతి తాబేళ్లు అంతరించిపోతున్న సరీసృపాల్లో ఉన్నాయి. గోలియత్‌ను 1929లో బ్రోంక్స్ జూకు, ఆ తరువాత 1981లో మయామి జూకు తరలించారు. ఇన్నేళ్ల తరువాత.. స్వీట్ పీ అనే వందేళ్ల తాబేలు వల్ల గోలియత్‌కు తండ్రి స్థానం లభించింది. జనవరి 27న స్వీట్ పీ ఎనిమిది గుడ్లు పెట్టగా.. 128 రోజులు పొదిగిన తరువాత ఒక్కటి మాత్రమే తాబేలు పిల్లగా మారింది. ఇన్నేళ్లలో గోలియత్‌కు ఇదే తొలి సంతానం కావడం విశేషం! ఈ జూలో మొట్టమొదటి గాలాపాగోస్ జాతి తాబేలు పిల్ల కూడా. తాబేళ్లు పుట్టుకతోనే స్వతంత్రంగా ఉంటాయని, ఈ తాబేలు పిల్లను ప్రత్యేక స్థలానికి తరలించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇక జూ నిర్వాహకులు ఆదివారం గోలియత్ పుట్టిన రోజుతోపాటు, మొదటి ఫాదర్స్‌డేను కూడా నిర్వహించారు. వృద్ధాప్యంలో మొదటిసారి తండ్రయిన తాబేలుగా గోలియత్‌కు గిన్నిస్ రికార్డ్ కోసం దరఖాస్తు చేసినట్లు జూ నిర్వాహకులు తెలిపారు. 135 ఏళ్ల గోలియత్ రికార్డును కచ్చితంగా సొంతం చేసుకుంటుందని ఆశిస్తూ ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

మాజీ ఎంపీపీ కిడ్నాప్ యత్నం

తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద తప్పించుకున్న వైనం

తూప్రాన్: కిడ్నాపర్ల నుంచి బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీపీ తృటిలో తప్పించుకున్నారు. మెదక్ జిల్లా తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద కలకలం రేపిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా మామడ మండలానికి చెందిన మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావును గుర్తు తెలియని నలుగురు ఆదివారం కిడ్నాప్ చేశారు. కారులో హైదరాబాద్‌కు తరలిస్తుండగా, టోల్‌ప్లాజా వద్ద వాహనం వేగం తగ్గగానే, అందులో నుంచి దిగి, అరుస్తూ పరుగుతీశాడు. 100 నంబరుకు డయల్ చేసి తూప్రాన్ పోలీసులను ఆశ్రయించాడు. టోల్‌ప్లాజా వద్దకు పోలీసులు చేరుకొని, అతడిని నిర్మల్ పోలీసులకు క్షేమంగా అప్పగించినట్టు తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపారు. కిడ్నాపర్లు రూ. 3 కోట్లు డిమాండ్ చేసినట్టు బాధితుడు పేర్కొన్నాడని ఎస్ఐ చెప్పారు.



చెడు మార్గం ద్వారా మంచి చేయొచ్చని అనుకోవడం ఒక భ్రాంతి, ఒక పీడకల.
– సయాజీ ఊ బా ఖీన్

సాక్షి
సోమవారం, 16 జూన్ 2025

నవ్వే నేరమౌనా?

మనుషులకు సహజసిద్ధమైన మనోల్లాస ప్రకటన నవ్వు. మాటలు రాని పసికందుల మొదలుకొని, వయోవృద్ధుల వరకు అందరూ నవ్వుతారు. నవ్వు ఒక విశ్వజనీన భాష. కొందరు అనునిత్యం చిరునవ్వులు చిందిస్తూ ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారు. ఇంకొందరు తాము నవ్వుతూ, ఎదుటివారిని కూడా నవ్విస్తుంటారు. అరుదుగా అతితక్కువ మంది ఉంటారు – వారు నవ్వరు, ఎదుటివారు ఉల్లాసంగా నవ్వుతూ, ఆనందంగా ఉంటే ఏమాత్రం భరించలేరు. నవ్వేవారు తమను చూసే నవ్వుతున్నారేమోననే భ్రమలోపడి లోలోన కుమిలి కునారిల్లిపోతారు. జీవితంలో నవ్వెరుగని మనుషులను చూసి మిగిలిన లోకం జాలిపడటం తప్ప చేయగలిగిందేమీ లేదు.

నవ్వు ఒక ఆరోగ్య లక్షణం. పసిపిల్లలు బోసినవ్వులు చిందిస్తుంటారు. బాల్యంలో నవ్వే నవ్వుల సంఖ్య వయసు పెరిగిన తర్వాత క్రమంగా తగ్గిపోతుంది. ఎంత ఎదిగినా పెద్దలు కూడా సమయ సందర్భాలను బట్టి నవ్వుతుంటారు. వైద్య పరిశోధనల ప్రకారం పసిపిల్లలు రోజుకు దాదాపు నాలుగు వందల సార్లు నవ్వులొలికిస్తారు. పెద్దలు రోజులో కనీసం ఇరవైసార్లయినా నవ్వుతారు. సంతోషకరమైన జీవితం గడిపేవారు నలభైసార్లకు పైబడి కూడా నవ్వుతారు. ‘నవ్వడం ఒక భోగం; నవ్వించడం ఒక యోగం; నవ్వకపోవడం ఒక రోగం’ అన్నారు జంధ్యాల. నవ్వెరుగని రోగులే హాయిగా నవ్వుతూ కనిపించే మనుషులను చూసి కుళ్లుకుంటారు.

‘ఒకరిని నవ్వమని శాసించలేము; కాని నవ్వవద్దని శాసించినా; నవ్వకూడదని భీష్మించుకొని కూర్చొనినా నవ్వు రాక మానదు... అసలు మన నవ్వుకి కొన్ని చోట్ల అర్థం పర్థం లేకపోవటం కూడ కద్దు’ అని ‘తెలుగు హాస్యం’ రచయిత ముట్నూరి సంగమేశం అన్నారు. ఆయన మాటలు అక్షర సత్యం. నవ్వమని ఎవరో శాసిస్తే నవ్వు రాదు. నవ్వొద్దని ఆంక్షలు విధిస్తే, వచ్చే నవ్వు రాకుండా మానదు. ‘నవ్వు ఒక దిద్దుబాటు చర్య. పెడదారి పట్టినవారిని సన్మార్గంలోకి తీసుకురావడానికి, చాదస్తాలను సరిదిద్దడానికి నవ్వు చేయూతనిస్తుంది’ అన్నారు ఫ్రెంచ్ తత్త్వవేత్త హెన్రీ బెర్గ్‌సన్. ‘నవ్వులేని రోజు దండగ రోజు’ అన్నాడు ప్రపంచ ప్రఖ్యాత హాస్యనటుడు చార్లీ చాప్లిన్. ‘మానవ జాతి చేతిలో గొప్ప ప్రభావవంతమైన ఆయుధం ఉంది, అదే నవ్వు’ అన్నారు అమెరికన్ రచయిత మార్క్ ట్వైన్. నవ్వు అంటే నవ్వులాట కాదు, నవ్వును నిర్వచించడం అంత తేలిక కాదు. నవ్వులోని సంక్లిష్టత నిర్వచనాలకు అందనిది.

‘నవ్వవు జంతువుల్ నరుడు నవ్వును, నవ్వులు చిత్తవృత్తికిన్/ దివ్వెలు కొన్ని నవ్వులెటు తేలవు కొన్ని విషప్రయుక్తముల్/ పువ్వులవోలె ప్రేమరసముల్ వెలిగ్రక్కు విశుద్ధమైనవే/ నవ్వులు సర్వ దుఃఖదమంబులు వ్యాధులకున్ మహౌషధుల్’ అన్నారు జాషువా. పురాణకాలంలో నవ్వు వల్ల అపార్థాలు, అనర్థాలు వాటిల్లిన సందర్భాలు రెండు ఉన్నాయి. వాటిలో ఒకటి మహాభారతంలోని పాంచాలి నవ్వు కురుక్షేత్ర సంగ్రామానికి దారితీసిన వైనం తెలిసినదే! మరొకటి రామాయణంలో లక్ష్మణుడి నవ్వు. రాముడి పట్టాభిషేక సమయంలో లక్ష్మణుడికి రెప్పలు మూతబడ్డాయి. పద్నాలుగేళ్ల అరణ్యవాస కాలంలో అన్నాళ్లూ రాని నిద్ర పట్టాభిషేక వేడుక జరుగుతున్నప్పుడే రావాలా అనుకుంటూ లక్ష్మణుడు తనలో తాను నవ్వుకున్నాడు. అతడి నవ్వు సీతారాములు సహా ఆ వేడుకలో కొలువుదీరిన వారందరిలోనూ రకరకాల అపార్థాలకు తావిచ్చింది. పాంచాలి నవ్వు అనర్థాలకు దారితీస్తే, లక్ష్మణుడి నవ్వు అపార్థాలకు దారితీసింది. కేవలం ఈ రెండు ఉదంతాలను ఉదహరిస్తూ, ‘నవ్వు నాలుగు విధాల చేటు’ అనే నిర్ధారణకు రావడం పూర్తిగా అసమంజసం. నవ్వులలో రకరకాలు ఉన్నాయి. మన ప్రాచీన అలంకారికులు నవ్వులను ఆరు రకాలుగా విభజించారు. అవి: స్మితం, హసితం, విహసితం, ఉపహసితం, అపహసితం, అతిహసితం. నవ్వుకు నానా ప్రయోజనాలు ఉన్నాయి. నవ్వు మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది; రోగ నిరోధక శక్తిని పెంచుతుంది; గుండె జబ్బులను నివారిస్తుంది. నవ్వు వల్ల ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆధునిక వైద్యశాస్త్రం చెబుతోంది.

రాజరికాలు కొనసాగిన కాలంలో రాజులను నవ్వించడానికి విదూషకులు ఉండేవారు. రాజకీయాలతోను, రణతంత్రాలతోను బుర్రలు వేడెక్కిన ప్రభువులకు విదూషకులు తమ హాస్యంతో మనోల్లాసం కలిగించి, వినోదపరచేవారు. పలువురు ఆస్థాన కవులు చమత్కార పద్యాలతో ప్రభువులను నవ్వించేవారు. నేటి ప్రజాస్వామ్యంలోని ప్రభువుల కంటే రాజరికాల నాటి ప్రభువులే హాస్యాన్ని ఆదరించడంలో చాలా నయం అనిపిస్తారు. నవ్వించే విదూషకులకు, కవులకు వారు నజరానాలు ఇచ్చి, గౌరవించేవారు. హాస్యాన్ని ఆస్వాదించాలంటే కాస్త హాస్యప్రియత్వం, చమత్కారాభిరుచి ఉండాలి. ఆనాటి ప్రభువుల్లో అవి కొంత మెండుగా ఉండేవి. హాస్యం కోసం ఆనాటి కవులు బూతులు కూడా ప్రయోగించేవారు. ‘నీతులకేమి ఒకించుక/బూతాడక నవ్వు దొరకు పుట్టదు ధరలో/ నీతులు బూతులు లోక ఖ్యాతులురా’ అన్నాడు చౌడప్ప. ఆనాటి కవులు ప్రభువుల తీరుతెన్నులను, సామాజిక పరిస్థితులను తెగనాడటానికి పదునైన వ్యంగ్యంతో అధిక్షేప పద్యాలు రాశారు. ఆ పద్యాల్లోని వ్యంగ్యం కటువుగా ఉన్నా, నవ్వు తెప్పిస్తుంది. అంతమాత్రాన ఆ ప్రభువులెవరూ ఆ కవులను శిక్షించిన దాఖలాలు లేవు. పాపం, సత్తెకాలం మారాజులు వాళ్లు. మనోభావాల శకం మొదలయ్యాక నవ్వుల వివాదాలు న్యాయస్థానాల ముందుకు వెళుతున్నాయి. నవ్వులను తాళలేని పాలకుల విన్యాసాలు నవ్వులపాలవుతున్నాయి.

తలసరి ఆదాయం పెరిగితేనే...

విశ్లేషణ



అజీత్ రణడే

భారత్, చైనా సమవుజ్జీలేనా? డాలర్లలో చూసినపుడు, 1990 ప్రాంతంలో భారత్, చైనా ఇంచుమించుగా ఒకే ఆర్థిక పరిమాణంలో, ఒకే రకమైన తలసరి ఆదాయంతో ఉన్నాయి. నిజానికి, అప్పట్లో చైనాలో తలసరి ఆదాయం మనకన్నా తక్కువగా ఉండేది. సుమారు 190 దేశాల జాబితాలో రెండు దేశాలు 140 నుంచి 145 మధ్య స్థానాల్లో ఉండేవి. చైనాలో ఆర్థిక సంస్కరణలు 1978లో మొదలయ్యాయి. వారి వృద్ధి వెంటనే ఏమీ వేగం పుంజుకోలేదు. తర్వాత, పదమూడేళ్ళకి, అంటే 1991లో భారత్ సంస్కరణల బాటపట్టింది. ఇపుడు ప్రపంచంలో చైనాది రెండవ పెద్ద ఆర్థిక వ్యవస్థ. అది 2010లోనే ఆ స్థితికి చేరింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) ప్రకారం, భారత్ కొద్ది రోజుల క్రితం, నాల్గవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. వచ్చే మూడేళ్ళలో జర్మనీని దాటి, భారత్ మూడవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవనుంది.

ఎంతో ఎదిగినా... ఇంకా వెనకే!

భారత్, చైనా గత మూడు దశాబ్దాల్లో సాధించిన ప్రగతి అద్భుతం, చారిత్రకం, అసాధారణం. ఆసియాలోని ఈ రెండు దిగ్గజాల జనాభా ప్రపంచ జనాభాలో నలభై శాతం మేరకు ఉంటుంది. ప్రస్తుతం భారత్ ఆర్థిక వ్యవస్థ సైజు సుమారు 4.1 ట్రిలియన్ల డాలర్లుగా ఉంది. దానికన్నా ఐదింతలు ఎక్కువగా చైనాది 19 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. భారత సంఖ్యామానం ప్రకారం ఒక ట్రిలియన్ అంటే లక్ష కోట్లతో సమానం.

భారత్ 2000 నుంచి 2024 వరకు 6.3 శాతం వార్షిక వృద్ధిని కనబరచిందని ప్రపంచ బ్యాంక్ పేర్కొంది. పెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఇది వేగవంతమైన వృద్ధి రేటు. ఇటీవలి సంవత్సరాల్లో, భారత్ వృద్ధి రేటు సుమారు 7.3 శాతానికి పెరిగింది. ఇక 1990 నాటి స్థితితో పోలిస్తే, భారత్ ఆర్థిక వ్యవస్థ ఇపుడు 11.5 రెట్లు పెద్దదిగా ఉంది. జనాభా 1.6 రెట్లు మాత్రమే పెరిగింది. మరో విధంగా చెప్పాలంటే, 1990లో సుమారు 360 డాలర్లుగా ఉన్న తలసరి ఆదాయం 2025 నాటికి 2,700 డాలర్లకు పెరిగింది.

అయినా చైనాతో వైరుధ్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. రెండు దేశాలు 1990లో ఒకే విధమైన తలసరి ఆదాయంతో ఉన్నాయి. చైనాలో తలసరి ఆదాయం 2025లో భారత్ కన్నా దాదాపు ఐదు రెట్లు ఎక్కువగా 13,000 డాలర్లకు దూసుకొచ్చింది. చైనా ఆర్థిక వ్యవస్థ గత 35 ఏళ్ళలో 51 రెట్లకు పైగా విస్తరించింది. చైనా మూడు దశాబ్దాలపాటు 10 శాతం వృద్ధి రేటును కొనసాగించగలిగింది. మొత్తం 197 దేశాల్లో నేడు భారత్ 141వ స్థానంలో ఉండగా, చైనా 70వ ర్యాంకునకు ఎగబాకింది. ప్రపంచ బ్యాంక్ ప్రకారం, భారత్ ఇపుడు మధ్యాదాయ కేటగిరీలో స్థిరంగా ఉంది. చైనాను అధిక-ఆదాయ దేశంగా పరిగణిస్తున్నారు. తలసరి ఆదాయం 14,000 డాలర్ల ఎగువన ఉంటే అలాంటి హోదా దక్కుతుంది. ఆ వాకిలిని కూడా దాటినవాటిని ప్రపంచ బ్యాంక్ అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలుగా గౌరవిస్తుంది. భారత్ 2047 నాటికి ఎలాగైనా ఆ స్థితిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆ కల సాకారమవడానికి,



మనం వచ్చే 20 ఏళ్ళపాటు డాలర్లలో సగటున 7.8 శాతం వృద్ధి వేగాన్ని అందుకుని, అదే రీతిలో కొనసాగవలసి ఉంటుంది. ఇటీవలి సంవత్సరాల్లో, మనం చూపిన 7.3 శాతం వృద్ధి రేటుకన్నా అది కాస్త ఎక్కువ.

ఎందుకు వెనకబడ్డాం?

భారత్ 1990–2025 మధ్య కాలంలో చైనాతో పోల్చుకుంటే, ఎందుకు వెనుకబడింది? ఎగుమతులు, ముఖ్యంగా శ్రమ శక్తి ద్వారా ఒనగూడే ఎగుమతుల ప్రాబల్యం విషయంలో, ఉన్న సామర్థ్యాన్ని నిర్లక్ష్యం చేయబట్టా? ప్రాథమిక ఆరోగ్య, విద్య రంగాలకు తక్కువ పెట్టుబడులు ఉండబట్టా? మనం 1991లో చాలా వరకు రద్దు చేసుకున్న లైసెన్సుల వ్యవస్థ స్థానంలో ఇన్‌స్పెక్టర్ల వ్యవస్థ ఏర్పడబట్టా? లేక సాఫీగా వ్యాపారాలు చేసుకోనివ్వకుండా అడ్డుపడుతున్న మన దేశంలోని మూడంచెల పాలనా వ్యవస్థే దీనికి కారణమా? లేక మన దేశంలోని ప్రజాస్వామిక వ్యవస్థకుగాను నత్తనడకన సాగే వృద్ధి రూపంలో మూల్యం చెల్లించుకోక తప్పదా?

చైనాతో పోల్చుకుంటే భారత్ పనితీరు పేలవంగా ఉండటానికి సంబంధించి ఇంకా అనేక ప్రశ్నలు తలెత్తుతాయి. ఆ ప్రశ్నలకు జవాబులు అన్వేషించడం వల్ల ఇప్పటికిప్పుడు ఒనగూడే ప్రయోజనం ఏమీ లేదు కనుక వాటినక్కడ వదిలేద్దాం. వృద్ధి రేటును సాధించడానికి, అది కూడా వచ్చే ఇరవై ఏళ్ళపాటు స్థిరంగా కొనసాగించడానికి ఏం చెయ్యవలసిన అవసరం ఉందో దానిపై దృష్టి కేంద్రీకరించడం మనందరి తక్షణ కర్తవ్యం. అది సమ్మిళిత వృద్ధి అయితే, తలసరి ఆదాయాలు కూడా పెరుగుతాయి. అంటే, ఉత్పాదకత, వేతనాలు, కుటుంబాల ఆదాయాలు, ఉన్నత–గుణాత్మక ఉద్యోగాలు వృద్ధి చెందాలి. దాన్ని సాధించకపోతే, 2047 నాటికి భారత్ మూడవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా పరిణామం చెందుతుందేమోకానీ, మధ్యాదాయ కేటగిరీలో చిక్కుకుపోతుంది. తలసరి ఆదాయం ఎదుగు బొదుగు లేకుండా 10,000 డాలర్లకు దిగువన ఉండిపోవచ్చు. ప్రపంచ బ్యాంక్ రికార్డులను తిరగేస్తే, గత యాభై ఏళ్ళలో, చాలా దేశాలు అటువంటి గతినే పొందాయని తెలుస్తుంది. మధ్య-ఆదాయ కేటగిరీ నుంచి అధిక- ఆదాయ కేటగిరీకి 34 దేశాలు మాత్రమే ఎగబాకగలిగాయి. దాదాపు 108 దేశాలు మధ్య- ఆదాయ వలలోనే చిక్కుకుపోయాయి. అమెరికన్ల తలసరి ఆదాయంలో సుమారు పదవ వంతుకి, లేదా ఇప్పటి లెక్కల్లో చెప్పాలంటే, సుమారు 8000 డాలర్లకు మాత్రమే అవి పరిమితమైపోయాయి.

◆ 1990లో సుమారు 360 డాలర్లుగా ఉన్న ఇండియా తలసరి ఆదాయం 2025 నాటికి 2,700 డాలర్లకు పెరిగింది. అయినా చైనాతో వైరుధ్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. రెండు దేశాలు 1990లో ఒకే విధమైన తలసరి ఆదాయంతో ఉన్నాయి. కానీ 2025లో భారత్ కన్నా దాదాపు ఐదు రెట్లు ఎక్కువగా చైనా 13,000 డాలర్లకు దూసుకొచ్చింది. చైనా 1978లోనే ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుడితే, మనం 1991లో గానీ వాటిని మొదలుపెట్టలేదు. ఫలితంగా పోటీలో వెనుకబడ్డాం.

ఏం చేయొచ్చు?

మధ్య-ఆదాయ వల నుంచి తప్పించుకునేందుకు, భారత్ బహుశా, దక్షిణ కొరియా (అత్యంత ఆకర్షణీయమైన పరిణామం), చిలీ, పోలెండ్‌ల నుంచి పాఠాలు నేర్చుకోవచ్చు. ఒక దేశం మధ్య-ఆదాయం నుంచి అధిక-ఆదాయానికి పరిణామం చెందేందుకు మూడు (పెట్టుబడి, ప్రేరణ, నవీకరణ) టానిక్‌లు అవసరమని ప్రపంచ బ్యాంక్ పరిశోధన వెల్లడిస్తోంది. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ స్థాయిని అందుకునేందుకు అన్ని రాష్ట్రాలు (సూటిగా చెప్పాలంటే, ఆ యా రాష్ట్రాల్లోని అన్ని నగరాలు, గ్రామాలు) కలసికట్టుగా కృషి చేయాలని నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభ్యర్థించారు. ఉద్యోగాలు, ఉత్పత్తి, ఎగుమతులు పెరిగేందుకు దోహదపడగల చిన్నతరహా (సూక్ష్మ సంస్థలు కాదు) సంస్థలకున్న వృద్ధి సామర్థ్యానికి పడిన సంకెళ్ళన్నింటినీ తెగ్గొట్టాలని కోరారు. ప్రధానంగా, రాష్ట్రాల అంశాల జాబితాలోకి వచ్చే వ్యవసాయ రంగానికున్న ప్రతిబంధకాలన్నింటినీ తొలగించుకోవాలని కూడా ఆ మాటల తాత్పర్యం.

స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 40 శాతానికి భారత్ పెట్టుబడులు పెంచుకోవాలి. మహిళా శక్తి భాగస్వామ్యాన్ని 35 శాతం నుంచి 50 శాతానికి పెంచుకోవాలి. గ్లోబల్ వాల్యూ చైన్లు, వాణిజ్య ఒప్పందాలు, విదేశీ పెట్టుబడులకు అడ్డంకిగానున్న సుంకాలను తగ్గించడం, అవరోధాలను తొలగించడం ద్వారా నూతన టెక్నాలజీల టానిక్‌ను వ్యవస్థలోకి చొప్పించాలి. పరిశోధన, అభివృద్ధి రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు రెండూ భారీ పెట్టుబడులు పెట్టడం ద్వారా నవీకరణకు దారులు తెరవాలి. నైపుణిని, శిక్షణను, ఉద్యోగ నియామక అర్హతలను ఇబ్బడిముబ్బడిగా పెంపొందించడం ద్వారా మానవ ప్రతిభ వ్యుత్పత్తుల మూలధనాన్ని పోగేసుకోవాలి.

భారత్ ఎదుట మరో పెను సవాల్ ఉంది. అది 2070 నాటికి కర్బన ఉద్గారాలను శూన్య స్థితికి తీసుకురావడం. ఈ సవాల్‌ను ఎదుర్కొంటూనే భారత్ లక్ష్య సాధనకు కృషి చేయాలి.

వ్యాసకర్త ఆర్థికవేత్త
(‘ద ఫ్రీ ప్రెస్ జర్నల్’ సౌజన్యంతో)

సోషల్ మీడియా

పెరుగుతున్న అంతరం



ఇండియాలోని అత్యంత ధనికులు, మామూలు జనం మధ్య ఆదాయాల అంతరం చాలాకాలం పాటు దక్షిణాఫ్రికా, బ్రెజిల్, పాకిస్తాన్‌లాంటి ఎదుగుతున్న దేశాల తరహాలో ఉండేది. కానీ ‘వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ ల్యాబ్’ ప్రకారం, ఈ అంతరం బాగా పెరిగి, వలసవాద పాలన కాలంలో మాదిరిగా ఉంది. ఇలా వెనక్కివెళ్లడాన్ని మనం ఆపాలి.
– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

వాస్తవ స్థితి




మా తమ్ముడు భోపాల్ నిట్ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్ చేశాడు. ఇస్రో ఏడాదికి 4.8 లక్షల ప్యాకేజీ ఆఫర్ చేసింది. టీసీఎస్ 9 లక్షల ప్యాకేజీ ఇస్తానంది. వాడు టీసీఎస్‌లో జాయినయ్యాడు.
– రాధికా చౌధురీ, వ్యాఖ్యాత

అదే ముఖ్యమా?



మూడు హెచ్‌లు– హమాస్, హెజ్బొల్లా, హౌతీలు లేకుండా ఇరాన్ సైనిక సామర్థ్యం పేలవమైనది. పర్షియన్లను అయతొల్లా ఖొమేనీ సేవలో ఉంచారు. వారి సార్వభౌమత్వానికి సవాలు ఎదురైనా వారి పని ఆయన్ని కాపాడటమే!
– సునందా వశిష్ఠ్, విశ్లేషకురాలు

నమ్మకం లేదా?



ఇండియా ఇన్వెస్టర్లు ‘భారత్ భవిష్యత్ పట్ల చాలా ఆశావహంగా ఉన్నాం’ అని చెబుతుంటారు. అయినా తమ పిల్లల్ని యూఎస్‌కు పంపుతారు.
– దేబర్ఘ్య దాస్, వెంచర్ క్యాపిటలిస్ట్

వాళ్లే బెడద



మధ్య ప్రాచ్యంలో శాంతి, సుస్థిరతలకు అతి పెద్ద బెడద ఉమ్మడిగా ఇజ్రాయెల్, యునైటెడ్ స్టేట్స్‌తోనే ఎదురవుతోంది. ఆ ప్రాంతంలో విచక్షణ ఉన్న పరిశీలకులకు అందరికీ ఇది తెలుసు.
– జేసన్ హికెల్, సీనియర్ ఫెలో

వైజ్ఞానిక వేగుచుక్కలు - 25

సైన్స్ కాంగ్రెస్ తొలి అధ్యక్షురాలు

భారతీయ విశ్వవిద్యాలయాల నుంచి డాక్టర్ ఆఫ్ సైన్స్ పట్టా అందుకున్న మహిళ, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ జనరల్ ప్రెసిడెంట్‌గా వ్యవహరించిన స్త్రీమూర్తి, మహిళా శాస్త్రవేత్తగా రాజ్యసభ సభ్యులు కావడం వంటి ప్రత్యేకతలు అసీమా చటర్జీ (1917– 2006) సొంతం. ప్రకృతి ఉత్పత్తులైన అల్కలాయిడ్స్, కామెరిన్స్, టెర్పనాయిడ్స్ విషయంలోఆమె కృషి విశేషమైనది. భారతీయ ఔషధ మొక్కలకు సంబంధించి వి.విశ్వాస్ గ్రంథానికి చాలా రకాలుగా అదనపు సమాచారాన్ని జోడించి ‘ట్రీటైస్ ఆన్ మెడిసినల్ ప్లాంట్స్’ను ఆరు భాగాల గ్రంథంగా వెలువరించారు.



అసీమా చటర్జీ

అసీమా చటర్జీ 1917 సెప్టెంబరు 23న బెంగాల్ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 1944లో పి.కె. బోస్ సారథ్యంలో కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి తొలి భారతీయ మహిళగా డీఎస్సీ పొందారు. వృక్ష ఉత్పత్తులకు సంబంధించి, సేంద్రియ రసాయనాలపై అధ్యయ నమే ఆవిడ పరిశోధన. ఆ సిద్ధాంత గ్రంథాన్ని నోబెల్ బహుమతి గ్రహీత ఎ.ఆర్. టాడ్ పరీక్షించి గొప్పగా అభినందించారు. ఆమె భర్త వరదానంద చటర్జీ భౌతిక రసాయన శాస్త్రంలో దిట్ట.


1947లో ఆమె అమెరికా వెళ్లి నాలుగేళ్లలో ముగ్గురు వేరు వేరు విశ్వవిద్యాలయాల ఆచార్యుల దగ్గర పరిశోధన చేశారు. ఇందులో నోబెల్ బహుమతి గ్రహీత పాల్ కారర్ ఒకరు. 1950లో భారతదేశానికి తిరిగి వచ్చి కలకత్తా విశ్వవిద్యాలయంలో ఉద్యోగ జీవితాన్ని కొనసాగించారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తూ ఈ విజ్ఞాన శాస్త్ర మహాసభలకు ప్రధాన కార్యదర్శిగా, కోశాధికారిగా, 1975లో ప్రధాన అధ్యక్షులుగా వ్యవహరించారు. భారతీయ ఔషధ మొక్కలు, ఆయుర్వేదానికి సంబంధించి సాల్ట్ లేక్ (కలకత్తా)లో, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రీజనల్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ రావడానికి కృషి చేశారు. మూర్ఛవ్యాధికి విరుగుడుగా ఆయుష్-56, అలాగే మలేరియాను నిర్మూలించేందుకు ఔషధాలను తయారు చేశారు. అసీమా పొందిన ఎన్నో గౌరవాలు, పురస్కారాలలో 1975లో లభించిన పద్మ విభూషణ్ ఒకటి.

ప్రజావళిలో శాస్త్రీయ అభినివేశం లేకపోతే ఫలితం శూన్యమని ఆమె నమ్మేవారు. శాస్త్ర సాంకేతిక అభివృద్ధి పట్టణాల వద్దే ఆగిపోతే మంచిది కాదనీ, గ్రామ సీమలలోనూ అది వ్యాప్తి కావాలనీ అనేవారు. రాజ్యసభ సభ్యురాలిగా 1982 నుంచి 8 ఏళ్ల పాటు సేవలు అందించారు. విజ్ఞానమాతకు ఆభరణంగా భాసిల్లిన అసీమా చటర్జీ 2006 నవంబర్ 22న తన 89వ యేట కన్ను మూశారు.

– డా॥ నాగసూరి వేణుగోపాల్, ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

ఆయనా ఓ పులే!

కామెంట్



కరణ్ థాపర్


ఆ రోజు నేను ఆశ్చర్యపోయాను. ఆయనో సెలబ్రిటీ అనీ, పులుల గురించి తనకు తెలిసినంతగా మరెవరికీ తెలియదనీ నాకు తెలుసు. 40 పుస్తకాలు రాశాడు. ‘ల్యాండ్ ఆఫ్ ద టైగర్’ పేరిట బీబీసీ సిరీస్ చేశాడు. పులుల మీద ప్రపంచస్థాయి ‘అథారిటీ’ అనడానికి ఇంతకంటే రుజువేం కావాలి? ఆయన చనిపోయినప్పుడు వార్తాపత్రికల్లో విశేషమైన కవరేజి వచ్చింది. ఆయన పట్ల ఉన్న అపారమైన గౌరవాభిమానాలకు అది నిదర్శనం. ఆ స్థాయిలో తనకు గుర్తింపు ఉందని నేనెప్పుడూ అనుకోలేదు. ఆయనో ఐకాన్.

వాల్మీక్ థాపర్ మృతితో ఆయన లెగసీ ఏమిటో వెల్లడైంది. ఆయన మిగిల్చిపోయే వారసత్వం, పేరు ప్రఖ్యాతులు అంతగా ఉంటాయని సొంత కుటుంబం కూడా ఊహించలేదు. ప్రకృతి సంరక్షకుడిగా, పులుల అధ్యయనకర్తగా ఆయన కనబరచిన ప్రభావం అపారమని ఆలస్యంగానైనా గుర్తించగలిగాం. ఈ తరానికి చెందిన మా కుటుంబంలో ఆయనో స్టార్.

వాలూ (మేం అలా పిలుస్తాం)కి పులుల మీద వల్లమాలిన ప్రేమ. తను కూడా ఎన్నో రకాలుగా ఒక పులిలాంటివాడు. శక్తిమంతుడు. కఠిన మైనవాడు. మాటలు తక్కువ, హావభావాలు ఎక్కువ. ఆయన వేషభాషలు కొట్టొచ్చినట్లు ఉండేవి. భారీ మనిషి. విలక్షణమైన నవ్వు. పెద్దపెద్ద మెరిసే కళ్లు. వాలూ నవ్వాడంటే క్షణకాలం అంతా కొయ్యబారుతుంది. మరు క్షణం ఆ గదంతా నవ్వులతో పెళ్లుమంటుంది.

తెలియడానికి చిన్నప్పటి నుంచీ తెలిసినా తనను నిజంగా తెలుసుకున్నది మాత్రం నా ఇరవైలలోనే. మనకు అన్నీ తెలుసు అనుకునే వయసది. ప్రియ నేస్తమైన క్లెయిర్ వింటర్ ప్లాడెన్‌తో కలిసి ఇండియాలో సెలవులకు వచ్చాను. ఆ సెలవులను రణతంబూరులో గడపమని వాలూ మాకు సలహా ఇచ్చాడు. ‘జీవితంలో ఒక్కసారన్నా పులిని చూడకపోతే, నువ్వసలు జీవించినట్లే కాదు’ అంటూ రెచ్చగొట్టాడు. ‘నేను మిమ్మల్ని రణతంబూర్ తీసుకెళ్తా... అక్కడ నిజమైన పులులను చూపిస్తా, మీరు బాగా ఎంజాయ్ చేస్తారు, సరేనా’ అని చెప్పి ఒప్పించాడు.

వాలూ చెప్పింది నిజం. మేం రణతంబూరుకు జీపులో బయలుదేరాం. పంజా గుర్తులను అనుసరిస్తూ వాలూ తనే జీపు నడిపాడు. అలా జీపును పోనిచ్చి



◆ పులుల సంరక్షకుడు, రచయిత, టీవీ ప్రొడ్యూసర్ వాల్మీక్ థాపర్ తన 73వ యేట మే 31న మరణించారు.

చాలా పులులను కొద్ది అడుగుల దూరం నుంచే మాకు చూపించాడు. రాత్రి సరస్సు ఒడ్డున నెగడు వేసుకుని ఆయన కథలు చెబుతుంటే వింటూ రమ్ తాగాం. కథల్లోని పులులు కూడా మా కళ్ల ముందు ప్రత్యక్షమైనట్లు అనిపించింది. వాలూ అంతగా నాటకీయ ఫక్కీలో కథలు చెప్తాడు. మేం బాగా ఎంజాయ్ చేశాం.

రణతంబూరులో గడిపిన ఆ రోజుల అర్థం ఏంటో నేను అప్పట్లో గుర్తించలేదు. అడవిలో సెలవులు గడపటం అదే మొదటిసారి. ఒక గర్ల్ ఫ్రెండ్‌తో కలిసి వెకేషన్ గడపటం అదే మొదటిసారి. మమ్మల్ని వాచ్ చెయ్యడానికి, నేను హద్దులు దాటకుండా మానిటర్ చేయ్యడానికి పేరెంట్స్ గానీ, గార్డియన్ గానీ అక్కడ లేకపోవడం అదే మొదటిసారి. కానీ వాలూకి తెలుసు. అందుకే మమ్మల్ని రణతంబూరు తీసుకెళ్లాడు. అంత శ్రద్ధ తీసుకున్నాడు. ఒక కజిన్ ఎదుగుదలకు తన వంతు సాయం తను చేశాడు.

తర్వాతి సంవత్సరాల్లో నేను జర్నలిస్టుగా మారినప్పుడు, తరచూ నన్ను డిన్నర్ కంటూ ఆహ్వానించి నాకు తెలియని విషయాలు ఎన్నో చెబుతూ ఉండేవాడు. నేను ఫాలో అయ్యే స్టోరీస్ అంతరార్థాలు, నాకు తట్టని గూఢార్థాలు విశదపరిచేవాడు. ఇదేమైనా ఆలోచించావా... అంటూ వాక్యం మొదలెట్టేవాడు. అలా ప్రారంభించాడంటే ఆ విషయం నేను ఆలోచించలేదని ముందే తెలిసిపోయేది.

ఎంతో సౌమ్యంగా, ఎంతో వివేకంతో నన్ను గైడ్ చేసేవాడు. అది నాకు మొదట్లో అర్థం అయ్యేది కాదు. కొన్ని కొన్నిసార్లు నా విషయ పరిజ్ఞానం పెంచేందుకు సంభాషణలకు ఇతరులను కూడా పిలుస్తూ ఉండేవాడు. మరికొన్నిసార్లు నేను ఇంటర్వ్యూ చేసిన తర్వాత కాల్ చేసి మాట్లాడేవాడు. ఏదైనా వార్తాకథ నాన్ని నేను గమనించానో లేదోనని నన్ను అలర్ట్ చేసిన సందర్భాలూ ఉన్నాయి. ప్రతి సందర్భంలోనూ సలహా అమూల్యంగా ఉండేది. తను రాజకీయ నాయకుడు కానప్పటికీ, ఏది జనం దృష్టిని ఆకర్షిస్తుందో తెలుసు. ఏది అందరికీ ఆసక్తికరంగా ఉంటుందో, ఏది ఢిల్లీ ఉన్నత వర్గాలను మాత్రమే ఆకర్షిస్తుందో అనాలోచితంగానే వాలూకి అర్థమైపోతుంది.

వాలూ నా విమర్శకుడు కూడా. అయితే ఆ విమర్శ సున్నితంగా సమంజసంగా ఉంటుంది. వేరేవారు అయితే ఆ వ్యాఖ్యలకు చిరాకు పడేవారేమో. కానీ నా ప్రోగ్రాం నిశితంగా చూసి జాగ్రత్తగా ఆలోచించుకున్న తర్వాతే నాతో దాని గురించి మాట్లాడతాడని నాకు తెలుసు. వాలూ చేసిన ఒక సూచన నేను పూర్తిగా అంగీకరించాను. కానీ అమలు చేయలేకపోయాను. మాట్లాడేప్పుడు గొంతు పెంచవద్దన్నది ఆ సూచన. ‘నీ ఉద్వేగ ప్రదర్శన అనవసరం... ఆడియన్స్‌ను ఆకట్టుకోడానికి నీ మాటల్లో ఉండే కంటెంట్ సరిపోతుంది. స్వరాన్ని చివరి వరకూ ఒకే పిచ్‌లో ఉంచుకోవాలి’ అనేవాడు.

నేను ఎప్పుడూ పాటించలేక పోయాను. ఇప్పుడు మాత్రం ప్రయత్నం చేస్తున్నాను. నా స్వరతంత్రుల మీద అదుపు కోల్పోతున్నప్పుడల్లా, గొంతు పెరుగుతున్న ప్రతిసారీ జ్ఞానదాయకమైన వాలూ సలహాను గుర్తు చేసుకుంటా. అంటే... ఆయన్ను ఎప్పటికీ మర్చిపోనన్న మాట!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

యోగాగ్ని

న తస్య రోగో న జరా న మృత్యుః
ప్రాప్తస్య యోగాగ్ని మయం శరీరం

ఎవరి శరీరమైతే యోగాగ్నితో నిండి ఉంటుందో అతనికి రోగం లేదు, ముసలితనం లేదు, చావు లేదు అని అర్థం. రోగము లేనివాడు, ముసలితనము రానివాడు, చావు లేనివాడు లోకంలో ఒక్కడూ లేడు. అంటే అసలైన యోగి ఒక్కడూ లేడని చెప్పాల్సి ఉంటుంది. కానీ దాని అర్థం అది కాదు. ఎవడైతే నిజంగా యోగాన్ని పొంది ఉంటాడో వానికి రోగమంటదు, వృద్ధాప్యం రాదు, చావు లేదు. మరి యోగాన్ని పొందటమంటే ఏమిటి? యోగమంటే కలయిక. ఎవరు ఎవరితో కలిస్తే యోగమన బడుతుంది? జీవాత్మ పరమాత్మతో కలిస్తే యోగమన బడుతుంది.



జ్యోతిర్మయం

జీవాత్మ పరమాత్మలో సంపూర్ణంగా లీనం కావటమే యోగం. అలాంటి స్థితిని పొందిన వానికి ఇక రోగం, ముసలితనం, చావు ఎలా ఉంటాయి? పరమాత్మకు అవన్నీ ఉండవు కదా! చాలా గొప్పగా చెప్పుకునే అరవింద ఘోష్ లాంటి వారికీ ఈ వృద్ధాప్యం, చావు వచ్చాయి అని మనందరికీ తెలుసు. క్రియాయోగాన్నే అందుబాటులోకి తెచ్చిన పరమహంస యోగానందకు చావు సంభవించింది. రాజయోగులుగా పేరొందిన వారంతా వెళ్ళిపోయారు.

రోగం, ముసలితనం, చావు వారి శరీరాలకే కానీ వారికి శరీరంతో దృఢ బంధం ఉండదు. కాబట్టి వారికి ఇవి మూడూ లేవని గ్రహించాలి. యోగ మార్గంలో ప్రాథమిక దశలో ఉన్నవారికి కూడా ఇతరులకంటే మంచి ఆరోగ్యమే ఉంటుంది; శారీరక రోగాలు, మానసిక రోగాలు తగ్గుముఖం పడతాయని పెద్దలు చెబుతారు. కాబట్టి సరైన గురువును ఎన్నుకొని యోగమార్గంలో పయనించటం శ్రేయస్కరం. దానికి స్వామి వివేకానంద రచించిన ‘రాజయోగ’ గ్రంథం ఎంతో ఉపయోగకరం.

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.పంచమి ప.1.27 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** ధనిష్ఠ రా.11.42 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ప.12.26 నుండి 1.18 వరకు, తదుపరి ప.3.03 నుండి 3.55 వరకు, **అమృతఘడియలు:** ప.1.13 నుండి 2.50 వరకు ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.29, **సూర్యాస్తమయం:** 6.31.



దేశంలో సగానికిపైగా ప్రజలకు జీవనాధారం వ్యవసాయమే. అలాంటి ప్రధాన రంగానికి సంబంధించి కచ్చితమైన గణాంకాల సేకరణ ఇన్నాళ్లూ కలగానే ఉంది. మొట్టమొదటిసారిగా శాటిలైట్ ఆధారిత అంచనాల సేకరణ ప్రారంభం కావటంతో కచ్చితత్వంతో కూడిన గణాంకాల సేకరణకు మార్గం సుగమమైంది. ఇప్పటికే పైలట్ అధ్యయనాలు పూర్తయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లో వరి సాగు విస్తీర్ణం భారీగా పెరిగినట్లు డిజిటల్ సర్వే గుర్తించింది. ఇది వ్యవసాయ గణాంకాల నమోదు ప్రక్రియలో పెద్ద ముందడుగు. కేంద్ర వ్యవసాయ శాఖ చొరవతో; రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సాగు లెక్కల సేకరణ, డిజిటలీకరణ ఇక పక్కాగా జరగనుంది.

- సాక్షి, సాగుబడి

శాటిలైట్ లెక్క.. సాగు పక్కా



- వ్యవసాయ గణాంకాల్లో మరింత కచ్చితత్వం
- ఉపగ్రహాల డేటాతో పైలట్ అధ్యయనాలు
- 93-95% కచ్చితత్వంతో ఫలితాలు
- ఈ ఖరీఫ్ నుంచి డిజిటలీకరణకు సన్నాహాలు
- సెప్టెంబర్ నాటికి పూర్తిస్థాయి గణాంకాలు

దేశంలో వ్యవసాయ రంగంలో గణాంకాల ప్రక్రియ కొంత సంక్లిష్టంగా, సుదీర్ఘ ప్రక్రియగా ఉంది. గ్రామ స్థాయిలో సిబ్బంది భూమి రికార్డు పుస్తకాల్లో సాగు విస్తీర్ణం, పంటల వివరాలను నింపుతారు. ఖరీఫ్ జూన్‌లో ప్రారంభమైనప్పటికీ పంట అంచనాలకు సంబంధించిన గణాంకాలు అరకొరగానే అందుతుండేవి. ఈ గణాంకాలను అనేక సార్లు సవరించేవారు. చివరికి ఎప్పటికో తుది అంచనాలు పాలకులకు అందుబాటులోకి వచ్చేవి. అయితే, శాటిలైట్ డేటాతో అనుసంధానం చేసి వ్యవసాయ గణాంకాల సేకరణను డిజిటలీకరించటంతో సెప్టెంబర్ నాటికే తొలి అంచనాలు అందుబాటులోకి రానున్నాయి. వ్యవసాయ గణాంకాల డిజిటలీకరణ దిశగా ఇది చాలా పెద్ద ముందుడుగని చెప్పుకోవచ్చు.

పూర్తయిన పైలట్ అధ్యయనాలు

వ్యవసాయ రంగానికి సంబంధించి ఎలాంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలన్నా; ముందస్తు మార్కెటింగ్ సదుపాయాలు, ఎగుమతి దిగుమతులు చేపట్టాలన్నా.. నమ్మకమైన గణాంకాల సేకరణ అత్యంత కీలకం. ఇప్పుడు ఈ సమస్యను అధిగమించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేశాయి. 'వివిధ రాష్ట్రాల్లో ఇప్పటికే పైలట్ అధ్యయనాలు పూర్తయ్యాయి. ఫలితాలు 93–95% కచ్చితత్వంతో వచ్చాయి. గణాంకాలను మాన్యువల్‌గా నమోదు చేసినప్పటితో పోలిస్తే ఇది చాలా మెరుగు. అందువల్ల ఈ ఏడాది ఖరీఫ్ నుంచి దేశంలోని అన్ని జిల్లాల్లో శాటిలైట్ డేటా ఆధారంగా వివరాలు సేకరిస్తున్నాం. ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో పండించారు, దిగుబడుల తొలి డిజిటల్ అంచనాలను సెప్టెంబర్ నాటికే విడుదల చేయడానికి ఏర్పాట్లు చేశాం' అని అధికార వర్గాలు చెబుతున్నాయి.

2024లోనే డిజిటల్ క్రాప్ సర్వే

సాధారణంగా భూమి రికార్డులు నిర్వహించే గ్రామస్థాయి సిబ్బంది (గిరిదవారీ పద్ధతి) ప్రతి ఏటా సాగయ్యే పంటల వివరాలు, విస్తీర్ణం, దిగుబడి అంచనాలు తదితర వివరాలను పుస్తకాల్లో నమోదు చేస్తూ, అనేక దఫాలు సవరిస్తూ ఉండేవారు. దాంతో అనిశ్చితి నెలకొనేది. అటువంటి అనిశ్చితికి స్వస్తి చెబుతూ రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వ్యవసాయ గణాంకాల సేకరణ వ్యవస్థను మెరుగుపరిచే పనికి శ్రీకారం చుట్టింది కేంద్ర ప్రభుత్వం. కేంద్ర వ్యవసాయ శాఖ గత ఏడాది నుంచి పంటల సాగు వివరాలపై శాటిలైట్ ఆధారిత గణాంకాల సేకరణ ప్రారంభించింది. 2024 ఖరీఫ్‌లో డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్) పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. ఇందులో భాగంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఒడిశా రాష్ట్రాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పంటల విస్తీర్ణం, తదితర గణాంకాల డిజిటలీకరణ జరిగింది. దాదాపు కచ్చితమైన పంట అంచనాల సేకరణ సాధ్యపడింది. ఉత్తరప్రదేశ్‌లో వరి సాగు విస్తీర్ణం భారీగా పెరిగినట్లు ఆ డిజిటల్ సర్వే గుర్తించింది. ఆ అనుభవాలతోనే ఈ ఏడాది అన్ని రాష్ట్రాల్లో డిజిటల్ పద్ధతుల్లో శాటిలైట్ ఆధారిత గణాంకాల సేకరణకు సన్నాహాలు జరుగుతున్నాయి.



కొత్త పంటల వివరాలూ..

పంటల మార్పిడి గురించి, కొత్త పంటల సాగుకు సంబంధించి గణాంకాల వివరాలు గతంలో లభించేవి కాదు. సంప్రదాయకంగా సాగయ్యే వరి, మొక్కజొన్న, జొన్న వంటి 25–26 రకాల పంటల వివరాలు మాత్రమే గణాంకాల్లోకి చేరేవి. ఇప్పుడు శాటిలైట్ డేటా ఆధారంగా డిజిటల్ గణాంకాల సేకరణతో ఈ సమస్య తీరనుంది. బెర్రీస్, అవొకాడో, డ్రాగన్‌ఫ్రూట్, కివి వంటి కొత్తపంటల సాగును సైతం ఇప్పుడు నమోదు చేస్తున్నారని వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి.

గోదావరిలో ఘోరం



బాసరలో ప్రమాదం జరిగిన స్థలం



భరత్ | రాకేశ్ | మదన్ | రుత్విక్ | వినోద్

▶ మొదటి పేజీ తరువాయి

తీసుకొచ్చారు. అప్పటికే వారు చలనం లేని స్థితిలో ఉండగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు..వారిని వెంటనే భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నలుగురూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా గంట పాటు గాలించిన తర్వాత వినోద్ మృతదేహం లభించింది.

ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత

తొలుత ఆస్పత్రికి తరలించిన నలుగురిలో ఇద్దరు కొన ఊపిరితో ఉన్నారని, ఆస్పత్రి సిబ్బంది సరిగా స్పందించ పోవడంతో వారు మరణించారని బాధిత కుటుంబాలు ఆరోపించాయి. వారి రోదనలతో ఆస్పత్రి ఆవరణ మార్మోగిపోయింది. ఈ సందర్భంగా కొద్దిసేపు ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత నెలకొంది. భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం తర్వాత మృతదేహాలను కుటుంబీకులకు అప్పగించారు.

ఫాదర్స్ డే రోజు పుత్రశోకం

ఈ దుర్ఘటనలో మరణించిన రాకేశ్, మదన్, భరత్ ముగ్గురు సోదరులు. ప్రేమ్‌రామ్, సోను దంపతుల కుమారులు. ఒకేసారి ముగ్గురూ మరణించడంతో భార్యాభర్తలు కుప్పకూలిపోయారు. విషయం తెలిసి హైదరాబాద్ నుంచి వచ్చిన వారు ఆస్పత్రి వద్ద గుండెలవిసేలా రోదించారు. వారిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. చింతల్ డివిజన్ చంద్రానగర్‌కు చెందిన ప్రేమ్‌రామ్ రైస్, కిరాణా హోల్‌సేల్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా తండ్రికి శుభాకాంక్షలు చెప్పిన ముగ్గురు కుమారులు ఇతర బంధువులతో కలిసి బాసర బయలుదేరి వెళ్లారు. నదిలో ప్రాణాలు కోల్పోయి తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిల్చారు. రాకేశ్ డిగ్రీ చదువుతుండగా, మదన్ ఇటీవల నీట్ పరీక్ష రాసి మంచి ఫలితం సాధించాడని, భరత్ ఎస్సెస్సీలో స్థానిక స్కూల్ టాపర్ అని తెలిసింది. వీరి సమీప బంధువులు దిల్‌సుఖ్‌నగర్ సమీపంలోని శాలివాహననగర్‌లో నివాసం ఉంటుండగా వారి కుమారుడు రుత్విక్ ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. వినోద్ కుటుంబం బేగంబజార్‌లో ఉంటుందని తెలిసింది. స్థానిక రాజస్తానీలు కొందరు భైంసా ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబాలను ఓదార్చారు.

లోక్ అదాలత్‌లో 1,93,439 కేసుల పరిష్కారం

- ఇందులో సైబర్ క్రైమ్ కేసులు 6,294
- సైబర్ నేర బాధితులకు రూ.53.5 కోట్ల రిఫండ్
- డీజీపీ జితేందర్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: జాతీయ మెగా లోక్ అదాలత్‌లో భారీ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యాయి. శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ లోక్ అదాలత్‌లో రాష్ట్రవ్యాప్తంగా 6,294 సైబర్ నేరాలు, 1,87,145 సాధారణ నేరాలు సహా మొత్తం 1,93,439 క్రిమినల్ కేసులు పరిష్కారమయ్యాయి. ఈ మేరకు డీజీపీ జితేందర్ ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు. తీవ్రమైన నేరాలు మినహా రాజీ కుదుర్చుకునే కేసులను పోలీసులు లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తున్నారు. సైబర్ నేరాలతోపాటు అత్యధిక సంఖ్యలో 84,601 ఈ–పెట్టీ కేసులు, 71,527 మోటార్ వెహికిల్ యాక్ట్ కింద నమోదైన కేసులు సైతం పరిష్కారమయ్యాయి. సైబర్ క్రైం కేసుల్లో మోసపోయి డబ్బులు పోగొట్టుకున్న బాధితులకు మొత్తం రూ. 53.5 కోట్ల రిఫండ్ ఆర్డర్లు ఇప్పించినట్టు తెలిపారు. లోక్ అదాలత్ విజయవంతం చేయడంలో కృషి చేసిన సీఐడీ అడిషనల్ డీజీ చారు సిన్హా, స్టేట్ క్రైం రికార్డ్స్ బ్యూరో అధికారులు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలను డీజీపీ అభినందించారు.

సాధారణ కేసుల పరిష్కారంలో టాప్-5 యూనిట్లు

యూనిట్ పేరు	పరిష్కారమైన కేసులు
హైదరాబాద్	32,171
రాచకొండ	21,397
నల్లగొండ	16,496
వరంగల్	13,651
రామగుండం	13,316

టాప్-5 యూనిట్లలో సైబర్ క్రైమ్ కేసుల పరిష్కారం ఇలా..

యూనిట్	కేసులు	రిఫండ్ (రూ.కోట్లలో)
హైదరాబాద్	782	14.54
సైబరాబాద్	2,997	13.65
రాచకొండ	1005	11.01
టీజీ సీఎస్‌బీ	172	5.74
సంగారెడ్డి	206	1.42



ఆదివారం తిరుమల శ్రీవారిని కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మధుసూదన్ రావు

- తిరుమల



రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ఆదివారం తన కుటుంబ సభ్యులతో కలసి యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభువులను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు.

- యాదగిరిగుట్ట

ప్రభుత్వ బడుల్లో టెక్ కోర్సులు

▶ మొదటి పేజీ తరువాయి

యోగితారాణా, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నర్సింహారెడ్డి, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సంస్థలు అందించే సేవలివీ..

- ఎక్‌స్టెప్ ఫౌండేషన్ 540 పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై పని చేస్తుంది. 33 జిల్లాల పరిధిలో 5వేలకుపైగా పైగా ప్రాథమిక పాఠశాలలకు దీన్ని విస్తరిస్తుంది. మూడు నుంచి ఐదో తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ భాషలతోపాటు మ్యాథ్స్‌పై బేసిక్స్‌ను అందిస్తుంది.
- ఫిజిక్స్‌వాలా ఇంటర్మీడియట్ విద్యార్థులను నీట్, జేఈఈ, క్లాట్ పరీక్షలకు సన్నద్ధులను చేస్తుంది. పాఠశాలస్థాయి నుంచే పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తుంది.
- ఖాన్ అకాడమీ రాష్ట్రంలో 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలకు అనుగుణంగా వీడియో ఆధారిత సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్‌పై శిక్షణ ఇస్తుంది.
- ప్రజ్వల ఫౌండేషన్ 6వ తరగతి నుంచి క్లాస్ 12 వరకు విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా బాల సురక్ష, రక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తుంది.
- పైజామ్ ఫౌండేషన్ ఒకటో తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు కోడింగ్ మరియు కంప్యూటేషనల్ థింకింగ్‌పై శిక్షణ ఇస్తుంది.
- ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థ రాష్ట్రంలో పాఠశాలలకు దూరంగా ఉన్న 16 వేలకు పైగా పిల్లలను తిరిగి బడిలో చేర్పించటంతో పాటు బాలికల అక్షరాస్యత, విద్యావకాశాలను మెరుగుపరుస్తుంది.

ప్రసాద వితరణకు ప్రతినెలా జీతం నుంచి రూ.లక్ష ఇస్తా

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈవో వెంకట్రావ్



కొండపైన బస్టాండ్ వద్ద నిండిపోయిన భక్తుల వాహనాలు



రూ.3 లక్షల చెక్కును అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తికి అందజేస్తున్న ఈవో

యాదగిరిగుట్ట: తాను సర్వీసులో ఉన్నంత కాలం ప్రతి నెలా వేతనం నుంచి లక్ష రూపాయలను యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు ఉచితంగా పంపిణీ చేసే ప్రసాద వితరణకు విరాళంగా ఇస్తానని ఆలయ ఈవో వెంకట్రావ్ వెల్లడించారు. వెంకట్రావ్ దేవస్థానం ఈవోగా బాధ్యతలు చేపట్టిన తరువాత తీసుకున్న మొదటి నెల జీతంలో నుంచి రూ.లక్షను, అమెరికాలో ఉంటున్న తన కుమారుడు దేవజ్ కుమార్ నుంచి రూ.లక్ష, అలాగే కుమార్తె మోనిషా తరపున రూ.లక్ష చొప్పున మొత్తంగా కుటుంబం నుంచి రూ.3 లక్షలను ప్రసాద వితరణ నిమిత్తం చెక్కును అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తికి ఆదివారం అందజేశారు. అనంతరం ఈవో వెంకట్రావ్ మాట్లాడుతూ, ఈ నగదును ఆగస్టు 15వ తేదీ నుంచి భక్తులకు ఉచితంగా ప్రసాదం పంపిణీ చేసేందుకు వినియోగించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో దోర్బల భాస్కర్‌శర్మ, ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు పాల్గొన్నారు.

యాదగిరీశుని దర్శనానికి 70 వేల మంది భక్తులు

యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామిని 70 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో శ్రీస్వామిని దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా, వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పరిసరాలు, క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, బస్టాండ్, కొండ కింద కల్యాణకట్ట, లక్ష్మీ పుష్కరిణి, శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపాలు భక్తులతో నిండిపోయాయి. కొండపైన బస్టాండ్ వద్ద కార్లు పూర్తిగా నిండిపోయాయి. శ్రీస్వామివారి ధర్మదర్శనానికి 4 గంటలకు పైగా సమయం పట్టగా, వీఐపీ దర్శనానికి గంటన్నర సమయం పట్టింది.

జూలై రెండో వారంలో..

▶ మొదటి పేజీ తరువాయి

సాయాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ వారంలోనే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేయనుంది. దీంతో పాటు సన్న రకం ధాన్యానికి బోనస్ ఇచ్చే ప్రక్రియను కూడా త్వరలోనే పూర్తి చేయనుంది. ఈ రెండు పథకాల నిధులను జమ చేసిన అనంతరం ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని తెలుస్తోంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు 15 రోజులు మాత్రమే సమయం ఉందని ఖమ్మం జిల్లా కూసుమంచిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా ఈ సమాచారాన్ని ధ్రువీకరిస్తున్నాయి. తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ నోటిఫికేషన్ ఇస్తారని, ఈ ఎన్నికల అనంతరం వారం రోజుల వ్యవధిలోనే సర్పంచ్‌లు, మున్సిపాలిటీలకు కూడా ఎన్నికల నగారా మోగించే యోచనలో ప్రభుత్వం ఉందని తెలుస్తోంది.

అధికార పార్టీలో 'కమిటీల' హడావుడి

స్థానిక సంస్థలకు త్వరలోనే ఎన్నికలు జరుగుతాయనే సమాచారం నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో హడావుడి పెరిగింది. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేయనున్న గ్రామ, మండల, బ్లాక్ కాంగ్రెస్ కమిటీల నియామకానికి గడువు విధించారు. డీసీసీ అధ్యక్షులు, పార్టీ పరిశీలకులతో నిర్వహించిన జూమ్ సమావేశంలో ఈ మేరకు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ దిశా నిర్దేశం చేశారు. ఈ నెల 25వ తేదీకల్లా రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సంస్థాగత ఎన్నికలు పూర్తి కావాలని, గ్రామ, మండల, బ్లాక్ కాంగ్రెస్ కమిటీలకు నియామక ఉత్తర్వులను కూడా ఇచ్చేయాలని ఆమె ఈ సమావేశంలో ఆదేశించారు. దీంతో పాటు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఐదుగురు ముఖ్య నాయకుల పేర్లను పీసీసీకి పంపాలని, వీరికి రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ డైరెక్టర్లుగా అవకాశం కల్పిస్తామని చెప్పినట్టు తెలిసింది. స్థానిక ఎన్నికల్లో కేడర్ ఉత్సాహంగా పాల్గొనేలా చేయాలనే వ్యూహంతోనే మీనాక్షి ఈ ఆదేశాలు జారీ చేసినట్టు తెలుస్తోంది.

రిజర్వేషన్ల పెంపు లేకుండానే..!

ఈ నెల చివరి వారంలో స్థానిక సంస్థలకు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే పక్షంలో బీసీ రిజర్వేషన్ల పెంపునకు అవకాశం లేనట్టేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బీసీ వర్గాలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని పార్లమెంటుతో పాటు రాష్ట్రపతి ఆమోదించాల్సి ఉంది. అయితే ఇది ఇప్పట్లో జరిగే అవకాశం లేదు. అందువల్ల బీసీలకు పాత రిజర్వేషన్లనే కొనసాగించవలసి ఉంటుంది. అయితే కాంగ్రెస్ పార్టీ పరంగా బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం సీట్లు కేటాయిస్తామని ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో..కేంద్రం అనుమతితో నిమిత్తం లేకుండా పార్టీ పరంగా బీసీ వర్గాలకు స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించే అవకాశాలు ఉన్నాయి.

ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో రోగి ఆత్మహత్య

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చిన ఓ వ్యక్తి ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆస్పత్రి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన బి.లక్ష్మయ్య (41)కు అనారోగ్య సమస్యలు రావడంతో బంధువులు శనివారం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు టీబీ వార్డులో ఉంచి చికిత్స ప్రారంభించారు. ఆదివారం మధ్యాహ్నం వరకు లక్ష్మయ్య చికిత్స పొందుతూ బంధువులతో ముచ్చటించాడు. ఆ తర్వాత ఫోన్‌లో మాట్లాడుతూ వార్డు నుంచి బయటకు వెళ్లి.. పక్కనే ఉన్న చెట్టుకు ఉరి వేసుకున్నాడు. కాసేపటి తర్వాత వార్డులో లక్ష్మయ్య కనిపించక పోవటంతో బంధువులు చుట్టు పక్కల గాలించగా చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. విషయాన్ని ఆస్పత్రి అధికారులకు తెలుపగా వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. లక్ష్మయ్య ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

విద్యుదాఘాతానికి నలుగురు బలి



గణపతి విగ్రహానికి తగిలిన విద్యుత్ తీగలు



వినోద్



సాయికుమార్

కోరుట్ల: రాష్ట్రంలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో విద్యుదాఘాతంతో నలుగురు మృతి చెందారు. హైదరాబాద్‌లో ఇద్దరు, జగిత్యాల జిల్లాలో ఇద్దరు మరణించగా, ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. కోరుట్ల–మెట్‌పల్లి జాతీయ రహదారి వెంట ఉన్న బాలాజీ కళా ఆర్ట్స్‌లో గణపతి విగ్రహాలు తయారు చేస్తారు. షెడ్‌లో తయారు చేసిన ఓ గణపతి విగ్రహానికి రంగులు వేసేందుకు మరో షెడ్‌కు తరలించడానికి ఆదివారం మధ్యాహ్నం 3.45 గంటల సమయంలో క్రేన్‌తో ఏర్పాట్లు చేసుకున్నారు. యజమాని అల్వాల వినోద్, ఆయన తమ్ముడు అల్వాల నితిన్ 8 మంది వర్కర్లతో కలిసి విగ్రహాన్ని ట్రాలీపై జాతీయ రహదారిపైకి తెచ్చారు. విగ్రహం దాదాపు 12 ఫీట్ల ఎత్తు ఉండటంతో కిరీటం భాగం పైన ఉన్న 33 కేవీ విద్యుత్ తీగలకు తగిలింది. విగ్రహం తడిగా ఉండటంతో విగ్రహాన్ని పట్టుకుని ఉన్న పది మంది విద్యుత్ షాక్‌కు గురయ్యారు. కరెంట్ తీగల్లో మంటలు చెలరేగి విగ్రహం కిరీటం కాలిపోయింది. ఏడుగురు షాక్‌తో విగ్రహానికి అతుక్కుపోయారు. మరో ముగ్గురు కింద పడిపోయారు. గమనించిన చుట్టుపక్కల వారు విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతోపాటు వారు కరెంటు తీగలను పక్కకు తప్పించారు. బాధితులను కోరుట్ల ప్రభుత్వాసుపత్రికి.. అక్కడి నుంచి జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో యజమాని అల్వాల వినోద్ (32), వర్కర్ వెల్లుట్ల సాయికుమార్ (23) మృతిచెందారు. ఎనిమిది మంది చికిత్స పొందుతున్నారు. ప్రమాద స్థలాన్ని ఎస్పీ అశోక్‌కుమార్ సందర్శించారు.

నిద్రలోనే తెల్లారిన బతుకులు

నాగోలు: నిద్రిస్తున్న వారిపై విద్యుత్ తీగలు తెగిపడిపోవడంతో ఇద్దరు సజీవ దహనమైన ఘటన హైదరాబాద్ ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎల్‌బీనగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఎల్‌బీనగర్‌లోని సాగర్ రింగ్ రోడ్డు చౌరస్తా సమీపంలోని బాబాయ్ హోటల్ సమీపంలో రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద ఫుట్‌పాత్‌పై ఇద్దరు గుర్తు తెలియని యాచకులు నిద్రిస్తున్నారు. వారితోపాటు ఓ శునకం కూడా ఉంది. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో 11 కేవీ హైటెన్షన్ వైరు తెగి నిద్రిస్తున్న వారిపై పడింది. ఇద్దరు యాచకులతో పాటు పక్కనే ఉన్న శునకం సజీవ దహనమైంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితి పరిశీలించారు. 11కేవీ విద్యుత్ తీగ వారిపై పడిపోవడంతో మంటల్లో కాలిపోయి వారి బట్టలు, దుప్పట్లు వారి శరీరాలకు అంటుకున్నాయి. గుర్తించలేని విధంగా మృతదేహాలున్నాయి. మృతులను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.



కేవీ వైరు మీద పడి మంటల్లో కాలిపోతున్న గుర్తు తెలియని వ్యక్తులు..

20న తెలుగు రాష్ట్రాల బంద్‌కు మావోయిస్టు పార్టీ పిలుపు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకవైపు మావోయిస్టు నాయకత్వాన్ని హతమారుస్తూనే, మరోవైపు శాంతి చర్చల పేరిట నాటకం ఆడుతున్నాయని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ ఆదివారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో చర్చల పేరుతో కామ్రేడ్ సుధాకర్‌ను కూడా చంపేశారని మండిపడ్డారు. ప్రభుత్వం చేస్తున్న బూటకపు చర్చల నాటకాన్ని ఎండగడుతూ, కగార్ దాడులను వ్యతిరేకిస్తూ ఈనెల 20న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో బంద్‌ను పాటించాలని పిలుపునిచ్చారు.

మోకాలితో గొంతు నొక్కిన ఉదంతంలో భారతీయుని విషాదాంతం



ఆస్ట్రేలియాలో భారతీయునిపై పోలీసు జులుం ● రెండు వారాలు కోమాలోకి వెళ్లి ఆస్పత్రిలో మృతి

మెల్‌బోర్న్: భార్యాభర్తల నడుమ చిన్న వాగ్వాదంపై ఆస్ట్రేలియా పోలీసుల అతి స్పందన, మితిమీరిన జులుం, ఆటవికులను తలపించిన కర్కశత్వం చివరికి ఓ భారతీయుని ప్రాణాలు బలిగొన్నాయి. తలను నేలకేసి కొట్టడమే గాక మెడపై మోకాలితో తొక్కిపెట్టడంతో 42 ఏళ్ల గౌరవ్ కుందీ మెదడుకు తీవ్ర గాయమైంది. దాంతో కోమాలోకి వెళ్లి ఆస్పత్రిలో రెండు వారాలుగా మృత్యువుతో పోరాడి గురువారం తుదిశ్వాస విడిచాడు. ఐదేళ్ల క్రితం అమెరికాతో పాటు ప్రపంచమంతటినీ కుదిపేసిన 'ఫ్లాయిడ్ ఉదంతాన్ని తలపించిన ఈ క్రూరత్వంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



గౌరవ్ దంపతులు

ఆ రోజు అసలేమైంది?

గౌరవ్, అమృత్‌పాల్ కౌర్ దపంతులు అడిలైడ్‌లో నివసిస్తున్నారు. వారికిద్దరు పిల్లలు. జూన్ మొదటి వారంలో జరిగిన దారుణాన్ని భార్య మీడియాతో పంచుకున్నారు. ''మేమిద్దరం మా ఇంటి సమీపంలో నడుస్తున్నాం. నా భర్త కాస్త తాగి ఉన్నారు. మా మధ్య చిన్న వాగ్వాదం జరిగింది. ఆయన నన్ను దూరంగా నెట్టేయడాన్ని పెట్రోలింగ్ పోలీసులు చూశారు. వెంటనే ఒక పోలీసు మా దగ్గరికొచ్చాడు. వస్తూనే నా భర్తను పోలీస్ కారుకేసి విసురుగా కొట్టాడు. తర్వాత కిందపడేసి తలను నేలకు గట్టిగా అదిమిపెట్టాడు. నా భార్యను హింసించడం లేదు అంటూ ఆయన మొత్తుకుంటున్నా వినిపించుకోలేదు. మేం కేవలం గట్టిగా మాట్లాడుకున్నామని, వదిలేయండని నేనూ అరిచినా పట్టించుకోలేదు. మెడపై చాలాసేపు మోకాలితో అదిమిపట్టడంతో ఊపిరాడక గౌరవ్ చివరకు స్పృహ తప్పారు. అయినా అరెస్ట్ చేయబోగా బతిమాలి ఆస్పత్రిలో చేర్పించా. మెడ, మెదడు నరాలు బాగా దెబ్బతిని కోమాలోకి వెళ్లాడు, స్పృహలోకి రావడం కష్టమని వైద్యులు చెప్పారు'' అంటూ వాపోయారు. 2020 మే నెలలో జార్జ్ ఫ్లాయిడ్ అనే 46 ఏళ్ల నల్ల జాతీయున్ని శ్వేతజాతి పోలీసు ఏకంగా తొమ్మిది నిమిషాల పాటు నేలకేసి అదిమిపట్టి ఊపిరాడకుండా చేయడం తెలిసిందే. దాంతో ఆయన నిస్సహాయంగా ప్రాణాలు కోల్పోయారు. 'ఐ కాంట్ బ్రీత్' అంటూ ఫ్లాయిడ్ చేసిన ఆర్తనాదాలు అమెరికావ్యాప్తంగా నల్లజాతీయుల సమరనాదంగా మారాయి.

పోలీసుల భిన్న వాదన

పోలీసులు మాత్రం తాము క్రూరంగా వ్యవహరించలేదని చెబుతున్నారు. అయినా ఈ ఉదంతాన్ని పోలీస్ కస్టడీ మరణంగా భావిస్తామని శుక్రవారం ప్రకటించారు. అయితే, అప్పట్లో ఘటన తర్వాత సౌత్ ఆస్ట్రేలియన్ పోలీస్ కమిషనర్ స్పందిస్తూ మోకాలితో మెడపై అదిమిపెట్టడం నిజమేనని అంగీకరించడం విశేషం.

కేదార్‌నాథ్ నుంచి తిరిగొస్తూ కూలిన హెలికాప్టర్

రెండేళ్ల పాప సహా ఏడుగురు దుర్మరణం 'చార్‌ధామ్' యాత్రలో మరో అపశ్రుతి

రుద్రప్రయాగ్/న్యూఢిల్లీ: భక్తిశ్రద్ధలతో చార్‌ధామ్ యాత్ర చేస్తున్న యాత్రికులను ప్రమాదాలు హడలెత్తిస్తున్నాయి. ఆదివారం తెల్లవారుజామున హిమ సానువుల్లోని కేదార్‌నాథ్ ఆలయాన్ని సందర్శించుకుని తిరిగొస్తున్న భక్తులు హెలికాప్టర్ కూలి ప్రాణాలు కోల్పోయారు. గౌరీకుండ్ అడవుల్లో ఈ దారుణం జరిగింది. రుద్రప్రయాగ్ జిల్లా విపత్తు నిర్వహణ సంస్థ అధికారి నందన్ సింగ్ రజ్వార్ వివరాలను వెల్లడించారు. ఆర్యన్ ఏవియేషన్ సంస్థకు చెందిన బెల్ 407 హెలికాప్టర్ ఉదయం 5.19 గంటలకు కేదార్‌నాథ్ నుంచి గుప్తకాశీ బయల్దేరింది. కాసేపటికే కేదార్‌ఘాటీలో గౌరీకుండ్, త్రిజుగ్ నారాయణ్ ప్రాంతాల మధ్య అడవిలో కుప్పకూలింది. అందులోని ఏడుగురూ ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో మహారాష్ట్రకు చెందిన జంట, వారి రెండేళ్ల పాప, పైలట్‌తో పాటు బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ సభ్యుడు విక్రమ్ సింగ్ రావత్ కూడా ఉన్నారు. పైలట్ రాజీవ్‌ర్ సింగ్ చౌహాన్ ఆర్మీలో 15 ఏళ్లపాటు పైలట్‌గా చేశారు. కేదార్‌నాథ్‌లో హెలికాప్టర్లు అటూ ఇటూ ఎత్తైన పర్వతాల మధ్య లోయ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. ప్రతికూల వాతావరణం, మేఘావృతమైన పొగమంచు గుండా ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించడం ప్రమాదానికి దారి తీసి ఉంటుందని భావిస్తున్నారు. మృతుల్లో మహారాష్ట్ర, రాజస్తాన్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలవారు.



హెలికాప్టర్ శకలాల వద్ద సిబ్బంది

నెలన్నరలో ఐదో ప్రమాదం

ఏప్రిల్ 30న చార్‌ధామ్ యాత్ర మొదలైనప్పటి నుంచి హెలికాప్టర్లు కూలిపోవడం ఐదోసారి. ఈ నేపథ్యంలో చార్‌ధామ్ యాత్రలో హెలికాప్టర్ సేవలను రెండు రోజులు నిలిపేస్తున్నట్టు ఉత్తరాఖండ్ ప్రభుత్వం ప్రకటించింది. ఆర్యన్ ఏవియేషన్ సంస్థ హెలికాప్టర్ కార్యకలాపాలను తక్షణం నిలిపివేస్తూ డీజీసీఏ ఆదేశాలిచ్చింది. కేదార్‌నాథ్ లోయలో రాకపోకలు సాగించే అన్ని హెలికాప్టర్ల నాణ్యత, సామర్థ్యాలను తక్షణం సమీక్షించేందుకు అధికారులను పంపుతోంది. దుర్ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) సమగ్ర దర్యాప్తు చేయనుంది. ''ఇలాంటి ఘటనల్లో జవాబుదారీతనం పెంచాలి. దర్యాప్తు, భద్రతా ప్రమాణాల అంశంలో కేంద్ర, రాష్ట్రాలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి'' అని కాంగ్రెస్ నేత ప్రియాంకాగాంధీ వాద్రా అన్నారు.

దాడులే దాడులు

తగ్గేదే లేదంటున్న ఇరాన్, ఇజ్రాయెల్ ● ఇరాన్ గ్యాస్, చమురు కర్మాగారాలపై బాంబులు

- రక్షణ శాఖ ప్రధాన కార్యాలయంపై క్షిపణి దాడులు
- 406 మంది మృతి.. ఒక్క భవనంలోనే 60 మంది!
- ఇజ్రాయెల్ నగరాలపై ఇరాన్ భారీ దాడులు
- అపార్ట్‌మెంట్ ధ్వంసమై ఏడుగురి దుర్మరణం
- క్షతగాత్రులు 390 మంది పై చిలుకే
- అమెరికాతో ఇరాన్ ఆరో విడత అణు చర్చలు రద్దు
- మాపై దాడి చేస్తే ఇరాన్‌ను తుడిచిపెట్టేస్తాం: ట్రంప్
- కొడుకు పెళ్లి వాయిదా వేసుకున్న నెతన్యాహూ

టెల్ అవీవ్/టెహ్రాన్/దుబాయ్/వాషింగ్టన్/న్యూఢిల్లీ/జెరూసలేం: ఇజ్రాయెల్, ఇరాన్ ఆదివారం వరసగా మూడో రోజు పరస్పరం భీకర దాడులు చేసుకున్నాయి. ఇరాన్ రక్షణ శాఖ ప్రధాన కార్యాలయంతో పాటు గ్యాస్, చమురు శుద్ధి కర్మాగారాలపై ఇజ్రాయెల్ భారీగా దాడులు చేసింది. క్షిపణి దాడులతో టెహ్రాన్ దద్దరిల్లిపోయింది. ఇరాన్ క్షిపణులు ఇజ్రాయెల్‌లో భారీ విధ్వంసం సృష్టిస్తున్నాయి. పశ్చిమాసియాలోని అమెరికా సైనిక, వైమానిక స్థావరాలు తదితరాల జోలికి రావొద్దని ఇరాన్‌ను ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. వాటిపై దాడులు చేస్తే కనీవినీ ఎరగని రీతిలో సైనిక శక్తిని ప్రయోగించి ఇరాన్‌ను తుడిచిపెట్టేస్తామని హెచ్చరించారు. తక్షణం దిగొచ్చి తమతో అణు ఒప్పందం చేసుకుంటేనే దాడులు తగ్గుముఖం పడతాయని పునరుద్ఘాటించారు.



ఇజ్రాయెల్‌లోని బాయ్‌టామ్ ప్రాంతంలో ధ్వంసమైన భవన సముదాయం

ఊపిరి సలపనివ్వని ఇజ్రాయెల్

ఇరాన్‌కు ఏమాత్రం సమయమివ్వకుండా టెహ్రాన్, సమీప ప్రాంతాలపై డ్రోన్లు, క్షిపణులతో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. టెహ్రాన్‌లో పౌర భవన సముదాయంపై దాడిలో 60 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 29 మంది చిన్నారులే! ఇప్పటిదాకా 406 మంది మరణించగా 700 మందికి పైగా గాయపడ్డారు. ప్రపంచంలోనే అతిపెద్ద 'ది సౌత్ పార్స్' సహజవాయువు ప్రాసెసింగ్ ప్లాంట్ దాడిలో దారుణంగా దెబ్బతింది. పర్షియన్ గల్ఫ్‌లో బుషెహర్ ప్రావిన్సులోని చమురుశుద్ధి కర్మాగారమూ మంటల్లో చిక్కుకుంది. షహ్రాన్ ఆయిల్ డిపోపైనా దాడులు జరిగాయి. ''ఆయుధాల ఉత్పత్తి కేంద్రాల నుంచి సిబ్బంది పారిపోండి. వాటిపై దాడులు చేయబోతున్నాం. అణు విద్యుత్కేంద్రాల సమీప ప్రాంతాల పౌరులూ పారిపోండి'' అని ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరించింది. ఇస్ఫహాన్ అణువిద్యుత్ కేంద్రంపై మరోసారి దాడులు చేసినట్టు ప్రకటించింది.

క్షిపణులతో హోరెత్తించిన ఇరాన్

ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది. యుద్ధవిమానాల ఇంధన తయారీ కేంద్రాలపై మిసైళ్లు ప్రయోగించింది. హైఫా సిటీలో చమురుశుద్ధి కర్మాగారంపై దాడులు చేయడంతో పైప్, ట్రాన్స్‌మిషన్ లైన్లు దెబ్బతిన్నాయి. దాడుల్లో ఇప్పటిదాకా 14 మంది చనిపోయినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. 390 మందికి పైగా గాయపడ్డట్టు పేర్కొంది. టెల్‌అవీవ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని వరుసగా మూడోరోజు మూసేశారు. టెల్‌అవీవ్ వీధుల్లో కుప్పకూలిన భవనాలు, కాలిపోయిన కార్లు, బద్దలైన కిటికీలు, తలుపులూ దర్శనమిస్తున్నాయని అసోసియేటెట్ ప్రెస్ రిపోర్టర్ తెలిపారు. టెల్ అవీవ్‌కు దక్షిణాన బాట్‌యామ్ ప్రాంతంలోని 8 అంతస్తుల అపార్ట్‌మెంట్ క్షిపణి దాడుల్లో ధ్వంసమైంది. ఈ ఘటనలో ఏడుగురు చనిపోగా 35 మంది జాడ గల్లంతైంది. పలువురిని రెస్క్యూ బృందాలు శిథిలాల నుంచి కాపాడాయి. ఘటనాస్థలిని ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ సందర్శించారు. ఇరాన్ కావాలనే జనావాసాలపైనే దాడులు చేస్తోందని మండిపడ్డారు. దీనికి భారీమూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. యుద్ధం నేపథ్యంలో కుమారుడు అవ్‌నర్ వివాహ వేడుకను వాయిదా వేసుకుంటున్నట్టు నెతన్యాహూ వెల్లడించారు. అటు హమాస్, ఇటు ఇరాన్ దాడులతో దేశమంతా యుద్ధంలో మునిగి తేలుతుంటే ఇంట్లో పెళ్లి సంబరాలు చేసుకుంటారా అంటూ విమర్శలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఖమేనీ హత్యకు ప్లాన్! వారించిన ట్రంప్

ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీని చంపేందుకు ఇజ్రాయెల్ ప్లాన్ చేసినట్టు సమాచారం! అమెరికా ఈ మేరకు వెల్లడించింది. ''అందుకు సర్వం సిద్ధమైంది. వద్దంటూ అధ్యక్షుడు ట్రంప్ వారించడంతో వెనక్కు తగ్గింది''అని లేదంటే ఖమేనీని చంపడం పెద్ద పని కాదని ఇజ్రాయెల్ వర్గాలు అన్నాయి.

వెంటనే ఆపగలను: ట్రంప్

ఇరాన్, ఇజ్రాయెల్ ఘర్షణను ఇప్పటికిప్పుడు ఆపేయగలనని ట్రంప్ చెప్పుకున్నారు. ''ఆ దేశాలను నిలువరించి ఈ రక్తపాతాన్ని ఆపడం నాకు చాలా తేలిక. ఈ రగడతో అమెరికాకు సంబంధం లేదు. ఇజ్రాయెల్‌కు మేం ఎలాంటి సాయమూ చేయడం లేదు'' అని చెప్పారు. ఇరాన్, ఇజ్రాయెల్ సంయమనం పాటించాలని ప్రపంచ దేశాలు కోరాయి.

మీరు ఆపితే మేమూ ఆపుతాం

దాడులవేళ ఇరాన్ కీలక ప్రకటన చేసింది. ఇజ్రాయెల్ దాడులను ఆపితే తామూ దాడులను నిలిపేస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ స్పష్టం చేశారు. ''మాకు యుద్ధ విస్తరణ కాంక్ష లేదు. కానీ ఇజ్రాయెల్ ఈ యుద్ధాన్ని పశ్చిమాసియాలో మరింత విస్తరించాలని తహతహలాడుతోంది. అందుకే బుషెహర్ ప్రావిన్సులో ఖతార్‌తో కలిసి ఇరాన్ నిర్వహిస్తున్న అసాలుయే ఆయిల్ రిఫైనరీపై దాడి చేసింది'' అంటూ మండిపడ్డారు. తమ ఆర్థికమూలాలను దెబ్బతీయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేస్తోందని దుయ్యబట్టారు. ఒమన్ మధ్యవర్తిత్వంలో అమెరికా, ఇరాన్ మధ్య ఆదివారం జరగాల్సిన ఆరో విడత కీలక అణు చర్చలు రద్దయ్యాయి. ఇజ్రాయెల్‌ను తమపైకి ఎగదోస్తున్న అమెరికా చర్చలు అర్థరహితమని ఇరాన్ ప్రకటించింది. చర్చలకు సాయపడేందుకు బ్రిటన్, ఫ్రాన్స్‌తో పాటు తామూ సిద్ధమని జర్మనీ పేర్కొంది.



కూలిన నడక వంతెన వద్ద స్థానికుల సహాయక చర్యలు

నడక వంతెన కూలి... నలుగురి దుర్మరణం

మహారాష్ట్రలో ఘోరం ● 18 మందికి తీవ్ర గాయాలు

పుణె: వర్షాకాలంలో ఇంద్రాయణి నది పరవళ్లు చూసేందుకు వచ్చిన పర్యాటకులు కాళ్లకింది వంతెన కూలడంతో నిస్సహాయంగా ప్రాణాలు కోల్పోయారు. ఈ దారుణం మహారాష్ట్రలోని పుణె జిల్లా కుందమాల గ్రామ సమీపంలో జరిగింది. అక్కడ ఇంద్రయణి నది మధ్యలో ఆలయం ఉంటుంది. అక్కడికి చేరుకునేందుకు 32 ఏళ్ల కింద చిన్న కాలినడక వంతెన నిర్మించారు. సగం కాంక్రీట్ దిమ్మెలు, మిగతా సగం ఇనుప కడ్డీలతో నిర్మించారు. ఇనుప భాగం పాతబడి తుప్పుబట్టింది. బాగా వర్షాలు కురుస్తుండటం, ఆదివారం సెలవు దినం కావడంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి జనం భారీగా వచ్చారు. మధ్యాహ్నం 3.30 గంటలప్పుడు వంతెన పాక్షికంగా కూలడంతో చాలామంది నదిలో పడిపోయారు. నలుగురు మరణించగా 51 మందిని కాపాడారు. మరో 50 మందికి పైగా గాయపడ్డారు. 18 మంది పరిస్థితి విషమంగా ఉంది. పలువురు నదిప్రవాహంలో పడి కొట్టుకుపోయినట్టు అనుమానిస్తున్నారు. వారికోసం విస్తృతంగా గాలిస్తున్నారు. ఒకేచోట ఎక్కువ మంది పోగయ్యారని ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ చెప్పారు. కూలే సమయానికి వంతెనపై 125 మంది ఒకేచోట ఉన్నట్లు కథనాలొచ్చాయి. ''ఎప్పటికప్పుడు రిపేర్లు చేస్తున్నాం. ఇటీవల దానిపై టూవీలర్ల రాకపోకలు పెరిగాయి. వంతెనపై రాకపోకల్ని ఆపేస్తూ బోర్డు పెట్టినా జనం పట్టించుకోలేదు'' అని స్థానిక ఎమ్మెల్యే సునీల్ షెల్కే చెప్పారు. మృతుల కుటుంబాలకు మహారాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఎన్డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లు రంగంలోకి దిగినట్టు సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ చెప్పారు. సైప్రస్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆయనకు ఫోన్ చేసి ఆరాతీశారు.

హోరెత్తిన నో కింగ్స్

నిరసనలతో దద్దరిల్లిన అమెరికా

- దేశవ్యాప్తంగా నిరసనలు, ర్యాలీలు
- లక్షలాదిగా రోడ్లపైకి ఆందోళనకారులు
- ట్రంప్ వ్యతిరేక నినాదాల హోరు

ఫిలడెల్ఫియా: ట్రంప్ సర్కారు వలస వ్యతిరేక చర్యలపై అమెరికావ్యాప్తంగా నిరసనలు మిన్నంటుతున్నాయి. ఆందోళనలు క్రమంగా దేశమంతటికీ విస్తరిస్తున్నాయి. శనివారం దేశవ్యాప్తంగా వందలాది చోట్ల నిరసన కార్యక్రమాల్లో లక్షలాదిగా ప్రజలు పాల్గొన్నారు. న్యూయార్క్, టెక్సాస్, మిసిసిపి, పోర్ట్‌లాండ్, మిన్నెసోటా, నార్త్ కరొలినా తదితర ప్రాంతాలు ఆందోళనలతో అట్టుడికిపోయాయి. వీధులు, పార్కులు, ప్లాజాలు... ఇలా అన్ని చోట్లా జనం నిరసనలకు దిగారు. ట్రంప్ నియంతృత్వ పోకడలను దుయ్యబట్టారు. 'నో కింగ్స్ (నియంతృత్వం వద్దు)' అంటూ నినదించారు. ప్రజాస్వామ్యాన్ని, వలసదారుల హక్కులను కాపాడుకుంటామని ప్రతినబూనారు. ప్రభుత్వం దిగొచ్చేదాకా ఆందోళనలు ఆగబోవని 'నో కింగ్స్ కోయెలిషన్' నిర్వాహకులు తెలిపారు. ప్రజలు హింసాత్మక ఘటనలకు పాల్పడవద్దని రాష్ట్రాల గవర్నర్లు కోరారు. పలు ప్రాంతాల్లో నేషనల్ గార్డులను మోహరించారు. ఫెడరల్ ఇమిగ్రేషన్ అధికారుల దాడులకు నిరసనగా వారం క్రితం లాస్‌ఏంజెలెస్‌లో మొదలైన నిరసనలు హింసాత్మక రూపం దాల్చడం తెల్సిందే.



లూయిస్‌విలేలో జాతీయ పతాకం చేబూని నిరసనకారుల ర్యాలీలు

రగడ, ఉద్రిక్తతలు

శనివారం లాస్‌ఏంజెలెస్‌లో ర్యాలీలో పాల్గొన్న నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. పోర్ట్‌ల్యాండ్‌లో ఇమిగ్రేషన్ కార్యాలయం వద్ద టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఉటాహ్‌లోని సాల్ట్‌లేక్ సిటీలో ర్యాలీలో కాల్పుల్లో ఒకరు గాయపడ్డారు. వర్జీనియాలో నిరసనకారులపై వాహనం నడిపి ఒకరిని గాయపరిచిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఆర్మీ డే, ట్రంప్ బర్త్ డే!

అమెరికా ఆందోళనలతో అట్టుకుతుంటే ట్రంప్ మాత్రం ఆర్మీ 250వ అవతరణ దినోత్సవాల్లో పాల్గొన్నారు. శనివారం ఆయన 79వ పుట్టినరోజు కావడం విశేషం. ఈ సందర్భంగా ఏకంగా 4.5 కోట్ల డాలర్ల వ్యయంతో వాషింగ్టన్‌లో అట్టహాసంగా జరిగిన సైనిక పరేడ్‌లో భార్య మెలానియాతో కలిసి ఆయన పాల్గొన్నా రు. ఉక్రెయిన్‌కు అందజేసిన అత్యాధునిక సైనిక సంపత్తిని ఈ సందర్భంగా ప్రదర్శించారు. పరేడ్ మార్గంపై 9 అపాచీ హెలికాప్టర్లు జనానికి కనువిందు చేశాయి. ''అమెరికా కంటే సాహసోపేతమైన సైన్యం భూ ప్రపంచంలోనే లేదు. మమ్మల్ని బెదిరించాలని చూసేవారికి హెచ్చరిక. మా సైన్యం మీ అంతు చూస్తుంది. దుర్మార్గ దేశాల గుండెల్లో బాయ్‌నెట్లు గుచ్చుతుంది'' అని ట్రంప్ హెచ్చరించారు.

మెక్సికో జెండాలు


న్యూయార్క్, డెన్వర్, షికాగో, ఆస్టిన్, లాస్‌ఏంజెలెస్ నగరాల్లో జనం 'నో కింగ్స్' బ్యానర్లు, మెక్సికో జెండాలు చేబూనారు. సియాటెల్‌లో జరిగిన అతి పెద్ద ర్యాలీలో 70 వేల మందికి పైగా పాల్గొన్నట్టు నిర్వాహకులు చెప్పారు. అట్లాంటా ర్యాలీకి 5 వేల మంది వచ్చారు. మిన్నెసొటాలో మాత్రం తగు కారణం లేకుండా నిరసనల్లో పాల్గొవద్దని గవర్నర్ టిమ్ వాల్జ్‌తోపాటు భద్రతాధికారులు ప్రజలను కోరారు. అయినా స్టేట్ కాపిటల్ భవన సముదాయం సహా పలుచోట్ల నిరసనలు జరిగాయి. నార్త్ కరొలినాలో 'నో కింగ్స్. నో క్రౌన్స్. వియ్ విల్ నాట్ బౌ డౌన్' అంటూ నినదించారు. 'ట్రంప్ మస్ట్ గో నౌ' అనే బ్యానర్‌ను ప్రదర్శించారు.

సాంకేతిక లోపంతో రన్‌వేపై ఆగింది!

హడలెత్తించిన ఎయిరిండియా విమానం ● 18 గంటల తర్వాత టేకాఫ్

గువాహటి: అహ్మదాబాద్ ప్రమాదాన్ని మరవకముందే గువాహటి- కోల్‌కతా ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం 170 మంది ప్రయాణికుల్ని హడలెత్తించింది. చివరికి 18 గంటల తర్వాత వారిని మరో విమానంలో పంపించారు. శనివారం రాత్రి 9.20 గంటలకు గువాహటి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయల్దేరిన విమానంలో సాంకేతిక లోపాన్ని గుర్తించడంతో రన్‌వేపై ఆపేశారు. ప్రయాణికులు రెండుసార్లు విమానం దిగాల్సి వచ్చింది. దీనిపై దుమ్మెత్తిపోసతఊ వారు పోస్ట్ చేసిన వీడియోలు వైరలయ్యాయి. ''అర్ధరాత్రి దాటాక 1.30 గంటల సమయంలో మమ్మల్ని కిందికి దిగమన్నారు. చౌక హోటల్‌లో వసతి కల్పించారు. కనీసం టిఫిన్ కూడా పెట్టలేదు. ఆదివారం ఉదయం 9.30కు విమానం ఎక్కించి, కాసేపటికే మళ్లీ దించారు. ఎట్టకేలకు మధ్యాహ్నం 3.34కు మరో విమానంలో కోల్‌కతా బయలుదేరాం'' అని ఓ ప్రయాణికుడు తెలిపారు. వారి ఆరోపణలను ఎయిరిండియా ఖండించింది. ''నగరంలోని బెస్ట్ హోటల్‌లో వసతి కల్పించాం. మా సిబ్బందీ అందులోనే ఉన్నారు'' అని చెప్పింది. సమస్యలేమిటో మాత్రం వెల్లడించలేదు.

దుబాయ్ వెళ్లేదాకా... ఏసీ లేదు, ఊపిరాడలేదు



ఎయిరిండియా తీరుపై ప్రయాణికురాలి ధ్వజం

ఎయిరిండియా విమానాల నిర్వహణ లోపాలు ప్రయాణికులకు చుక్కలు చూపుతున్నాయి. శనివారం జైపూర్ నుంచి దుబాయ్ వెళ్లిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో ఏసీ పనిచేయక నరకం చూశామని అర్జూ సేథీ అనే డైటీషియన్ వాపోయారు. ''ఐఎక్స్196 విమానంలో 5 గంటలకు పైగా ప్రయాణం ఏసీ లేకుండానే సాగింది. ఊపిరాడక, చెమటలు పట్టి అంతా నరకం చూశాం. నా మూడేళ్ల కొడుకు, తోటి ప్రయాణికులు చెమటతో తడిసి ముద్దయ్యారు. ఇదేమిటని అడిగినా సిబ్బంది స్పందించలేదు. జవాబుదారీతనమే లేదు. ఇది తీవ్రమైన భద్రతా లోపం'' అంటూ మండిపడ్డారు. దీనిపై ఎయిరిండియా స్పందించలేదు.

47 మృతదేహాల గుర్తింపు

అహ్మదాబాద్: ఎయిరిండియా విమాన ప్రమాదంలో ఆదివారానికి గుజరాత్ మాజీ సీఎం విజయ్ రుపానీ సహా 47 మంది మృతదేహాలను డీఎన్‌ఏ పరీక్షల ఆధారంగా గుర్తించారు. 24 మృతదేహాలను సంబంధీకులకు అప్పగించారు. బాధితుల కుటుంబాలకు అవసరమైన సాయం అందించేందుకు 230 బృందాలను ఏర్పాటు చేశారు. ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ గురువారం కుప్పకూలిన ఘటనలో రుపానీ సహా 242 మంది ప్రయాణికులు మృత్యువాతపడగా ఒకే ఒక్క వ్యక్తి సజీవంగా బయటపడటం తెల్సిందే. విమానం పడిన ప్రాంతంలో ఉన్న ఐదుగురు ఎంబీబీఎస్ విద్యార్థులు సహా 33 మంది సైతం ప్రాణాలు కోల్పోయారు. గుర్తు పట్టలేనంతగా మాడి మసవ్వడంతో అధికారులు సంబంధీకుల నుంచి సేకరించిన డీఎన్‌ఏ ద్వారా మృతదేహాలను గుర్తించే ప్రక్రియను చేపట్టారు. 230 మంది ప్రయాణికుల చిరునామాలు సేకరించారు. మృతి చెందిన ప్రయాణికుల్లో ముగ్గురి సంబంధీకులు మాత్రం ఇప్పటి వరకు డీఎన్‌ఏ నమూనాలను ఇవ్వలేదని చెప్పారు. మిగతా వారి విషయంలో సంబంధీకులకు డెత్ సర్టిఫికెట్లను సైతం అందజేస్తున్నామన్నారు. కాగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీ పీకే మిశ్రా ఆదివారం ఘటనాస్థలిని పరిశీలించారు. ఘటనా క్రమాన్ని అధికారులు ఆయనకు వివరించారు. క్షతగాత్రులను పీకే మిశ్రా పరామర్శించారు. విమాన ప్రమాదానికి కారణాలపై ఎయిర్‌క్రాఫ్ట్ యాసిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఏఏఐబీ) ప్రధానంగా దర్యాప్తు జరుపుతోంది. ఆదివారం ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించిన విదేశీ బృందానికి అహ్మదాబాద్ ఫైర్ బ్రిగేడ్ అధికారులు వివరాలను అందించారు. కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ సోమవారం ఢిల్లీలో మొదటిసారిగా సమావేశం కానుంది. మూడు నెలల్లోగా ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది.



రోజర్ డేవిడ్ మృతదేహం వద్ద కుటుంబీకుల రోదన

సైప్రస్ చేరుకున్న ప్రధాని మోదీ

నికోసియా: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన కోసం ఆదివారం సైప్రస్ చేరుకున్నారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడ్స్‌తో ఆయన చర్చలు జరుపుతారు. లార్నాకా అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రధాని మోదీకి అధ్యక్షుడు క్రిస్టోడౌలిడ్స్ స్వయంగా స్వాగతం పలికారు. భారత ప్రధాని ఒకరు సైప్రస్‌లో పర్యటించడం రెండు దశాబ్దాల కాలంలో ఇదే ప్రథమం. సైప్రస్ అధ్యక్షుడితో ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడుల వంటి రంగాల్లో బంధాన్ని దృఢతరం చేసుకునేందుకు అవకాశముందని ప్రధాని మోదీ 'ఎక్స్'లో తెలిపారు. ప్రధాని మోదీ తమ దేశానికి రావడం చారిత్రక సందర్భమని క్రిస్టోడౌలిడ్స్ తెలిపారు. స్థానిక హోటల్‌లో ప్రధాని మోదీ బస చేశారు. ఈ సందర్భంగా 'వందే మాతరం, భారత్ మాతా జీ జై' అంటూ భారత సంతతి ప్రజలు ఆయనకు స్వాగతం పలికారు. సైప్రస్ పర్యటన అనంతరం కెనడాలో జరిగే జీ7 శిఖరాగ్రానికి ప్రధాని మోదీ వెళ్లనున్నారు.



మోదీకి స్వాగతం పలుకుతున్న సైప్రస్ అధ్యక్షుడు క్రిస్టోడౌలిడ్స్

అన్నార్తులపై మళ్లీ ఇజ్రాయెల్ కాల్పులు 13 మంది పాలస్తీనియన్లు మృతి

ఖాన్‌యూనిస్: గాజాలో ఇజ్రాయెల్ మరోసారి బరితెగించింది. అమెరికాతో కలిసి తానే స్వయంగా ఏర్పాటు చేసిన ఆహార పంపిణీ కేంద్రం వద్ద అన్నార్తులపై మళ్లీ కాల్పులకు తెగబడింది. ఈ దారుణంలో 13 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం ఇజ్రాయెల్ సైన్యం మొత్తంగా కనీసం 37 మందిని పొట్టనబెట్టుకుందని గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. ఆదివారం వేకువజామున 4.30 గంటల సమయంలో రఫాలోని తల్ అల్-సుల్తాన్‌లో ఏర్పాటు చేసిన రెండు ఆహార పంపిణీ కేంద్రాల దిశగా వస్తున్న అన్నార్తులపైకి ఇజ్రాయెల్ బలగాలు కాల్పులకు దిగాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. నెట్‌జరీమ్ కారిడార్ వద్ద జరిగిన మరో ఘటనలో ముగ్గురు మృతి చెందారు. ఈ రెండు ఘటనల్లో కనీసం 50 మంది గాయపడ్డారు. దక్షిణ గాజా ప్రాంతంపై ఇజ్రాయెల్ ఆర్మీ చేపట్టిన వైమానిక దాడుల్లో 12 మంది, బెయిట్ లహియా పట్టణంపై జరిపిన లక్షిత దాడిలో మరో ఏడుగురు మృత్యువాతపడ్డారని వైద్య సిబ్బంది వివరించారు. గత రెండు వారాల్లో ఇలా అన్నార్తులను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ సైన్యం కాల్పులకు తెగబడటం ఇది ఏడోసారి అని హమాస్ వర్గాలు వెల్లడించాయి. అమాయకులపై తూటాల వర్షం కురిపిస్తుండటాన్ని ఎలా సమర్థించుకుంటుందో చెప్పాలని ప్రశ్నించాయి.

సాక్షి
హైదరాబాద్
సోమవారం, 16, జూన్, 2025


పంథా మార్చిన పార్థీ గ్యాంగ్!
పార్థీ గ్యాంగ్ ప్రస్తుతం పంథా మార్చింది. నగరంలో గంధపు చెట్లను నరికి ఎత్తుకుపోతున్న పార్థీ గ్యాంగ్‌ను పోలీసులు పట్టుకున్నారు. పరారీలో ఉన్న మరో 19 మంది కోసం గాలిస్తున్నారు. -8లో


మాన్సూన్‌లో.. మోటార్ రైడ్స్..
చల్లని మేఘాలు, మత్తెక్కించే వర్షపు వాసన, హత్తుకునే పచ్చటి ప్రకృతి దృశ్యాలను ఆస్వాదించేందుకు గ్రూప్ రైడ్స్, ఔటింగ్స్, నేచర్ ట్రిప్‌లతో నగర యువకులు సందడి చేస్తున్నారు. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
30.0/23.0
నగరంలో సోమవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 30, కనిష్ఠంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

న్యూస్‌రీల్

జూనియర్ ఆర్టిస్ట్‌కు వేధింపులు
జిమ్ ట్రైనర్ అరెస్టు

బంజారాహిల్స్: ప్రేమ, పెళ్లి పేరుతో జూనియర్ ఆర్టిస్ట్‌ను వేధించిన కేసులో జిమ్ ట్రైనర్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. అల్లాపూర్‌లో నివసించే కాగితాల మహేష్ (32) జిమ్ ట్రైనర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు వివాహమైన తర్వాత మరో అమ్మాయిని ప్రేమించి వలలో వేసుకున్నాడు. వీరిద్దరినీ వదిలేసి శ్రీకృష్ణానగర్‌లో ఓ జూనియర్ ఆర్టిస్ట్‌తో పరిచయం పెంచుకుని ఆమెతో ప్రేమాయణం నడిపి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. 2021లో పరిచయం పెంచుకున్న మహేష్ సదరు జూనియర్ ఆర్టిస్ట్‌తో సహ జీవనం చేస్తున్నాడు. జూబ్లీహిల్స్‌లోని గాయత్రీహిల్స్‌లో ఆమెతో కలిసి 2022 వరకు అక్కడే ఉన్నాడు. పెళ్లి విషయం తన తల్లిదండ్రులతో మాట్లాడి వస్తానంటూ 2023 నవంబర్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని తన స్వగ్రామానికి వెళ్లిపోయాడు. ఆ సమయంలో బాధిత జూనియర్ ఆర్టిస్ట్ మణికొండలో ఓ హాస్టల్‌లో ఉండేది. ఇటీవల మహేష్ ఆమె వద్దకు వెళ్లి పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఖర్చులు ఉన్నాయంటూ రూ.15 లక్షలు తీసుకున్నాడు. నమ్మిన ఆమె రూ.15 లక్షలు ఇవ్వగా, అందులో రూ.5 లక్షలు మహేష్ ఆమెకు తిరిగి ఇచ్చాడు. ఇటీవల డబ్బుల కోసం ప్రశ్నించగా దాటవేస్తూ వచ్చాడు. దీనికి తోడు ఆయనకు అప్పటికే పెళ్లి జరిగిందని, మరో యువతితో పరిచయం ఉందని తెలుసుకుంది. తాను మోసపోయానని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెళ్లి జరిగిన విషయం దాచిపెట్టి మరో యువతితో ఉంటూనే జూనియర్ ఆర్టిస్ట్‌ను కూడా మోసగించిన ఘటనలో నిందితుడిపై బీఎన్‌ఎస్ సెక్షన్ 69 కింద జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

బ్రాస్‌లెట్ విషయమై దంపతుల గొడవ
- క్షణికావేశంలో ఉరేసుకున్న భర్త
- మృతుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

రాజేంద్రనగర్: క్షణికావేశంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మామిడి కిశోర్ తెలిపిన వివరాల ప్రకారం... ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన కుమార స్వామి (28)కి, మౌనికకు ఏడాది క్రితం వివాహమైంది. వీరు నగరంలోని బండ్లగూడ భవానీ కాలనీలో ఉంటున్నారు. కుమారస్వామి సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పని చేస్తున్నారు. నెల రోజులుగా బ్రాస్‌లెట్ విషయమై భార్యాభర్తల మధ్య గొడవ జరుగుతోంది. శనివారం రాత్రి మరోసారి వీరు ఘర్షణ పడ్డారు. మౌనిక ఈ విషయాన్ని సెల్‌ఫోన్‌లో తన తల్లిదండ్రులతో పాటు అత్తామామలకు తెలియజేసింది. వారు సముదాయించడంతో ఇద్దరూ మిన్నకుండిపోయారు. రాత్రి 11 గంటల సమయంలో మళ్లీ గొడవ జరిగింది. దీంతో కుమార స్వామి మౌనికను కొట్టడంతో ఆమె స్పృహ తప్పి పడిపోయింది. ఎంతసేపటికీ ఆమెలో చలనం లేకపోవడంతో మృతి చెందిందని భావించిన కుమార స్వామి కంగారుపడి బెడ్రూంలోకి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో స్పృహలోకి వచ్చిన మౌనిక భర్త కనిపించకపోవడంతో పక్కనే అద్దెకు ఉంటున్న వారికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చూడగా ఉరేసుకొని విగతజీవిగా కనిపించాడు. రాజేంద్రనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టార్గెట్ జూబ్లీహిల్స్!


అజహరుద్దీన్
విజయారెడ్డి
నవీన్ యాదవ్

- ఇటీవల ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూత
- మరో బీఆర్‌ఎస్ సిట్టింగ్ స్థానంపై కాంగ్రెస్ కన్ను
- కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో విజయం స్ఫూర్తితో..
- లోక్‌సభ ఎన్నికల్లో పెరిగిన ఓటు బ్యాంక్
- టికెట్ రేసులో ముగ్గురు నేతలు
- గెలిచే నాయకుడి కోసం హస్తం పార్టీ సర్వే

సాక్షి, సిటీబ్యూరో: అధికార కాంగ్రెస్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను తీవ్రంగా పరిగణిస్తోంది. నగరంలోని మరో బీఆర్‌ఎస్ సిట్టింగ్ స్థానాన్ని ఉప ఎన్నికల్లో దక్కించుకునేందుకు పకడ్బందీగా వ్యూహ రచన చేస్తోంది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనివార్యమైంది. వాస్తవంగా బీఆర్‌ఎస్ సిట్టింగ్ స్థానమైన జూబ్లీహిల్స్‌లో గట్టెక్కడం క్లిష్టమైనా.. అధికార పక్షం కావడంతో ఉప ఎన్నికల కలిసి వచ్చే అవకాశం లేకపోలేదని అంచనా వేస్తోంది. కంటోన్మెంట్‌లో బీఆర్‌ఎస్ సిట్టింగ్ సీటును గెలుచుకున్న ధీమాతో జూబ్లీహిల్స్ సీటును కూడా కైవసం చేసుకోవాలనే గట్టి పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అక్కడి నుంచి పలువురు టికెట్ ఆశిస్తున్నా.. అధిష్టానం సర్వే నిర్వహించి గెలుపు గుర్రాన్ని బరిలో దింపాలని యోచిస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా హస్తం హవా కొనసాగి ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికి.. రాజధాని నగరంలో ఆ పార్టీకి ఒక్క స్థానం కూడా దక్కలేదు. తర్వాత ఉప ఎన్నికల్లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ స్థానం దక్కింది. తాజాగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వచ్చే అవకాశం ఉండటంతో మరో నియోజకవర్గం చేజిక్కించుకోవాలని వ్యూహరచన చేస్తోంది. అయితే.. ఈ అసెంబ్లీ నియోజకవర్గంలో మాత్రం గెలుపుపై మజ్లిస్ తీవ్ర ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. వాస్తవంగా నియోజకవర్గంలో మూడోవంతు ముస్లిం ఓటర్లు ఉన్నారు. మజ్లిస్ పార్టీ గత మూడు పర్యాయాలుగా జూబ్లీహిల్స్‌లో పాగా వేసేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తూ వస్తోంది. ఈసారి కూడా బరిలో దిగితే కాంగ్రెస్ గట్టెక్కడం కష్టమే అని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

పెరిగిన ఓటు బ్యాంక్‌పై ఆశలు..
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో ఓటు బ్యాంక్ పెరగడంతో ఆశలు పెట్టుకుంది. అసెంబ్లీ ఉప ఎన్నికల్లో సైతం అదే పునరావృత్తమైతే విజయం సునాయాసమేనని కాంగ్రెస్ భావిస్తోంది. వాస్తవంగా అసెంబ్లీ ఎన్నికల్లో విజయం దక్కిన బీఆర్‌ఎస్‌కు 43.94 శాతం ఓట్లు లభిస్తే కాంగ్రెస్ 35.03 శాతం ఓట్లతో రెండో స్థానానికి పడిపోయింది. లోక్‌సభ ఎన్నికల నాటికి కాంగ్రెస్ ఇక్కడ తన ఓటు శాతాన్ని 50.83కు పెంచుకోగలిగింది. ఉప ఎన్నికల్లో ఓటు బ్యాంకు పునరావృత్తం కావచ్చని అంచనా వేస్తోంది.



☛ జూబ్లీహిల్స్ సంపన్నులతో పాటు ముస్లింలు అత్యధికం ఉండే నియోజకవర్గం. నియోజకవర్గాల పునర్విభజనతో ఖైరతాబాద్ నుంచి వేరుపడి ఏర్పడ్డ కొత్త నియోజకవర్గం జూబ్లీహిల్స్ 2009 ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ నాయకుడు పి.జనార్దన్ రెడ్డి ఆకస్మిక మరణంతో జరిగిన ఉప ఎన్నికలో ఆయన తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి కాంగ్రెస్ తరఫున విజయం సాధించారు. 2014 సాధారణ ఎన్నికల్లో బీజేపీతో పొత్తులో తెలుగుదేశం పార్టీ తరఫున నెగ్గిన మాగంటి గోపీనాథ్ తర్వాత బీఆర్‌ఎస్ పార్టీలోకి మారి 2018, 2023 వరుస ఎన్నికల్లో విజయం సాధిస్తూ వచ్చారు. 2009 ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచిన విష్ణువర్ధన్ రెడ్డి 2014, 2018 వరుస ఎన్నికల్లో ఓడిపోయారు. 2023లో కాంగ్రెస్ పార్టీ ఆయనకు టికెట్ నిరాకరించి క్రికెటర్ అజహరుద్దీన్‌ను బరిలో దింపడంతో విష్ణువర్ధన్ బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్‌కు మాత్రం ఓటమి తప్పలేదు.

టికెట్ రేసులో ముగ్గురు నేతలు..
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల టికెట్ కోసం తీవ్ర పోటీ నెలకొన్నట్లు కనిపిస్తోంది. ప్రధానంగా ముగ్గురు నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం పాలైన అజహరుద్దీన్ మళ్లీ టికెట్ ఆశిస్తున్నారు. ఈ ఎన్నికల్లో గెలిస్తే మైనారిటీ కోటా కింద మంత్రి పదవి ఖాయమని ఆయన భావిస్తున్నారు. దీంతో జాతీయ స్థాయిలో టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

☛ మరోవైపు జూబ్లీహిల్స్‌లో పేరొందిన చిన్న శ్రీశైలం యాదవ్ కుమారుడు కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్ ఈసారి బరిలో దిగేందుకు టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు జూబ్లీహిల్స్ అసెంబ్లీ లేదా సికింద్రాబాద్ ఎంపీ సీటు హామీతో నవీన్ యాదవ్ కాంగ్రెస్‌లో చేరారు. 2014 ఎన్నికల్లో నవీన్ యాదవ్ మజ్లిస్ పార్టీ నుంచి పోటీ చేసి 41వేల 656 ఓట్లు సాధించారు. ఆ తర్వాత 2018లో జరిగిన ఎన్నికల్లో మజ్లిస్ బరిలో దింపక పోవడంతో పార్టీకి రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆయనకు 18వేల 817 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరినా.. పార్టీ టికెట్ దక్కలేదు. ఈసారి టికెట్ తనకే దక్కుతుందని ఆయన భావిస్తున్నారు.

☛ కార్మిక నేత దివంగత పీజేఆర్ కూతురు, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి పోటీ చేసినా ఆమెకు విజయం దక్కలేదు. అక్కడి నుంచి గెలిచిన బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరడంతో భవిష్యత్తులో సైతం ఖైరతాబాద్‌పై ఆశలు వదులుకునే పరిస్థితి నెలకొంది. దీంతో తన తండ్రి చివరిసారిగా ప్రాతినిధ్యం వహించిన జూబ్లీహిల్స్‌పై విజయా రెడ్డి దృష్టి సారించి టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా అధికార కాంగ్రెస్‌కు జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారనున్నాయి.

నెత్తిన మృత్యుపాశాలు!



- ప్రాణాంతకంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు
- లైన్ల పునరుద్ధరణకు ఏటా రూ.100 కోట్లకుపైగా ఖర్చు
- అయినా మెరుగుపడని పంపిణీ వ్యవస్థ
- తరచూ తెగిపడుతున్న వైర్లు
- సాగర్ రింగ్‌రోడ్డు వద్ద ఇద్దరు వ్యక్తుల విషాదాంతం

సాక్షి, సిటీబ్యూరో: ఇళ్లలో వెలుగులు నింపాల్సిన విద్యుత్ తీగలు.. పౌరుల జీవితాల్లో చీకట్లు నింపుతున్నాయి. నెత్తిన మృత్యుపాశాల్లా వేలాడుతున్న వైర్లు ఎప్పుడు.. ఎవరిపై తెగిపడతాయో తెలియని దుస్థితి నెలకొంది. ఎలాంటి ఈదురు గాలులు, వర్షాలు లేకపోయినప్పటికీ.. వైర్లు తెగిపడుతుండటాన్ని పరిశీలిస్తే.. డిస్ట్రిబ్యూషన్ లైన్ల వ్యవస్థ ఎంత బలహీనంగా ఉందో అర్థమవుతోంది. విద్యుత్ లైన్ల నిర్వహణ కోసం డిస్కం ఏటా రూ.100 కోట్లకుపైగా ఖర్చు చేస్తోంది. అయినా ప్రమాదాలు తగ్గడంలేదు. తాజాగా సరూర్‌నగర్ డివిజన్ చింతల్‌కుంట ఫీడర్‌కు సంబంధించిన 11 కేవీ పోల్‌పై పాలిమర్ పిన్ ఇన్సులేటర్‌లోని మెటల్ రాడ్డు విరిగిపడి, హైటెన్షన్ విద్యుత్ కేబుల్ తెగిపడటంతో.. సాగర్ రింగ్ రోడ్డు సమీపంలోని ఓ దేవాలయం ఫుట్‌పాత్‌పై నిద్రపోతున్న ఓ మహిళ, పురుషుడు (యాచకులు) విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డారు. విద్యుత్ ఇంజినీర్లు మాత్రం తమ తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు గుర్తు తెలియని ఓ వాహనం స్తంభాన్ని ఢీకొనడంతోనే వైర్లు తెగిపడినట్లు చెబుతున్నారు.

నిర్వహణ లోపంతోనే..
నగరంలోని పాతబస్తీ సహా ప్రధాన బస్తీల్లో ఇప్పటికీ నిజాం కాలం నాటి ఓవర్‌హెడ్ లైన్లు, ఇనుప స్తంభాలే ఉన్నాయి. ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ లైన్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. తరచూ వైర్లు తెగిపడుతుండటంతో పాటు స్తంభాలను ముట్టుకుంటే షాక్ కొడుతున్నాయి. లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, లూజు లైన్లు సరి చేయడం, దెబ్బతిన్న పిన్ ఇన్సులేటర్లను మార్చడం, పాడైన ఫ్యూజ్ బాక్సులను మార్చడం, డీటీఆర్‌ల వద్ద పటిష్టమైన ఎర్తింగ్ ఏర్పాటు చేయడం వంటి పనుల కోసం డిస్కం ఏటా రూ.100 కోట్లు ఖర్చు చేస్తోంది. కంపెనీ కేటాయించిన నిధులు హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయి తప్ప.. సరఫరా వ్యవస్థ మాత్రం మెరుగుపడటం లేదు. క్షేత్రస్థాయిలో ఇంజినీర్లు ఎప్పటికప్పుడు లైన్ టు లైన్, పోల్ టు పోల్ తిరిగి ప్రమాదకరంగా మారిన వాటిని గుర్తించి, వాటి స్థానంలో కొత్త వైర్లు, స్తంభాలు, పిన్ ఇన్సులేటర్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. పట్టించుకోవడం లేదు. లైన్ల పునరుద్ధరణ అంటే కేవలం చెట్ల కొమ్మల తొలగింపు ఒక్కటే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.


సాగర్ రింగ్‌రోడ్డు చౌరస్తాలో విద్యుత్ స్తంభం పైనుంచి విరిగిపడిన పాలిమర్ పిన్ ఇన్సులేటర్ మెటల్ రాడ్డు

ప్రతిపాదనలకే సరి..
గ్రేటర్‌ను విశ్వనగరంగా తీర్చి దిద్దే క్రమంలో భాగంగా వేలాడుతున్న వైర్లను తొలగించి, వాటి స్థానంలో భూగర్భ విద్యుత్ కేబుళ్లను ఏర్పాటు చేయాలని డిస్కం నిర్ణయించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఇంజినీర్ల బృందం ఇటీవల బెంగళూరులో పర్యటించి భూగర్భ విద్యుత్ కేబుల్ పనులను పరిశీలించి వివరాలను సేకరించింది. 3400 కిలోమీటర్ల 33 కేవీ, 11500 కిలోమీటర్ల 11 కేవీ లైన్లలో యూజీ కేబుళ్ల లైన్లు, 15 వేల కిలోమీటర్ల ఏబీ కేబుల్ లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందు కోసం రూ.13,600 కోట్ల వరకు ఖర్చువుతుందని అంచనా వేసింది. బకాయిలు భారీగా పేరుకపోవడం, ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు సకాలంలో రాకపోవడంతో డిస్కం ఇప్పటికే పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. రాష్ట్ర ప్రభుత్వం సైతం నిధుల్లేవంటూ చేతులెత్తేసింది. కేంద్రం దయ తలచి ఏదైనా స్కీం ప్రకటిస్తే గాని.. ఈ పనులు ఇప్పట్లో పూర్తికాని పరిస్థితి నెలకొంది.

తెలిసినవారే తెగించారు

సామాజిక మాధ్యమాల్లో తొలుత పరిచయమయ్యారు. కొన్నాళ్లపాటు నమ్మకంగా మెలిగారు. ఆ తర్వాత తమ నిజ స్వరూపాన్ని బయటపెట్టారు. ఈ రెండు ఘటనల్లో మహిళలే బాధితులుగా మారారు. షాదీ డాట్‌కామ్ ద్వారా మహిళను పరిచయం చేసుకున్న వ్యక్తి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి లైంగిక దాడికి పాల్పడటంతో పాటు రూ.లక్షల్లో నగదు తీసుకుని మోసానికి పాల్పడ్డాడు. మరో ఘటనలో స్నాప్‌చాట్‌లో పరిచయమైన ఓ యువతిని వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు అందింది.

- అటు స్నాప్‌చాట్‌లో పరిచయమై వేధింపులు..
- ఇటు షాదీ డాట్‌కామ్‌లో పరిచయమై..
- మహిళపై లైంగిక దాడి..ఆపై బ్లాక్‌మెయిల్

పోచారం: స్నాప్‌చాట్‌లో పరిచయమైన ఓ యువతిని వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాల్లోకి వెళితే..స్నాప్‌చాట్‌లో 2024 జూన్ నెలలో యాగిరెడ్డి అనిల్‌కుమార్‌కు ఓ మహిళ పరిచయమైంది. ఇరువురు ఆన్‌లైన్‌లో చాటింగ్ చేసుకుంటున్నారు. కొన్ని రోజుల తర్వాత ఆమె స్నాప్‌చాట్ లాగిన్‌లో సమస్య వచ్చింది. దీన్ని అనిల్ పరిష్కరిస్తానని ఆమె ఐడీ, పాస్‌వర్డ్ తీసుకున్నాడు. వీటిని వినియోగించి ఆమె వ్యక్తిగత ఫొటోలను సేకరించాడు. ఈ ఫొటోలను ఇతరులకు షేర్ చేస్తానని బెదిరించి విడతల వారీగా రూ.90 వేలు ఫోన్‌పే ద్వారా తీసుకున్నాడు. ఈ నెల 8వ తేదీన సంస్కృతి టౌన్‌షిప్‌లోని ఓ ఫ్లాట్‌కు రావాలని డిమాండ్ చేయడంతో ఆమె వెళ్లింది. అక్కడ ఆమెపై అనిల్ దాడి చేసి డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత ఏడాది కాలంగా ఆమెను అనిల్ ఇబ్బందిపెడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొంది.



సనత్‌నగర్: షాదీ డాట్‌కామ్ ద్వారా ఓ మహిళను పరిచయం చేసుకున్నాడు..ఆపై పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి పలుమార్లు బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా రూ.లక్షల్లో నగదు తీసుకుని మోసానికి పాల్పడిన ఓ వ్యక్తిపై బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..బేగంపేట రసూల్‌పురాకు చెందిన మహిళ (47)కు వెస్ట్ ముంబైకి చెందిన కల్పేష్ కక్కడ్ (42) షాదీ డాట్‌కామ్‌లో పరిచయమయ్యాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పి ఫేస్‌బుక్ రిక్వెస్ట్ పంపి ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. తనకు బాగా ఆస్తిపాస్తులు ఉన్నాయని, నమ్మబలికాడు. నగరానికి వచ్చి ఇక్కడే మకాం వేశాడు. ఈ క్రమం

సనత్‌నగర్ పరిధిలో..
లో పలుమార్లు బలవంతంగా లైంగికదాడికి పాల్పడ్డాడు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు అంటూ బాధితురాలితో పాటు ఆమె బంధువుల నుంచి రూ.22 లక్షల వరకు అప్పుగా తీసుకున్నాడు. ఆ తర్వాత కొద్దిరోజులకు ముంబైకి పారిపోయాడు. బాధితురాలు ఫోన్ చేసి పెళ్లి విషయం, డబ్బు విషయం అడిగితే వారిద్దరూ సన్నిహితంగా ఉన్న సమయంలో తీసుకున్న ఫొటోలు, వీడియోలు తన వద్ద ఉన్నాయని, డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేస్తే వీడియోలు, ఫొటోలను వైరల్ చేస్తానని బెదిరించాడు. దీంతో బాధితురాలు బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మల్టీలెవల్ కారు పార్కింగ్ ట్రయల్ రన్ విజయవంతం



బంజారాహిల్స్: వాకర్ల వాహనాల పార్కింగ్ సమస్యకు మరో పది రోజుల్లో శాశ్వత పరిష్కారం లభించనుంది. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కును ఆనుకుని మల్టీలెవల్ పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. వారం రోజులుగా జరుగుతున్న ట్రయల్ రన్ విజయవంతమైంది. ఆరు అంతస్తుల్లో 72 కార్లు పార్కింగ్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. వారం రోజుల నుంచి పార్కు వాకర్స్ తమ కార్లను ట్రయల్ రన్‌లో భాగంగా ఇక్కడ పార్కింగ్ చేస్తున్నారు. మరో 10 రోజుల్లో అధికారికంగా ఇది అందుబాటులోకి రానుంది. ఇంకా కొన్ని పనులు మిగిలి ఉన్నాయని, అవి పూర్తయ్యాక ప్రారంభిస్తామని నిర్వాహకులు తెలిపారు. నవ నిర్మాణ్ అసోసియేట్స్ సంస్థ రూ.6.50 కోట్ల వ్యయంతో నగరంలోని మొదటి మల్టీలెవల్ పార్కింగ్‌ను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించింది. ఈ పార్కింగ్ వ్యవస్థ విజయవంతమైతే కేబీఆర్ చుట్టూ మరో రెండు ప్రాంతాల్లో నిర్మించాలని యోచిస్తున్నారు.

వైవిధ్య తటాకం!

- మనూలో బయోడైవర్సిటీ పాండ్‌కు శ్రీకారం
- నగరంలోనే సరికొత్త విధానంలో తొలి చెరువు
- క్యాంపస్‌లో భూగర్భ జలాల పెంపునకు చర్యలు

రాయదుర్గం: నగరానికి, చెరువులకు పురాతన చరిత్రతో పాటు అవినాభావ సంబంధం ఉంది. ఇక్కడ ఉన్న చెరువులను కాపాడటం, కలుషితం కాకుండా చూడటం గగనంగా మారింది. ఇలాంటి తరుణంలో నగరంలో మొదటిసారిగా ఓ చెరువునే ఏర్పాటు చేసి భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో నూతనంగా చెరువు తవ్వకానికి శ్రీకారం చుట్టడం విశేషం. 'మనూ' క్యాంపస్‌లో పదిహేను రోజుల క్రితం చెరువు తవ్వకం పనులకు వైస్ చాన్స్‌లర్, పద్మశ్రీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ శంకుస్థాపన చేశారు. క్యాంపస్‌లో భూగర్భ జలాలను గణనీయంగా పెంపొందించి బోర్‌వెల్‌లకు కీలకమైన వనరుగా ఉపయోగపడేలా దీన్ని రూపొందించారు. 'మనూ' క్యాంపస్‌లోని వృక్షాలకు అవసరమైన నీరు అందుబాటులో ఉండేలా, పచ్చదనం మరింత పెంపొందేలా, పక్షులు, ఇతర జీవజాతుల మనుగడ సాఫీగా సాగేలా ఈ చెరువుకు శ్రీకారం చుట్టారు. క్యాంపస్‌లో తయారు చేసే ఈ చెరువుకు 'జీవ వైవిధ్య చెరువు' (బయోడైవర్సిటీ పాండ్)గా పేరు కూడా పెట్టడం గమనార్హం.


చెరువుకు శంకుస్థాపన చేస్తున్న వీసీ సయ్యద్ ఐనుల్ హసన్ (ఫైల్)


కొత్తగా తవ్వుతున్న చెరువులో తాత్కాలిక ఫౌంటెన్

ప్రత్యేకతలివీ..
- క్యాంపస్‌లోని 2.68 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఏర్పాటు
- 450 మీటర్ల వ్యాసంతో దీనికి రూపకల్పన
- 80 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం ఉండేలా..
- మురుగు నీరు చేరకుండా కేవలం వర్షం నీటితోనే నిల్వ ఉట్టిపడేలా..
- నగరంలోని మిగతా చెరువుల కన్నా విభిన్నంగా తీర్చిదిద్దడం
- చెరువు పరిసరాల్లో జీవ వైవిధ్యం
- ప్రకృతి సహజసిద్ధంగా ఉండేలా.. వేలాది నాటి భారీ బండరాళ్లను కాపాడటం
- పక్షుల ఆవాసాలు, చెరువు చుట్టూ పచ్చదనం పెంచడం
- పూల మొక్కలను కూడా పెంచేందుకు నిర్ణయం
- క్యాంపస్‌లోని వారు ఆహ్లాద వాతావరణంలో సేద తీరేలా చర్యలు
- చుట్టూ వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటు యోచన
- అందమైన లైటింగ్, చెరువులో నీటి ఫౌంటెన్‌లతో కొత్త శోభ.

గత పాలకుల వల్లే విద్యా వ్యవస్థ నిర్వీర్యం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ పురుషోత్తం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణలో విద్యా వ్యవస్థ కుంటుపడిందని, అందుకు కారణం గత పాలకుల వైఫల్యమేనని తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం అన్నారు. తెలంగాణ పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో 'తెలంగాణ విద్యారంగం–ఆంధ్ర కార్పొరేట్ దోపిడీ' అనే అంశంపై సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సాయంత్రం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని ఏ ఉన్నత విద్యా సంస్థలోనూ విద్యా ప్రమాణాలు పాటించడం లేదని పేర్కొన్నారు. కార్పొరేట్ కళాశాలలన్నీ వ్యాపార దృక్పథంతో నడుస్తున్నాయని, దీంతో విద్యా ప్రమాణాలు పూర్తిగా తగ్గిపోయాయన్నారు. నడవని కాలేజీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకూడదని చెప్పారు.

ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం

◆ విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించాలని అప్పుడే వ్యవస్థ బాగుపడుతుందని అన్నారు. సోషల్ వెల్ఫేర్ కళాశాలల్లో చదివే పిల్లలే నీట్ వంటి పోటీ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించారన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి విద్యా వ్యవస్థను బాగుపరచాలనే సంకల్పం ఉందని, దానికి పౌర సమాజం కూడా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్, పాశం యాదగిరి, పల్లె వినయ్‌కుమార్, ఇర్వేంటి విజయ్‌కుమార్, ఆర్.వెంకట్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, కిరణ్, సంగిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఇబ్బంది పెట్టొద్దు


డబుల్ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశమైన ఎమ్మెల్యే సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: రాజకీయాల కోసం పేద ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి హితవు పలికారు. సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్లకు చెందిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు తమ సమస్యలను ఆదివారం ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలోని పేదలకు దాదాపు 5వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఆన్‌లైన్ లక్కీడీప్ ద్వారా కేటాయించడం జరిగిందన్నారు. ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్లకు చెందిన 1,800 మందికి డ్రా ద్వారా కేటాయించామన్నారు. స్థానికులకు 10 శాతం కేటాయించి ప్రభుత్వ నిబంధనల ప్రకారమే అర్హులకు పట్టాలు ఇచ్చామని వివరించారు. కొంతమంది కావాలని కోర్టులకు వెళ్లి లబ్ధిదారులను ఇబ్బంది పెట్టే విధంగా చేస్తూ ఆనందం పొందుతున్నారని విమర్శించారు. ఉన్నతాధికారులతో చర్చించి లబ్ధిదారులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

నగరంలో పర్ఫ్యూమర్ మెన్..

22న ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పర్ఫ్యూమ్‌లతో ప్రత్యేక ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: నగర సంస్కృతిలో పర్ఫ్యూమ్ వందల సంవత్సరాలుగా ఉందని దుబాయ్‌కు చెందిన ప్రముఖ పర్ఫ్యూమ్ స్పెషలిస్ట్ యూసఫ్ బాయ్ తెలిపారు. నగరానికి తొలిసారి వచ్చిన సందర్భంగా మాట్లాడుతూ.. నిజాం కాలం నుంచి సుగంధ ద్రవ్యాల వినియోగం ఉందని, ఇది నగర సంస్కృతిలో భాగమని అన్నారు. ఈ నెల 22న బంజారాహిల్స్‌లో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పర్ఫ్యూమ్‌లతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భారత్‌లో యేటా సుగంధ ద్రవ్యాల కోసం 10 వేల కోట్ల ఖర్చు పెడుతున్నారని, ఇది మరో ఐదేళ్లలో 20 వేల కోట్లకు పెరగనుందని అన్నారు. దీంతో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. 150 సంవత్సరాల క్రితం టర్కీలో ప్రారంభమైన పెర్ఫ్యూమ్ కల్చర్ క్రమంగా ప్రపంచం మొత్తం వ్యాపించిందన్నారు. పెర్ఫ్యూమ్ తయారీ కూడా ఒక కళేనని, ప్రకృతిలోని ప్రతి వస్తువుతో పెర్ఫ్యూమ్ తయారు చేయడం సాధ్యమవుతుందన్నారు. యూసఫ్ బాయ్ సంస్థ ఫౌండర్, చైర్మన్ అబ్దుల్ జలాల్, బిలాల్ అబ్దుల్, ముకీత్ అతీఫ్, ముజాహిద్ అహ్మద్ పాల్గొన్నారు.

కోకాపేట పబ్‌లలో ఎస్‌ఓటీ దాడులు

మణికొండ: పబ్‌లలో డ్రగ్స్, గంజాయి వాడకందారులపై ఎస్‌ఓటీ, నార్సింగి పోలీసులు సంయుక్తంగా ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఆదివారం కోకాపేటలోని రాబిట్ హోల్, మై క్యూప్స్, గండిపేటలోని టస్కా పబ్‌లలో వారు దాడులు నిర్వహించి అనుమానితులకు పరీక్షలు నిర్వహించారు. వారిలో ఇద్దరికి గంజాయి పాజిటివ్ రావటంతో వారిపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది. ఈ సందర్భంగా ఎస్‌ఓటీ పోలీసు అధికారులు పబ్‌లలో డ్రగ్స్, గంజాయి వాడితే చర్యలు తప్పవన్నారు. ప్రతి పబ్‌ను క్రమ పద్ధతిలో తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

పంథా మార్చిన పార్థీ గ్యాంగ్!

సకుటుంబ సపరివార సమేతంగా వచ్చి నేరాలు

- ఒకప్పుడు దోపిడీలు, బందిపోటు దొంగతనాలు
- నగరంలో వీళ్లు చేసిన హత్యలు, దారుణాలు ఎన్నో
- ప్రస్తుతం గంధపు చెట్ల స్మగ్లింగ్ వైపు మళ్లిన గ్యాంగ్స్
- తాజాగా నలుగురిని అరెస్టు చేసిన సిటీ పోలీసులు
- పరారీలో ఉన్న 19 మంది కోసం ముమ్మరంగా వేట



సాక్షి, సిటీబ్యూరో: మధ్యప్రదేశ్‌లోని నుంచి వచ్చి నగరంలోని వివిధ ప్రాంతాల్లో గంధపు చెట్లను నరికి ఎత్తుకుపోతున్న పార్థీ గ్యాంగ్‌ను నగర పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఈ ముఠాకు చెందిన నలుగురిని అరెస్టు చేసి, పరారీలో ఉన్న మరో 19 మంది కోసం గాలిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో అనేక నేరాలు చేసిన పార్థీ గ్యాంగ్ ప్రస్తుతం తన పంథా మార్చింది. అత్యంత కరుడుగట్టిన ఈ ముఠా పేరు చెప్తే ఒకప్పుడు పోలీసులే హడలిపోయే వాళ్లు. దోపిడీలు, బందిపోటు దొంగతనాలు, సొత్తు కోసం హత్యలు, అత్యాచారాలు చేసిన ఈ గ్యాంగ్స్ ప్రస్తుతం గంధపు చెట్లపై పడ్డాయి. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్‌ల్లో విస్తరించి ఉన్న పార్థీ గ్యాంగ్స్‌లో మూడు రకాలు ఉన్నాయని పోలీసులు చెప్తున్నారు. అవే పాసి పార్థీలు, పస్ పార్థీలు, గ్రామ్ పార్థీలు... వీటిలో పస్, గ్రామ్ ముఠాలు అత్యంత ప్రమాదకరమని స్పష్టం చేస్తున్నారు.

వగలు రెక్కీ... రాత్రికి పంజా...

పార్థీ గ్యాంగ్స్ కొన్నేళ్ల క్రితం వరకు శివార్లలో ఒంటరి ఇళ్లు, ఫామ్‌హౌస్‌ల్ని ఎంచుకుని క్రూరంగా బందిపోటు దొంగతనాలకు పాల్పడేవి. అడవుల్లో వేటాడేప్పుడు క్రూరమృగాలపై ఎలా దాడి చేస్తారో... దోచుకునే సమయంలో మనుషుల పైనా అదే స్థాయిలో వీళ్లు విరుచుకుపడేవారు. బాధితుల్ని తీవ్రంగా గాయపరచడం, ఎదిరిస్తే హతమార్చడం వారి నైజం. నిర్మానుష్య ప్రాంతాల్లో గుడారాలు వేసుకుని నివసిస్తూ..పగలు ప్లాస్టిక్ సామాన్లు, పూసలు అమ్ముకునే వారిగా వీధుల వెంట తిరిగేవాళ్లు. అనువైన ఇంటిని ఎంపిక చేసుకుని అర్ధరాత్రి దాటిన తరవాత దానిపై విరుచుకుపడి విలయం సృష్టించే వాళ్లు.

ఆ కాలం నుంచి 'క్రిమినల్ ట్రైబ్' ముద్ర...

బ్రిటీష్ కాలంలో ఉత్తరాదికి చెందిన పార్థీ గ్యాంగ్స్‌ను క్రిమినల్ ట్రైబ్ యాక్ట్ కింద నోటిఫై చేశారు. అప్పట్లో వీళ్లు కేవలం నేరాలు మాత్రమే చేస్తుండటంతో ఇలా చేసి వారిపై పటిష్ట నిఘా ఉంచారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత ప్రభుత్వం పార్థీలకు జీవనోపాధి కల్పించడంతో దాదాపు 99 శాతం మంది తమ జీవనశైలి మార్చుకున్నారు. అయినప్పటికీ ఇప్పటికీ కొన్ని ముఠాలు నేరాలు చేయడమే తమ జీవనాధారంగా చేసుకున్నాయి. ఒకప్పుడు మహారాష్ట్రకు చెందిన ముఠాలకు గణేష్ బాపు రావు పవార్ దలే నాయకుడిగా ఉండేవాడు. అత్యంత ప్రమాదకరమైన వ్యక్తిగా పేరున్న ఇతనిపై సైబరాబాద్‌తో పాటు మెదక్, నల్గొండ, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు ఏపీలోనూ అనేక కేసులు ఉన్నాయి. ఇతన్ని 2005లో సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీం పోలీసులు అరెస్టు చేశారు. ఆపై 2011లో సైబరాబాద్ పోలీసులే ఇతని సోదరుడు రాహుల్ బాపురావు పవార్‌ను పట్టుకున్నారు.

వేసవి కాలంలోనే ఎక్కువగా...

ఈ ముఠాలు అప్పట్లో వేసవి కాలంలోనే సైబరాబాద్‌పై విరుచుకుపడేవి. దీని వెనుక ఓ ఆసక్తికరమైన కారణం ఉందని పోలీసులు చెప్తున్నారు. పార్థీలు ప్రతి ఏడాదీ సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో కొండ ప్రాంతాల్లో ఉన్న తమ స్వస్థలాల్లో పూర్తిగా విశ్రాంతి తీసుకుంటూ గడుపుతారు. డిసెంబరు నెల నుంచి దొంగతనాలు ప్రారంభించేవారు. ముందుగా మహారాష్ట్రలో, ఆపై గుజరాత్‌ల్లో నేరాలు చేసేవారు. అక్కడ నుంచి ఇక్కడకు చేరే సరికి మార్చి, ఏప్రిల్ వచ్చేది. అలా ఆగస్టు వరకు ఇక్కడ నేరాలు చేసి కర్ణాటక రాష్ట్రంలోకి ప్రవేశించి..మళ్లీ సెప్టెంబరు వచ్చేసరికి తమ స్వస్థలాలకు చేరుతుండేవారు. ఒక్కోసారి ఈ పార్థీ ముఠాలు సీజన్‌ను మారుస్తూ నవంబరులోనూ నగరంపై పడి రెచ్చిపోయేవారు. పోలీసుల్ని ఏమార్చడానికి ఈ ఎత్తు వేసేవారని అధికారులు చెప్తున్నారు.

ఆ గ్యాంగ్స్ 'పని' చేసేది ఇలా...

శివార్లలో ప్రవేశించి నిర్జన ప్రదేశాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తారు. రాహుల్ బాపురావు పవార్ ముఠా అప్పట్లో లింగంపల్లిలో మకాం పెట్టింది. పగలు గ్యాంగ్‌లోని మహిళలతో రెక్కీ నిర్వహించేవారు. అన్ని రకాలుగా అనువుగా ఉన్న ఇళ్లను ఎంచుకుని అర్ధరాత్రి విజృంభించి బందిపోటు దొంగతనాలకు పాల్పడేవారు. దోపిడీలకు సైతం శివార్లలోని ఒంటరిగా ఉన్న ఇళ్లనే ఎంచుకునేది. సాధారణంగా ఈ ముఠా ఎలాంటి ఆయుధాల్నీ తమతో తెచ్చుకోదు. బందిపోటు దొంగతనం చేయబోయే ఇంటి ఆవరణలో, ఇంట్లో చేతికి దొరికిన వస్తువుతో పాశవికంగా దాడి చేస్తుంది. ఆ సమయంలో సాధారణంగా బాధితులకు మాట్లాడే అవకాశం కూడా ఇవ్వరు. తొలుత బాధితుల్ని గాయపరచడం ద్వారా భయభ్రాంతులకు గురిచేసి.. ఆపై సొత్తు చేజిక్కించుకోవడం వీరి నైజం. వీళ్లు ఎక్కువగా బాధితుల తలపైనే దాడి చేసేవారు. 2001లో నాగోలులోని కో–ఆపరేటివ్ బ్యాంక్ కాలనీలోని ఓ ఇంట్లో వీరు సృష్టించిన విలయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది.

బైకు ఢీకొని యువకుడి మృతి

కేపీహెచ్‌బీకాలనీ: రోడ్డు దాటుతున్న ఓ యువకుడిని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలకు గురై మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రూప తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన శ్రీకాంత్ (29) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి బీహెచ్ఇఎల్‌లో స్నేహితుడి వివాహానికి హాజరై తిరిగి వెళ్లే క్రమంలో సొంత పనిమీద కేపీహెచ్‌బీ కాలనీకి వచ్చాడు. ఇక్కడి పోలీస్‌స్టేషన్ ఎదురుగా రోడ్డు దాటుతుండగా మియాపూర్ వైపు నుంచి వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం శ్రీకాంత్‌ను ఢీకొంది. తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కెమెరాలను తక్కువ ధరకే ఇప్పిస్తానంటూ మోసం


నిందితుడు సూరజ్ ధనాల

బంజారాహిల్స్: ఈవెంట్లలో ఫొటోలు తీసే ఫొటోగ్రాఫర్లను పరిచయం చేసుకుని ఖరీదైన కెమెరాలను తక్కువ ధరకే ఇప్పిస్తానంటూ నమ్మించి డబ్బులు దండుకుంటున్న నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..శ్రీకృష్ణానగర్‌లో నివసించే సూరజ్ ధనాల ఈవెంట్లలో డీజే ఆపరేటర్‌గా పనిచేస్తుంటాడు. తాను వెళ్లే ఈవెంట్లలో అక్కడి ఫొటోగ్రాఫర్లను పరిచయం చేసుకుంటూ ఇంతకంటే మేలైన, నాణ్యత ఉన్న, అత్యంత ఆధునిక పరిజ్ఞానంతో ఉన్న కెమెరాలను తక్కువ ధరకు ఇప్పిస్తానంటూ నమ్మబలికాడు. ఇలా వరంగల్, హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్ తదితర పోలీస్‌స్టేషన్ల పరిధిలో 24 మందిని నమ్మించి లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసం చేసిన సూరజ్ ధనాలను బంజారాహిల్స్ పోలీసులు చీటింగ్ కేసులో అరెస్టు చేశారు. ఇలా అడ్డదారుల్లో వసూలు చేసిన డబ్బును నిందితుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌లలో పెట్టేవాడని దర్యాప్తులో తేలింది. బెట్టింగ్‌లకు బానిసైన సూరజ్ ఈజీ మనీ కోసం ఫొటోగ్రాఫర్లకు వలవేస్తూ తక్కువ ధరకే కెమెరాలు ఇప్పిస్తానంటూ నమ్మించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి ముఖం చాటేసేవాడు. గత ఏడాది గజ్వేల్ పోలీసులు ఇదే తరహా చీటింగ్ కేసులో నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. జైలు నుంచి బెయిల్‌పై వచ్చిన తర్వాత కూడా సూరజ్ తన ప్రవర్తనను మార్చుకోకుండా ఇలాంటి మోసాలకు తరచూ పాల్పడుతున్నాడు. ఇప్పటివరకు ఆయనపై రాష్ట్ర వ్యాప్తంగా 24 కేసులు నమోదయ్యాయని పోలీసుల దర్యాప్తులో తేలింది. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పై నుంచి పడి హెచ్‌సీయూ విద్యార్థికి తీవ్ర గాయాలు

గచ్చిబౌలి: భవనం పైనుంచి పడటంతో హెచ్‌సీయూ విద్యార్థికి తీవ్ర గాయాలైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం కౌశిక్ (22) అనే విద్యార్థి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఇంటిగ్రేటెడ్ కోర్సు ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఐ హాస్టల్ బ్లాక్ ఏ, రూమ్ నెంబర్ 202లో ఉంటున్నాడు. ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో అదే భవనం మూడవ అంతస్తు నుంచి జారి స్లాబ్‌పై పడ్డాడు. దీంతో కౌశిక్‌కు తీవ్ర గాయాలు కావడంతో సమీపంలోని సిటిజన్ హాస్పిటల్‌కు తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ప్రమాదవశాత్తు పడ్డాడా, లేక అతనే దూకాడా అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..

హిమాయత్‌నగర్: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆదివారం ఎస్ఐ షఫీ తెలిపిన వివరాల ప్రకారం నారాయణగూడ విఠల్ వాడికి చెందిన ఆటో డ్రైవర్ డి.కోటేశ్వర్(50) ఆర్థిక ఇబ్బందులతో ఈ నెల 10న సాయంత్రం పురుగులమందు తాగి ఆత్మహత్య యత్నం చేశారు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మరణంపై ఎటువంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు తెలిపినట్లు పోలీసులు చెప్పారు. మృతుడి సోదరుడు డి.పరమేశ్వర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్రం వెంటనే కులగణన చేపట్టాలి


మాట్లాడుతున్న రవీంద్రాచారి

హయత్‌నగర్: స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ల గడిచినా ఏ వర్గం వారి జనాభా ఎంత ఉందో లెక్కలు లేకపోవడం దురదృష్టకరమని సీపీఐ రాష్ట్ర వర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, కౌన్సిల్ సభ్యుడు ముత్యాల మాదిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జరిగిన పార్టీ కుంట్లూరు శాఖ మహాసభలో వారు మాట్లాడారు. కేంద్రం తక్షణం స్పందించి కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలకు కార్పొరేట్ విద్య, వైద్యం ఉచితంగా అందజేయాలన్నారు. పార్టీ మండల సహాయ కార్యదర్శి ఆజ్మీరా హరిసింగ్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యుడు చిర్ర శేఖర్, నాయకులు గణేష్, పేరాల గోపి, సైదులు, అనసూయ, రాజు, రవళి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న విజ్ఞానపురి కాలనీ అధ్యక్షుడు కృష్ణ

మీర్‌పేట: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని మీర్‌పేట కార్పొరేషన్ విజ్ఞానపురి కాలనీ అధ్యక్షుడు ఆర్ కృష్ణ పేర్కొన్నారు. బృంగి హాస్పిటల్ సహకారంతో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కాలనీ సెంటర్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన ఉచిత న్యూరో వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత ఆహారపు అలవాట్లు, ఉరుకులు పరుగుల జీవితంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం లేదన్నారు. కాలనీవాసుల ఆరోగ్య రక్షణ కోసం ప్రత్యేకంగా ప్రతీ ఆదివారం వైద్య శిబిరాన్ని ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

హిమాయత్‌నగర్: ప్రేమ విఫలమైందనే కారణంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆదివారం ఎస్ఐ షఫీ తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రానికి చెందిన బికాస్ శష్మల్(20) హిమాయత్‌నగర్‌లో ఓ రూమ్‌ను రెంట్‌కు తీసుకొని స్నేహితులతో ఉంటూ స్థానికంగా ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. ఈ నెల 13న రూమ్‌లో ఉండే మరో ఇద్దరు స్నేహితులు బయటకు వెళ్లి రాత్రి 11:30 నిమిషాలకు తిరిగి వచ్చారు. డోర్ కొట్టగా ఎంతకు ఓపెన్ చేయక పోవడంతో కిటికీ నుండి చూడగా బికాస్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించాడు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. రూమ్ లోపల నుండి లాక్ చేసి ఉండటం వల్ల పోలీసులు డోర్‌ను పగలగొట్టి లోపలికి వెళ్లారు. బికాస్ చేతిని కట్ చేసుకొని, ఉరి వేసుకొని బలన్మరణానికి పాల్పడినట్లు గుర్తించారు. ఆత్మహత్య చేసుకునేందుకు ముందు అతని వాట్సాప్ ఒడియా భాషలో 'ప్రేమిస్తే బాధను ఎదుర్కోవాలి, ఆ బాధ పోవాలంటే చనిపోవాలని' స్టేటస్ పెట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. బికాస్ స్నేహితుడు తరుణ్ కుమార్ మొహంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షఫీ తెలిపారు.

అడ్మిషన్ల భర్తీకి శ్రీకారం

- బీసీ సంక్షేమ బాలుర గృహంలో 100 సీట్లు
- నాణ్యమైన భోజనంతో పాటు వసతి
- తుక్కుగూడలో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం


తుక్కుగూడలోని బాలుర వసతిగృహం

తుక్కుగూడ: బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేసింది. వీటిలో భాగంగా తుక్కుగూడ పురపాలిక కేంద్రంలో బాలుర గృహం కలదు. ఇందులో విద్యార్థుల సంఖ్య పూర్తి స్థాయిలో భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీనికోసం కొత్తగా చేరబోయే వారికి పలు రకాల వసతులను కల్పించనున్నారు. ఇక్కడ విద్యార్థుల సంఖ్య ప్రతీ ఏటా తగ్గుతూ వస్తోంది. దీంతో ఈ గృహంలో విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రవేశాల కోసం విస్తృత ప్రచారం చేస్తున్నారు.

మూడో తరగతి నుంచి..

బాలుర వసతి గృహంలో మూడోతరగతి నుంచి పదోతరగతి వరకు 100 మందికి ప్రవేశం కల్పించే అవకాశం ఉంది. రెండు, మూడేళ్ల నుంచి పూర్తి స్థాయిలో విద్యార్థులు చేరకపోవడంతో కొన్ని సీట్లు మిగిలిపోయేవి. తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో ప్రస్తుతం 50శాతం పైగా విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో ప్రవేశాలే లక్ష్యంగా అధికారులు, ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇక్కడ ఇతర మండలాలకు చెందిన వారికి సైతం ప్రవేశం కల్పించనున్నారు. స్థానికంగా ఉండే పాఠశాలలకు, తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రచారం చేస్తున్నారు. వసతిగృహంలో చేరేలా అవగాహన కల్పిస్తున్నారు. ఇక్కడ వసతి గృహంలో 100 మంది విద్యార్థుల్లో బీసీలకు 75 సీట్లు, ఎస్సీలకు 15సీట్లు, ఎస్టీలకు 5 సీట్లను కేటాయించారు.

పౌష్టికాహారం అందజేత..

విద్యార్థులకు వసతితో పాటు, నాణ్యమైన భోజనాన్ని నిత్యం అందించనున్నారు. గతంలో విద్యార్థులకు మెస్ ఛార్జీల రూపేణ ఒక్కరిపై రూ.1,100లు ఖర్చు చేస్తుండేది. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుకూలంగా రూ.2,150 వెచ్చించనుంది. దీంతో విద్యార్థులకు మరింత నాణ్యమైన పౌష్టికాహారం వడ్డించనున్నారు.

ప్రతీరోజు..

ఉదయం 7గంటలకు రాగిజావ, పాలు. అనంతరం గంట తరువాత బ్రేక్‌ఫాస్ట్‌లో భాగంగా ఉప్మా, పులిహోర, కిచిడి రసం, చపాతి, పూరీ, ఇడ్లీ, జీర రైస్, టమాట అన్నం ఇలా రోజుకోరకంగా అందజేయనున్నారు. మధ్యాహ్నం పాఠశాలలో భోజనం ఉంటుంది. సాయత్రం ఐదు గంటలకు స్నాక్స్ పల్లిపట్టి, అటుకులు, బిస్కెట్స్, శనగలు, బొబ్బర్లు తదితర పదార్థాలు అందించనున్నారు. గతంలో వారానికి రెండు గుడ్లు, అరటిపండ్లు ఇచ్చేవారు. ఇప్పుడు వారంలో ఐదు రోజుల పాటు ఇవ్వనున్నారు. వారంలో ఆదివారం చికెన్ ఉంటుందని అధికారులు తెలిపారు. దీనికి తోడు విద్యార్థులకు మూడోతరగతి నుంచి ఏడోతరగతి వరకు రూ.150, 8నుంచి 10వ తరగతి వరకు రూ.200 కాస్మొటిక్ ఛార్జీలను ప్రభుత్వం చెల్లించనుంది.

సద్వినియోగం చేసుకోవాలి

తుక్కుగూడ బీసీ బాలుర సంక్షేమ వసతిగృహంలో 100 సీట్లు ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యను పెంచడానికి విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. మొత్తం సీ ట్లను భర్తీ చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం. అర్హులైన విద్యార్థులు వసతిగృహాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– జగదీశ్ కుమార్, బీసీ, బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి, తుక్కుగూడ

రాజీ మార్గమే రాజమార్గం

జాతీయ మెగా లోక్‌ అదాలత్‌లో పెద్ద ఎత్తున కేసుల పరిష్కారం

- వెస్ట్‌జోన్‌ పరిధిలో పంజగుట్ట ఫస్ట్‌
- ఆ తర్వాత స్థానంలో జూబ్లీహిల్స్‌
- కేసుల పరిష్కారానికి ముందుకువచ్చిన కక్షిదారులు



పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌

బంజారాహిల్స్‌: క్షణికావేశంతో కేసుల్లో ఇరుక్కుని పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగితే విలువైన సమయం, డబ్బు కోల్పోవడమే కాకుండా మానసికంగా తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. చాలామంది అనవసరంగా కేసుల్లో చిక్కుకుని నష్టాలకు గురవుతున్నారు. అలాంటి వారికి సత్వర న్యాయం అందించేందుకు జాతీయ లోక్‌ అదాలత్‌ విశేషంగా దోహదపడింది. స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ రాజీ పడితే ఎలాంటి వివాదాలు ఉండవని, రాజీ మార్గంతో పెండింగ్‌ కేసులు పరిష్కరించుకునేందుకు ఇది మంచి అవకాశమని భావించిన చాలామంది ముందుకువచ్చారు. దీంతో చాలా వరకు కేసులు పరిష్కారానికి నోచుకున్నాయి. రాజీ మార్గమే రాజమార్గమని జాతీయ మెగా లోక్‌ అదాలత్‌లో పలువురు కక్షిదారులు తమకు కేసులను పరిష్కరించుకున్నారు.

వెస్ట్‌జోన్‌ పరిధిలో మంచి స్పందన..

శాంతియుతంగా జీవించడానికి రాజీ మార్గమే మేలని గత కొంత కాలంగా లోక్‌ అదాలత్‌పై పోలీసులు విస్తృత ప్రచారం నిర్వహించి పరిష్కారానికి నోచుకునే కేసులను న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరింపజేశారు. గత రెండు వారాల నుంచి వెస్ట్‌ జోన్‌ పరిధిలోని పోలీసులు లోక్‌ అదాలత్‌లో పరిష్కారానికి నోచుకునే కేసులను గుర్తించి కక్షిదారులను ఒప్పించి పరిష్కార మార్గాన్ని చూపారు. సుదీర్ఘకాలంగా సివిల్‌, క్రిమినల్‌ పెండింగ్‌ కేసులతో ఇబ్బంది పడుతున్న కక్షిదారులకు లోక్‌ అదాలత్‌ ద్వారా రాజీ కుదిరింది. ఈ కార్యక్రమానికి వెస్ట్‌జోన్‌ పరిధిలో మంచి స్పందన లభించింది. ముఖ్యంగా మోటార్‌ వెహికల్‌ ప్రమాద ఘటనకు సంబంధించి చాలా కేసులు ఇందులో పరిష్కారానికి నోచుకున్నాయి.

మొత్తం 406 కేసులు నమోదు..

చాలామంది లోక్‌ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకునేందుకు ముందుకువచ్చారు. వెస్ట్‌జోన్‌ పరిధిలో మొత్తం 406 కేసులు నమోదయ్యాయి. ఇందులో పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌ అత్యధిక కేసులు పరిష్కరించి మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత జూబ్లీహిల్స్‌, బంజారాహిల్స్‌ పోలీస్‌స్టేషన్లు కేసులు పరిష్కరింపజేశాయి. కేసులను పరిష్కరించడంలో సిబ్బందితో పాటు ఎస్‌ఐలు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి కక్షిదారులను ఒప్పించడంలో విజయవంతమయ్యారు. దీంతో మెగా లోక్‌అదాలత్‌తో పోలిస్తే ఈ సారి మరిన్ని కేసులు ఎక్కువగా పరిష్కారానికి నోచుకున్నాయి. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగలేక సతమతమవుతున్న వారికి జాతీయ లోక్‌ అదాలత్‌ చక్కని వేదికగా నిలిచింది.

వెస్ట్‌ జోన్‌ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో రాజీ కుదిరిన కేసులు..

పోలీస్‌స్టేషన్‌	పరిష్కారమైన కేసులు
పంజగుట్ట	85
జూబ్లీహిల్స్‌	73
బంజారాహిల్స్‌	60
ఎస్సార్‌నగర్‌	45
బోరబండ	43
మధురానగర్‌	28
మాసబ్‌ట్యాంక్‌	18

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్‌: బీకేగూడ, అల్లాడిన్‌ కోటి 11 కేవీ ఫీడర్లు, ఈఎస్‌ఐ, లోధా సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా ఈనెల 16న పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌లాండ్స్‌ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్‌ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జయభారతి స్కూల్‌, శ్రీరామ్‌నగర్‌, దాసారం బస్తీ, సీ–టైప్‌ క్వార్టర్స్‌, సనత్‌నగర్‌ ఇండస్ట్రియల్‌ ఏరియా, ఆల్లాడిన్‌ కోటి, లిక్కర్‌ కంపెనీ తదితర ప్రాంతాలు. అదేవిధంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్‌ఆర్‌నగర్‌ మెయిన్‌రోడ్డు ఏరియా, కమ్యూనిటీహాల్‌ లైన్‌, ఆంధ్రాబ్యాంకు, ఎస్‌బీహెచ్‌, చైతన్య జూనియర్‌ కళాశాల, 2 ఆర్‌టీ, 3 ఆర్‌టీ క్వార్టర్స్‌ ప్రాంతాలు, డీఎస్‌ఎం కాలనీ, అశోక్‌ కాలనీ, సనత్‌నగర్‌ మెయిన్‌రోడ్డు, సుభాష్‌నగర్‌, ఎస్‌ఆర్‌టీ టీవీఎస్‌ షోరూం ఒక పార్ట్‌, మెథడిస్ట్‌ చర్చి లైన్‌, డీ–మార్ట్‌ ఎదురు గల్లీల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న ఆప్తమాలజిస్టులు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–11లోని గౌరీశంకర్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం అడ్వాన్స్‌డ్‌ ఫోకస్‌ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్‌ అనూజ పాశం పర్యవేక్షణలో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన ఈ శిబిరానికి 150 మంది వరకు హాజరై కంటి పరీక్షలు నిర్వహించుకున్నారు. బస్తీల్లో చాలా మంది కళ్లను నిర్లక్ష్యం చేస్తుంటారని, సమస్య ముదిరేదాకా తెలుసుకోరని, అందుకే తాము బస్తీలను ఎంపిక చేసుకుని వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్‌ అనూష తెలిపారు.

శాస్త్రినగర్‌ బస్తీ ఎన్నికలు



బాలరాజ్‌ను అభినందిస్తున్న బస్తీ నేతలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ డివిజన్‌ శాస్త్రినగర్‌ బస్తీ ఎన్నికలు ఆదివారం జరిగాయి. బస్తీలో మొత్తం 144 ఓట్లు ఉండగా బాలరాజ్‌కు 92, ప్రత్యర్థి ఎం.సత్యనారాయణకు 52 ఓట్లు వచ్చాయి. 40 ఓట్ల మెజార్టీతో బాలరాజ్‌ గెలుపొందినట్లు ఎలక్షన్‌ ఆఫీసర్‌ నర్సింగరావు తెలిపారు. ఈ సందర్భంగా బస్తీ నేతలు జ్యోతీబాయ్‌, రవికుమార్‌ ముదిరాజ్‌, రవిగౌడ్‌, సంతోష్‌ ముదిరాజ్‌, సత్యనారాయణ ముదిరాజ్‌, శ్రీకృష్ణ, అంజయ్యగౌడ్‌, వెంకటేశ్‌గౌడ్‌, హరికృష్ణ ముదిరాజ్‌, రమేశ్‌నాయక్‌ బాలరాజ్‌కు అభినందనలు తెలిపారు.

సికింద్రాబాద్‌ ఎస్‌సీఆర్‌పీసీ కన్వీనర్‌గా రవికిరణ్‌



రవికిరణ్‌కు నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

రహమత్‌నగర్‌: షెడ్యూల్‌ క్యాస్ట్స్‌ రైట్స్‌ ప్రొటెక్షన్‌ సొసైటీ (ఎస్‌సీఆర్‌పీఎస్‌) సికింద్రాబాద్‌ పార్లమెంట్‌ కన్వీనర్‌గా సీనియర్‌ దళిత నాయకుడు బోడ రవికిరణ్‌ మాదిగ నియామకమయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఎస్‌సీ ఆర్‌పీఎస్‌ అధ్యక్షుడు సుదర్శన్‌ బాబు, మహిళా అధ్యక్షురాలు స్టాలిన్‌, హైదరాబాద్‌ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్‌, ఉపాధ్యక్షుడు మహేందర్‌, సత్యనారాయణ ఆదివారం రవికిరణ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవికిరణ్‌ మాట్లాడుతూ..దళిత హక్కుల సాధనకు పోరాటం చేస్తానని పేర్కొన్నారు. అనంతరం రహమత్‌నగర్‌లో వివిధ దళిత సంఘాల నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడికి గాయాలు

వెంగళరావునగర్‌ : ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడికి గాయాలైన ఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జగ్గయ్యపేటకు చెందిన ఈ.బాలాజీ రహమత్‌నగర్‌లో నివాసం ఉంటూ ప్రైవేట్‌ జాబ్‌ చేస్తున్నాడు. ఈనెల 14న సాయంత్రం రహమత్‌నగర్‌ నుంచి హిమాయత్‌నగర్‌కు బైక్‌పై వెళుతున్నాడు. నిమ్స్‌ మే సమీపంలో వెనుక నుంచి వచ్చిన ఆర్‌టీసీ బస్సు వాహనాన్ని ఢీకొట్టగా కిందపడి గాయపడ్డాడు. ద్విచక్ర వాహనం సైతం దెబ్బతిన్నది. ఆసుపత్రిలో చికిత్స అనంతరం బాధితుడు మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆపరేషన్‌ కగార్‌ను వెంటనే ఆపాలి



మాట్లాడుతున్న కల్లూరు ధర్మేంద్ర

హిమాయత్‌నగర్‌: అడవుల్లోని ఖనిజ సంపదను, వనరులను కార్పొరేట్లకు దోచిపెట్టే ఆపరేషన్‌ కగార్‌ను వెంటనే ఆపాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్‌) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఏఐవైఎఫ్‌ రాష్ట్ర కార్యాలయం (సత్యనారాయణ రెడ్డి భవన్‌)లో జరిగిన ఏఐవైఎఫ్‌ రాష్ట్ర కౌన్సిల్‌ సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివాసీలపై దమనకాండను ఆపాలని, కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణను ప్రకటించి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్‌ చేస్తూ 23న చలో రాజ్‌ భవన్‌ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏఐవైఎఫ్‌ రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ నెర్ల కంటి శ్రీకాంత్‌, రాష్ట్ర ఆఫీస్‌ బేరర్స్‌ వెంకటేశ్వర్లు, నానబాల రామకృష్ణ, బిజ్జ శ్రీనివాసులు, టి.సత్యప్రసాద్‌, పేరబోయిన మహేందర్‌, శ్రీమాన్‌, కొండల్‌, రాష్ట్ర సమితి సభ్యులు ఎల్లంకి మహేష్‌, ఉపేంద్ర, సల్మాన్‌ బేగ్‌, శివ కుమార్‌, రాజేష్‌, మహమూద్‌, మాజీద్‌, మహేష్‌, మధు పాల్గొన్నారు.

రాడీషీటర్లకు కౌన్సెలింగ్‌



రాడీషీటర్లకు కౌన్సెలింగ్‌ ఇస్తున్న మాసబ్‌ట్యాంక్‌ ఇన్‌స్పెక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌

బంజారాహిల్స్‌: రానున్న బోనాల పండుగను పురస్కరించుకుని రౌడీషీటర్ల కదకలిలపై నిఘా ఉంటుందని, ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే ఊరుకునేది లేదని మాసబ్‌ట్యాంక్‌ ఇన్‌స్పెక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌ రౌడీషీటర్లకు హెచ్చరికలు జారీ చేశారు. బోనాల పండుగ సందర్భంగా రౌడీషీటర్లను బైండోవర్‌ చేసిన అనంతరం వారికి కౌన్సెలింగ్‌ ఇచ్చారు. వివాదాల జోలికి వెళ్లవద్దని, ప్రశాంతంగా ఉండాలని, అనుమానాస్పదంగా తిరిగితే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతిరోజూ తమ పోలీసులు రౌడీషీటర్ల కదలికలపై దృష్టిపెట్టారనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు.

లంబాడీలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న సంజీవ్‌ నాయక్‌

పంజగుట్ట: లంబాడీలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని సేవాలాల్‌ సేన వ్యవస్థాపకుడు సంజీవ్‌ నాయక్‌ డిమాండ్‌ చేశారు. లంబాడీలను నమ్మించి మోసం చేస్తున్నా మిన్నకున్నట్లు ఉన్న ఆ పార్టీ నలుగురు ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున సమావేశాలు, సభలు నిర్వహిస్తామని కాంగ్రెస్‌ బంజారాలకు చేస్తున్న మోసాన్ని ఎండగడతామని హెచ్చరించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే లంబాడీల వల్లే తాను అధికారంలోకి వచ్చానని చెప్పిన రేవంత్‌రెడ్డి నమ్మించి మోసం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ స్పీకర్‌, ఒక విప్‌ ఇచ్చి చేతులు దులుపుకుటాం అంటే ఊరుకునేది లేదన్నారు. వెంటనే బంజారాలకు మంత్రి పదవి, కార్పొరేషన్‌ చైర్మన్‌లు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ఈ సమావేశంలో బాలోత్‌ సైదానాయక్‌, స్వరాజ్‌ నాయక్‌, హుస్సేన్‌ నాయక్‌, కళ్యాణ్‌ నాయక్‌, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

రహమత్‌నగర్‌: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జూబ్లీహిల్స్‌ బీజేపీ కన్వీనర్‌ కుంబాల గంగారాజు పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడు తంగలపల్లి లక్ష్మణ్‌ ఆధ్వర్యంలో కార్మికనగర్‌లో ఆదివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమ్‌సాగర్‌, మల్లేశ్‌ గుప్తా, చింటు, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, గిరి, సౌభాగ్య, లక్ష్మి, విజయ్‌, శివ, మహేశ్‌, నరేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పంజగుట్ట: ప్రేమ్‌నగర్‌, అంబేడ్కర్‌ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని విశేష స్పందన లభించింది. సుమారు 160 మంది ఈ శిబిరంలో పాల్గొని వైద్యుల సలహాలు తీసుకుని అవసరమైన వారు ఉచితంగా మందులు తీసుకున్నారు. అపోలో ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌, అంబేడ్కర్‌ సేవా సంఘం, జై జవాన్‌ జై కిసాన్‌ యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో రక్తపరీక్షలు, ఆర్థోపెడిక్‌, జనరల్‌ ఫిజీషియన్‌, స్త్రీలకు సంబంధించిన సమస్యలు, చిన్న పిల్లల సమస్యలపై వైద్యులు పరిశీలించి సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బస్తీ ప్రధాన కార్యదర్శి కె.భగవాన్‌ దాస్‌, పంచాయతీ కమిటీ మాజీ చైర్మన్‌ వెంకటేశం, క్యాంపు కో ఆర్డినేటర్‌ నితిన్‌ సింగ్‌, స్థానిక నాయకులు రామచందర్‌, సుదీర్‌, కె.ఆర్‌.నర్సింగ్‌ రావు, వైద్యులు పాల్గొన్నారు.

మహిళపై కేసు

వెంగళరావునగర్‌: అకారణంగా ఓ వ్యక్తిని మహిళ బెదిరింపులకు గురి చేస్తున్న ఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రూపాని నానక్‌రామ్‌ ఎల్లారెడ్డిగూడలో నివసిస్తూ వ్యాపారం చేస్తుంటాడు. కాగా అతని ఇంటికి కొద్ది దూరంలోనే శివపార్వతి అనే మహిళ హాస్టల్‌లో ఉంటోంది. నానక్‌రామ్‌ వచ్చివెళ్లే క్రమంలో అకారణంగా దూషిస్తోంది. గత నెలలో రెండుసార్లు ఆమెతో మాట్లాడి అకారణంగా దూషించవద్దని కోరాడు. అయినప్పటికీ తనను అవమానపరిచేలా నిత్యం దూషిస్తోంది. దీంతో నానక్‌రామ్‌ ఆదివారం మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయం చేయాలని ఆందోళన

రహమత్‌నగర్‌: భవనం పై నుంచి పడి మృతి చెందిన కైలాస్‌ ప్రదాన్‌ కుటుంబ సభ్యులు ఆదివారం కార్మికనగర్‌లోని ఘటనా జరిగిన భవనం ఎదుట ఆందోళన నిర్వహించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వీరికి మద్దతుగా ఒడిస్సాకు చెందిన మహిళలు నిలిచారు. సమాచారం అందుకున్న బోరబండ సెక్టార్‌ ఎస్‌ఐలు సర్దార్‌ జమాల్‌, స్వప్నారెడ్డి కార్మికనగర్‌కు చేరుకుని అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. కాగా బస్తీ పెద్దలు జోక్యం చేసుకుని భవన యాజ మాని జంగయ్య మృతుడి కుటుంబానికి నష్ట పరిహారం అందించేలా ఒప్పందం కుదర్చడంతో వారు ఆందోళన విరమించారు.


ఘనంగా ఫాదర్స్‌ డే



ఒయాసిస్‌లో ఫాదర్స్‌ డే వేడుకలు

బంజారాహిల్స్‌: ఫాదర్స్‌ డే సందర్భంగా ఓయాసిస్‌ ఫెర్టిలిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఒయాసిస్‌ జనని యాత్ర విజయవంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా పురుషుల ఫెర్టిలిటీ గురించి అపోహలు తొలగిస్తూ అవగాహన కల్పించి వారికి సాధికారిత కల్పించడమే లక్ష్యంగా ఒయాసిస్‌ జనని యాత్ర చేపట్టడం జరిగిందని ఈ సందర్భంగా ఫెర్టిలిటి సైంటిఫిక్‌ హెడ్‌, క్లినికల్‌ ఎంబ్రియాలజిస్ట్‌ డాక్టర్‌ కృష్ణచైతన్య తెలిపారు. 'హెల్తీ మ్యాన్‌–హ్యాపీ ఫాదర్‌' అనే థీమ్‌తో మగవారిలో వంధ్యత్వ సమస్యలు గురించి అవగాహన కల్పించడం, సంతానం పొందడంలో మగవారి పాత్ర ఎంత ఉందో తెలియజేయడం ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో నగర ట్రాఫిక్‌ అదనపు డీసీపీ రాములు, ఒయాసిస్‌ ఫెర్టిలిటీ మెడికల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ దుర్గా జి రావు తదితరులు పాల్గొన్నారు.

సర్దార్‌ కుటుంబానికి అండగా బీఆర్‌ఎస్‌



రహమత్‌నగర్‌: ఆత్మహత్య చేసుకున్న బీఆర్‌ఎస్‌ మైనార్టీ నాయకుడు సర్దార్‌ కుటుంబానికి బీఆర్‌ఎస్‌ అండగా ఉంటుందని ఎమ్మెల్సీలు శ్రావణ్‌కుమార్‌, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బోరబండ ఎస్‌ఆర్‌టీనగర్‌లోని సర్దార్‌ నివాసంలో ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్దార్‌ది ఆత్మహత్య కాదని, ప్రభుత్వ హత్య అని ఆరోపించారు. వారి వెంట రాష్ట్ర మైనార్టీ నాయకులు సోహైల్‌, అర్షద్‌, కార్పొరేటర్లు రాజ్‌కుమార్‌, దేదిప్య, డివిజన్‌ నాయకులు పాల్గొన్నారు.

గౌతమ్‌నగర్‌ చౌరస్తాలో బీజేపీ బహిరంగ సభ



ఫిలింనగర్‌ గౌతమ్‌నగర్‌ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో బహిరంగ సభ

ఫిలింనగర్‌: జూబ్లీహిల్స్‌ డివిజన్‌ ఫిలింనగర్‌ గౌతమ్‌నగర్‌ చౌరస్తాలో '11 ఏళ్ల మోదీ ప్రభుత్వం–సంకల్పంతో సహకారం'పై ఆదివారం బహిరంగ సభ నిర్వహించారు. డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్‌ అధ్యక్షతన జరిగిన ఈ సభకు తెలంగాణ రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, హైదరాబాద్‌ సెంట్రల్‌ జిల్లా బీజేపీ అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 11 ఏళ్లల్లో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేశారన్నారు. ముఖ్యంగా 81 కోట్లకు పైగా ప్రజలకు ప్రధానమంత్రి గరీబ్‌ కల్యాణ్‌ అన్న యోజన ద్వారా ఉచిత రేషన్‌ ఇస్తున్నారన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్‌ యోజన ద్వారా 4 కోట్లకు పైగా ప్రజలకు ఇళ్ల నిర్మాణం చేయడం జరిగిదన్నారు. ప్రధానమంత్రి స్వనిధి యోజన ద్వారా 68 లక్షలకు పైగా వీధి వ్యాపారులకు పూచీకత్తులు లేని రుణాలు మంజూరు చేయడం జరిగిందని వివరించారు. అలాగే నారీ శక్తి వందన్‌ ద్వారా చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పన చేయడం జరిగిందని, ముఖ్యంగా ముస్లిం మహిళలకు న్యాయం దక్కేలా 'ట్రిపుల్‌ తలాక్‌ రద్దు చేయడం జరిగిందన్నారు. తెలంగాణలో జరగబోయే ఏ ఎన్నికల్లో అయినా బీజేపీ విజయం ఖాయమని, రాష్ట్రంలో, కేంద్రంలో డబుల్‌ ఇంజిన్‌ సర్కార్‌ ఏర్పడుతుందని వారు వివరించారు. ఈ కార్యక్రమలో నాయకులు కాడిగారి భోజిరెడ్డి, గడ్డం వెంకట్‌స్వామి, కొత్త నీరజ, దండుగుల శ్రీనివాస్‌, సీతల అనిల్‌కుమార్‌, గందె అరుణ్‌కుమార్‌, కస్తూరి మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో బ్లూ షీట్ల ఏర్పాటు



బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–12లోని మోర్‌ మెడికల్స్‌ వెనుక కమాండ్‌కంట్రోల్‌ సెంటర్‌ను ఆనుకుని కొత్తగా వేసిన రోడ్డు పక్కన గత ఏప్రిల్‌ 16న 1000 గజాల ప్రభుత్వ స్థలంలో కబ్జాదారులు నిర్మించిన అక్రమ నిర్మాణాలను షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు కూల్చివేసి ఇక్కడ హెచ్చరిక బోర్డును కూడా ఏర్పాటు చేశారు. సర్వేనెంబర్‌–403లో ఉన్న సుమారు 2,000 గజాల స్థలం చుట్టూ ఫెన్సింగ్‌ వేయగా రెవెన్యూ అధికారులు వాటిని తొలగించి తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. అయితే ఆదివారం ఇదే స్థలంలోకి కొంత మంది వ్యక్తులు ప్రవేశించి సెలవు దినం కావడంతో చుట్టూ బ్లూషీట్స్‌ ఏర్పాటుచేశారు. ఇది ప్రభుత్వ స్థలమని, సర్వేనెంబర్‌ 129/104 కిందకు వస్తుందని, కోర్టు ఆర్డర్‌ కూడా ఉందని సదరు వ్యక్తులు స్పష్టం చేశారు. స్థలంలో ఉన్న ప్రభుత్వ హెచ్చరిక బోర్డును తొలగించారు. సుమారు 5 గంటల పాటు 25 మంది వ్యక్తులు ఈ స్థలంలోకి ప్రవేశించి చుట్టూ బ్లూ షీట్స్‌ ఏర్పాటుచేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు చాలామంది ఈ ప్రాంతానికి చేరుకోవడంతో ఏమి జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. ఈ స్థలంలో 1000 గజాలు తమదేనని, సంబంధిత పత్రాలు కూడా ఉన్నాయని వీరు తెలిపారు.

ఇది ప్రభుత్వ స్థలమే:
అనితారెడ్డి, తహసీల్దార్‌, షేక్‌పేట

బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–12లోని పోలీస్‌ కమాండ్‌ కంట్రోల్‌ పక్కన సర్వేనెంబర్‌ 403లోని టీఎస్‌ నెంబర్‌ 5, బ్లాక్‌–హెచ్‌, వార్డు–10లోకి వచ్చే ఈ స్థలం ప్రభుత్వానిదేనని, రెండు నెలల క్రితం ఇక్కడ అక్రమ నిర్మాణాలను కూడా కూల్చివేశాం. ఈ స్థలం విలువ సుమారుగా రూ.80 కోట్లు ఉంటుంది. ఇటీవల కొందరు వ్యక్తులు ఈ స్థలం తమదేనంటూ రావడం జరిగింది. అయితే వారు పేర్కొంటున్న సర్వేనెంబర్‌ ఇది కాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న స్థలం సర్వేనెంబర్‌ 403లోకి వస్తుందని, తమదేనని పేర్కొంటున్న వారి సర్వేనెంబర్‌ 129/104 అని అది ఎక్కడ ఉందో వారికే తెలియాలన్నారు. సెలవు దినం కావడంతో స్థలంలోకి వచ్చి ఉంటారని ఆమె అన్నారు.

వెంగళరావునగర్‌ బీజేపీ నూతన కార్యవర్గం ఎన్నిక



వెంగళరావునగర్‌ : వెంగళరావునగర్‌ డివిజన్‌ బీజేపీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్‌.నవీన్‌కుమార్‌, ఉపాధ్యక్షులుగా శ్రావణ్‌కుమార్‌, శివకుమార్‌, అర్జున్‌, నర్సింగరావు, కిలారి హరిబాబు, ప్రధాన కార్యదర్శులుగా టి.రాఘవేంద్ర, అరవింద్‌, వరలక్ష్మి, కార్యదర్శులుగా భాస్కర్‌, నరేశ్‌, రోజారాణి, రఘు, వెంకటకృష్ణ, సతీశ్‌, కోశాధికారిగా పీ.లీలా నియమితులయ్యారు. నూతన కార్యవర్గానికి బీజేపీ హైదరాబాద్‌ సెంట్రల్‌ జిల్లా ఉపాధ్యక్షుడు, ఈఎస్‌ఐసీ బోర్డు మెంబర్‌ కిలారి మనోహర్‌, బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్‌ సుప్రియాగౌడ్‌ శాలువాలు కప్పి, నియామకపు పత్రాలు అందించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు, కమిటీ నేతుల మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామన్నారు. త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్‌లో జరగనున్న ఉప ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగురవేస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు కిలారి మనోహర్‌, సుప్రియాగౌడ్‌ వీరితో ప్రమాణం చేయించి ప్రధాని మోదీ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సీనియర్‌ నాయకులు వేణు యాదవ్‌, యలమంచిలి రవి తదితరులు పాల్గొన్నారు.

కొత్త పైపులైన్ల నిర్మాణంతో సమస్యకు పరిష్కారం



శ్రీకృష్ణానగర్‌ సీ–బ్లాక్‌లో జెట్టింగ్‌ మిషన్‌తో మ్యాన్‌హోళ్లు క్లీన్‌ చేస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్‌: శ్రీ కృష్ణానగర్‌ సీ–బ్లాక్‌లో కమ్యూనిటీ హాల్‌ లైన్‌లో గత కొన్నేళ్లుగా డ్రైనేజీ సమస్య తీవ్రరూపం దాల్చడంతో జలమండలి అధికారులు సమస్యపై దృష్టిపెట్టారు. శ్రీకృష్ణానగర్‌ సీ–బ్లాక్‌లోని పూర్ణ టిఫిన్‌ సెంటర్‌ గల్లీతో పాటు కమ్యూనిటీ హాల్‌ లైన్‌లో, చుట్టుపక్కల మరో నాలుగు వీధుల్లో వానాకాలం వచ్చిందంటే మురుగునీరు వీధుల్లో పొంగిపొర్లుతూ మ్యాన్‌హోళ్ల లీకవుతూ స్థానికంగా నరకప్రాయంగా మారుతుంది. దుర్వాసనలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జలమండలి ఎల్లారెడ్డిగూడ సెక్షన్‌ పరిధిలోని ఈ ప్రాంతంలో వరదనీటి కాలువలో మురుగునీటి పైపులైన్లు కలపడం వల్లనే ఈ సమస్య తలెత్తినట్లుగా అధికారులు గుర్తించారు. దీంతో ఇటీవలనే రూ.75 లక్షల వ్యయంతో 450 ఎంఎం దయా సీవరేజీ పైపులైన్ల నిర్మాణం కోసం శంకుస్థాపన కూడా జరిగింది. వానాకాలంలో రోడ్ల తవ్వకాలకు జీహెచ్‌ఎంసీ అనుమతులు నిలిపివేయడంతో ఎమర్జెన్సీ వర్క్స్‌ కింద స్థానికంగా డ్రైనేజీ సమస్య సీరియస్‌గా ఉన్న నేపథ్యంలో రోడ్డు కటింగ్‌కు అనుమతులు ఇవ్వాలని అధికారులు జీహెచ్‌ఎంసీకి లేఖ రాశారు. ఇదిలా ఉండగా శ్రీ కృష్ణానగర్‌ సీ–బ్లాక్‌ నుంచి 450 ఎంఎం దయా మురుగునీటి పైపులైన్‌ను శ్రీకృష్ణానగర్‌ ఏ–బ్లాక్‌లో ఉన్న 900 ఎంఎం దయా అంబర్‌పేట మెయిన్‌లైన్‌కు అనుసంధానం చేయనున్నారు. ప్రస్తుతం ఈ లింక్‌ కట్‌ కావడం వల్లనే సమస్య చోటుచేసుకున్నట్లుగా అధికారులు గుర్తించారు. శ్రీకృష్ణానగర్‌లో మెయిన్‌రోడ్డులో మెట్రో పిల్లర్ల నిర్మాణ సమయంలో ఇక్కడి డ్రైనేజీ పైప్‌లైన్లను మెట్రో అధికారులు నిలిపివేశారు. దీంతో స్థానికంగా డ్రైనేజీ పైపులను ఇక్కడ ఉన్న వరద నీటి కాలువలోకి మళ్లించారు. వర్షాకాలంలో పెద్ద ఎత్తున వరదనీరు వస్తుండడంతో మురుగంతా వెనక్కి తన్నుకొచ్చి కృష్ణానగర్‌ సీ–బ్లాక్‌ను ముంచెత్తుతుంది. కొత్త పైపులైన్ల నిర్మాణంతో స్థానికంగా సమస్యకు పరిష్కారం లభిస్తుందని జలమండలి జీఎం హరిశంకర్‌ తెలిపారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కావలి చంద్రకాంత్ తీసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బల్కంపేటలోని శ్రీ ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కల్యాణోత్సవాలను పురస్కరించుకుని ఉదయం 11 గంటలకు దేవస్థాన ప్రాంగణంలో దేవాదాయ శాఖ మంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తారు.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ ట్రస్ట్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు సంపూర్ణ సంస్థ ఆధ్వర్యంలో వస్త్రభూషణ పేరిట చేనేత వస్త్ర ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్(ఫ్లో) హైదరాబాద్ చాప్టర్ స్టైల్‌తత్వ 2025 మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు వస్త్రభూషణం పేరిట వస్త్ర ప్రదర్శన జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

పాఠ్యపుస్తకాలకు 'యూడైస్'తో ముడి!



- విద్యార్థి వివరాలు నమోదు కాకుంటే బుక్స్ ఇవ్వవడంలేదు
- టీచర్లతో వాగ్వాదానికి దిగుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- ఆధార్ కార్డులతో ప్రభుత్వ పాఠశాలలకు ఉరుకులు, పరుగులు

నగరంలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతిలో 46 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారి సంఖ్యకు అనుగుణంగా పాఠశాల నుంచి పాఠ్యపుస్తకాల ఇండెంట్ విద్యా శాఖకు వెళ్లింది. కానీ, కేవలం 28 మందికి మాత్రమే పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ వచ్చాయి. మిగతా 18 మంది విద్యార్థులకు రాలేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే యూడైస్ సంఖ్య ఆధారంగానే పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ సరఫరా జరిగిందని విద్యాశాఖాధికారులు సమాధానం చెప్పారు. దీంతో సిస్టమ్‌లో పొరపాటు జరిగిందా..? నమోదులోనే జరిగిందా? అనేది తెలియక టీచర్లు సతమతమవుతున్నారు.

సాక్షి, సిటీబ్యూరో: విద్యా సంవత్సరం ప్రారంభమైన వేళ ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త సమస్య వచ్చి పడింది. ఉచితంగా అందించే పాఠ్యపుస్తకాల పంపిణీ ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. కొంతమంది విద్యార్థులకు ఆవేదనను మిగిలిస్తోంది. పేద విద్యార్థులకు ఉచితంగా అందించే పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంల పంపిణీ ప్రక్రియ యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ (యూడైస్ ప్లస్)తో ముడి పడింది. విద్యా శాఖకు సంబంధించిన యూడైస్‌లో విద్యార్థి పేరును ఆధార్ కార్డు ఆధారంగా నమోదు చేయడం తప్పనిసరి. విద్యా శాఖ కూడా యూడైస్ ఆధారంగానే పాఠశాలలకు పాఠ్యపుస్తకాలకు సంబంధించిన ఇండెంట్ విడుదల చేస్తోంది. అయితే యూడైస్‌లో నమోదు కానీ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడంలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలకు వచ్చి ఉపాధ్యాయులను నిలదీస్తున్నారు. అందరితో పాటు తమ పిల్లలకు పుస్తకాలు ఇవ్వకపోవడమేమిటని వాగ్వాదానికి దిగుతున్నారు.

12.50 లక్షల పాఠ్య పుస్తకాలు

హైదరాబాద్ జిల్లాలో 713 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 94,339 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారి కోసం సుమారు 12.50 లక్షల పాఠ్యపుస్తకాలు, 6.20 లక్షల నోట్‌బుక్స్ అవసరమవుతాయి. అయితే ఒకటో తరగతిని మినహాయించి మిగతా 2–10వ తరగతి వరకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌లను విద్యాశాఖ ముద్రించింది. యూనిఫాంలను కూడా కుట్టించింది. ముద్రించిన పుస్తకాలను మే 20వ తేదీ వరకు అధికారులు మండల విద్యా వనరుల కేంద్రం(ఎమ్మార్సీలకు) పంపించారు. ఈ మేరకు అదే నెల 23వ తేదీ నుంచి హెచ్‌ఎంలు అక్కడి నుంచి తీసుకెళ్లి తమ పాఠశాలల్లో భద్రపరిచారు. ఈ నెల 12న పాఠశాలల పునః ప్రారంభం రోజు నుంచి విద్యార్థులకు పంపిణీ చేయాల్సి ఉంటుంది. అయితే యూడైస్‌లో నమోదైన పేర్ల ప్రకారం విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలు అందిస్తున్నారు. అందులో లేని వారు ఆధార్ కార్డు తీసుకుని వస్తే పేర్లు నమోదు చేసి, విద్యాశాఖకు ఇండెంట్ పెడ్తామని ఉపాధ్యాయులు అంటున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆధార్ కార్డుతో స్కూల్స్‌కు ఉరుకులు, పరుగులు చేస్తున్నారు. మొత్తం 10 శాతం విద్యార్థుల పేర్లు యూడైస్‌లో నమోదు కాలేదని ఉపాధ్యాయ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఆర్టీఐ చట్టాన్ని కాపాడుకోవాలి

మాజీ కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్


సమావేశంలో మాట్లాడుతున్న మాడభూషి శ్రీధర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆర్టీఐ చట్టాన్ని కాపాడుకోవడంతోపాటు సమాజానికి పనికి వచ్చే సమాచారాన్ని రాబట్టాలని ఆర్టీఐ మాజీ కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం (హెచ్‌సీఎఫ్), పీపుల్స్ ఫ్రంట్ ఫర్ రైట్ టు ఇన్ఫర్మేషన్ (పీఎఫ్‌ఆర్‌ఐ) సంయుక్త ఆధ్వర్యంలో 'ఆర్టీఐ చట్టం అమలు తీరు–పొంచి ఉన్న ప్రమాదం'అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీఐ చట్టం చాలా విశిష్టత కలిగి ఉందని, దాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. పిచ్చి పిచ్చి ప్రశ్నలతో అధికారులను వేధించడం కాకుండా సమాజానికి ఉపయోగపడే సమాచారమే రాబట్టేలా ప్రశ్నలు అడగాలన్నారు. కొంతమంది అధికారులు ప్రశ్నరూపంలో అడిగితే సమాచారం ఇవ్వటంలేదని, సమాచారం రాబట్టటం ప్రధానం తప్ప ఏరూపంలో అడిగారనేది ముఖ్యం కాదని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిగొప్ప సమాచార హక్కు చట్టం మనదేశంలోనే ఉందన్నారు. సమాచార హక్కు చట్టాన్ని నీరు కార్చేందుకు అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ అధికారులు సమాచారం ఇవ్వకుండా తప్పించుకునేందుకు అనేక వక్రమార్గాలను అవలంబిస్తున్నారని విమర్శించారు. సమాచారం పొందటం ప్రజల హక్కు అని, దాన్ని తిరస్కరించకుండా ప్రజలకు చేరవేయాలన్నారు. ఇతర రాష్ట్రాల కంటే తెలుగు రాష్ట్రాలలో ఆర్టీఐ చట్ట వినియోగం, సమాచారాన్ని ఇస్తున్న తీరు లోపభూయిష్టంగా ఉందని విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని సమాచార హక్కు చట్టాన్ని కాపాడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్టీఐ కార్యకర్త ఎం.శ్రీనివాస్ ఆర్టీఐ నిపుణులు శ్రీనివాస్ యాదవ్, అయిలు, ప్రధాన కార్యదర్శి కె.పార్థసారథి, హెచ్‌సీఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.వీరయ్య, యాదయ్య, ఎం .శ్రీనివాస్‌రావు, సంగీత, అస్మిత తదితరులు పాల్గొన్నారు.

మహిళా స్టార్టప్‌లను ప్రోత్సహించడమే లక్ష్యం

టీ వర్క్స్‌లో 'టై విమెన్ రోడ్ షో–2025'లో వక్తలు


టై విమెన్ రోడ్‌షో–2025లో టై విమెన్ చాంప్స్‌గా ఎంపికైనవారికి జ్ఞాపికలను అందించిన దృశ్యం

రాయదుర్గం: మహిళా స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు టై విమెన్ రోడ్ షో–2025 కార్యక్రమాన్ని నాలెడ్జి సిటీలోని టీవర్క్స్ ప్రాంగణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా మహిళా వ్యాపార వేత్తలకు ప్రోత్సాహం అందించడం, అవకాశాల ద్వారా వారి వ్యాపారాల అభివృద్ధిని వేగవంతం చేయడం దీని ఉద్దేశమని టై హైదరాబాద్ సంస్థ నిర్వాహకులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టై గ్లోబల్ చైర్మన్ మురళి బుక్కపట్నం మాట్లాడుతూ మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించాలన్నారు. టై హైదరాబాద్ అధ్యక్షుడు రాజేష్ పగడాల మాట్లాడుతూ టై విమెన్ రోడ్ షో సమానత, ప్రోత్సాహం కలిగిన వ్యాపార వాతావరణాన్ని నిర్మించడంలో కీలకమైన అడుగు అని పేర్కొన్నారు. టై హైదరాబాద్ ఉపాధ్యక్షుడు మురళి కాకర్ల మాట్లాడుతూ తమ సంస్థ స్టార్టప్‌లకు కేంద్రంగా ఎదుగుతున్నట్లు చెప్పారు. టై విమెన్ ప్రోగ్రామ్ చైర్ నీతి కామహేశ్వరి మాట్లాడుతూ తెలంగాణలోని 2వ, 3వ స్థాయి నగరాల మహిళా వ్యవస్థాపకులను చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ సందర్భంగా 'షీ బిల్డ్స్, షీ లీడ్స్'అనే అంశంపై ప్యానల్ చర్చా కార్యక్రమం కొనసాగింది. ప్రముఖ మహిళా వ్యాపారవేత్తలు అకింత్ షా, ఆర్తి జోషి, జ్యోష్ణ చెరువు, కవితామంతా, సుందరి, పి.సుపతి పాల్గొన్నారు. అనంతరం 'టై విమెన్ చాంప్స్'గా ఎంపికైన వారిని సన్మానించి జ్ఞాపికను అందించారు. చాంప్స్‌గా ఎంపికైన వారిలో రచనా గుజ్రాల్, అల్కా మెహతా, డాక్టర్ రమ్య బోజెడ్ల, డాక్టర్ నీతికా, సృజనావిస్తకుల జ్ఞాపికలను అందించి గౌరవించారు. అనంతరం వ్యాపార రంగంలో వారి అనుభవాలను వివరించారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని రేపు మహాధర్నా


పోస్టర్ ఆవిష్కరిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు, కార్యకర్తలు

ముషీరాబాద్: ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీలపై పోలీసులు జరుపుతున్న మారణహోమాన్ని ఆపాలని, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 17న ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.గోవర్ధన్, ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకులు బి.ప్రదీప్, పీవోడబ్ల్యూ జాతీయ నాయకులు వి.సంధ్య తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం మధ్య భారతంలోని సహజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికి ఈ మారణహోమం సృష్టిస్తోందని విమర్శించారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఇప్పటికే 600 మందికిపైగా ఆదివాసీలను, మావోయిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలను పొట్టన పెట్టుకున్నారని అన్నారు. మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు సిద్ధమని ఐదు దఫాలుగా ప్రకటించిన కూడా కేంద్ర ప్రభుత్వం విడతల వారీగా ఎన్‌కౌంటర్లకు పాల్పడుతూ నరమేధాన్ని సాగిస్తోందని విమర్శించారు. ఈ చర్యలకు నిరసనగా ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద 17వ తేదీన శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధర్నాలో జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ కోదండరాంలతోపాటు బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, హక్కుల సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అరుణ, అనురాధ, శివబాబు, పరశురామ్, పి.మహేష్, కె.శ్రీనివాస్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

పట్నం మహేందర్‌రెడ్డి



చింతల్: స్వదేశీ సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి దేశ పటిష్టతకు కృషి చేసిన మహోన్నతుడు దివంగత ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ అని శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని ముఖ్య అతిథిగా హాజరై ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో టీఆర్‌ఎల్‌డీ కీలక పాత్ర

కేంద్రమంత్రి జయంత్ చౌదరి



బన్సీలాల్‌పేట్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్(టీఆర్‌ఎల్‌డీ) కీలక భూమిక పోషించిదని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జయంత్ చౌదరి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ కవాడిగూడలోని అన్నం కాంప్లెక్స్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జయంత్ చౌదరి మాట్లాడుతూ అప్పటి ఉద్యమంలో తాను కూడా నేరుగా పాల్గొన్నానని గుర్తు చేసుకున్నారు. తెలంగాణలో రానున్న రోజుల్లో టీఆర్‌ఎల్‌డీ పార్టీని బలోపేతం చేసేందుకు రాష్ట్ర నాయకత్వం కృషి చేయాలన్నారు. ఇందుకోసం రైతులు, యువకులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమాలు చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్ అధ్యక్షుడు కపిలవాయి దిలీప్‌కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జాతీయ మహిళా అధ్యక్షురాలు ఇందిర, పార్టీ నాయకులు సిద్ధార్థ్, గిరి, విశాల్, మల్లేశ్, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ స్కూళ్లకు నిధులు విడుదల చేయాలి

బెస్ట్ అవేలబుల్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్


మాట్లాడుతున్న వీరన్న

పంజగుట్ట: బెస్ట్ అవేలబుల్ స్కూల్స్‌కు గత రెండేళ్ల నుంచి రావల్సిన బకాయిలను వెంటనే చెల్లించి 26 వేల మంది విద్యార్థులకు, పాఠశాల నిర్వాహకులకు న్యాయం చేయాలని బెస్ట్ అవేలబుల్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు కేశ వీరన్న, ప్రధానకార్యదర్శి యాదగిరి శేఖర్ రావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో 180 బడ్జెట్ అవేలబుల్ స్కూల్స్ ఉన్నాయని, ఇందులో ఎస్సీ విద్యార్థులు 19 వేల మంది, ఎస్టీ విద్యార్థులు 7 వేల మంది మొత్తం 26 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు ఒక్కో డే స్కాలర్ విద్యార్థికి ప్రతీ ఏడాది రూ.28 వేలు, ఐదు నుండి 10వ తరగతి వరకు ఒక్కో రెసిడెన్షియల్ విద్యార్థికి రూ.42 వేలను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ డబ్బుల్లోనే వారికి పుస్తకాలు, డ్రస్‌లు, రెసిడెన్షియల్ విద్యార్థులకు వసతి, భోజనం కల్పిస్తామని తెలిపారు. కానీ, గత రెండేళ్ల నుంచి వీటికి సంబంధించిన బకాయిలు ఇవ్వడంలేదని, పాఠశాలల నిర్వహణ కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2025 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 95 శాతంపైగా ఫలితాలు సాధించామన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క, సాంఘిక సంక్షేమ మంత్రి లక్ష్మణ్ స్పందించి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మారం లింగారెడ్డి, జయసింహా గౌడ్, లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏవీఎస్ రాజు బయోగ్రఫీ ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు

మణికొండ: పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఎన్‌సీసీ సంస్థ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ ఏవీఎస్ రాజు బయోగ్రఫీ పుస్తకాన్ని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఆదివారం వట్టి నాగులపల్లిలోని అన్వయ కన్వెన్షన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ డాక్టర్ ఏవీఎస్ రాజు నిర్మాణ రంగంలో తనదైన ముద్ర వేశారన్నారు. అనేక సవాళ్లను ఎదుర్కొని తాను ఎంచుకున్న రంగంలో రాణించారని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన సేవలను గుర్తించి భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించిందని పేర్కొన్నారు. ఆయన లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు, గిన్నిస్‌బుక్ రికార్డు, డాక్టరేట్‌లు పొందటం గర్వకారణమన్నారు. ఆయన జీవిత చరిత్ర ఇలా పుస్తకం రూపంలో అందుబాటులోకి రావటం శుభ పరిణామమని అన్నారు. కేంద్ర విమానయాన శాఖ మాజీ మంత్రి పి.అశోక్ గజపతి రాజు, శాంతా బయోటెక్స్ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ కె.వరప్రసాద్‌రెడ్డిలతోపాటు రాజకీయ, వ్యాపార రంగ, బంధు, మిత్ర వర్గాలు పాల్గొన్నారు.

రౌడీషీటర్ ఆత్మహత్య


హత్వాల్ ఉమేష్ (ఫైల్)

జియాగూడ: జియాగూడలోని ఓ రౌడీషీటర్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుల్సుంపురా ఎస్.ఐ. భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.... కేశవస్వామినగర్‌లో ఉంటున్న హత్వాల్ ఉమేష్ (35)కు భార్య శ్వేత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతడు స్థానికంగా తరచూ గొడవలకు దిగుతుండటంతో 2011లో కుల్సుంపురా పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్‌గా నమోదయ్యాడు. అప్పటి నుంచి గొడవలు, గంజాయి విక్రయాలు, హత్యలకు పాల్పడేవాడు. తరచూ జైలుకు వెళ్లి వస్తుండేవాడు. అతనిపైన 17 కేసులు నమోదై ఉన్నాయి. కొంతకాలంగా భార్యతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం గొడవ జరగగా ఉమేష్ బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. శ్వేత తలుపు తట్టగా ఎంతకూ తీయకపోవడంతో స్థానికులు వచ్చి తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లారు. కొన ఊపిరితో ఉన్నట్లు గుర్తించి వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

పాఠశాల జ్ఞాపకాలు మరువలేనివి: నిరంజన్ రెడ్డి


శివశివాని డిగ్రీ కాలేజీని ప్రారంభిస్తున్న ఎంపీ నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

పంజగుట్ట: 'మా పాఠశాలలో మాతోపాటు చదువుకున్న విద్యార్థులం దేశ విదేశాల్లో ఎక్కడ కలుసుకున్నా, అప్పటి పాఠశాల తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటాం'అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు ఎస్.నిరంజన్‌రెడ్డి అన్నారు. తమ పాఠశాల డిగ్రీ కాలేజీ స్థాయికి అప్‌గ్రేడ్ కావడం, ఆ కాలేజీ ప్రారంభోత్సవానికి తనను ఆహ్వానించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆదివారం సోమాజిగూడ రాజ్‌భవన్ రోడ్డులో శివ శివానీ డిగ్రీ కాలేజీని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామిద్దరం శివ శివానీ పూర్వ విద్యార్థులమేనని, ఇక్కడ చదువుకున్న వారు ఎంతో ఉన్నతస్థానాల్లో ఉన్నారని పేర్కొన్నారు. కాలేజీ నిర్వాహకులు ఎస్.ఆరతి, ఎస్.పి.సంపతి, ప్రిన్సిపాల్ వి.సారికా రాజీలు మాట్లాడుతూ కాలేజీ ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా కొనసాగుతోందని, ఇన్ఫోసిస్ సంస్థతో ఒప్పందం ఉందని అన్నారు. కాలేజీలో సివిల్ సర్వీసెస్, ప్రభుత్వ ఉద్యోగాల నిమిత్తం శిక్షణ ఇస్తామని చెప్పారు.

బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

హస్తినాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని కేకే గార్డెన్‌లో జరిగిన కేంద్ర ప్రభుత్వ బీడీఎల్, మిధాని ఓబీసీ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించడానికి పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లు పెట్టాలన్నారు. అన్ని వైపుల నుంచి బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలనే సిఫార్సులు ఉన్నాయని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆర్.కృష్ణయ్య విమర్శించారు. కేంద్రంలోని అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీలతో చర్చిస్తున్నామని త్వరలోనే బీసీలకు మంచి రోజులు వస్తాయని కృష్ణయ్య అన్నారు. జనగణనలో కులగణన చేపడుతున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించడం ఒక చరిత్ర అని, ఇప్పుడు బీసీల శకం ప్రాంభమైందని అన్నారు. కార్యక్రమంలో బీసీ కమీషన్ చైర్మన్ జి.నిరంజన్, కాంగ్రెస్ నాయకులు వి.హనుమంతరావు, బీసీ నాయకులు పగిళ్ల సతీష్, పల్లగొర్ల మోదిరాందేవ్, రవియాదవ్, పృధ్వీగౌడ్ పాల్గొన్నారు.


రాష్ట్రం నుంచి ఏటా 10 వేల మంది డాక్టర్లు

డాక్టర్స్ అవార్డుల ప్రదానోత్సవంలో మాజీమంత్రి హరీశ్‌రావు

మాదాపూర్: తెలంగాణ నుంచి ఏటా 10 వేల మంది డాక్టర్లు బయటకు వస్తున్నారని మాజీమంత్రి హరీశ్‌రావు తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో ఆదివారం ఓ టీవీ చానల్ నిర్వహించిన డాక్టర్స్ అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. భారతదేశంలో డాక్టర్లను తయారు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని, కేసీఆర్ ప్రభుత్వం ముందుచూపుతో మెడికల్ కాలేజీల సంఖ్యను ఐదు నుంచి 35కు పెంచిందని తెలిపారు. కరోనా సమయంలో డాక్టర్ల గొప్పతనం బయటపడిందని అన్నారు. దేశ నలుమూలల నుంచి చాలామంది వైద్యం కోసం నగరానికి వస్తున్నారని, పలువురు కేంద్రమంత్రులు సైతం హైదరాబాద్‌కు వచ్చి చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ మెడికల్ హబ్‌గా మారిందన్నారు. డాక్టర్‌తోపాటు సపోర్టింగ్ స్టాఫ్ కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ముందుచూపుతో కాలేజీలను ప్రణాళికాబద్ధంగా ప్రారంభించామని చెప్పారు. భవిష్యత్‌లో వైద్యరంగంలో మన రాష్ట్రం ప్రముఖ పాత్ర పోషించాలని, ప్రపంచంలో అగ్రగామిగా నిలవాలని కోరారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన డాక్టర్లకు అవార్డులు అందజేశారు.

పరిసరాలను పచ్చగా ఉంచుకోవాలి

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


జెండా ఊపి 5కే రన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: మన పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చదనంగా ఉంచుకున్నప్పుడే మనమంతా ఆరోగ్యంగా ఉంటామని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, రాష్ట్ర మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి టి.కె.శ్రీదేవి అన్నారు. ఆదివారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో వంద రోజుల ప్రణాళికలలో భాగంగా మెలుహా ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద 5కే రన్‌ను వారు జెండా ఊపి ప్రారంభించారు. రోడ్ల పక్కన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలను పరిశుభ్రంగా, ఆహ్లాదంగా ఉంచేందుకు అధికారులు ఎంతో శ్రమిస్తున్నారన్నారు. వారికి ప్రజలు సైతం అండగా నిలిచినపుడే వారు అనుకునే లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల వారు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనను వారు ప్రారంభించారు. 5కే రన్‌లో పాల్గొన్న ఉత్సాహవంతులకు వారు ధ్రువ పత్రాలను అందజేశారు. మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కె.దశరథ యాదవ్, మాజీ చైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, పాపిరెడ్డి, గండయ్య, డి.లక్ష్మణ్, మున్సిపల్ డీఈ నరేష్, ఏఈ శ్రీనివాస్, టీపీఓ మణిహారిక, మేనేజర్ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో ఊసేలేని కొత్త కోర్సులు

- ఉత్తుత్తి ఎంఓయూలతోనే సరి
- ఇక పోటీ పరీక్షలకు పెద్దపీట


ఓయూ ఆర్ట్స్ కాలేజీ భవనం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలోనూతనత్వం కొరవడిందనే చర్చ, ఆధునికత దిశగా అడుగులు పడటంలేదనే విమర్శలు ఉన్నాయి.పదేళ్లుగా కొత్త కోర్సుల ఊసేలేదు. డిగ్రీ స్థాయిలో కొన్ని కొత్త కోర్సులను ప్రవేశ పెట్టినా, పీజీలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ తదితర సంప్రదాయ కోర్సులే కొనసాగుతున్నాయి. పేద విద్యర్థులకు అందబాటులో ఉండే పీజీ కోర్సుల్లో ప్రతి ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. అందులో అమ్మాయిలు అధికంగా నూటికి 75 శాతం మంది చేరుతున్నారు. కానీ, మారిన పరిస్థితులకు అనుకూలంగా ఉపాధినిచ్చే కొత్త కోర్సులను ప్రవేశపెట్టాలనే ఆలోచన, ఉన్న కోర్సులను ఆధునీకరించి మార్కెట్‌కు అనుకూలంగా సిలబస్‌ను తీర్చిదిద్దాలనే ఆలోచన అధికారుల్లో లేదనే విమర్శలు వినవస్తున్నాయి. తాజాగా వీసీ ప్రొ.కుమార్ సిద్దిపేటలో పీజీ సెంటర్‌ను సందర్శించి డాటా సైన్స్ కోర్సును ప్రారంభిస్తామని ప్రకటించినా ఇటీవల విడుదలైన సీపీగేట్–2025 నోటిఫికేషన్‌లో ప్రకటించలేదు. సంప్రదాయ పీజీ కోర్సులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన పరిశోధనాత్మక విద్యాబోధన సాగడం లేదు. ఓయూలో చేరే తెలుగు మీడియం గ్రామీణ విద్యార్థులకు ఇంగ్లిష్‌లో మాట్లాడటం, రాయడం సవాల్‌గా మారింది. పీజీలు, పీహెచ్‌డీ డాక్టరేట్ పూర్తి చేసినా ఇంగ్లిష్ అంతంత మాత్రమే. దీంతో ఓయూలో వివిధ కోర్సుల్లో ప్రవేశం పొంది ఉద్యోగ పోటీ పరీక్షల కోసం విద్యార్థులు నిత్యం చదవుతున్నారు.

పోటీ పరీక్షల శిక్షణకు పెద్దపీట

పీజీలు, పీహెచ్‌డీలు పూర్తి చేసినా ఉద్యోగాలు రావడం లేదని గ్రహించిన విద్యార్థులు డిగ్రీ అర్హతతో వివిధ ఉద్యోగాల పోటీ పరీక్షలకు చదవుతున్నారు. దీనిని గ్రహించిన ఓయూ అధికారులు నాలుగేళ్ల క్రితం సివిల్ సర్వీస్ అకాడమి కోచింగ్ పేరుతో ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం అకడమిక్ కోర్సుల తరగతులు మధ్యాహ్నం తర్వాత ఉద్యోగ పోటీ పరీక్షల శిక్షణ తరగతులకు ఏర్పాట్లు చేశారు.

విదేశీ వర్సిటీలతో ఉత్తుత్తి ఎంఓయూలు

ఓయూ అధికారులు కొంత కాలంగా అనేక విదేశీ యూనివర్సిటీలతో వివిధ అంశాలపై ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. ఇక్కడి అధ్యాపకులు, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు విదేశీ వర్సిటీల్లో చదవడం, పరిశోధనలు చేయడం, వివిధ అంశాల్లో పరస్పరం సహకరించుకోవడం, విదేశాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు ఓయూలో పరిశోధనలు చేయడం తదితర అనేక అంశాలపై వీసీలు, ఇతర అధికారులు ఒప్పందాలు కుదుర్చుకొని సంతకాలతో ఒప్పంద పత్రాలను పరస్పరం మార్పిడి చేసుకున్నారు. కానీ, అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. బోధన, పరిశోధనాల అంశాలను ఓయూ అధికారులు సీరియస్‌గా తీసుకోవడం లేదు. అందుకు అనేక సమస్యలు ఉన్నా ఒక్క సమస్యను కూడా పరిష్కరించే దిశగా ఓయూ వీసీలు నిర్ణయం తీసుకోలేదు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 16 జూన్ 2025

వర్షాలు మబ్బుల్లోంచి కురిసే మధుర గీతాల్లా వినిపిస్తున్న ఈ మాన్సూన్ సీజన్‌కు నగర యువత నుంచి ప్రత్యేక స్వాగతం లభిస్తోంది. సాధారణంగా జూన్ రెండో వారం నుంచి మొదలయ్యే ఈ సీజన్, ఈసారి కాస్త ముందస్తుగానే ప్రారంభమైంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈసారి తక్కువ ఉష్ణోగ్రతలతో, ఎక్కువ మోస్తరు వర్షపాతం నమోదవుతుందనే ఊహతో యువతలో ప్రకృతిని ఆస్వాదించే ఆసక్తి భారీగానే పెరిగింది. నగరవాసులు ముఖ్యంగా యువత ఈ చల్లని మబ్బులు, మత్తెక్కించే వర్షపు వాసన, హత్తుకునే పచ్చటి ప్రకృతి దృశ్యాలు అన్నింటినీ ఆస్వాదించేందుకు గ్రూప్ రైడ్స్, ఔటింగ్స్, నేచర్ ట్రిప్‌లతో సందడి చేస్తున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో

ఈ సీజన్‌లో ముందస్తుగానే పలకరించిన వర్షాలు

ట్యాంక్‌బండ్ మొదలు అనంతగిరి హిల్స్ వరకూ

100 కి.మీ లోపు లొకేషన్లకు గ్రూపు ప్రయాణాలు

ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్న వీకెండ్ ప్లాన్స్



మాన్సూన్‌లో.. మోటార్ రైడ్స్..

వర్షాకాలం రైడ్స్‌తో నగర యువత సందడి

సోషల్ మీడియా యుగంలో ప్రతి చినుకూ శీర్షికే..!! రీల్స్, స్టోరీస్, వ్లాగ్స్..ఇవన్నీ మాన్సూన్ థీమ్‌తో నిండిపోతున్నాయి. వర్షపు నీటిలో కళ్లకు తక్కువ కనిపించే పొగమంచు, డ్రోన్లతో తీసిన పచ్చటి దృశ్యాలు వీరిని ఆహ్లాదపరిచేలా ఉంటున్నాయి. మాన్సూన్ కేవలం వర్షపు చినుకుల సంగతి మాత్రమే కాదు.. ఇది ఒక మూడ్, ఒక ఉల్లాసం, రిలాక్సేషన్. పని ఒత్తిడి నుంచి కొన్ని గంటలు బయటపడేందుకు ఇదో సువర్ణావకాశం. హైదరాబాద్ యువత దీన్ని అందుకుంటోంది. ప్రకృతిని హత్తుకునేలా, జీవితాన్ని మరొక కోణంలో చూసేలా మాన్సూన్ సీజన్ మనల్ని ప్రేరేపిస్తోంది. హైదరాబాద్ శివార్లలోని అనంతగిరి హిల్స్, సంఘీ టెంపుల్ పరిసర ప్రాంతాలు, శామీర్‌పేట్ లేక్ వంటి ప్రాంతాలు డ్రైవ్ డెస్టినేషన్లుగా మారాయి. వారం చివరి రోజుల్లో ఈ ప్రాంతాలకు వెళ్లేవారి సంఖ్య రెండింతలు పెరిగింది. శివార్లలో ఇప్పుడిప్పుడే మొలకలొస్తున్న పొలాలు, మబ్బుల్లో నలుగుచేసే కిరణాలు, మోస్తరు జల్లుల్లో సాగే డ్రైవ్‌లు.. ఇవన్నీ యువత హృదయాలను తాకుతున్నాయి. వీకెండ్స్‌లో అయితే ఇంకొంచెం దూరమైనప్పటికీ నాగార్జున సాగర్, లక్నవరం వంటి ప్రాంతాలకు సైతం షార్ట్ ట్రిప్స్ ప్లాన్ చేస్తున్నారు.





నగరంలో మాన్సూన్ మ్యాజిక్..

నగరం వదిలి వెళ్లలేని వారు కూడా తక్కువ సమయంలో ట్యాంక్ బండ్, హుస్సేన్ సాగర్, కేబీఆర్ పార్క్, దుమ్ముగూడ చెరువు వంటి ప్రదేశాలకు వెళుతున్నారు. ప్రత్యేకించి ప్రకృతి ప్రేమికులు, యువత, విద్యార్థులు, ఫొటోగ్రాఫర్స్ ఈ వర్షపు సీజన్‌ను కలర్‌ఫుల్‌గా మార్చేస్తున్నారు. ఇక నెక్లెస్ రోడ్డుపై సైక్లింగ్, బంజారాహిల్స్ కెఫేలో రేయిన్ వ్యూ టేబుల్స్, టెర్రస్ కాఫీ డేట్‌లు, రోడ్డు పక్కన స్వీట్‌కార్న్ బండ్లు, షావర్మ స్టాల్స్.. ఇవన్నీ మాన్సూన్ ఎక్స్‌పీరియన్స్. ఈ వర్షాల సీజన్‌కి సోషల్ మీడియా జనరేషన్ తమదైన హ్యాష్‌ట్యాగ్‌లు తయారుచేస్తోంది. హ్యాష్ రేయిన్‌రైడ్, హ్యాష్ మాన్సూన్‌మూడ్, హ్యాష్ చినుకులు క్రానికల్స్ లాంటి క్యాప్షన్లతో యువత సోషల్ మీడియాను మాన్సూన్ డైరీగా మార్చేస్తోంది. మాన్సూన్ ఏక కాలంలో రిలీఫ్, రొమాన్స్, రిఫ్రెష్‌మెంట్ తీసుకురావడమే కాదు, జీవితం కొంత నెమ్మదిగా, ప్రశాంతంగా సాగేలా చేస్తుంది.

వనాలవైపు పయనం..

సిటీ రైడింగ్‌కి అలసిన వారు మృగవాని పార్కులకు, అనుమతి ఉన్న శివార్ల అడవులకు, ఫారెస్ట్ ట్రెయిల్స్‌కు వెళ్లే ట్రెండ్ బాగా పెరిగింది. నగరం నుంచి మంచిర్యాల కవ్వాల సర్వాయ్ ఫారెస్ట్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, భాన్సువాడ గ్రీన్ కవర్ వంటి ప్రాంతాలు ఈ లిస్ట్‌లో చేరిపోతున్నాయి. ఇవన్నీ పచ్చదనంతో కళకళలాడుతున్న ప్రదేశాలుగా పేరుగాంచుతున్నాయి. ఇక్కడ వన్యప్రాణులను పరిశీలిస్తూ, వాన జల్లుల్లో నడకలు వేసేలా యూత్ ట్రెక్కింగ్ ప్లాన్ చేసుకుంటున్నారు.





ఇండియన్ ఐకాన్ అవార్డ్స్-2025 ప్రదానం

లక్డీకాపూల్ : సమాజం కోసం తమ వంతు కృషి చేస్తున్న వారిని గుర్తించి గౌరవించడం ఎంతో స్ఫూర్తిదాయకమని దక్షిణాది నటి కావ్యా థాపర్ అన్నారు. సోమాజిగూడలోని ది పార్క్ హోటల్‌లో ప్రైడ్ ఇండియా అవార్డ్స్ ఆధ్వర్యంలో ఇండియన్ ఐకాన్ అవార్డ్స్- 2025 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ ఇండియన్ ఐకాన్ అవార్డ్స్ ప్రదానోత్సవానికి నటి కావ్యా థాపర్, నారీ పురస్కార్ గ్రహీత కె.రాధాదేవి, జియోలజిస్ట్, సేక్రెడ్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ వాసుదేవ్ వీఎస్ విజేతలకు అవార్డులను ప్రదానం చేశారు. సమాజంలోని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వ్యక్తులు, సంస్థలను ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, సంస్కృతి, వ్యాపారం వంటి విభాగాల్లో ఉత్తమ ప్రతిభను ప్రదర్శించిన వారిని గౌరవించి ఈ అవార్డులను అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ప్రైడ్ ఇండియా అవార్డ్స్ వ్యవస్థాపకులు వినయ్‌కుమార్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



అన్ బీటబుల్ సాయిదీప్..

- బైక్ రేసింగ్‌లో రఫ్ఫాడిస్తున్న తెలుగు తేజం
- సీఆర్ఏ రేసింగ్ ఛాంపియన్‌షిప్‌లో డబుల్ ఛాంపియన్
- 400 జీటీ, 400 సూపర్ బైక్‌లో అగ్రస్థానం

సాక్షి, సిటీబ్యూరో : హైదరాబాద్ వీధుల్లో బైక్‌తో రైడ్స్ చేసిన తెలుగు తేజం సాయి దీప్.. ప్రస్తుతం నార్త్ అమెరికాలో ఛాంపియన్ షిప్ రేసింగ్ అసోసియేషన్ నిర్వహిస్తున్న 2025 సీఆర్ఏ రేసింగ్ ఛాంపియన్‌షిప్‌లో దూసుకుపోతున్నాడు. ఎమ్ఎస్‌డీ రేసింగ్–నార్త్ కాలిఫోర్నియా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ యువ రేసర్ 400జీటీ, 400 సూపర్‌బైక్ రెండు విభాగాల్లోనూ అగ్రస్థానంలో నిలిచాడు. ఇప్పటికే ముగిసిన మూడు రౌండ్లలో అద్భుత నైపుణ్యం, అన్ బీటబుల్ రేస్ క్రాఫ్ట్‌ను ప్రదర్శించి మూడు రేసుల కంటే ముందే తన ఆధిక్యతను చాటుకున్నాడు. ఈ సీజన్ నిజంగా ఒక కలలాంటిది, పోటీ ఉత్కంఠంగా సాగింది. అయినా తమ జట్టు కష్టపడుతోందని తెలిపారు. ఈ దశలో రెండు ఛాంపియన్‌షిప్‌లను లీడ్ చేయడం గౌరవంగా భావిస్తున్నానని సాయిదీప్ పేర్కొన్నారు. ప్రస్తుతం సీఆర్ఏ రేసింగ్ చివరి దశకు చేరుకోగా.. ఈ దశలో డబుల్ ఆధిక్యతను నిలుపుకోవాలని పట్టుదలతో ఉన్నారు. ఈ పోటీలో చివరి రౌండ్.. జూన్ 27 నుంచి 29 వరకూ బటన్‌విల్లో రేస్‌వే–కాలిఫోర్నియాలో జరగనుంది.





సమాజ హితం కోసం..

సమాజం మనకు ఏమి ఇచ్చింది అని ఆలోచించేవారే ఎక్కువ మంది ఉంటారు. కానీ సమాజానికి నేను ఏమిచ్చాను అని ఆలోచించే వారు కొందరే ఉంటారు. ఆ కొందరిలో ఒక్కడే యోగేష్ రాజ్ శ్రీవాస్తవ. పదో, ఇరవైయ్యో కాదు.. ఏకంగా 136 సార్లు రక్తదానం చేసి పరోక్షంగా అనేక మంది ప్రాణాలను కాపాడారు. 62 సంవత్సరాల వయసులో కూడా ప్రతి ఆరు నెలలకూ ఓసారి ఇప్పటికీ రక్తదానం చేస్తూనే ఉన్నారు. కేవలం రక్తదానమే కాదు తాను మృతి చెందిన అనంతరం తన శరీరంలో పనికొచ్చే అన్ని అవయవాలు ఇండియన్ ఆర్మీకి దానం చేశారు.

- పంజగుట్ట



- 136 సార్లు రక్తదానం చేసిన యోగేష్ రాజ్
- ఇండియన్ ఆర్మీకి అవయవాలు దానం
- 62 ఏళ్ల వయసులో నలుగురికీ స్ఫూర్తిగా

నగరంలోని డీడీ కాలనీలో నివాసం ఉండే యోగేష్ రాజ్ శ్రీవాస్తవ 1983లో వివేకవర్ధిని కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న సమయంలో అక్టోబర్ 2, మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రీ జయంతి సందర్భంగా ఎన్ఎస్ఎస్ వారు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో మొదటి సారి రక్తదానం చేశారు. ఇక అప్పటి నుండి ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తూనే ఉన్నారు. 60 సంవత్సరాలు దాటిన తరువాత ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇప్పటికీ తన రక్తాన్ని దానం చేస్తున్నారు. రెడ్ క్రాస్ సొసైటీకి, నగరంలో ఏ ఆస్పత్రి నుండి ఫోన్ వచ్చినా వెళ్లి రక్తదానం చేస్తుంటాడు. యోగేష్‌ది ఓ నెగెటివ్ కావడంతో రక్తదానం చేసిన ప్రతిసారీ మీరు ఒకరి ప్రాణాలు కాపాడారు అని వైద్యులు అంటుంటే అందులో కలిగే ఆనందం ఎక్కడా దొరకదని ఆయన అంటున్నారు. ఈయన రక్తదానం చెయ్యడమే కాకుండా రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ప్రజల్లో చైతన్యం నిపుతుంటారు.



ప్రముఖుల నుంచి అభినందనలు..

ఇన్నిసార్లు రక్తదానం చేసిన యోగేష్‌ను ఎంతో మంది రాజకీయ ప్రముఖులు, సినీ ప్రముఖులు అభినందించారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి గవర్నర్ చేతులమీదుగా అవార్డులు తీసుకున్నారు. ఒక వేదికపై ప్రముఖ హీరో రాంచరణ్ మేము సినిమాల్లో హీరోలమైతే యోగేష్ రాజ్ శ్రీవాస్తవ్ నిజ జీవితంలో హీరో అని అందరిముందూ పొగడడం ఎంతో ఆనందం కలిగించిందని ఆయన తెలిపారు.

పలు అవార్డులు, రికార్డులు..

యోగేష్‌కు జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, 16వ ఫిలిప్స్ గాడ్‌ఫ్రే బ్రేవరీ అవార్డు, క్యాలిఫోర్నియా యూనివర్సిటీ వారు ఫిలాసఫీ ఆఫ్ హ్యూమానిటీ డాక్టరేట్, 17 బంగారు, వెండి, 14 మెరిట్ సర్టిఫికెట్స్, రాజీవ్‌గాంధీ సమైక్యతా అవార్డు, లయన్ ఇంటర్నేషనల్ అవార్డు, స్వేచ్ఛా భారత్ పురస్కార్‌తో పాటు ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారు.

అలరించిన లైవ్ కిక్ బాక్సింగ్ పోటీలు



మూసాపేట: కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ మాల్‌లో లైవ్ కిక్ బాక్సింగ్ పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ కిక్ బాక్సింగ్ పోటీల్లో 8 మ్యాచ్‌లలో 16 మంది బాక్సర్లు తలపడ్డారు. వీరిలో ఇద్దరు మహిళలు పోటీలో ఉన్నారు. వెల్టర్ వెయిట్ విభాగంలో వహీద్ ఛాంపియన్‌గా నిలిచారు. ఈ సందర్భంగా మాల్ రీజనల్ డైరెక్టర్ అబ్దుల్ ఖాదీర్ మాట్లాడుతూ నగరంలో క్రీడాకారులను, క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వీటిని నిర్వహించామని, సందర్శకుల నుంచి విశేష ఆదరణ లభించిందని అన్నారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ మహ్మద్ షరీఫ్, మాల్ మేనేజర్ ఎడిల్ అరసన్ పాల్గొన్నారు.

స్వరాల జల్లు..

చిత్రామృతం..

హిట్ సాంగ్స్‌తో అలరించిన కేఎస్ చిత్ర కాన్సర్ట్



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ గాయని కేఎస్ చిత్ర స్వరాలతో నగరం పులకరించింది. అక్షయ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఎస్ చాంట్, శ్రేయాస్ మీడియా సమర్పణలో నిర్వహించిన 'చిత్రామృతం-2.0' స్వరాలతో హోరెత్తింది. ప్రమాదం కారణంతో తన కుడి చెయ్యి బ్యాండేజ్‌తో ఉన్నప్పటికీ మూడు గంటల పాటు అద్భుతంగా పాడటం.. ఆమెకు సంగీతంపై ఉన్న అపారమైన ప్రేమను చాటిచెప్పింది. ఈ కాన్సర్ట్‌లో భాగంగా 'నువ్వు వస్తానంటే నేను వద్దంటానా, చిలకమ్మా చిటికేయంగ, జగదానంద తారక, ఏ శ్వాసలో' వంటి తెలుగు పాటలతో అలరించారు. వీటితో పాటు పలు దేశభక్తి గీతాలు పాడి భారత జవాన్లకు అంకితం చేశారు. సంగీత దర్శకులు మణిశర్మ, గాయని సునిత, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ వంటి సినీ ప్రముఖులు సందడి చేశారు.

'అశోక' ఆధ్వర్యంలో

ఐడీఎల్ రన్

డెకాథ్లాన్ భాగస్వామ్యంతో 5కె, 10కె పరుగు



కూకట్‌పల్లి: అశోక డెవలప్పర్స్, బిల్డర్స్ లిమిటెడ్ ప్రతిష్ఠాత్మక వెంచర్, అశోక వన్ మాల్‌లో ఆదివారం తమ క్రీడా భాగస్వామి డెకాథ్లాన్‌తో కలిసి ఐడీఎల్ 5కె, 10కె రన్ మాల్ వద్ద నిర్వహించింది. రన్నర్లు సమీపంలోని ఐడీఎల్ చెరువు కట్టపై పరుగులు తీసి తిరిగి మాల్‌కు చేరుకున్నారు. ఈ రన్‌లో అనుభవజ్ఞులైన అథ్లెట్లు, కార్పొరేట్ జట్లు, ఫిట్‌నెస్ ప్రేమికులు పాల్గొన్నారు. ఈ రన్‌లో మొదటి స్థానంలో నిలిచిన మొహమ్మద్ షరీఫ్, అంజలి డెకాథ్లాన్ షూస్ అందుకున్నారు. మనోజ్, సౌజన్య 2వ స్థానం సాధించినందుకు డెకాథ్లాన్ టీ షర్టులను అందుకున్నారు. అశోక డెవలప్పర్స్ అండ్ బిల్డర్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.జైదీప్ రెడ్డి మాట్లాడుతూ ఫిట్‌నెస్ కోసం అనేక మంది కలిసి రావడం స్ఫూర్తిదాయకమన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు మద్దతివ్వడానికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు.

ఎండ ప్రచండం!



భారతావనిలో 'ఉష్ణ' తాండవం	2030 నాటికి రెట్టింపు వడగాడ్పు రోజులు
దేశమంతటా వడగాడ్పులు, ఉక్కపోత	• ఈ జాబితాలో హైదరాబాద్, ఢిల్లీ వంటి నగరాలు • కోస్తా జిల్లాలపైనా తీవ్ర వేడిమి ప్రభావం • దేశ ఆర్థిక వ్యవస్థకు అపార నష్టం • ఐపీఈ గ్లోబల్, ఎస్రి ఇండియా నివేదిక

- సాక్షి, స్పెషల్ డెస్క్

జూన్ 14 వరకు తీవ్రమైన వడగాడ్పులు.. వాయవ్య భారతానికి వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరిక. పంజాబ్, హరియాణాలకు రెడ్ అలర్ట్. వచ్చే 48 గంటల్లో భానుడి ఉగ్రరూపం అంటూ జూన్ 12న ఐఎండీ మరో హెచ్చరిక. వేసవి వెళ్లిపోయింది. ఉష్ణోగ్రత ఉండిపోయింది! దేశంలోని అన్ని ప్రాంతాలను వడగాడ్పులు చుట్టు ముట్టాయి. ఇది ప్రస్తుతం.

2030 నాటికి ఢిల్లీ, హైదరాబాద్, ముంబై, చెన్నై, వంటి నగరాల్లో వడగాడ్పులు వీచే రోజుల సంఖ్య ఇప్పటితో పోలిస్తే రెట్టింపు కానుందట. టైర్ -1, 2 సిటీల్లో 72 శాతం వాటికి తీవ్ర వేడిమి, భారీ వర్షాల ముప్పు పొంచి ఉందట. ఐపీఈ గ్లోబల్ - ఎస్రి ఇండియా సంయుక్త అధ్యయనం ఇలాంటి ఆసక్తికర విషయాలు వెల్లడించింది.

భానుడి ప్రతాపానికి పంజాబ్, హరియాణా, రాజస్తాన్ తల్లడిల్లిపోతున్నాయి. ఢిల్లీలో రెడ్ అలెర్ట్. స్కూళ్లు బంద్. ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఏడాది ఏప్రిల్ మధ్య నుండి జూన్ 10 వరకు దాదాపు 700 వడదెబ్బ కేసులు నమోదయ్యాయి. ప్రపంచ చరిత్రలోనే 'హాటెస్ట్ ఇయర్'గా 2024 నమోదైంది. మళ్లీ ఇప్పుడు ఆ స్థాయిలో భారత్‌లో సెగలు రేగుతున్నాయి.

భవిష్యత్తుల్లో వేసవి కాలం.. మరిన్ని రోజులు ఉండనుందట. వడగాడ్పుల తీవ్రత మరింత పెరగనుందట. ఒకపక్క భారీ వర్షాలు.. మరోపక్క పిడుగుల వర్షం కురవనుంది. మానవాభివృద్ధి, సుపరిపాలన వంటి అంశాల్లో పనిచేసే ఐపీఈ గ్లోబల్; భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్)పై పనిచేసే ఎస్రి ఇండియా సంయుక్తంగా దేశంలో తీవ్ర వేడి, అత్యంత వర్షపాతం అంశాలపై అధ్యయనం చేశాయి. జిల్లా స్థాయిలో సమస్య తీవ్రతను మ్యాపింగ్ చేశాయి. పట్టణాల్లో మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, ప్రజారోగ్య వ్యవస్థలను పర్యావరణ ఉత్పాతాలను తట్టుకునేలా తీర్చిదిద్దాల్సిన అవసరాన్ని ఈ అధ్యయనం నొక్కి చెప్పింది.

పదింట 8 జిల్లాల్లో...

1993 నుంచి చూస్తే.. వేసవిలో తీవ్రమైన వడగాడ్పులు ఉండే రోజులు 15 రెట్లు పెరిగాయి. కోస్తా జిల్లాల్లో తీవ్రమైన వేడి, భారీ వర్షాలు.. ఇలా విచిత్రమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. 2040 నాటికి.. ప్రతి 10 కోస్తా జిల్లాల్లోనూ 8 జిల్లాల్లో వేసవి ముగిసినా తీవ్ర వేడి, ఉక్కపోత వంటివి వర్షాకాలంలో కూడా నమోదైనా ఆశ్చర్యపోనవసరం లేదు. ఈ సమస్యలకు పరిష్కారంగా.. రియల్‌టైమ్‌లో వాతావరణాన్ని అంచనా వేసేందుకు ఒక క్లైమేట్ రిస్క్ అబ్జర్వేటరీ (సీఆర్ఓ) ఏర్పాటును ఈ అధ్యయనం సూచించింది.

జీడీపీలో 4.5 శాతం తగ్గుదల

ఎండ దెబ్బకు ఆర్థిక నష్టం కూడా పెరిగే ముప్పు పొంచి ఉంది. 2030 నాటికి భారతదేశం అంచనా వేసుకున్న 8 కోట్ల ప్రపంచ ఉద్యోగాలలో 3 కోట్ల 40 లక్షల ఉద్యోగాలు తగ్గిపోయే ప్రమాదం ఏర్పడింది. తీవ్రమైన వేడి, ఉక్కపోత కారణంగా పని గంటల్ని కోల్పోయే పరిస్థితి ఉండటంతో ఈ దశాబ్దంలో స్థూల జాతీయోత్పత్తి (జి.డి.పి.)లో 4.5 శాతం వరకు తగ్గుదల కనిపించవచ్చని రిజర్వు బ్యాంకు హెచ్చరించింది.

2010 నుంచి 2025 వరకు వడగాడ్పుల రోజులు

ఇండియాలో వడగాడ్పులు వీచే రోజుల సంఖ్య పెరుగుతోంది! జమ్మూకశ్మీర్ వంటి చల్లగా ఉండే ప్రాంతాలు సైతం ఈ ఏడాది మేలో వడగాడ్పులతో ఉడుకెత్తిపోయాయి.

సంవత్సరం	రోజులు
2014	89
2015	161
2016	170
2017	188
2018	96
2019	178
2020	40
2021	52
2022	455
2023	217
2024	536
2025	134 (జూన్ 12 వరకు)

(దేశంలో వివిధ ప్రాంతాలలోని వడగాడ్పు రోజులను విడివిడిగా తెచ్చి కలపటం వల్ల కొన్ని సంవత్సరాలలో 365 కంటే ఎక్కువగా నమోదయ్యాయి)

(ఆధారం : ఐ.ఎం.డి., వార్తా నివేదికలు)

వడగాడ్పు మరణాలు

2014-2022 మధ్య వేలాది మంది ఎండ దెబ్బకు మరణించారు. ఒక్క 2015లోనే అత్యధికంగా 1,908 మంది మరణించారు.

సంవత్సరం	మరణాలు
2014	1,248
2015	1,908
2016	1,338
2017	1,127
2018	890
2019	1,274
2020	530
2021	374
2022	730

(ఆధారం : ఎన్.సి.ఆర్.బి.)

కోస్తా ప్రాంతాల్లోనే ఎక్కువ

భారతదేశం అంతటా వడగాడ్పులు వీచే రోజులు 2030, 2040 నాటికి గణనీయంగా పెరుగుతాయని అంచనా. ప్రాంతాల వారీగా వడగాడ్పు రోజుల సంఖ్యలో పెరుగుదల అంచనాలు..

	2030	2040
కొండలు	75	77
మైదానాలు	60	70
తీరప్రాంతాలు	80	85

(ఆధారం: ఐ.పి.ఇ.గ్లోబల్, ఎస్రి ఇండియా)

తీవ్రం.. సాధారణం!

తీవ్రమైన వాతావరణం అన్నది ఇప్పుడు చాలా సాధారణమైన విషయమైపోయింది. దీన్ని కనిపెట్టి, మార్చుకోవాలంటే మనకు భౌగోళిక ఉపకరణాలు చాలా అవసరం.

- అజేంద్రకుమార్, ఎం.డి., ఎస్రి

వాతావరణ అస్థిరతలు పసిగట్టాలి

వాతావరణం, అభివృద్ధి అనేవి పరస్పర అవినాభావ సంబంధం ఉన్నవి. భారత్ సహా గ్లోబల్ సౌత్‌గా పిలిచే దేశాలన్నింటి ముందూ ఇప్పుడు ఒక సమస్య ఉంది. అదేంటంటే.. వాతావరణ అస్థిరతలను పసిగట్టి, అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతూనే ప్రజల జీవన ప్రమాణాలనూ పెంచాలి.

- అశ్వజిత్ సింగ్, వ్యవస్థాపకుడు, ఎం.డి., ఐపీఈ గ్లోబల్

నేడు ఏసీబీ ముందుకు మాజీ మంత్రి కేటీఆర్

- ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో ప్రశ్నించనున్న అధికారులు


సాక్షి, హైదరాబాద్: ఫార్ములా ఈ-కార్ రేస్ కేసు దర్యాప్తులో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ నేడు అవినీతి నిరోధక శాఖ అధికారుల ఎదుట విచారణకు హాజరుకానున్నారు. సోమవారం విచారణకు రావాల్సిందిగా ఏసీబీ ఇప్పటికే ఆయనకు నోటీసులు ఇచ్చింది. ఈ మేరకు ఉదయం 10 గంటలకు బంజారాహిల్స్‌లోని ఏసీబీ కేంద్ర కార్యాలయానికి ఆయన వెళ్లనున్నారు. ఈ కేసులో ఏ-1గా ఉన్న కేటీఆర్‌ను ఇప్పటికే జనవరి 9న ఏసీబీ అధికారులు ఒకసారి సుదీర్ఘంగా విచారించారు. మరోమారు విచారణకు రావాలని మే 28నే ఆయనకు నోటీసులు జారీ చేసినప్పటికీ, విదేశీ పర్యటన కారణంగా తాను రాలేనని కేటీఆర్ ఏసీబీకి తెలిపారు. ఈ నేపథ్యంలో మరోసారి నోటీసులు జారీ చేయడంతో సోమవారం ఏసీబీ విచారణకు వెళతానని కేటీఆర్ ఇప్పటికే ఎక్స్‌లో ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా ఈ-కార్ రేస్‌లో రూ.54.89 కోట్లు దుర్వినియోగం జరిగినట్టు ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కాగా, ఏసీబీ డీఎస్పీ మాజిద్ అలీ నేతృత్వంలోని అధికారుల బృందం పలు కీలక అంశాలపై వివరాలు రాబట్టేందుకు ఇప్పటికే ప్రశ్నావళి సిద్ధం చేసుకున్నట్టు తెలిసింది.

సంఘీభావం ప్రకటించేందుకు రండి..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేడు ఏసీబీ విచారణకు హాజరవుతున్న నేపథ్యంలో ఆయనకు సంఘీభావంగా పార్టీ శ్రేణులు తెలంగాణ భవన్‌కు తరలిరావాలని పార్టీ నేతలు పిలుపునిచ్చారు. కేటీఆర్ సోమవారం ఉదయం 9 గంటలకు తెలంగాణ భవన్‌కు చేరుకుని అక్కడి నుంచి బంజారాహిల్స్‌లోని ఏసీబీ కేంద్ర కార్యాలయానికి వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో కేటీఆర్ వెంట ఏసీబీ కార్యాలయానికి వెళ్లేలా బీఆర్ఎస్ నాయకత్వం ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిసింది.

రేవంత్‌రెడ్డితో కేసీఆర్ కుటుంబం కుమ్మక్కు

- ఫోన్ ట్యాపింగ్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థలతో సమగ్ర విచారణ జరగాలి
- కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు ఎంపీ ధర్మపురి అర్వింద్ బహిరంగ లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ కుటుంబం మధ్య ఉన్న అవినాభావ సంబంధం దృష్ట్యా.. తెలంగాణలో జరిగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం నిష్పాక్షికంగా దర్యాప్తు చేయడం అసాధ్యమని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. ఈ అక్రమ ఫోన్ ట్యాపింగ్ ఎపిసోడ్‌పై కేంద్ర సంస్థలతో సమగ్ర దర్యాప్తు జరిపించాలని తెలంగాణ బీజేపీ శాఖ వెంటనే డిమాండ్ చేయాలన్నారు. ఈ మేరకు ఆదివారం ఎంపీ ధర్మపురి అర్వింద్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌లకు సోషల్ మీడియా వేదికగా బహిరంగ లేఖ రాశారు. 'ఈ ఉదయం నేను లేచి చూస్తే, నా వ్యక్తిగత గోప్యతను భంగపరిచే షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. పార్లమెంటు సభ్యుడిగా, నా ఫోన్ కాల్స్, బెడ్రూం, బాత్రూంలలో ఎవరో అక్రమంగా చొరబడటానికి నేను ఎన్నిక కాలేదు. 2019 నుంచి నాపై భౌతిక దాడులు, వేధింపులు జరుగుతూనే ఉన్నాయి. కేసీఆర్ కుటుంబం పకడ్బందీగా నన్ను లక్ష్యంగా చేసుకుని, రాష్ట్ర యంత్రాంగాన్ని తమ వ్యక్తిగత మానవ నిఘా సాధనంగా ఉపయోగించింది' అని అర్వింద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై లోక్‌సభ స్పీకర్, కేంద్ర హోంమంత్రికి కూడా లేఖలు రాస్తున్నట్టు అర్వింద్ తెలిపారు.

ఆగస్టు 15 కల్లా భూసమస్యల పరిష్కారం

- 7,578 రెవెన్యూ సదస్సుల్లో 4.61లక్షల దరఖాస్తులు
- వారం, పది రోజుల్లో ఆ 5 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేస్తాం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



కూసుమంచిలో పొలం దున్నుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సాక్షి, హైదరాబాద్/కూసుమంచి: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో వస్తున్న భూసమస్యలను ఆగస్టు 15వ తేదీకల్లా పరిష్కరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై ఆదివారం మంత్రి పొంగులేటి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈనెల 3వ తేదీ నుంచి రాష్ట్రంలోని 561 మండలాల్లోని 7,578 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, 4.61 లక్షల దరఖాస్తులు వచ్చాయని వివరించారు. ఈ సదస్సులను 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి మానవతా దృక్పథంతో పరిష్కార మార్గం చూపాలని అధికారులను కోరారు. పదేళ్లలో రైతులు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారని, వాటన్నింటినీ పరిష్కరించేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతోనే సీఎం రేవంత్‌రెడ్డి భూభారతి చట్టాన్ని తీసుకొచ్చారని, ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి రైతులకు మేలు చేసే బాధ్యత అధికారులదేనని చెప్పారు.

వేగంగా భూసర్వే

రాష్ట్రంలో నక్షాలు లేని 413 గ్రామాలకుగాను ఐదింట జరుగుతున్న రీసర్వే నిర్వహణ గురించి కూడా మంత్రి పొంగులేటి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత నెల మూడోవారం నుంచి ఈ పైలట్ సర్వే నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా సలార్‌నగర్‌లో 422 ఎకరాలకు 337 ఎకరాలు, కొమ్మనాపల్లి (కొత్తది) గ్రామంలో 626 ఎకరాలకు 269 ఎకరాలు, ములుగుమడలోని 845 ఎకరాలకు 445 ఎకరాలు, నూగురులో 502 ఎకరాలకు 232 ఎకరాలు, షాహిద్‌నగర్‌లో 593 ఎకరాలకు 308 ఎకరాల్లో సర్వే పూర్తయ్యిందని వివరించారు. అనంతరం పొంగులేటి మాట్లాడుతూ మరోవారం, పది రోజుల్లో ఈ సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. చిన్న వివాదాలకు కూడా తావు లేకుండా రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలని సూచించారు. భూముల సర్వే కారణంగా రైతులు, గ్రామీణ భూయజమానులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని మంత్రి పొంగులేటి చెప్పారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, సోమవారం జరిగే కేబినెట్ సమావేశంలో తేదీలపై స్పష్టత వస్తుందని మంత్రి పొంగులేటి చెప్పారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో ఆదివారం పాలేరు నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో పొంగులేటి మాట్లాడారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ పార్టీ అభ్యర్థులు విజయం సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎవరికి టికెట్ ఇచ్చినా గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కొద్దిరోజుల్లో రైతు భరోసా నిధులు విడుదలవుతాయని, సన్నధాన్యం అమ్మిన రైతులకు బోనస్ చెల్లిస్తామని చెప్పారు. అనంతరం కూసుమంచిలో పొలం దున్నిన పొంగులేటి.. కూలీలతో కలిసి విత్తనాలు వేశారు.

బనకచర్లతో తెలంగాణకు తీవ్ర నష్టం

- రాష్ట్ర నీటి హక్కుల కోసం బీఆర్ఎస్ మీకు తోడుగా నిలుస్తుంది
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాజీమంత్రి హరీశ్‌రావు లేఖ



సాక్షి, హైదరాబాద్: గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుతో గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులకు తీవ్ర నష్టం కలుగుతుందని మాజీమంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన 200 టీఎంసీల గోదావరి నీటిని బనకచర్ల వరకు తరలించేందుకు మూడు దశల్లో ప్రాజెక్టు డిజైన్, కేంద్రానికి పీఎఫ్ఆర్ (ప్రీ ఫీజిబిలిటీ రిపోర్ట్) సమర్పించడం తెలంగాణ నీటి హక్కులను కాలరాయడమే అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర నీటి హక్కుల కోసం బీఆర్ఎస్... ప్రభుత్వానికి తోడుగా నిలుస్తుందని వెల్లడించారు. ఈ మేరకు గోదావరి బనకచర్ల అంశంపై మంత్రి ఉత్తమ్‌కు మాజీమంత్రి హరీశ్‌రావు ఆదివారం ఒక లేఖ రాశారు. ఈ ప్రాజెక్టును కేంద్రం ఆమోదించేలోపే, తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు రావాల్సి ఉండగా, ఏపీ యూనిలేటరల్‌గా ముందుకెళ్తుండటం అన్యాయమన్నారు. ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ కేంద్ర జలశక్తి మంత్రికి ఈ ఏడాది జూన్ 13న మంత్రి ఉత్తమ్ లేఖ రాయడాన్ని హరీశ్‌రావు అభినందించారు. 'ఏపీ తీసుకుంటున్న చర్యలు.. 2014 రాష్ట్ర పునర్విభజన చట్టంతోపాటు నదీ జలాల బోర్డుల నియమాలను ఉల్లంఘించడమే. వెంటనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరాలి. గోదావరి జలాల్లో 969 టీఎంసీల తెలంగాణ వాటాలో ఇప్పటివరకు వినియోగం 600 టీఎంసీలకు పెరిగింది. గోదావరి నదిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ, సీతమ్మసాగర్, సమ్మక్కసాగర్ వంటి బరాజ్‌లు, 19 లక్షల ఎకరాల స్థిరీకరణతో గోదావరి బేసిన్ అభివృద్ధి, చెరువులు, చెక్ డ్యామ్‌లు, మిషన్ కాకతీయ, కాల్వల ద్వారా గోదావరి నీటిని వ్యవస్థీకృతంగా వినియోగంలోకి తెచ్చాం. కాళేశ్వరం ఎత్తిపోతల అదనపు నివేదిక, సమ్మక్కసాగర్, వార్ధా (బీఆర్ అంబేడ్కర్ ప్రాజెక్టు) డీపీఆర్‌లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఏపీ వానాకాలపు వరద జలాలే తరలిస్తామన్నా, గోదావరి ట్రిబ్యునల్ అవార్డులో 'ఆల్ వాటర్స్'అనే పదమే ఉన్నదని నిపుణుల అభిప్రాయం. అదనపు జలాలు అనే అంశం గోదావరి అవార్డులో లేదు. బ్రిజేష్ ట్రిబ్యునల్ ముందు తెలంగాణకు ఈ 157.5 టీఎంసీల అదనపు వాటాను కోరాలి. న్యాయ నిపుణులతో చర్చించి తగిన చర్యలు చేపట్టాలి. కేసీఆర్ పోరాట ఫలితంగా ఇప్పుడు 45 టీఎంసీలతో పాటు 112.5 టీఎంసీల అదనపు వాటా కోసం ట్రిబ్యునల్ ముందు వాదించే అవకాశం వచ్చింది'అని హరీశ్‌రావు తన లేఖలో పేర్కొన్నారు.

సూపర్ సిక్స్ కాదు.. ఫస్ట్ బాల్‌కే కూటమి అవుట్

- చంద్రబాబు ఏడాది పాలనపై మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: సూపర్ సిక్స్ అని గొప్పగా చెప్పుకునే సీఎం చంద్రబాబు ప్రజల దృష్టిలో మొదటి బాల్‌కే అవుట్ అయ్యారని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఎద్దేవా చేశారు. ఏడాది పాలనలో సూపర్ సిక్స్ హామీలను అమలు చేసేశానంటూ సీఎం చంద్రబాబు నిస్సిగ్గుగా పచ్చి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి ప్రజలకు న్యాయం చేస్తే.. హామీలను అమలు చేయకుండానే నెరవేర్చేసినట్టు కూటమి సర్కార్ మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అప్పులు తగ్గి, ఆదాయం పెరిగితే.. కూటమి ఏడాది పాలనలో ఆదాయం తగ్గి, అప్పులు పెరిగాయనే విషయాన్ని ఆధారాలు, గణాంకాలతో సహా వివరించారు. వాస్తవాలను దాచిపెట్టి, అద్భుతమైన పాలనను అందించామని.. హామీలపై ఎవరైనా ప్రశ్నిస్తే సహించనని చంద్రబాబు బెదిరించడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. తాను వెల్లడించిన గణాంకాలు వాస్తవం కాదు అని చెప్పే ధైర్యం చంద్రబాబుకు ఉందా అని సవాల్ విసిరారు. బుగ్గన ఇంకా ఏమన్నారంటే..

తల్లికి వందనం మహామోసం

తల్లికి వందనం పథకం ప్రారంభం.. ఏడాది పాలన పూర్తి సందర్భంగా చంద్రబాబు మీడియా సమావేశంలో పచ్చి అబద్ధాలను మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేసేశామంటూ, దానిపై మాట్లాడినే నాలుక మందం అంటూ ప్రతిపక్షంతో పాటు ప్రజలకు కూడా హెచ్చరికలు చేశారు. ఎన్నికల ముందు తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేల చొప్పున 87 లక్షల మందికి ఇస్తామని చంద్రబాబు విస్తృతంగా ప్రచారం చేశారు. ఇప్పుడు అందులో 30 లక్షల మందికి ఎగ్గొట్టారు. అదికూడా కేవలం రూ.13 వేలు మాత్రమే ఇస్తున్నారు. 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు నెలకు రూ.4 వేల చొప్పున పెన్షన్ ఇస్తామన్నారు. ఆడబిడ్డ నిధి కింద 2.07 కోట్ల మందికి నెలకు రూ.1,500 ఇస్తామన్నారు. 53.50 లక్షల మందికి రైతు భరోసా కింద రూ.20 వేల చొప్పున ఇస్తామన్నారు. ఇందుకు ఏడాదికి రూ.10 వేల కోట్లకు పైగా అవసరం కాగాజజ కేవలం రూ.వెయ్యి కోట్లు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించారు. ఉద్యోగం రాని యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 1,54,047 మందికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం అని ఊదరగొట్టారు. వాటిని ఎప్పుడు ఇస్తారని ప్రజలు అడుగుతున్నారు. ప్రజల తరఫున ప్రతిపక్షంగా వాటినే వైఎస్సార్‌సీపీ అడుగుతోంది. వాటికి సమాధానంగా అన్ని సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాశానని చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉంది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

రాజకీయ శిక్షణ వేదికగా జాగృతి

- 'లీడర్' కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ కవిత

సాక్షి, హైదరాబాద్: యువత, మహిళలకు తెలంగాణ జాగృతి ఒక రాజకీయ శిక్షణ వేదికగా మారబోతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. రాజకీయ నేపథ్యం లేనివారికి జాగృతి ఒక వేదిక అవుతుందని, యువత రాజకీయాల్లోకి వస్తే స్వచ్ఛమైన రాజకీయాలకు నాంది పడుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 'లీడర్' పేరిట నిర్వహించనున్న నాయకత్వ శిక్షణా కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా కవిత ఈ వ్యాఖ్యలు చేశారు. 'తెలంగాణ గడ్డ అంటే ప్రశ్నించేతత్వం. ముందు తరాలకు కూడా ప్రశ్నించే తత్వాన్ని నేర్పించాలి. తెలంగాణ వ్యాప్తంగా ప్రతి నెలా మూడు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తాం. జూలైలో హైదరాబాద్‌లో ప్రారంభించి ఆగస్టు నుంచి జిల్లాల్లో నిర్వహిస్తాం. ప్రజాస్వామ్యంపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ శిక్షణా తరగతుల్లో పాల్గొనాలి. ఇది ఒక నిరంతర కార్యక్రమంగా కొనసాగుతుంది' అని కవిత పేర్కొన్నారు. 'డీలిమిటేషన్ తర్వాత తెలంగాణలో అసెంబ్లీ సీట్లు 153కు పెరుగుతాయి... లోక్ సభ సీట్లు కూడా పెరుగుతాయి. కాబట్టి మనం నాయకులను తయారు చేసుకోవాల్సిన అవసరం ఉంది. మహిళా రిజర్వేషన్ బిల్లు, బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదంలో తెలంగాణ జాగృతి కీలక పాత్ర పోషించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు ఉద్యమిస్తాం' అని కవిత తెలిపారు.

మీ ప్రయాణం ఒక ప్రేరణ



'జీవితం ఒక వరం, ప్రయాణం ఒక ప్రేరణ లాంటి వ్యక్తికి ఫాదర్స్ డే శుభాకాంక్షలు' అని ఎమ్మెల్సీ కవిత ఆదివారం ఫాదర్స్‌డే సందర్భంగా ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. తన తండ్రి కేసీఆర్‌తో కలిసి దిగిన ఫొటోకు ఈ వ్యాఖ్యలతో పాటు లవ్‌సింబల్‌ను జోడిస్తూ కవిత పోస్టు చేశారు.

ప్రతీకారేచ్ఛతోనే రేవంత్ పాలన

- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతీకారేచ్ఛతో రాష్ట్రాన్ని పాలిస్తున్నారని, ప్రజల కోసం రాజీలేని పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులు పెడుతున్నారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ప్రశ్నిస్తున్న గొంతులను నొక్కడానికి రేవంత్ ప్రయత్నాలు నిరంతరం కొనసాగుతున్నాయని విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎక్కడ సమస్య ఉన్నా కేటీఆర్ పోరాటం చేస్తున్నారని, ఇప్పటి వరకు కేటీఆర్‌పై 14 కేసులు పెట్టారని చెప్పారు. 'ఏసీబీ కార్యాలయం నుంచి తెలంగాణ భవన్‌కు నడుచుకుంటూ వస్తే కూడా కేసు పెట్టారు. ఆయనపై పెట్టిన కేసుల్లో 4 కేసులను హైకోర్టు కొట్టివేసింది. ఒకే అంశంపై రెండు ఎఫ్.ఐ.ఆర్‌లు పెట్టారు. ఇలా ఎక్కడైనా జరుగుతుందా? కేటీఆర్‌పై పెట్టిన ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో తుఫేల్ ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేశారు. నా 26 సంవత్సరాల పోలీసు సర్వీస్‌లో ఇలాంటి చెత్త కేసు ఎప్పుడూ చూడలేదు'అని ప్రవీణ్‌కుమార్ అన్నారు.

నాకు సీఎం అయ్యే అవకాశం చేజారిపోయింది: మాజీ మంత్రి జానారెడ్డి



జానారెడ్డి, కొండేటి మల్లయ్యలను గజమాలతో సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

నాగార్జునసాగర్: 'కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు శ్రమకు తగిన ఫలితం ఉంటుంది. కానీ నాకు రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యే అవకాశం చేజారిపోయింది' అని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. కాంగ్రెస్ నేత కొండేటి మల్లయ్య టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా ఆదివారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని జానారెడ్డి నివాసంలో మల్లయ్యతో పాటు జానాను కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా జానారెడ్డి విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ, కొండేటి మల్లయ్య తన లాగే మొదటి నుంచీ పార్టీ కోసం కష్టపడ్డారని, తనకు ముఖ్యమంత్రి పదవి చేజారగా, మల్లయ్యకు ఎమ్మెల్యే పదవి దక్కలేదని అన్నారు. త్వరలో ఆయన శ్రమకు తగిన ఫలితం ఉంటుందని, కొండేటి మల్లయ్యకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. తమపై నియోజకవర్గ ప్రజలకు ఎంత ప్రేమ ఉందో, తనకు వారిపై అంతకు మించి అభిమానముందన్నారు. కాగా, తన పుట్టిన రోజున ఎవరూ స్వీట్లు పంచవద్దని, కేక్‌లు కట్ చేయవద్దని, శాలువాలతో తన వద్దకు రావొద్దని.. తానెప్పుడూ ఆరోజున అందుబాటులో ఉండనని చెప్పారు. ఈ విషయాన్ని మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజా రమేశ్, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వన్నీ బూటకపు మాటలే

- మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్‌ను చెత్తబుట్టలో వేయాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్‌వన్నీ బూటకపు మాటలే అని మొదట్నుంచీ చెప్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని, కులగణనను రోల్‌మోడల్‌గా చెప్పుకుంటున్న రేవంత్ ప్రభుత్వం.. మంత్రి పదవుల్లో బీసీలకు 42 శాతం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కులగణన అంతా తప్పుల తడక అని, బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత ఏదని ప్రశ్నించారు. ప్రస్తుతమున్న బీసీ మంత్రుల వద్ద కీలక శాఖలు లేవని అన్నారు. ఏడాదికి రూ.20 వేల కోట్లు బీసీలకు బడ్జెట్‌లో కేటాయిస్తామని చెప్పి ఇప్పటివరకు అమలు చేయకపోవడం దారుణమని ఆయన విమర్శించారు.

డబ్బు కోసం వ్యాపారం కాదు

- క్రెడాయ్ నేషనల్ ప్రెసిడెంట్ రాంరెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు గుమ్మి రాంరెడ్డి, ఎన్‌వీఎస్ రెడ్డి, రెడ్డి బిజినెస్ గ్లోబల్ హబ్ ప్రతినిధులు



అవార్డు అందుకుంటున్న శాంతాబయోటెక్ వ్యవస్థాపకులు డాక్టర్ వరప్రసాద్ రెడ్డి

గచ్చిబౌలి (హైదరాబాద్): డబ్బు కోసం వ్యాపారం కాదని, వ్యాపారం చేస్తూ డబ్బు సంపాదించాలని క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు గుమ్మి రాంరెడ్డి సూచించారు. ఆదివారం హెచ్ఐసీసీలో రెడ్డి బిజినెస్ గ్లోబల్ హబ్ ఆధ్వర్యంలో రెడ్డి బిజినెస్ హబ్ కాన్‌క్లేవ్-2025కు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏదైతే చెప్తామో అదే చేస్తూ నిజాయితీగా వ్యాపారం చేస్తే కొంత సమయం తీసుకున్నా విజయం సాధించవచ్చన్నారు. షార్ట్ టర్మ్ కాకుండా దీర్ఘకాలికంగా రాణించే వ్యాపారాలను ఎంచుకోవాలని సూచించారు. యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి మాట్లాడుతూ, అమెరికాలో 50 శాతం బిలియనీర్లు ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారని, చిన్న కమ్యూనిటీలైన మార్వాడి, గుజరాతీలు 80 శాతం వ్యాపారాలు నడిపిస్తున్నారని తెలిపారు. రెడ్డి సామాజికవర్గం సామర్థ్యం కలిగి ఉందని.. దూరదృష్టి, ఐక్యత, ఉద్యమశీలతతో ముందుకు వెళ్లితే శక్తివంతమైన వారసత్వాన్ని నిర్మించగలమని అన్నారు. రెడ్డి బిజినెస్ హబ్ నిర్వాహకులు భరత్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాపారం చేయాలనుకునే వారికి ఎడ్యుకేషన్, నాలెడ్జ్, ఆర్థికంగా ప్రోత్సాహం అందిస్తామన్నారు. బిజినెస్ ఫ్రాంచైజీల ద్వారా వ్యాపార అవకాశాలను అందించేలా డిజైన్ చేశామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో రెడ్డి సామాజిక వర్గాన్ని ఆయా రంగాల్లో చైతన్యం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో రాణించిన వారికి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి బిజినెస్ గ్లోబల్ హబ్ వ్యవస్థాపకులు భరత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ స్వాతిరెడ్డి, శాంతాబయోటెక్ వ్యవస్థాపకులు డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, సాక్షి డైరెక్టర్ వైఈపీ రెడ్డి, డైరెక్టర్ వంశీ, డాక్టర్ తీగల అనితారెడ్డి, రాజిరెడ్డి, జనప్రియా ఎండీ రవీందర్‌రెడ్డి, టీహబ్ మెంటర్ కీర్తిరెడ్డి, ఎన్ఆర్ఐలు ఝాన్సీరెడ్డి, అప్పిరెడ్డిలతో పాటు హైదరాబాద్, బెంగళూర్, ఆంధ్రప్రదేశ్ నుంచి దాదాపు 500 మంది పాల్గొన్నారు.

సన్నిధి
సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం ॥ 16-6-2025



మంచిమాట

అవగాహన.. మనం నిత్యమూ స్మరించే పదాల్లో ఒకటి. దాదాపుగా ప్రతి వ్యక్తీ వాడే మాట.. "ఈ విషయం మీద నాకు సంపూర్ణమైన అవగాహన ఉంది".. "ఆ పని చేయడానికి కావల సిన ప్రాథమిక అవగాహన కూడా అతనికి లేదు". ఇటువంటి మాటలు మనం తరచూ మాట్లాడుతూ ఉంటాం.

అవగాహన అంటే...

అసలు అవగాహన అంటే ఏమిటి? అవగాహన అనే పదం చాలా విస్తృతమైన అర్థాన్ని కలిగి ఉంది. శాస్త్రీయంగా చెప్పాలంటే, ఏదైనా వస్తువు లేదా విషయంమీద ఒక వ్యక్తికున్న జ్ఞానాన్ని, ఆకళింపు శక్తినీ అవగాహనగా పేర్కొనవచ్చు. ప్రత్యేకమైన అంశంపై మనకున్న స్పృహ అంటే బాహ్య దృగ్విషయ సాక్షాత్కారం మనసులో నిండి ఉండడమే అవగాహన లేదా ఆకళింపు లేదా గ్రహింపు శక్తి. కొంచెం విడమరచి విశ్లేషిస్తే, ఆకళింపు అంటే చేయబోయే పనిమీద ప్రాథమికమైన జ్ఞానాన్ని కలిగి ఉండడం అన్న అర్థంలో తీసుకోవచ్చు. అదే విధంగా తాను కార్యసాధనలో కలిసి పని చేయబోయే వ్యక్తిని గురించి తెలుసుకుని ఉండగలగడాన్ని అవగాహనగా నిర్వచించవచ్చు. ఆనందకరమైన రీతిలో జీవితాన్ని గడపడానికి తన జీవిత భాగస్వామితో నిత్యమూ ఆనందకరంగా చరించడమూ అవగాహనకు అందమైన ఉదాహరణే. ప్రజాసేవకు అంకితమయ్యే నాయకులు తాము చేసే సేవా కార్యక్రమాల మీద అర్థవంతమైన పరిజ్ఞానాన్ని కలిగి ఉండడమూ అవగాహనే. అంతేకాదు, పసిపిల్లలను ముఖ్యమైన విషయాలపట్ల అప్రమత్తంగా తీర్చిదిద్దడమూ అవగాహనగానే పరిగణించాలి.

ఈ రోజుల్లో జీవిత భాగస్వామితో ఉన్న అవగాహన రాహిత్యంవల్లనే, వారి దాంపత్యబంధంలో ముఖ్యమైన శాంతి కరువవుతోంది, సుఖమన్నది అరుదవుతోంది. భార్యాభర్తలమధ్య ఆకళింపు లేమివల్ల సత్సమాజం ఏర్పడేందుకు అవరోధాలు కలుగుతాయని చెప్పవచ్చు. ఎందుకంటే, తల్లిదండ్రులు వ్యవహరించే తీరునే పిల్లలు అనుసరిస్తారు, అనుకరిస్తారు. ఇది మనస్తత్వ శాస్త్రవేత్తలు ఘంటాపథంగా చెప్పేదేగాక, మనం నిత్యమూ కనులముందు తిలకించేదే..!!

భార్యాభర్తల బంధంలో ఒకరినొకరు అర్థం చేసుకుని చరించడం భారమైన విషయం కాదు, అది మధురమైన మకరంద సారం వంటిదని గ్రహించాలి.. ఇది నిజం..!! ఒకరిపై ఒకరికి అనురాగం, ప్రేమలను మరింత బలీయంగా ఉంచేది వారి మధ్య నిలిచివున్న అందమైన అవగాహనే. "భార్యకు నచ్చిన పనుల్ని చేయవలసిన అవసరం ఏముందని భర్త భావించడం, భర్త చెప్పినట్లుగా ఎందుకు నడుచుకోవాలి?" అని భార్య భావిస్తే, అతి కొద్దిరోజుల్లోనే ఆ బంధం దెబ్బతింటుంది. దీనికి ప్రధాన కారణం వారికి వారుగా ఒకరిపై ఒకరు పెంచుకున్నవిశ్వాసరాహిత్యమే అని చెప్పడం నూటికి నూరుపాళ్ళూ నిజం.

విద్యార్థులు తమ విద్యపట్ల, లక్ష్యసాధకులు తాము సాధించదలచిన లక్ష్యం పట్ల అవగాహన కలిగి ఉన్నట్లే, దేశప్రగతిని కాంక్షించే నాయకులకు తాము ఏ రకంగా ఉత్తమసేవలను అందించి దేశానికి ప్రగతిని, సుగతిని అందించదలచుకున్నామో అన్న విషయంలో స్పష్టమైన అవగాహన కలిగి ఉండడం దేశప్రగతికి అత్యంత ముఖ్యమైన విషయం. ప్రతి అందమైన బంధానికీ ఇరువురి మధ్య అవగాహన అనేది ఎంతో ముఖ్యం. సాధకుని ఆలోచనా ధోరణిలో నిండివున్న దృఢమైన అవగాహనే కార్యసాధనలో విజయానికి ప్రధాన భూమిక నిర్వహిస్తుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.


ఏదైనా లక్ష్యాన్ని సాధించాలి అని భావించినప్పుడు, ఆ లక్ష్య సాధనకు సంబంధించిన విషయాల పట్ల సమగ్రమైన గ్రహింపుని కలిగి ఉండడమనేది మౌలికమైన విజయసూత్రం. సాధనాక్రమంలో ఏదైనా విషయం తెలియకపోయినా, కొద్దిపాటి ఆకళింపు లేకపోయినా, ఆ విషయాన్ని సాధకుడు పనికిమాలిన అంశంగా భావించకూడదు. అదే, పరాజయానికి హేతువుగా మారుతుంది. నీకు ఏ విషయమైనా తెలియక పోయినా, ఆ రంగంలో నిష్ణాతులైనవారినో, అందులోని లోటుపాట్లను విడమరచి చెప్పగలవారినో ఆశ్రయించాలి. అందుకే, ఒక ఆర్యోక్తిలో చెప్పినట్లు "పెద్ద పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకోవడం ముఖ్యం కాదు. చిన్న చిన్న విషయాలను సమగ్రంగా అర్థం చేసుకుంటూ ముందుకు సాగడం వివేకి లక్షణం" అన్న మాటలు శిరోధార్యమే..!!

వ్యాఖ్యాన విశారద
వెంకట్ గరికపాటి

ఆత్మదర్శిని

దైవంతో బంధం

రాగద్వేషాలు, కోరికలు ఉన్నంతవరకు జనన మరణ చక్రంలో భ్రమిస్తూనే ఉంటాము. కొత్తశరీరం వస్తుందే గానీ మనస్సు మాత్రం అదే కొనసాగుతూ ఉంటుంది. ఈ కర్మలు ఆగనంతవరకు జన్మలుకూడా ఆగవు. నిజానికి ఇది కూడా కల్పితమే. అసలు శరీరం, మనస్సు అనేవే సత్యాలు కావు. నీవు ఆత్మవు, అదే సత్యం. కానీ ఈ సత్యాన్ని నీవు అనుభవ పూర్వకంగా తెలుసుకోనంత వరకు మనస్సు చేతిలో కీలుబొమ్మలాగే ఉంటావు. మనస్సు తాలూకు సుఖదుఃఖాలకు బందీవి అయిపోయి విషయ ప్రపంచంలోనే కొట్టుమిట్టాడుతుంటావు. నిరంతరం కోరికలను పెంచుకుంటూ, భౌతిక విషయాల వెంటపడుతూ వాటిల్లోనే ఆనందం ఉందని నమ్ముతూ నిత్యం అసంతృప్తిలోనే జీవితాన్నంతా గడిపేస్తావు. ఇలా ఎన్ని జన్మలెత్తినా సంస్కారాలను పెంచుకుంటూ పోతావేగానీ అనందాన్ని మాత్రం ఎన్నటికీ పొందలేవు. నీ నిజతత్వమే ఆనందమని తెలుసుకో. ఇకనైనా నీలోనికి ప్రయాణించు. ప్రతిక్షణం సాక్షిగా గమనించడం మొదలుపెట్టు. నీవు ఏ శరీరము- మనస్సులనైతే 'నేను' అని నమ్ముతున్నావో వాటికి ద్రష్టగా ఉండు. ఎప్పుడూ ఆత్మలో స్థిరపడి ఉండాలి. కానీ మనం ఎప్పుడు చూసినా ఏదో ఒకదాని కోసం వేటాడుతునే ఉంటున్నాము. ఏ కోరిక ఐనా నీనుండి నిన్ను దూరం చేసేదే. ఆఖరికి దైవాన్ని కోరుకున్నా అదీ కోరికనే. నిజానికి కర్మరీత్యా నీకు ఏమి ఇవ్వాలో అవన్నీ సమకూర్చబడే ఉన్నాయి. ఐనా గానీ ఏదో ఒకటి కోరుతూనే ఉంటుంది మనస్సు. అదే అహం ఆడే ఆట. అలా కాకుండా ప్రతిక్షణాన్ని, ప్రతి సంఘటనను దైవప్రసాదంగా స్వీకరిస్తూ పోవాలి. చివరకి చావులోకూడా, శరీరాన్ని వదిలేస్తున్న సమయంలోకూడా ద్రష్టగా గమనిస్తూ ఉండాలి. ప్రతిక్షణంలోనూ జీవిస్తూపో. ఏ క్షణంలోనూ బాధగా, నిర్లిప్తంగా, నీరసంగా అస్సలు ఉండకూడదు. నీవు చావునుకూడా సాక్షిగా గమనించినప్పుడు నిజంగా చావు అనేదే లేదు కదా! శరీరం నువ్వు కాదు. దాని వెనుక ఉన్న దివ్య చైతన్యమే నీవు ఐనప్పుడు చనిపోయేదెవరు? బాధపడుతున్న వాడిని చూసేది నీవైనప్పుడు బాధపడుతున్నది నీవు కాదు కదా! ఈ శరీరం-మనస్సు అనేవి భ్రమలు మాత్రమే.



మనస్సు నిన్ను సాక్షిగా ఉండనివ్వదు. అనుక్షణం దారి మళ్ళించడానికి ప్రయత్నిస్తూనే ఉంటుంది. ఏదో ఒక సమస్యను సృష్టిస్తుంది. మనం ధ్యానం చేసేది మనస్సు అనే ఈ అడ్డుగోడను తొలగించడానికే. రాగంలేదు, ద్వేషం లేదు, దేనితోనూ బంధనం లేదు... అలాంటి స్థితిలో ఏమి జరిగినా నిన్ను కదపలేదు. జబ్బుపడినా, వృద్ధాప్యం వచ్చినా, తీవ్రమైన నొప్పులు వచ్చినా, చనిపోతున్నా.... ఏమైనా సరే గమనించే వాడు మాత్రం నిరంతరంగా ఉంటాడు. ద్వైతం అనేదే మాయమవ్వాలి. సంస్కారాలన్నీ అంతమవ్వాలి. కర్మలన్నీ మాయమైనపుడు ఇంకేమి ఉంటుంది ఒక్క దివ్యచైతన్యం తప్ప. కాబట్టి **అన్నింటికన్నా ముఖ్యమైనది సాక్షీభావన. నీవే ఆ దివ్యచైతన్యం ఐనప్పుడు సమస్త జగత్తూ నీదే, నీలోనే ఉంది. అన్నీ నీవే ఐనపుడు ఇల్లు కావాలనో, పదవి కావాలనో కోరటం దేనికి? అన్నింటికీ మూలమే నీవు. ఈ ప్రజ్ఞతో ఉన్నప్పుడు మనస్సు క్రమంగా మాయమౌతుంది. నీవే దైవం అని తెలుస్తుంది.**

దైవాన్ని ఒక రూపంలో ఊహించుకోవడం, దైవంగురించి వినడం లాంటివి ఎంత అజ్ఞానమో నీకే తెలుస్తుంది. దైవం గురించి మాట్లాడేవారు, వేదాంత ప్రవచనాలు ఇచ్చేవాళ్ళు సైతం రాగద్వేషాల్లో చిక్కుకొనే ఉన్నారు కదా! అంటే దైవం గురించి వినడం వల్ల దైవాన్ని తెలుసుకోలేవు. మాటలు, శబ్దాలు మనస్సుకు సంబంధించినవి. దైవం మనస్సుతో తెలుసుకోలేనిది, మనస్సుకు అతీతమైనది.

– స్వామి మైత్రేయ, ఆధ్యాత్మిక బోధకులు

ఆధ్యాత్మిక కథ

సగమైన సముద్రం

తుంగభద్ర నది ప్రవహిస్తోంది. దూరంగా మంత్రాలయ రాఘవేంద్ర స్వామి అష్టోత్తరం వీనుల విందుగా వినిపిస్తూ ఉంది. నది ఒడ్డున కూర్చుని ఉన్న గురువుతో శిష్యుడు "స్వార్థం అంటే ఏమిటి?" అని అడిగాడు. "స్వార్థం అంటే తన గురించి మాత్రమే శ్రద్ధ వహించడం. ఇతరులను పట్టించుకోకుండా తన ప్రయోజనం, ఆనందం లేదా సంక్షేమం గురించి మాత్రమే ఆలోచించడం" అని బదులిచ్చాడు గురువు.

"దాని పర్యవసానాలు ఏమిటి?" అని మళ్ళీ ప్రశ్నించాడు శిష్యుడు. "స్వార్థం ఎంత పనైనా చేయిస్తుంది. దానికి అంతమనేది లేదు. నీకు అర్థమయ్యే రీతిలో ఒక పాతకథ చెబుతాను విను.



"ఒక పెద్ద సామ్రాజ్యంలోని రాజ్యాలలో వర్షాలు లేక తీవ్రమైన కరువు ఏర్పడింది. ఏమి చేయాలో తెలియని చక్రవర్తి ఆస్థాన పండితులను పిలిచి చర్చించాడు. తపస్సు చేసి దైవానుగ్రహం పొందటమే శరణ్యమని వారు సలహా ఇచ్చారు. రాజ్యాల శ్రేయస్సు కోసం అడవులకెళ్ళి ఘోర తపస్సు ప్రారంభించాడు. చక్రవర్తి తపస్సుకి దేవుడు ప్రత్యక్షమై ఏం కావాలో కోరుకోమన్నాడు.

తన సామ్రాజ్యంలో మంచివానలు కురవాలని, నీటికరువు ఉండకూడదని కోరాడు చక్రవర్తి. ఎందుకైనా మంచిదని తన సామ్రాజ్యానికి ఆనుకుని ఉన్న సముద్రాన్ని కూడా మంచినీళ్ళుగా మార్చివేయమని అడిగాడు. "ఆలోచించే అడుగుతున్నావా?" అని దేవుడు రాజును ప్రశ్నించాడు."వృధాగా ఉన్న సముద్రం నీళ్ళు మంచినీళ్ళుగా మారితే మా సామ్రాజ్యంలోని ప్రజలు తరతరాలు నీటి ఎద్దడి లేకుండా సుఖపడతారు కదా. చరిత్రలో నా పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది కదా" అని దేవుణ్ణి ఒప్పించాడు."సరే, నీ ఇష్టం" అని చక్రవర్తి కోరినట్లే చేశాడు దేవుడు. వెంటనే మంచి వర్షాలు కురిశాయి. పరమానందభరితుడయ్యాడు చక్రవర్తి.

కొన్నాళ్ళు గడిచాయి. ఉప్పునీళ్ళ సముద్రం మంచి నీళ్ళుగా మారాక పరిస్థితి ఎలా ఉందో చూద్దామని చక్రవర్తి సముద్రం దగ్గరకు వెళ్ళాడు. సముద్రం సగమై ఉంది. ఆశ్చర్యపోయాడు. అలలు సైతం నీరసంగా పడి లేస్తున్నాయి. చక్రవర్తి గుండె తరుక్కుపోయింది. కారణమేమిటని తన సిబ్బందిని అడిగాడు. ఏ రాజ్యానికి ఆ రాజ్యం రాజులు అవసరం ఉన్నా లేకున్నా సముద్రం నీళ్ళని తమ రాజ్యాల వైపుకు మళ్ళించుకున్నారని చెప్పారు.

'సముద్రాన్ని కూడా సగం చేసింది కదా మనిషి స్వార్థం' అని తల పట్టుకున్నాడు చక్రవర్తి. ఇంకొన్నాళ్ళు గడిస్తే సముద్రం పూర్తిగా మాయమై పర్యావరణ సమస్య వస్తుందని గుర్తించాడు. వెంటనే తపస్సు ప్రారంభించడంతో దేవుడు ప్రత్యక్షమయ్యాడు. చేసిన తప్పునకు క్షమాపణలు కోరి సముద్రాన్ని ఉప్పునీళ్ళగా మార్చమని ప్రాధేయపడ్డాడు" అని స్వార్థం గురించి వివరించాడు గురువు. స్వార్థం మనిషిని ఎంత నీచానికైనా దిగజారుస్తుందని అర్థం చేసుకున్నాడు శిష్యుడు.

– ఆర్.సి.కృష్ణస్వామి రాజు

సాక్షి సినిమా

చలో గుజరాత్



● నాగచైతన్య

హీరో నాగచైతన్య గుజరాత్ వెళ్లనున్నారట. నాగచైతన్య హీరోగా కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో ఓ మిస్టిక్ థ్రిల్లర్ మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి హీరోయిన్. ఇటీవల హైదరాబాద్‌లో ఈ సినిమాకు చెందిన భారీ షెడ్యూల్ చిత్రీకరణ జరిగింది. ఓ ప్రముఖ స్టూడియోలో గుహ సెట్ వేసి, నాగచైతన్య పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ ఈ నెల చివరి వారంలో గుజరాత్‌లో ప్రారంభం కానుందని, నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణం పాల్గొనగా మేకర్స్ కీలక సన్నివేశాల చిత్రీకరణను ప్లాన్ చేశారని సమాచారం. బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్, బి. సుకుమార్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది వేసవిలో రిలీజ్ కానుంది.

కాంతార చాప్టర్ 1ని వీడని కష్టాలు

● షూటింగ్‌లో పడవ ప్రమాదం ● క్షేమంగా బయటపడిన రిషబ్ శెట్టి



● 'కాంతార చాప్టర్ 1' పోస్టర్

కన్నడతో పాటు ఇతర భాషల్లోకి అనువాదమై ఘన విజయం సాధించిన 'కాంతార' సినిమా ప్రీక్వెల్ 'కాంతార చాప్టర్ 1'ను వరుస కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ చిత్రం షూటింగ్ కర్ణాటకలో సాగుతోంది. ఈ చిత్ర కథానాయకుడు-దర్శకుడు రిషబ్ శెట్టి, ఇతర చిత్రబృందం ఉన్న బోటు బోల్తాపడింది. శనివారం రాత్రి శివమొగ్గ జిల్లా మాణి డ్యామ్‌లో ఈ ఘటన జరిగింది. పడవలో రిషబ్ శెట్టి, కెమెరామేన్‌తో పాటు చిత్రబృందంలోని పది మంది షూటింగ్‌లో నిమగ్నమయ్యారు. భారీ సెట్స్ వేసి, కొన్ని వారాలుగా చిత్రీకరణ జరుపుతున్నారు. ఈ షూటింగ్ టైమ్‌లో పడవ ఓ వైపుకు ఒరిగి పాక్షికంగా మునిగి పోవడంతో రిషబ్ శెట్టితో పాటు ఇతర సిబ్బంది నీటిలో పడిపోగా ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. కెమెరా మాత్రం డ్యామ్‌లో మునిగిపోయింది. ఇక ఈ చిత్రంలో నటిస్తున్న ఇద్దరు నటులు ఇటీవల కొన్ని రోజుల వ్యవధిలో గుండెపోటుతో మరణించారు. తమ గ్రామం వద్ద షూటింగ్ జరపకూడదని ఆ మధ్య గ్రామస్తులు ధర్నా చేశారు. ఇలా 'కాంతార చాప్టర్ 1'కి వరుసగా అవాంతరాలు ఎదురు కావడం చర్చనీయాంశమైంది. ఇదిలా ఉంటే... నటులు, సిబ్బంది క్షేమంగా ఉన్నారనీ, ఆదివారం కూడా షూటింగ్ కొనసాగిందనీ చిత్రనిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఆదర్శ్ పేర్కొన్నారు.

– 'సాక్షి' ప్రతినిధి, బెంగళూరు



● సునీల్ నారంగ్, ధనుష్, నాగార్జున, రాజమౌళి, శేఖర్ కమ్ముల, రష్మికా మందన్నా, జాన్వీ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు

నమ్మిన సిద్ధాంతాల పైనే శేఖర్ సినిమాలు తీస్తారు

– దర్శకుడు రాజమౌళి

"శేఖర్ కమ్ముల తాను నమ్మిన సిద్ధాంతానికి ఏం అడ్డొచ్చినా, ఎంత ఆశ చూపినా, ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఒక్క ఇంచ్ కూడా పక్కకు జరగరు. తాను నమ్మిన సిద్ధాంతాల పైనే సినిమాలు తీస్తారు. శేఖర్ ఇండస్ట్రీకి వచ్చిన పాతిక సంవత్సరాల్లో అలానే ఉన్నారు. అలాంటి సినిమాలే తీశారు. ఆయన అలానే ఉండాలని మేం కోరుకుంటున్నాము" అని ప్రముఖ దర్శకుడు రాజమౌళి అన్నారు. నాగార్జున, ధనుష్ హీరోలుగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కుబేర'. రష్మికా మందన్నా హీరోయిన్. సునీల్ నారంగ్, పుస్కూరు రామ్మోహన్‌రావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన 'కుబేర' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన దర్శకుడు రాజమౌళి ఈ చిత్రం ట్రైలర్, బిగ్ టికెట్స్‌ను లాంచ్ చేశారు. ఈ వేదికపై ఇంకా రాజమౌళి మాట్లాడుతూ – "ట్రాన్స్ ఆఫ్ కుబేర' చూసి ఆశ్చర్యపోయాను. ఈ సినిమాలో రిచ్, పూర్ ప్రపంచాలను ఎలా కలిపారు? నాగార్జున, ధనుష్‌గార్లను ఏ విధంగా తీసుకొచ్చారు? వీరి మధ్య డ్రామా ఎలా ఉండబోతుందన్న నాకు ఈ సినిమా ట్రైలర్ ఇంకా ఆసక్తిని పెంచింది" అని అన్నారు.

నాగార్జున మాట్లాడుతూ – "'కుబేర' శేఖర్ కమ్ముల సినిమా. 'మాయా బజార్'లో ఎన్టీఆర్ గారు హీరోనా? ఏయన్నార్‌గారు హీరోనా? ఎస్వీ రంగారావుగారు హీరోనా? సావిత్రిగారు హీరోనా? కాదు... కేవీ రెడ్డిగారు హీరో. అలా.. 'కుబేర' సినిమాకు శేఖర్ కమ్ముల హీరో. ఈ సినిమా కథ చెప్పగానే శేఖర్ కమ్ముల కోసం ఒప్పుకున్నాను. ఎన్ని సంవత్సరాలైనా మీ (అభిమానులు) ప్రేమ, ఇలానే ఉంది. నేను ఏ పాత్రలు చేసినా అప్రిషియేట్ చేస్తున్నారు. మీరు ఉన్నంతవరకు ఏఎన్ఆర్ లివ్స్ ఆన్" అని చెప్పారు.

ధనుష్ మాట్లాడుతూ– "'కుబేర' సినిమా కోసం శేఖర్ కమ్ములగారు ఎంతో కష్టపడ్డారు. నాగార్జునగారితో మంచి లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్. మ్యాన్ ఆఫ్ క్లాస్. నాగార్జునగారు, నేను, రష్మికల కంటే... ఫీల్డ్‌లో ఎక్కువగా డైరెక్షన్ టీమ్ కష్టపడింది. 'కుబేర' సినిమాలో రెండు ప్రపంచాలను చూస్తారు" అన్నారు.

శేఖర్ కమ్ముల మాట్లాడుతూ– "నా ప్రతి సినిమాకు చెబుతుంటాను... సరస్వతీ దేవి తల దించుకోకుండా ఉంటే చాలని. కానీ 'కుబేర' సినిమాను సరస్వతీ దేవి తల ఎత్తుకుని చూస్తుంది. ఈ సినిమా నేపథ్యం ముంబై. తెలుగు, తమిళ భాషల్లో షూట్ చేశాం. నిజమైన పాన్ ఇండియా మూవీ 'కుబేర'. కథ విషయంలో చైతన్య పింగళి సపోర్ట్ ఉంది. 'శివ' సినిమా టైమ్‌లో నాగార్జునగారి ఆటోగ్రాఫ్ తీసుకున్నాను. 'కుబేర' కోసం ఏమైనా చేస్తానన్నారు. ఈ సినిమాలోని బిచ్చగాడు క్యారెక్టర్ కోసం ధనుష్ సన్నబడ్డాడు. సినిమా కోసం రష్మిక ఎంతైనా కష్టపడతారు. దేవిశ్రీ నిజమైన రాక్‌స్టార్. మంచి మ్యూజిక్ ఇచ్చాడు" అన్నారు.

"'కుబేర' గేమ్‌ను లాంచ్ చేయబోతున్నాం. హిందీ, ఇతర ఏరియాల్లో 'కుబేర' రిలీజ్‌కు అసోసియేట్ అవ్వడం హ్యాపీగా ఉంది" అన్నారు 'ముగాఫే' ప్రతినిధులు మనీష్, విపుల్. అమిగోస్ క్రియేషన్స్ ప్రతినిధి నాగేశ్వర రావు, కొరియోగ్రాఫర్ జావేద్, ఫైట్ మాస్టర్ శ్రీధర్, లిరిక్ రైటర్స్ భాస్కరభట్ల, నందకిశోర్, ప్రొడక్షన్ డిజైనర్ తోట తరణి మాట్లాడారు. ఆదిత్య మ్యూజిక్ ప్రతినిధి నిరంజన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ అవార్డులను స్వీకరించడం మన బాధ్యత

– 'దిల్' రాజు

"ప్రభుత్వ అవార్డులను స్వీకరించాలి. షూటింగుల్లో బిజీగా ఉన్నా, ఎక్కడ ఉన్నా, ప్రభుత్వం నుంచి అవార్డు వస్తుందంటే స్వీకరించడం మన బాధ్యత. ప్రభుత్వంతో జర్నీ చేయాల్సిన బాధ్యత సినిమా ఇండస్ట్రీలోని ప్రతి ఒక్కరిదీ. భవిష్యత్తులో కూడా ప్రభుత్వం నుంచి అవార్డులు ప్రకటించినప్పుడు ఆ తేదీలను డైరీలో నోట్ చేసుకుని, ఒకవేళ మీకు అవార్డు ఉంటే ఆ అవార్డును స్వీకరించాలి. ఇది నా రిక్వెస్ట్. అది ఏ రాష్ట్రమైనా కానివ్వండి. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌లో కూడా అవార్డులు స్టార్ట్ అవుతాయి. ఎందుకంటే తెలుగు రాష్ట్రాలు మనకు రెండు కళ్లు" అని అన్నారు తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్, నిర్మాత 'దిల్' రాజు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన తెలంగాణ గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం శనివారం హైదరాబాద్‌లో జరిగిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎఫ్‌డీసీ చైర్మన్ 'దిల్' రాజు, ఎఫ్‌డీసీ ఎండీ హరీష్ ఐఏఎస్ ఆదివారం హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ ప్రెస్‌మీట్‌లో 'దిల్' రాజు మాట్లాడుతూ– "తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ వేడుక సక్సెస్ కావడం సంతోషంగా ఉంది. అవార్డులు స్వీకరించిన అందరికీ ఎఫ్‌డీసీ తరఫున ధన్యవాదాలు చెబుతున్నాం. తెలంగాణ సీయం రేవంత్‌రెడ్డి గారికి స్పెషల్ థ్యాంక్స్. సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, డిప్యూటీ సీయం మల్లు భట్టి విక్రమార్కగారికి ప్రత్యేక ధన్యవాదాలు. అలాగే ఇంత పెద్ద ఈవెంట్‌లో చిన్న చిన్న తప్పులు ఉండొచ్చేమో. కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల ఏమైనా తప్పులు జరిగి, ఈవెంట్‌కు వచ్చిన వారు ఒకవేళ హర్ట్ అయితే ఎఫ్‌డీసీ తరఫున చైర్మన్‌గా క్షమాపణలు కోరుతున్నాను" అని అన్నారు. "సీయం రేవంత్ రెడ్డిగారి ఆదేశాలతో, సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిగారి గైడెన్స్‌తో, ఎఫ్‌డీసీ చైర్మన్ 'దిల్' రాజుగారి విజన్‌తో తెలంగాణ గద్దర్ అవార్డ్స్ వేడుకను సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించుకున్నాం. ఈ సక్సెస్‌కు కారణమైన ప్రతి ఒక్కరీ కృతజ్ఞతలు" అన్నారు ఎఫ్‌డీసీ ఎండీ హరీష్.



● 'దిల్' రాజు, హరీష్

ఓటీటీ
ఇది చూడొచ్చు

నేడన్నది పోదు... రేపన్నది రాదు... ఎలా?

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం భూల్ చుక్ మాఫ్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఈ రోజుల్లో తాము చేసిన తప్పుని తెలుసుకొని సరిదిద్దుకునేవాళ్లు అరుదుగా ఉంటారు. చాలా మంది భయం లేకుండానే తప్పులు చేస్తుంటారు. మరి తప్పు చేసినవాడికి తన తప్పు తెలుసుకోవడానికి చిన్నపాటి భయం కలిగిస్తే అన్న ఆలోచనతో రూపొందిన హిందీ చిత్రం 'భూల్ చుక్ మాఫ్'. కరణ్ శర్మ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రాజ్‌కుమార్ రావ్ హీరోగా నటించారు. ఈ సినిమా కథ గమ్మత్తుగా ఉంటుంది. అంతే సరదాగా సినిమా అంతా సాగిపోతుంది కూడా. అంతలా ఈ కథలో ఏముందంటే... వారణాసి నగరానికి చెందిన తితలి మిశ్రా, రంజన్ తివారి ప్రేమించుకుంటుంటారు. తితలి తల్లిదండ్రులకు ఈ విషయం తెలిసి తమ కూతురుని రంజన్ పెళ్ళాడాలంటే గవర్నమెంట్ ఉద్యోగం తప్పని సరి అని కండిషన్ పెడతారు. ఇది విని, హమీద్ అంసారీ అనే బ్రోకర్ ద్వారా రంజన్ దొంగ దారిలో గవర్నమెంట్ ఉద్యోగం త్వరగానే సంపాదిస్తాడు. ఇంకేముంది... ఇరు కుటుంబాలు కలిసి ఇద్దరికీ పెళ్ళి చేయాలని ఓ తేదీని నిర్ణయిస్తాయి. రేపు పెళ్ళి అనగా ఈ రోజు నిద్ర లేచి నలుగు కార్యక్రమానికి రెడీ అవుతుంటాడు రంజన్. రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపి రేపటి తన పెళ్ళి గురించి కలలు కంటూ మరుసటి రోజు నిద్ర లేస్తాడు. కానీ ట్విస్ట్ ఏంటంటే మళ్ళీ నలుగు కార్యక్రమం రోజే రంజన్ నిద్ర లేస్తాడు. ఇలా ఎన్ని రోజులైనా అదే రోజు నిద్ర లేస్తూ ఉంటాడు. రంజన్ టైమ్ లూప్‌లో ఇరుక్కుపోయి ఇలా జరుగుతూ ఉంటుంది. గవర్నమెంట్ ఉద్యోగం సంపాదించి చక్కగా పెళ్ళి చేసుకుందామనుకున్న సమయంలో ఈ సమస్య రంజన్‌ను ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. మరి... రంజన్ ఈ టైమ్ లూప్ నుండి బయటపడి పెళ్ళి చేసుకోగలుగుతాడా? అసలు ఇలాంటి సమస్య రంజన్‌కు ఎందుకు వచ్చింది? వంటి ప్రశ్నలన్నిటికీ సమాధానం దొరకాలంటే ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'భూల్ చుక్ మాఫ్' చూడాల్సిందే. ఈ సినిమా కథలో చిన్న కన్ఫ్యూజన్ ఉన్నా కామెడీతో దానిని ప్రేక్షకుడికి చక్కగా అర్థమయ్యేలా తీశారు దర్శకుడు. సినిమా ఆద్యంతం నవ్వులతో గిలిగింతలు పెడుతూ హాయిగా సాగుతుంది. వర్త్‌ఫుల్ వాచ్.

– హరికృష్ణ ఇంటూరు



బాక్సర్ నిశాంత్ దేవ్ రెండో విజయం

భారత స్టార్ బాక్సర్ నిశాంత్ దేవ్ తన ప్రొఫెషనల్ కెరీర్‌లో వరుసగా రెండో విజయం అందుకున్నాడు. న్యూయార్క్‌లోని మ్యాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ఆదివారం జరిగిన సూపర్ వెల్టర్ వెయిట్ కేటగిరీ బౌట్‌లో 24 ఏళ్ల నిశాంత్ 60-54 పాయింట్ల తేడాతో జోస్ సిల్వా (మెక్సికో)పై గెలుపొందాడు. 'ప్రత్యర్థిని నాకౌట్ చేయాలనే ఉద్దేశంతో కాకుండా నా నైపుణ్యాన్ని మెరుగుపర్చుకునేందుకు రింగ్‌లోకి దిగుతాను. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో, ఒలింపిక్స్‌లో ఎక్కువ రౌండ్‌లు ఆడటం అలవాటు చేసుకున్నాను. ప్రొఫెషనల్ బాక్సర్‌గా మారి ఎక్కువ రోజులు కాలేదు. నేనింకా నేర్చుకునే దశలోనే ఉన్నాను. ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో ఉన్నతస్థితికి చేరుకోవడమే నా లక్ష్యం' అని హరియాణాకు చెందిన నిశాంత్ వ్యాఖ్యానించాడు. ఈ ఏడాది జనవరిలో ప్రొఫెషనల్‌గా మారిన నిశాంత్ తొలి బౌట్‌లో అమెరికాకు చెందిన ఆల్టన్ విగిన్స్‌ను టెక్నికల్ నాకౌట్ పద్ధతిలో ఓడించాడు. 2023 ప్రపంచ సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం (71 కేజీలు) నెగ్గిన నిశాంత్ గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. మార్కో వెర్డె (మెక్సికో)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో నిశాంత్ ఓడిపోయి కాంస్య పతకాన్ని త్రుటిలో చేజార్చుకున్నాడు.



వరుసగా ఆరో పరాజయం

మళ్లీ ఓడిన భారత పురుషుల హాకీ జట్టు

- ఆధిక్యంలోకి వెళ్లి వెనుకంజ
- కెరీర్‌లో 400వ మ్యాచ్ ఆడిన మన్‌ప్రీత్

అంట్‌వర్ప్ (బెల్జియం): అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) యూరోపియన్ అంచె ప్రొ లీగ్‌లో భారత పురుషుల జట్టు నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. హార్దిక్ సింగ్ నాయకత్వంలోని భారత జట్టు యూరోపియన్ అంచెలో వరుసగా ఆరో పరాజయాన్ని చవిచూసింది. ఆస్ట్రేలియా జట్టుతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 2-3 గోల్స్ తేడాతో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌కు ముందు నెదర్లాండ్స్‌తో రెండు మ్యాచ్‌ల్లో, అర్జెంటీనాతో రెండు మ్యాచ్‌ల్లో, ఆస్ట్రేలియాతో ఒక మ్యాచ్‌లో భారత జట్టు ఓటమి పాలైంది. ఆస్ట్రేలియాతో జరిగిన రెండో మ్యాచ్‌లో భారత జట్టు మ్యాచ్ మొదలైన మూడో నిమిషంలోనే ఖాతా తెరిచింది. సంజయ్ చేసిన గోల్‌తో భారత్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే ఆధిక్యంలోకి వెళ్లామన్న ఆనందం భారత్‌కు మరుసటి నిమిషంలోనే ఆవిరైంది. రెండు నిమిషాల వ్యవధిలో ఆస్ట్రేలియా రెండు గోల్స్ చేసి భారత్‌కు షాక్ ఇచ్చింది. నాలుగో నిమిషంలో టిమ్ బ్రాండ్, ఐదో నిమిషంలో బ్లేక్ గోవర్స్ ఆస్ట్రేలియాకు ఒక్కో గోల్ అందించారు. రెండో క్వార్టర్‌లో భారత్ మూడో గోల్ సమర్పించుకుంది. 18వ నిమిషంలో కూపర్ బర్న్స్ గోల్‌తో ఆస్ట్రేలియా 3-1తో ముందంజ వేసింది. మూడో క్వార్టర్‌లో దిల్‌ప్రీత్ సింగ్ గోల్‌తో భారత్ ఈ ఆధిక్యాన్ని 2-3కు తగ్గించింది. అనంతరం భారత జట్టు స్కోరును సమం చేసేందుకు ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆస్ట్రేలియా చివరి పది నిమిషాల్లో మూడు పెనాల్టీ కార్నర్‌లు సంపాదించినా భారత గోల్‌కీపర్ కృషన్ బహదూర్ పాఠక్ నిర్వీర్యం చేశాడు. ఓవరాల్‌గా మ్యాచ్‌లో భారత జట్టుకు నాలుగు పెనాల్టీ కార్నర్‌లు రాగా ఒక్క దానిని సద్వినియోగం చేసుకుంది. మరోవైపు ఆస్ట్రేలియాకు ఎనిమిది పెనాల్టీ కార్నర్‌లు రాగా ఆ జట్టు కూడా ఒక్క దానిని లక్ష్యానికి చేర్చింది. ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగడం ద్వారా భారత మాజీ కెప్టెన్, మిడ్‌ఫీల్డర్ మన్‌ప్రీత్ సింగ్ కెరీర్‌లో 400 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్నాడు. మొత్తం తొమ్మిది జట్లు పోటీపడుతున్న 2024-2025 ప్రొ లీగ్‌లో భారత జట్టు 14 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. ఐదు మ్యాచ్‌ల్లో గెలిచి, తొమ్మిది మ్యాచ్‌ల్లో ఓడింది. 15 పాయింట్లతో ఏడో స్థానంలో ఉంది. భారత జట్టు తమ చివరి రెండు మ్యాచ్‌లను బెల్జియం జట్టుతో (జూన్ 21న, 22న) ఆడుతుంది.

చివరి నిమిషంలో గోల్ సమర్పించుకొని...

మరోవైపు లండన్‌లో జరుగుతున్న మహిళల ప్రొ లీగ్‌లో భారత జట్టుకు వరుసగా రెండో పరాజయం ఎదురైంది. ఆస్ట్రేలియా జట్టుతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో సలీమా టెటె సారథ్యంలోని టీమిండియా 1-2 గోల్స్ తేడాతో ఓడిపోయింది. భారత్ తరఫున వైష్ణవి ఫాల్కే (3వ నిమిషంలో) ఒక గోల్ చేయగా... ఆస్ట్రేలియా జట్టుకు ఆమీ లాటన్ (37వ నిమిషంలో), లెక్సీ పికెరింగ్ (60వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. 'డ్రా'గా ముగుస్తుందనుకున్న మ్యాచ్‌ను భారత బృందం చివరి నిమిషంలో చేజార్చుకుంది. ఆఖరి క్షణాల్లో లభించిన పెనాల్టీ కార్నర్‌ను లెక్సీ పికెరింగ్ గోల్‌గా మలిచి ఆస్ట్రేలియాను గెలిపించింది. భారత్‌కు ఈ మ్యాచ్‌లో ఏకంగా ఎనిమిది పెనాల్టీ కార్నర్‌లు లభించగా అన్నింటిని వృథా చేసుకోవడం గమనార్హం. తొమ్మిది జట్లు పోటీపడుతున్న ఈ లీగ్‌లో భారత్ పది మ్యాచ్‌లు పూర్తి చేసుకొని తొమ్మిది పాయింట్లతో ఏడో స్థానంలో ఉంది. భారత్ తమ తదుపరి రెండు మ్యాచ్‌లను 17, 18వ తేదీల్లో అర్జెంటీనా జట్టుతో ఆడుతుంది.

కలలో కూడా ఊహించలేదు

భారత టెస్టు జట్టు కెప్టెన్సీపై శుబ్‌మన్ గిల్ వ్యాఖ్య

- రోహిత్, కోహ్లి నుంచి ఎంతో నేర్చుకున్నా
- గంభీర్‌తో అనుబంధం ఇప్పటిది కాదు



లండన్: టీమిండియా సారథ్య బాధ్యతలు నిర్వర్తించే అవకాశం లభిస్తుందని కలలో కూడా ఊహించలేదని భారత టెస్టు జట్టు కొత్త కెప్టెన్ శుబ్‌మన్ గిల్ అన్నాడు. పేస్ తురుపుముక్క బుమ్రా అందుబాటుపై ముందుగానే చెప్పడం కుదరదన్నాడు. జట్టులోని ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండేందుకు... యథేచ్ఛగా ఆడేందుకు తగిన లక్ష్యాలను నిర్దేశించుకుంటామన్నాడు. స్టార్, వెటరన్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలు సంప్రదాయ ఫార్మాట్‌కు వీడ్కోలు పలకడంతో గిల్‌కు జట్టు పగ్గాలు అప్పగించారు. ఇన్నాళ్లు ఓపెనింగ్ సవాల్‌ను ఎదుర్కొన్న శుబ్‌మన్ ఇప్పుడు మొదటిసారి ఓపెనింగ్‌తోపాటు సారథ్య పరీక్షకూ ఇంగ్లండ్‌కు వచ్చాడు. 2007లో టీమిండియా ఇంగ్లండ్ గడ్డపై టెస్టు సిరీస్ నెగ్గింది. తర్వాత చాలాసార్లు పర్యటించినా విజయం మాత్రం దక్కలేదు. ఇప్పుడు గిల్ నేతృత్వంలోని భారత్ ఈ నిరీక్షణకు తెరదించేందుకు ఐదు టెస్టుల సిరీస్‌లో రాణించడంపై దృష్టి సారించింది. ఇంగ్లండ్‌లోని స్కై స్పోర్ట్స్ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై గిల్ వెలిబుచ్చిన అభిప్రాయాలు అతని మాటల్లోనే...

ఆటగాళ్లపై ఒత్తిడి లేకుండా...

ఆటగాళ్లపై ఒత్తిడి లేకుండా జట్టు సంస్కృతిని మార్చాలనుకుంటున్నాను. సురక్షితమైన వాతావరణం కల్పించడం ద్వారా ఆ ఆటగాడు యథేచ్ఛగా ఆడే అవకాశం కల్పిస్తే... అతని పూర్తిస్థాయి సామర్థ్యం బయటపడుతుంది. ఓ నాయకుడు జట్టుకు చేయాల్సింది అదేనని నేను గట్టిగా విశ్వసిస్తున్నాను. ఇది అంతసులువు కాదని నాకూ తెలుసు. అయితే ఆ దిశగా నా ప్రణాళికలుంటాయి. కెప్టెన్ రోహిత్ శర్మ బ్యాటింగ్‌లో దూకుడుగా ఉన్నట్లే జట్టును నడిపించే విషయంలోనే అంతే పట్టుదలను ప్రదర్శిస్తాడు. సిరీస్ లేదంటే పర్యటనలో ఆటగాళ్ల నుంచి తనకు ఏం కావాలనేది స్పష్టం చేస్తాడు. ముగిసిన తర్వాత సమీక్షలోనూ ఇదే పంథా అనుసరిస్తాడు. ఇది సరైన మార్గనిర్దేశనమని నేను భావిస్తున్నా. దూకుడైన సారథిగా కోహ్లి మార్కు కూడా జట్టుపై ఉంది. ఇద్దరి నుంచి నేనెంతో నేర్చుకున్నాను.

అంచనాలనేవి సహజం

చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, హెడ్ కోచ్ గౌతం గంభీర్‌లు నాపై అసాధారణ ఒత్తిడిని పెట్టలేదు. అమితమైన అంచనాలను పెంచలేదు. అయితే ఓ ఆటగాడిగా, కెప్టెన్‌గా నాపై సహజంగానే కొన్ని అంచనాలయితే తప్పకుండా ఉంటాయి. ఇది కాదనలేని సత్యం. వాటిని అందుకునేందుకు నా వంతు ప్రయత్నం చేస్తా. నా ఆటతీరుపై మా నాన్న ప్రభావం తప్పకుండా ఉంటుంది. నాలాగే తను కూడా భారత టెస్టు జట్టుకు కెప్టెన్‌ను అవుతానని ఏనాడూ ఊహించలేదు. ఆయన కూడా నాలాగే టీమిండియాకు ఆడటం, జట్టును గెలిపించడంలో కీలకపాత్ర పోషించాలనే ఆశలే పెట్టుకున్నాడు. కెప్టెన్సీపై నాతో సంప్రదింపులు జరుగుతున్నప్పుడే నాన్న నాకు ఫోన్ చేసి అడిగారు. కానీ నేను మాత్రం అధికారికంగా నియమించాకే నాన్నతో ఆ విషయాన్ని పంచుకున్నాను.

గంభీర్ శైలిని అందిపుచ్చుకోవడం...

ఐపీఎల్‌లోనే కోచ్ గంభీర్ శైలికి అలవాటు పడ్డాను. కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు నేను ఆడినపుడు గంభీర్ మెంటార్‌గా ఉన్నాడు. కాబట్టి అతని శిక్షణ శైలిపై అవగాహన ఉంది. ఇప్పుడు ఓ జాతీయ జట్టుకు అతను హెడ్ కోచ్ కాబట్టి ఎంతబాగా అతని శైలి తెలిసున్నప్పటికీ ఇంకాస్త జాగ్రత్తగా అనుసరించాల్సి ఉంటుంది. జట్టు కోసం అంకితభావం, నిబద్ధతతో పనిచేసే గంభీర్ ఆటగాళ్లకు ఎప్పుడు అందుబాటులో ఉంటాడు. జట్టు ముందున్న లక్ష్యాలు, ఆటగాళ్లు అందుకోవాల్సిన అంచనాలు ముందే స్పష్టీకరిస్తాడు. జట్టుకు ఏ సమయంలో ఏం కావాలనేది ఓ సానుకూల దృక్పథంతో ఆటగాళ్ల మానసిక స్థయిర్యాన్ని పెంచుతాడు.

బుమ్రా అందుబాటుపై...

పేసర్ బుమ్రాపై పని భారాన్ని తగ్గించేందుకు అన్ని టెస్టులకు అందుబాటులో ఉండటం లేదు. అయితే ఏ, ఏ మ్యాచ్‌లు ఆడతాడనేది ఇప్పుడే వెల్లడించడం సాధ్యం కాదు. ఐదు టెస్టుల పూర్తిస్థాయి సిరీస్‌లో పరిస్థితులు, పలు అంశాలను బట్టి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అంతేకానీ అతను ఈ మ్యాచ్ ఆడడు. వచ్చే మ్యాచ్ ఆడతాడు అని చెప్పలేం. ఇంగ్లండ్ 'బజ్‌బాల్ క్రికెట్'ను ఎదుర్కొనేందుకు ప్రణాళికలేం లేవు. పరిస్థితులను బట్టే జట్టు ఎత్తుగడలు అమలవుతాయి. దూకుడు ప్రతీసారి ఫలించదు. ఆ విషయం నాకు తెలుసు.

'ప్రపంచ' ఆర్చరీ పోటీలకు జ్యోతిసురేఖ, చికిత

- బొమ్మదేవర ధీరజ్ కూడా అర్హత
- స్టార్ ఆర్చర్లు మధుర, అతాను దాస్, అభిషేక్ వర్మలకు చుక్కెదురు



పుణే: స్టార్ ఆర్చర్లు వెన్నం జ్యోతి సురేఖ, బొమ్మదేవర ధీరజ్ (ఆంధ్రప్రదేశ్), తనిపర్తి చికిత (తెలంగాణ) ప్రపంచ కప్ స్టేజ్-4 టోర్నీ, ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే భారత జట్టుకు ఎంపికయ్యారు. భారత ఆర్చరీ సంఘం (ఏఏఐ) ఆధ్వర్యంలో ఇక్కడ నిర్వహించిన జాతీయ సెలక్షన్ ట్రయల్స్‌లో పలువురు స్టార్ ఆర్చర్లకు నిరాశ ఎదురైంది. ఒలింపియన్ అతాను దాస్, ప్రపంచ ఏడో ర్యాంకర్ అభిషేక్ వర్మ, ఈ ఏడాది ప్రపంచకప్ టోర్నీల్లో మూడు పతకాలు నెగ్గిన మధుర ట్రయల్స్‌లో విఫలమయ్యారు. ఆశ్చర్యకరంగా టీనేజ్ ఆర్చర్లు 'ప్రపంచ' పోటీలకు అర్హత సాధించడం విశేషం! 15 ఏళ్ల మహారాష్ట్ర ఆర్చర్లు గత ఖడకే, శర్వారీ మహిళల రికర్వ్ లో ... 16 ఏళ్ల ప్రీతిక మహిళల కాంపౌండ్‌లో భారత జట్టుకు ఎంపికయ్యారు. మహిళల కాంపౌండ్‌లో జ్యోతి సురేఖ (18.25 పాయింట్లు), పర్ణీత్ (14), ప్రీతిక (12.25) వరుసగా తొలి మూడు స్థానాలు పొందారు. చికిత (12.25) కూడా ప్రీతికతో సమవుజ్జీగా నిలిచినప్పటికీ 'షూటాఫ్'తో చికిత నాలుగో స్థానానికి పరిమితమైంది. అయితే ఈ ప్రదర్శనతో ఆమె ప్రపంచకప్ ఈవెంట్‌కు అర్హత పొందగా... టాప్-3 ప్లేయర్లు రెండు మెగా ఈవెంట్లకూ క్వాలిఫై అయ్యారు. పురుషుల రికర్వ్‌లో అతాను దాస్ అర పాయింట్ (0.5) తేడాతో ప్రపంచ పోటీలకు దూరమయ్యాడు. ప్రపంచ కప్ స్టేజ్-4 ఈవెంట్ వచ్చే నెల 8 నుంచి 13 వరకు మాడ్రిడ్‌లో జరుగుతుంది. ప్రపంచ చాంపియన్ షిప్‌ను సెప్టెంబర్ 5 నుంచి 12 వరకు దక్షిణ కొరియాలో నిర్వహిస్తారు.

'లార్డ్' బవుమా
దక్షిణాఫ్రికా టెస్టు జట్టు కెప్టెన్‌పై స్టోరీ
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ఫ్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-ఇంగ్లిష్

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్ఏఎల్‌లో 86 టెక్నీషియన్ పోస్టులు

ప్రభుత్వ రంగ సంస్థ అయిన బెంగళూరులోని సీఎస్ఐఆర్-నేషనల్ ఎయిరోస్పేస్ లేబొరేటరీస్ (ఎన్ఏఎల్).. 86 టెక్నీషియన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు జూలై 10వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 86 (టెక్నీషియన్)
» **అర్హతలు:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్, ఐటీఐలో ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 10.07.2025 నాటికి 28 ఏళ్లలోపు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.19,900 – రూ.63,200 వేతన శ్రేణి లభిస్తుంది.
» **ఎంపిక ప్రక్రియ:** రాత పరీక్ష, ట్రేడ్ టెస్ట్‌ల ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 10.07.2025.
» **వెబ్‌సైట్:** https://www.nal.res.in

ఇన్‌కోయిస్‌లో సైంటిస్ట్ ఉద్యోగాలు

భారత ప్రభుత్వ భూశాస్త్ర మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్(ఇన్‌కోయిస్).. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ సైంటిస్ట్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 76
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ సైంటిస్ట్ 3-04 పోస్టులు, ప్రాజెక్ట్ సైంటిస్ట్ 2-16 పోస్టులు, ప్రాజెక్ట్ సైంటిస్ట్ 1-9 పోస్టులు, ప్రాజెక్ట్ అసిస్టెంట్స్ 17 పోస్టులు, ప్రాజెక్ట్ సైంటిఫిక్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్-15 పోస్టులు.
» **అర్హతలు:** పోస్టును అనుసరించి ఓషనోగ్రఫీ, అట్మాస్ఫియరిక్ సైన్సెస్, ఇంజనీరింగ్, జియో ఇన్ఫర్మాటిక్స్, ఫిజిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ తదితర విభాగాల్లో కనీసం 60 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీతోపాటు అనుభవం, పీహెచ్‌డీ ఉండాలి.
» **వయసు:** ఆయా పోస్టును అనుసరించి 35 ఏళ్ల నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** ప్రాజెక్ట్ సైంటిస్ట్ 3కు రూ.78,000, ప్రాజెక్ట్ సైంటిస్ట్ 2కు రూ.67,000, ప్రాజెక్ట్ సైంటిస్ట్ 1కు రూ.56,000, ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.20,000, సైంటిఫిక్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్‌కు రూ.18వేలు వేతనం లభిస్తుంది.
» **ఎంపిక విధానం:** సైంటిస్ట్ పోస్టులకు ఇంటర్వ్యూ, అసిస్టెంట్‌లకు రాత పరీక్ష ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. పరీక్ష, ఇంటర్వ్యూ హైదరాబాద్‌లో జరుగుతాయి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 30.06.2025.
» **వెబ్‌సైట్:** https://incois.gov.in

ఐసీఎంఆర్‌లో యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

ఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్).. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
» **పోస్టుల వివరాలు:** యంగ్ ప్రొఫెషనల్స్ 1(అడ్మినిస్ట్రేషన్)-05 పోస్టులు, యంగ్ ప్రొఫెషనల్స్ 2(అడ్మినిస్ట్రేషన్)-06 పోస్టులు, యంగ్ ప్రొఫెషనల్స్ 2 (ఐటీ) -1 పోస్టు.
» **అర్హతలు:** పోస్టును అనుసరించి 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఐటీ అప్లికేషన్స్, కంప్యూటర్ పరిజ్ఞానం, ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** యంగ్ ప్రొఫెషనల్స్1కు 35 ఏళ్లు, యంగ్ ప్రొఫెషనల్స్ 2కు 40 ఏళ్లు మించరాదు.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, ఉద్యోగానుభవం, రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 30.06.2025.
» **వెబ్‌సైట్:** https://www.icmr.gov.in/employmentopportunities

పీడీఐఎల్, నోయిడాలో ఎగ్జిక్యూటివ్ గ్రేడ్-2 పోస్టులు

నోయిడాలోని ప్రాజెక్ట్స్ అండ్ డెవలప్‌మెంట్ ఇండియా లిమిటెడ్(పీడీఐఎల్).. ఒప్పంద ప్రాతిపదికన మూడేళ్ల పనిచేసేందుకు ఎగ్జిక్యూటివ్ గ్రేడ్-2 (ఎస్ఎస్‌పీ-క్యూసీ ఆడిట్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఎస్సీ(కెమిస్ట్రీ)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:**31.05.2025నాటికి 35ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.51,800.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డీజీఎం అండ్ హెచ్‌వోడీ(కార్పొరేట్ హెచ్ఆర్), పీడీఐఎల్ భవన్, ఏ-14, సెక్టార్-1, నోయిడా-201301, గౌతమ్ బుద్ నగర్(ఉత్తరప్రదేశ్) చిరునామకు పంపించాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**19.06.2025
» **పర్సనల్ ఇంటర్వ్యూ తేది:** 27.06.2025.
» **ఇంటర్వ్యూ వేదిక:**పీడీఐఎల్ భవన్, నోయిడా.
» **వెబ్‌సైట్:** https://www.pdilin.com

సీఎస్ఐఆర్- సీఈఆర్‌సీలో ఉద్యోగాలు

కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖకు చెందిన కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) పరిధిలోని పరిశోధన ల్యాబొరేటరీ.. సీఎస్ఐఆర్ -స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ సెంటర్.. వివిధ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10
» **పోస్టుల వివరాలు:** జూనియర్ స్టెనోగ్రాఫర్-2 పోస్టులు, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(జనరల్)- 6 పోస్టులు, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(ఫైనాన్స్ అండ్ అకౌంట్స్) -1 పోస్టు, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(స్టోర్స్ అండ్ పర్చేస్)- 1 పోస్టు.
» **అర్హతలు:** 10+2/ఇంటర్మీడియెట్ తత్సమాన అర్హత ఉండాలి.
» **వయసు:** జూనియర్ స్టెనోగ్రాఫర్ పోస్టుకు గరిష్ఠ వయోపరిమితి 27 ఏళ్లు, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ పోస్టుకు 28 ఏళ్లుగా ఉంది.
» **వేతనం:** జూనియర్ స్టెనో గ్రాఫర్ పోస్టుకు రూ.25,500-రూ.81,100; జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్‌కు రూ.19,900 - రూ.63,200 వేతన శ్రేణి లభిస్తుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 30.07.2025
» **వెబ్‌సైట్:** https://serc.res.in/csirrecruitment

కేంద్రంలో స్టెనోగ్రాఫర్ కొలువు

» 261 స్టెనోగ్రాఫర్ పోస్టులకు ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్
» ఇంటర్‌ఉత్తీర్ణతతోనే దరఖాస్తుకు అవకాశం
» సీబీటీ పరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక

కేంద్ర ప్రభుత్వ నియామకాల సంస్థ.. స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. స్టెనోగ్రాఫర్ గ్రేడ్ సీ, డీ ఎగ్జామినేషన్ 2025కు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాలు/సంస్థల్లో స్టెనోగ్రాఫర్ పోస్టులను భర్తీ చేయనుంది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ), స్కిల్ టెస్టుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో ఎస్ఎస్‌సీ స్టెనోగ్రాఫర్ ఎగ్జామినేషన్, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

స్టెనోగ్రఫీ నైపుణ్యాలుండి కేంద్ర కొలువు కోరుకునే అభ్యర్థులకు ఎస్ఎస్‌సీ స్టెనోగ్రాఫర్ గ్రేడ్ సీ,డీ ఎగ్జామినేషన్ 2025 చక్కటి అవకాశం. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతోనే కేంద్రంలోని వివిధ మంత్రిత్వ శాఖలు/విభాగాలు/సంస్థల్లో ఉద్యోగం సొంతం చేసుకోవచ్చు. తద్వారా ఉద్యోగ భద్రతతోపాటు ఆకర్షణీయ వేతనం సొంతం చేసుకోవచ్చు.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 261.

అర్హతలు

స్టెనోగ్రాఫర్ గ్రేడ్ సీ, డీ పోస్టులకు 01.08.2025 నాటికి గుర్తింపు పొందిన బోర్డు నుంచి 10+2/ఇంటర్మీడియెట్ తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి. దీంతోపాటు స్టెనోగ్రఫీ నైపుణ్యాలు ఉండటం తప్పనిసరి. స్టెనోగ్రఫీ స్కిల్స్ లేని అభ్యర్థులకు అర్హత ఉండదు.

వయసు

స్టెనోగ్రాఫర్ గ్రేడ్ సీ పోస్టులకు 01.08.2025 నాటికి 18 నుంచి 30 ఏళ్ల మధ్యలో వయసు ఉండాలి. అలాగే స్టెనోగ్రాఫర్ గ్రేడ్ డీ పోస్టులకు 01.08.2025 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్యలో ఉండాలి. గరిష్ఠ వయోపరిమితిలో ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు సడలింపు లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ)లో ప్రతిభతో పాటు స్కిల్ టెస్టులో అర్హత ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. సీబీటీలో స్కోర్ ఆధారంగా స్కిల్ టెస్టుకు ఎంపిక చేస్తారు. స్కిల్ టెస్టు అర్హత పరీక్ష మాత్రమే. కాని ఇందులో కనీస అర్హత మార్కులు తప్పనిసరిగా సాధించాల్సి ఉంటుంది.

200 మార్కులకు రాత పరీక్ష

- ఎంపిక ప్రక్రియ తొలి దశలో 200 మార్కులకు కంప్యూటర్ బేస్డ్ టెస్టు నిర్వహిస్తారు. ప్రశ్న పత్రంలో ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ఇందులో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 50 ప్రశ్నలు-50 మార్కులకు, జనరల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు-50 మార్కులకు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్ 100 ప్రశ్నలు-100 మార్కులకు అడుగుతారు. ప్రశ్న పత్రం (బైలింగ్వల్) హిందీ /ఇంగ్లిష్‌లో ఉంటుంది. పరీక్ష వ్యవధి 2గంటలు.
- సీబీటీ పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు. పరీక్ష వివిధ షిఫ్ట్‌ల్లో నిర్వహిస్తున్న నేపథ్యంలో నార్మలైజేషన్ ప్రక్రియను అనుసరిస్తారు.



స్కిల్ టెస్ట్

- సీబీటీలో ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులకు స్టెనోగ్రఫీలో స్కిల్ టెస్టు నిర్వహిస్తారు. ఇంగ్లిష్/హిందీలో పది నిమిషాలకు ఒక డిక్టేషన్ చొప్పున ఇస్తారు. స్టెనోగ్రాఫర్ గ్రేడ్ సీ పోస్టులకు నిమిషానికి వంద పదాల చొప్పున టైప్ చేయాలి. స్టెనోగ్రాఫర్ గ్రేడ్ సీ పోస్టులకు నిమిషానికి 80పదాల చొప్పున టైప్ చేయాలి. ఇవన్నీ కంప్యూటర్‌పైనే టైప్ చేయాల్సి ఉంటుంది.
- స్టెనోగ్రాఫర్ గ్రేడ్ డీ పోస్టులకు ఇంగ్లిష్ లాంగ్వేజ్‌కు 50 నిమిషాలపాటు టైప్ చేయాల్సి ఉంటుంది. అదే హిందీ లాంగ్వేజ్‌కు అయితే 65 నిమిషాల వ్యవధి ఉంటుంది.
- స్టెనోగ్రాఫర్ గ్రేడ్ సీ పోస్టులకు ఇంగ్లిష్ లాంగ్వేజ్‌కు 40 నిమిషాలపాటు టైప్ చేయాల్సి ఉంటుంది. అదే హిందీ లాంగ్వేజ్‌కు అయితే 55 నిమిషాల వ్యవధి ఉంటుంది.
- ఇంగ్లిష్ స్టెనోగ్రఫీ టెస్టును ఎంపిక చేసుకొని అర్హత సాధించిన వారు ఉద్యోగంలో చేరిన తర్వాత తప్పనిసరిగా హిందీ టైపింగ్ కూడా నేర్చుకోవాలి. అదేవిధంగా హిందీని ఎంచుకొని అర్హత సాధించిన అభ్యర్థులు ఇంగ్లిష్ టైపింగ్‌ను తప్పనిసరిగా నేర్చుకోవాలి. ఎందుకంటే ఆయా విభాగాల్లో కొలువులో చేరిన తర్వాత రెండు భాషల్లో టైపింగ్ చేయాల్సి ఉంటుంది.

రాత పరీక్షలో రాణించేలా

- 200 మార్కులకు నిర్వహించే కీలకమైన రాత పరీక్షల్లో రాణించేందుకు అభ్యర్థులు ఇప్పటినుంచే ప్రిపరేషన్ సాగించాలి. ఇందులో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ విభాగాలపై ప్రశ్నలు అడుగుతారు.
- జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ విభాగంలో.. వెర్బల్, నాన్ వెర్బల్ తరహా ప్రశ్నలు ఉంటాయి. ఇందులో అనాలజీస్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, స్పేస్ విజువలైజేషన్, ప్రాబ్లం సాల్వింగ్, అనాలసిస్, జడ్జ్‌మెంట్, డెసిజన్ మేకింగ్, విజువల్ మేకింగ్, రిలేషన్‌షిప్ కాన్సెప్ట్‌లు, అరిథమెటిక్ రీజనింగ్, వెర్బల్ అండ్ ఫిగరల్ క్లాసిఫికేషన్స్, అరిథమెటికల్ నంబర్ సిరీస్, నాన్ వెర్బల్ సిరీస్ తదితరాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.
- జనరల్ అవేర్‌నెస్ విభాగంలో.. అభ్యర్థికి తన పరిసరాలపై ఉన్న అవగాహనను పరిశీలించేలా ప్రశ్నలు అడుగుతారు. అదేవిధంగా తాజా జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ సంఘటనలు, కరెంట్ అఫైర్స్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. భారత్‌కు పొరుగు దేశాలతో ఉన్న సంబంధాలతోపాటు చరిత్ర-సంస్కృతి, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, రాజ్యాంగం, క్రీడలు, సైన్స్ రంగంలో పరిశోధనలు వంటి అంశాలపైనా ప్రశ్నలు అడిగే అవకాశముంది.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్ విభాగంలో.. ఆంగ్ల భాషపై అభ్యర్థికి ఉన్న అవగాహనను పరిశీలించేలా ప్రశ్నలు ఉంటాయి. ముఖ్యంగా వొకాబ్యులరీ, గ్రామర్, వాక్యనిర్మాణం, సినానిమ్స్, యాంటోనిమ్స్‌తోపాటు ఇంగ్లిష్‌లో అభ్యర్థికి ఉన్న రాత సామర్థ్యాన్ని సైతం పరీక్షించేలా ప్రశ్నలు అడుగుతారు.
- అభ్యర్థులు తొలుత సిలబస్‌ను పరిశీలించాలి. ఆ తర్వాత గత ప్రశ్నపత్రాలను విశ్లేషించి పరీక్ష కోణంలో ముఖ్యమైన అంశాలపై ప్రధానంగా దృష్టిసారించాలి.

ఆయా సిలబస్ అంశాల బేసిక్స్‌పై అవగాహన పెంచుకున్న తర్వాత సాధ్యమైనన్ని ఎక్కువ మోడల్ ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి. ఈ పరీక్షలో విజయానికి వేగం, కచ్చితత్వం కీలక పాత్ర పోషిస్తాయి. కాబట్టి ప్రాక్టీస్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వడం మేలు చేస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** 26.06.2025
- **పరీక్ష తేది:** 2025, ఆగస్టు 6 నుంచి 11వ తేదీ వరకూ
- **వెబ్‌సైట్:** https://ssc.gov.in

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
16-6-2025

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	573	81,119
నిఫ్టీ ▽	170	24,719

విదేశీ సూచీలు

నాస్‌డాక్	19,407	▽	255
డోజోన్స్	42,198	▽	770
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,851	▽	34
డాక్స్	23,516	▽	255
షాంఘై	3,377	▽	26
నికాయ్	37,834	▽	339

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.75	86.77
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	114.70	117.67
€	యూరో	ఎస్‌బీఐ	98.11	100.84
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.26	60.81
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.80	57.02
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	64.81	69.48
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.06	23.57
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.55	23.33
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.11	12.93

ఆస్తుల బదిలీ సాఫీగా.. సులభంగా!

- ఆర్థిక ఆస్తుల పంపకం సులభమే
- స్థిరాస్తులవిషయంలో సంక్లిష్టతలు
- అందుబాటులో ఎన్నో మార్గాలు
- వీలునామా, గిఫ్ట్ డీడ్, ఫ్యామిలీ ట్రస్ట్
- తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే వివాదాలకు తావు

సుధాకర్ (71) తన మరణానంతరం తనకున్న ఏకైక ఇల్లు ఇద్దరు కుమారులకు సమానంగా చెందుతుందని వీలునామా రాశాడు. అనారోగ్యంతో సుధాకర్ 2022లో ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయాడు. మూడేళ్లు గడుస్తున్నా కానీ సుధాకర్ కోరిక నెరవేరలేదు. ఆ ఇంటి కోసం సోదరులిద్దరి మధ్య అంగీకారం కుదరడం లేదు. ఇంటిని విక్రయించి వచ్చిన మొత్తాన్ని సమానంగా పంచుకుందామని ఒకరు అంటుంటే.. మరొకరు ఆ ప్రతిపాదనకు ఒప్పుకోవడం లేదు. దేశంలో వారసత్వ వివాదాల్లో ఎక్కువగా ఇళ్ల గురించే ఉంటున్నాయనడానికి ఇదొక ఉదాహరణ.

– సాక్షి, బిజినెస్ డెస్క్



బెంగళూరు సంస్థ 'దక్ష్' 2017లో చేపట్టిన అధ్యయనం ప్రకారం.. దేశంలో మూడింట ఒక వంతు వివాదాలు భూమి, ఇంటి గురించే ఉంటున్నాయి. ఇందులో 80 శాతం వారసత్వ హక్కులకు సంబంధించినవే కావడం గమనార్హం. 2016 నాటి ఒక సర్వే ప్రకారం చూసినా 66 శాతం సివిల్ వివాదాలు భూమి, ఇల్లు గురించే ఉన్నాయి. ఒకరికి మించిన వారసుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడం, వీలునామాలో ఆస్తుల పంపకం అసమంజసంగా ఉండడం, వీలునామాల ఫోర్జింగ్, ఆస్తులను బలవంతంగా స్వాధీనం చేసుకోవడం తదితర అంశాలన్నీ కోర్టుల్లో న్యాయపోరాటాలకు దారితీస్తున్నాయి. ఆస్తుల పంపకం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వివాదాలను సాధ్యమైన మేర తగ్గించొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ''చట్టపరమైన సంక్లిష్టతలు, పరిపాలనా ప్రక్రియలకు దూరంగా ఉండడం అసాధ్యం. అయినప్పటికీ, ఆస్తులను ఎప్పుడు, ఎలా బదిలీ చేయాలన్నది నిర్ణయించడం ద్వారా వీటిని పరిమితం చేయొచ్చు''అని 5నాన్స్ వ్యవస్థాపకుడు, సీఈవో దినేష్ రోహిరా సూచించారు.

అందరికీ ఒక్కటే పరిష్కారం కాదు..

బ్యాంక్ డిపాజిట్లు మ్యూచువల్ ఫండ్స్, స్టాక్స్‌లో పెట్టుబడులు తదితర ఆర్థిక ఆస్తుల బదిలీ ఎంతో సులభం. వీటి విలువను ఏరోజుకారోజు సులభంగా లెక్కించొచ్చు. కనుక వీటిని ఎంత మంది వారసుల మధ్య అయినా సులభంగానే పంపిణీ చేయొచ్చు. స్థిరాస్తులైన భూమి, ఇల్లుతోపాటు ఆభరణాలు, పెయింటింగ్‌లు, కళాకృతుల పంపిణీ సవాళ్లతో కూడుకున్నదే. వీటి అసలైన విలువను అంచనా వేయడంలోనే సమస్యలు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా ఒకే ఇంటిని ఒకటికి మించి భాగాలుగా పంచే విషయంలో ఇద్దరి మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే అది న్యాయవివాదానికి దారితీయవచ్చు. కనుక ఈ విషయంలో సాధ్యమైన మేర వివాద రహితంగా పరిష్కారాన్ని చూడాల్సి ఉంటుంది. వీలునామా, ట్రస్ట్, గిఫ్ట్ డీడ్, ఆస్తులను విక్రయించి పంచడం.. ఆస్తుల బదిలీకి ఇలా ఎన్నో మార్గాలున్నాయి. వీటిలో సానుకూలతలే కాదు, ప్రతికూలతలూ ఉన్నాయి. తమకు అత్యంత అనుకూలమైన దానిని ఎంపిక చేసుకోవడమే మెరుగైన మార్గం అవుతుంది.

జీవించి ఉండగా /మరణానంతరం..

జీవించి ఉండగా ఆస్తుల బదిలీకి గిఫ్ట్‌డీడ్ చేయడం, ఫ్యామిలీ ట్రస్ట్‌కు బదిలీ చేయడం తదితర మార్గాలున్నాయి. ఆస్తులను విక్రయించి అందిరికీ సమానంగా పంచొచ్చు. లేదా హెచ్‌యూఎఫ్‌కు గిఫ్ట్ డీడ్ చేయొచ్చు. మరణానంతరం ఆస్తులు ఎవరికి చెందాలన్నది వీలునామా ద్వారా నిర్దేశించొచ్చు.

గిఫ్ట్ డీడ్



బహుమతి కింద ఒక వ్యక్తి తన స్థిర, చరాస్తులను స్వచ్ఛందంగా బదిలీ చేయడానికి గిఫ్ట్ డీడ్ అనుకూలిస్తుంది. జీవించి ఉండగా బదిలీ చేస్తున్నారు కనుక, తమ తదనంతరం న్యాయపరమైన, వారసత్వ వివాదాలకు అవకాశాలు చాలా తక్కువ. స్వీయ ప్రయోజనాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోకపోతే గిఫ్ట్ డీడ్ అనంతరం ఆ ఆస్తులపై బదిలీ చేసిన వారు హక్కును కోల్పోవడం ఇందులో ఉన్న ప్రతికూలత.

ఫ్యామిలీ/ప్రైవేటు ట్రస్ట్



ఇండియన్ ట్రస్ట్ యాక్ట్, 1882 కింద ఫ్యామిలీ లేదా ప్రైవేటు ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి వాటికి ఆస్తులను బదిలీ చేయడం ఒక పరిష్కారం. ఇదొక చట్టబద్ధమైన సంస్థ. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తుంది. ఎవరికి ఏ మేరకు ఆస్తుల ప్రయోజనాలు అందించాలో ఇందులో పేర్కొనొచ్చు. ట్రస్టీల బాధ్యతలు, లబ్ధిదారులు, ఆస్తుల నిర్వహణ గురించి స్పష్టంగా ట్రస్ట్ డీడ్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. కుటుంబ సభ్యులు, వారసులు, ఇతరులు చట్టపరంగా సవాలు చేయడాన్ని నిరోధిస్తుంది. లబ్ధిదారులకు రుణదాతల నుంచి రక్షణనిస్తుంది. ఇందులో ఉన్న ప్రతికూలత ఆస్తులను ట్రస్ట్‌కు బదిలీ చేసిన తర్వాత వాటిపై స్వీయ నియంత్రణ కోల్పోతారు. హక్కులన్నీ ట్రస్టీ చేతుల్లోకి వెళతాయి. కాకపోతే ఆ ఆస్తుల హక్కుదారులను నిర్ణయించే అధికారం ఉంటుంది. ట్రస్ట్ ఏర్పాటుకు ఎంతో సమయం తీసుకుంటుంది. నిర్వహణ కూడా సంక్లిష్టమైనది. కొన్ని ఆస్తులు కాకుండా పెద్ద మొత్తంలో ఆస్తులున్న వారికి ఇది అనుకూలిస్తుంది. ట్రస్ట్ తరఫున ప్రత్యేక రికార్డుల నిర్వహణ, రిటర్నుల దాఖలు తప్పనిసరి. దీని సవరణ, రద్దు అన్నది ఎంతో కష్టమైనది.

ఆస్తుల విక్రయం



తమ తదనంతరం ఆస్తుల పంపకంలో సమస్యలు వస్తాయని సందేహించే వారు జీవించి ఉండగానే వాటిని విక్రయించి వారసులకు బదిలీ చేయడం ఒక పరిష్కారం. ముఖ్యంగా విదేశాల్లో స్థిరపడిన పిల్లలు కలిగిన వారికి ఇది మరింత అనుకూలం. అనవసర ప్రక్రియలను నివారించి, సమయాన్ని ఆదా చేస్తుంది. న్యాయ వివాదాలకు ఆస్కారం ఉండదు. స్వార్జితం అయితే తమకు నచ్చిన విధంగా పంపకాలు చేసుకోవచ్చు.

సెటిల్‌మెంట్ డీడ్

ఆస్తుల పంపకం విషయంలో కుటుంబ సభ్యుల మధ్య అంగీకార పత్రం ఇది. కనుక న్యాయవివాదాలకు ఆస్కారం తక్కువ. దీన్ని రిజిస్టర్ చేసుకోకపోయినా కోర్టుల ముందు ఆధారంగా నిలుస్తుంది. రిజిస్టర్ చేసుకుంటే మంచిది. నిపుణుల సహకారంతో శ్రద్ధగా డ్రాఫ్టింగ్ చేసుకోవడం ద్వారా న్యాయవివాదాలను నివారించొచ్చు. ఒక్కసారి రిజిస్టర్ చేసుకుంటే తిరిగి కోర్టు అనుమతి లేకుండా రద్దు చేసుకోవడం కుదరదు. దీన్ని కోర్టుల్లో సవాలు చేసుకోవచ్చు.

ఉమ్మడి యజమాని



మరొకరితో ఉమ్మడిగా ఆస్తులను కలిగి, సర్వైవర్‌షిప్ హక్కుతో ఉంటే.. అప్పుడు ఒకరి మరణానంతరం మరొకరికి ఆస్తులు బదిలీ అయిపోతాయి. నామినేషన్, బెనిఫీషియరీ (లబ్ధిదారు) నమోదు చేస్తే, మరణానంతరం ఆస్తులను వారు క్లెయిమ్ చేసుకోవడానికి అనుమతించినట్టు అవుతుంది. ఈ విధానంలో వివాదాలకు అవకాశాలు ఎక్కువ. నామినేషన్ ఉంటే ఆస్తులపై హక్కులు వారసులకు ఆలస్యంగా బదిలీ అవుతాయని గుర్తుంచుకోవాలి. బెనిఫీషియరీ నమోదు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయకపోతే సరైన లబ్ధిదారులకు ఆస్తుల బదిలీ జరగకపోవచ్చు. ఆస్తుల బదిలీ ఏ రూపంలో చేస్తున్నా.. దీనికంటే ముందు న్యాయ నిపుణుల సహకారం తీసుకోవడం ద్వారా సాధ్యమైన మేర వివాదాలు తలెత్తకుండా నివారించొచ్చు.

వీలునామా

తన మరణానంతరం ఆస్తుల సాఫీ బదిలీకి వీలునామా ఉపకరిస్తుంది. చట్టబద్ధమైన వారసులు కాని వారికి సైతం ఆస్తుల పంపకాన్ని వీలునామా ద్వారా నిర్ణయించొచ్చు. ఆస్తులను ఎలా పంచాలనే విషయంలో ప్రత్యేక సూచనలు ఇవ్వొచ్చు. మైనర్ పిల్లల కోసం సంరక్షకులను నియమించొచ్చు. వీలునామా రాసినా కానీ, ఆ ఆస్తులపై జీవించి ఉన్నంత కాలం యజమానికే హక్కు, అధికారం ఉంటాయి. వీలునామాను ఎప్పుడైనా సమీక్షించొచ్చు. సులభంగా తిరగరాయొచ్చు. కానీ, అస్పష్టతకు తా విస్తే భవిష్యత్తులో కోర్టు వివాదాల చిక్కు ఇందులో ఎక్కువ. వీలునామా ద్వారా ప్రైవేటు ట్రస్ట్‌ను సైతం ఏర్పాటు చేసి, మరణానంతరం అమల్లోకి వచ్చేలా నిర్ణయించొచ్చు.

ప్రాపర్టీ పంపకం సంక్లిష్టం చేయొద్దు..

ఒక్కరే వారసులు ఉన్న సందర్భాల్లో ఆస్తుల బదిలీకి ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాబోవు. ఒకరికి మించి వారసుల మధ్య ఆస్తుల బదిలీయే సంక్లిష్టం అవుతుంది. ఒక ఇల్లు ఉంటే సమానంగా పంచుకోండంటూ చెప్పడం సులభమే. కానీ, ఈ విషయంలో వారసుల మధ్య ఏకాభిప్రాయం లేకపోతే వివాదాలతో విలువైన సమయం హరించుకుపోతుంది. రెండు ఇళ్లు ఉంటే ఇద్దరు వారసులకు చెరొకటి పంచడం కూడా అంత సులభమేమీ కాదు. రెండూ ఒకే ప్రాంతంలో, ఒక్కటే విస్తీర్ణంతో ఉంటే ఫర్వాలేదు. వేర్వేరు చోట్ల ఉన్నప్పుడు వాటి విలువ ఒకే రకంగా ఉండదు. ఇద్దరు వారసులూ ఒకే ప్రాపర్టీ కోరుకోవచ్చు. వారసుల్లో ఒకరు విదేశాల్లో ఉండి, ఒకరు ఇక్కడే స్థిరపడొచ్చు. విదేశాల్లో స్థిరపడిన వారు భారత్‌లో ఆస్తుల పట్ల ఆసక్తి చూపించరని, వాటి నిర్వహణ, పన్నుల చెల్లింపు వారికి భారంగా మారొచ్చన్నది నిపుణుల అభిప్రాయం. కనుక విదేశాల్లో స్థిరపడిన వారికి భౌతిక ఆస్తుల కంటే ఆర్థిక ఆస్తుల రూపంలో పంపకం మెరుగైన మార్గం అవుతుంది. ఒక్కటే ఇల్లు లేదా ఫ్లాట్ కలిగి, మరే ఆస్తుల్లేని వారు.. తమ తదనంతరం ఆ ఇంటిని విక్రయించి, వచ్చిన మొత్తాన్ని వారసులకు సమానంగా బదిలీ చేయాలంటూ వీలునామా రాసుకోవడం మంచి ఆలోచన అని నిపుణుల సూచన. అంతేకానీ, ఒకే ప్రాపర్టీకి సమాన హక్కులు చెందేలా రాసినట్టయితే ఏకాభిప్రాయం కుదరని సందర్భాల్లో వివాదాలకు తావిచ్చినట్టు అవుతుంది.

అన్నీ ఆలోచించాకే అడుగు..

- ఆస్తులను పోగేసి వారసులకు పంచిపెట్టాలా? అన్నది పూర్తిగా వ్యక్తిగత ఎంపికే. వారసుల కంటే ముందు తమ అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నది నిపుణుల సూచన. జీవితకాలం కష్టార్జితం వృద్ధాప్యంలో మెరుగైన జీవనానికి భరోసా ఇవ్వాలి. తమ అవసరాలకు పోను మిగిలినది తమ తదనంతరం వారసులకు పంపిణీ చేయడం మెరుగైన ఆలోచన అవుతుంది. ముఖ్యంగా పిల్లల చదువులకు ఉన్నదంతా ఖర్చు చేసి.. వారికి మెరుగైన భవిష్యత్తును అందించిన తల్లిదండ్రులు మిగిలిన కొద్ది ఆర్థిక వనరులు/ఆస్తులను తమ కోసమే వినియోగించుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- తమ అవసరాలకు మించి అదనంగా కలిగి ఉంటే అప్పుడు జీవించి ఉండగానే బదిలీ చేయడాన్ని పరిశీలించొచ్చు.
- కొందరు పిల్లలకు ఆస్తులను పంపిణీ చేసే సందర్భంలో జీవిత భాగస్వామిని విస్మరిస్తుంటారు. ముందుగానే ఆస్తులన్నింటినీ పిల్లలకు పంచేసిన తర్వాత.. దంపతుల్లో ఒకరు ముందుగా కాలం చేస్తే అప్పుడు రెండో వ్యక్తి యోగ క్షేమాలను పిల్లలు పట్టించుకుంటారన్న గ్యారంటీ లేదు. కనుక జీవిత భాగస్వామికి ఈ విషయంలో భరోసా కల్పించాలి.
- పిల్లల్లో ఒకరిద్దరు గొప్పగా స్థిరపడి.. ఎవరో ఒకరు వైవాహిక జీవితం విచ్ఛిన్నం కారణంగా తల్లిదండ్రులపైనే ఆధారపడి ఉండొచ్చు. అలాంటి ప్రత్యేక కేసుల్లో వారు జీవితాంతం అదే ఇంట్లో నివసించే హక్కు (రైట్ టు రిసైడ్)ను వీలునామా ద్వారా కల్పించొచ్చు.



- ఆస్తుల పంపకంలో పిల్లల ఆసక్తులను పట్టించుకోవాలి. వారికి ఇష్టం లేని ఆస్తులు, వ్యాపారాలను విడిచిపెట్టడం మంచి నిర్ణయం కాబోదు. అలా ఇచ్చిన వ్యాపారాలు, ఇంటి నిర్వహణను వారు పట్టించుకోకపోతే కొంత కాలానికి వాటి విలువ క్షీణిస్తుంది.
- ముఖ్యంగా మైనర్ పిల్లలు, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ఉంటే వారి కోసం సంరక్షకులను వీలునామా ద్వారా నియమించుకోవచ్చు. లేదా ట్రస్ట్ ఏర్పాటు చేయడాన్ని పరిశీలించొచ్చు. ఇలాంటి వారికి ఆస్తుల బదిలీలో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. నిపుణుల సాయంతో వారికి జీవిత కాలం పాటు స్థిరమైన ఆదాయ మార్గం కల్పించడంపై దృష్టి పెట్టాలి.
- ఆస్తుల బదిలీకి అనుకూలమైన చట్టబద్ధమైన ప్రక్రియలు, పన్ను బాధ్యతలను పరిగణనలోకి తీసుకోవాలి. విదేశాల్లో స్థిరపడిన పిల్లలకు ఆస్తులను బదిలీ చేస్తుంటే.. వారు తమ దేశాల్లో పన్నులు చెల్లించాల్సి రావచ్చు. కనుక వీటి గురించి ముందే పిల్లలతో చర్చించాలి.
- ఆస్తుల పంపకం అసంబద్ధంగా ఉంటే అది న్యాయ వివాదాలకు దారితీయవచ్చు. దీనివల్ల ఎన్నో ఏళ్ల విలువైన కాలంతోపాటు న్యాయపోరాటానికి ఎంతో వ్యయం చేయాల్సి వస్తుంది. ఆస్తుల బదిలీలో సాధ్యమైన మేర పారదర్శకతకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి.
- పిల్లలు ఇతర పట్టణాలు, విదేశాల్లో స్థిరపడినప్పుడు వారసత్వ ఆస్తుల పరిష్కారానికి తరచూ రావాల్సి వస్తే అది కష్టంగా మారుతుంది.
- సక్సెషన్ సర్టిఫికెట్, చట్టబద్ధమైన వారసులేనన్న ధ్రువీకరణ, లెటర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ పొందాలంటే వ్యక్తిగతంగా కోర్టు ముందు హాజరుకావాలి. వీటికి కూడా ఎన్నో సార్లు తిరగాల్సి వస్తుంది.
- తల్లిదండ్రుల పేరిట ఉన్న మ్యూచువల్ ఫండ్స్, షేర్లు ఇతర పెట్టుబడులు పిల్లలకు తెలియకపోవచ్చు. వీటి వివరాలను పిల్లలతో పంచుకోవడం మంచిదన్నది నిపుణుల సూచన.
- ఆస్తుల బదిలీ విషయంలో కొంత ఫీజు చెల్లించి నిపుణుల సలహా తీసుకోవడానికి వెనుకాడొద్దు.

స్టాక్ స్కోప్

ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ | బ్రోకరేజ్: జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,756 టార్గెట్: రూ. 2,048

ఎందుకంటే:
గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ నికర ప్రీమియం ఆదాయం వార్షికంగా 5 శాతం నీరసించింది. జనవరి–మార్చి(క్యూ4)లో రూ. 23,861 కోట్లకు పరిమితమైంది. ప్రధానంగా సింగిల్ ప్రీమియం ఆదాయం భారీగా 42 శాతం పైగా క్షీణించి రూ. 4,463 కోట్లను తాకడం ప్రభావం చూపింది. 20.8 శాతం ప్రయివేట్ మార్కెట్ వాటాతో పూర్తి ఏడాదికి కొత్త బిజినెస్ ప్రీమియం(ఎన్‌బీపీ) రూ. 35,580 కోట్లకు చేరింది. వ్యక్తిగత ఎన్‌బీపీ రూ. 26,360 కోట్లును తాకింది. 25.3 శాతం ప్రయివేట్ మార్కెట్ వాటాతో వార్షికంగా 11 శాతం వృద్ధి నమోదైంది.



ఇందుకు వ్యక్తిగత జీవిత బీమా ప్రొడక్టులకు పెరిగిన డిమాండ్ తోడ్పాటునిచ్చింది. 2024–25లో స్థూల పూర్తి(రిటెన్) ప్రీమియం 4 శాతం అధికంగా రూ. 84,980 కోట్లకు చేరింది. ఇందుకు పాలసీ రెనెవల్స్‌లో నిలకడ, కొత్త, పాత బిజినెస్‌లలో స్వల్ప వృద్ధి సహకరించాయి. పూర్తి ఏడాదికి కొత్త బిజినెస్ విలువ(వీవోఎన్‌బీ) 7.2% బలపడి రూ. 5,950 కోట్లకు చేరగా, వీవోఎన్‌బీ మార్జిన్ స్వల్పంగా తగ్గి 27.8 శాతానికి పరిమితమైంది. ఈ కాలం (2023–24)లో 28.1 శాతం మార్జిన్లు సాధించింది. అమ్మకాల పరిమాణం పుంజుకోవడం మార్జిన్లకు మద్దతిచ్చినప్పటికీ.. తక్కువ మార్జిన్ ఆఫరింగ్స్ వైపు కొంతమేర ప్రొడక్ట్ మిక్స్ దృష్టి పెట్టడం ప్రభావం చూపింది. క్యూ4లో నికర లాభం నామమాత్ర వృద్ధితో రూ. 814 కోట్లను తాకింది. నిర్వహణ సామర్థ్యాలు ఇందుకు దన్నునిచ్చాయి. బ్యాంకెస్యూరెన్స్ చానళ్లు, ఏజెన్సీలను పటిష్టం చేయడం తోపాటు నాన్‌యులిప్, ప్రొటెక్షన్ ప్రొడక్టులకు ప్రాధాన్యత ఇవ్వడం, డిజిటల్ సామర్థ్యాలను ఆధునీకరించడం తదితర వ్యూహాత్మక చర్యల ద్వారా కంపెనీ దీర్ఘకాలిక వృద్ధిపై దృష్టి సారించింది.

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ | బ్రోకరేజ్: ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 254 టార్గెట్: రూ. 324

ఎందుకంటే: దేశీయంగా బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి(థర్మల్ పవర్) రంగంలో భారత్ హెవీ ఎలక్ట్రిక్స్(బీహెచ్‌ఈఎల్) సుప్రసిద్ధ కంపెనీ. ఇంధన రంగంలో పలు మార్పులకు తెరలేచినప్పటికీ కొత్త బేస్ లోడ్ ప్లాంట్ల ఏర్పాటు ప్రాధాన్యతను ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో గత రెండేళ్ల(2023–24, 2024–25)లో బొగ్గు ఆధారిత ప్లాంట్లకు భారీగా ఆర్డర్లు పుట్టుకొచ్చాయి. వెరసి ఈ ప్రభుత్వ రంగ దిగ్గజం గత రెండేళ్లలో రూ. 78,000 కోట్లు, రూ. 92,500 కోట్ల విలువైన కాంట్రాక్టులను దక్కించుకుంది. గతంలో అంటే 2018–19 నుంచి 2022–23వరకూ చూస్తే సగటున రూ. 21,400 కోట్ల విలువైన ఆర్డర్లు లభించాయి. వీటితో పోలిస్తే



ఇటీవల ఆర్డర్ల రాక భారీగా పుంజుకుంది. ఈ బాటలో ఇటీవల కొద్ది నెలలుగా థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణానికి భారీ కాంట్రాక్టులను అందుకుంది. తాజాగా లభించిన భారీ ఆర్డర్ల జాబితాలో రాయ్‌పూర్ రెండో దశ, మీర్జాపూర్ తొలి దశ, ఖ్వాడా నాగ్‌పూర్ హెచ్‌వీడీసీ, ఆదిలాబాద్, ఉకాయ్, కొరాడి, కోడెర్మా, సిపట్, కవాయ్, మహన్ ప్లాంట్లున్నాయి. వెరసి బీహెచ్‌ఈఎల్ ఆర్డర్ బుక్ విలువ రూ. 2 లక్షల కోట్లను తాకింది. ఇవికాకుండా 6 గిగావాట్ల బొగ్గు ఆధారిత పవర్ ప్లాంట్ల కోసం ఎల్ 1 ఆర్డర్లను సైతం పొందింది. ఈ తరహా ప్రాజెక్టుల ఆర్డర్ల విలువ రూ. 50,000 కోట్లను అధిగమించినట్లు అంచనా వేస్తున్నాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26)లోనూ రూ. 80,000 కోట్ల విలువైన ఆర్డర్లు లభించే వీలున్నట్లు అంచనా. ఫలితంగా గతేడాది మొదలు 2026–27వరకూ ఆదాయం భారీగా పుంజుకోనున్నట్లు భావిస్తున్నాం. గతేడాది చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో వార్షిక ప్రాతిపదికన ఆదాయం 19 శాతం, నిర్వహణ లాభం(ఇబిటా) 103 శాతం, నికర లాభం 97 శాతం చొప్పున జంప్ చేశాయి.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఐటీఐ మ్యూచువల్ ఫండ్ 'డివినిటీ సిఫ్'



హైదరాబాద్: ఐటీఐ అస్సెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ 'డివినిటీ సిఫ్' పేరుతో స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (సిఫ్) కోసం కొత్త ప్లాట్‌ఫామ్‌ను ప్రకటించింది. ఈక్విటీ, హైబ్రిడ్, ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ వ్యాప్తంగా వినూత్నమైన పెట్టుబడి పరిష్కారాలను డివినిటీ సిఫ్ అందిస్తుందని ఐటీఐ అస్సెట్ మేనేజ్‌మెంట్ తెలిపింది. సంప్రదాయ మ్యూచువల్ ఫండ్స్, పీఎంఎస్/ఏఐఎఫ్‌ల మధ్య వారధిగా ఇది ఉంటుందని ఐటీఐ మ్యూచువల్ ఫండ్స్ సీఈవో జతిందర్ పాల్ సింగ్ పేర్కొన్నారు. మారుతున్న ఇన్వెస్టర్ల అవసరాలకు అనగుణంగా వినూత్నమైన, సౌకర్యవంతమైన పరిష్కాలను అందిస్తుందన్నారు. అధిక రిస్క్ తీసుకునే ఇన్వెస్టర్ల కోసం సెబీ ఇటీవలే ప్రత్యేక పెట్టుబడుల విభాగం 'సిఫ్'ను అనుమతించడం తెలిసిందే. ఇందులో కనీసం రూ.10 లక్షల నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మార్కెట్లో ఆటుపోట్లతే అధిక చాన్స్
నేటి నాన్నకు.. 'మల్టీ అసెట్' బాసట

'ఫండ్స్'ను బహుమతిగా ఇవ్వొచ్చా..?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఈఎల్‌ఎస్‌ఎస్ పథకాలు దీర్ఘకాలంలో మెరుగైన రాబడులు ఇస్తాయా..? – వివేక్

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్‌ఎస్‌ఎస్) పథకాలు పాత పన్ను విధానంలో సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల మొత్తంపై పన్ను ఆదా ప్రయోజనం కలిగినవవి. ఈ పథకాల్లో రాబడులు దీర్ఘకాలంలో సగటున 15–20% మధ్య ఉంటాయి. ఈ విభాగంలో బలహీన పనితీరు చూపించిన పథకాన్ని గమనించినా.. పీపీఎఫ్ కంటే అధిక రాబడులు కనిపిస్తాయి. కాంపౌండింగ్ (వడ్డీపై వడ్డీ జమ కావడం) ప్రయోజనంతో పెట్టుబడి వృద్ధి చెందుతుంది. మంచి పథకాన్ని ఎంపిక చేసుకుని, అది అన్ని కాలాల్లోనూ మంచి పనితీరు చూపిస్తుంటే దానితోనే కొనసాగొచ్చు. మార్కెట్‌తో అనుసంధానమైన సాధనాల్లో పెట్టుబడులు ఆటుపోట్లకు గురవుతంటాయి. కనుక వాటి పనితీరును కాలానుగుణంగా పరిశీలిస్తూ ఉండాలి. ఎందుకంటే కొంత కాలం పాటు మంచి పనితీరు చూపించినవి, ఆ తర్వాత చెత్త పథకాలుగా మారొచ్చు. అందుకే పెట్టుబడులను సమీక్షించుకోవడమనే సూత్రాన్ని అనుసరించాలి. మీరు ఇన్వెస్ట్ చేస్తున్న ఈఎల్‌ఎస్‌ఎస్ పథకం పనితీరు ఆశాజనకంగా లేకపోతే, దాని నుంచి మూడేళ్ల తర్వాత బయటకు వచ్చేయవచ్చు. ఎందుకంటే మూడేళ్లకు పెట్టుబడుల లాకిన్ ముగిసిపోతుంది. ఒకవేళ కొత్త పన్ను విధానంలోకి మారిపోయి ఉంటే అలాంటి వారు ఈఎల్‌ఎస్‌ఎస్ ఫండ్స్ బదులు రిస్క్, కాల వ్యవధి, రాబడుల అంచనాలకు అనుగుణంగా ఫ్లెక్సీక్యాప్, డైనమిక్ అస్సెట్ అలోకేషన్ తదితర పథకాలను పరిశీలించొచ్చు.

మ్యూచువల్ ఫండ్స్‌లో నా పెట్టుబడులను మరొకరికి బహుమతిగా ఇవ్వడం ఎలా? – నీరజ్ ప్రసాద్

మ్యూచువల్ ఫండ్స్ పథకంలోని యూనిట్లు ఒకరికి బదిలీ చేయడం కానీ, బహుమతిగా ఇవ్వడం కానీ కుదరదు. ఇన్వెస్టర్ తన పేరిట ఉన్న యూనిట్లు వేరొకరికి బదిలీ చేయడం అన్నది కేవలం.. ఇన్వెస్టర్ మరణించిన సందర్భాల్లోనే చోటు చేసుకుంటుంది. అటువంటి సందర్భంలో నామినీ క్లెయిమ్ దాఖలు చేసుకోవాలి. మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులను పిల్లలకు బహుమతిగా ఇవ్వాలన్నా కుదరదు. పిల్లల కోసం అయితే వారి పేరుతో ఇన్వెస్ట్ చేయడం ఒక్కటే మార్గం. పిల్లల వయసు 18 ఏళ్లలోపు ఉన్నా ఇది సాధ్యపడుతుంది. పిల్లలు మేజర్ అయ్యే వరకు (18 ఏళ్లు నిండే వరకు) తల్లిదండ్రులే సంబంధింత పెట్టుబడులకు సంరక్షకులు అధికారం కలిగి ఉంటారు. పిల్లల బర్త్ సర్టిఫికెట్‌తో పాటు, గార్డియన్ కేవైసీ వివరాలను మ్యూచువల్ ఫండ్ సంస్థ అడుగుతుంది. పిల్లల పేరిట (మైనర్లు) ఉన్న మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను విక్రయించగా వచ్చిన ఆదాయం.. తల్లిదండ్రుల ఆదాయానికి కలిపి చూపించాల్సి ఉంటుంది. ఒకవేళ పిల్లల వయసు 18 ఏళ్లు నిండిన తర్వాత పెట్టుబడులను వెనక్కి తీసుకుంటే అది వారి వ్యక్తిగత ఆదాయం కిందకే వస్తుంది. పిల్లలు కాకుండా వేరొకరికి మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు ఇవ్వాలనుకుంటే ముందుగా వాటిని విక్రయించాలి. అలా వచ్చిన నగదును బహుమతిగా ఇవ్వాలనుకునే వారికి బదిలీ చేయాలి. అప్పుడు మ్యూచువల్ ఫండ్స్ కొనుగోలు చేస్తున్న వ్యక్తి స్వయంగా ఆ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది.


సంగమేశ్వరుడి దర్శనానికి వచ్చిన భక్తులు

సంగమేశ్వరుడి జలాధివాసం

- జూన్‌లోనే కృష్ణానదిలో ఆలయం మునగడం ఇదే తొలిసారి
- ఈ ఏడాది చివరి దర్శనం కోసం తరలివచ్చిన భక్తజనం

కొల్లాపూర్: సప్తనది సంగమ ప్రాంతంలో కొలువైన సంగమేశ్వరుడు జలాధివాసం అయ్యాడు. ఏపీ సరిహద్దులోని కృష్ణానది తీరంలో వెలసిన సంగమేశ్వరాలయం ప్రతి సంవత్సరం వర్షాకాలంలో శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో మునిగిపోతుంది. మళ్లీ వేసవిలో నదిలో నుంచి బయటపడుతుంది. కాగా ఈ ఏడాది మార్చి 21న సంగమేశ్వరుడి ఆలయం నది నీళ్ల నుంచి బయటపడింది. గత కొన్ని రోజులుగా కృష్ణానదికి వరద జలాలు చేరుతుండటంతో శ్రీశైలం బ్యాక్‌వాటర్ లెవెల్ క్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 9 గంటల వరకు గుడి చుట్టూ నది నీళ్ల చేరుకోవడంతో ఈ ఏడాది సంగమేశ్వరుడిని చివరి దర్శనం చేసుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. 11 గంటలకు ఆలయ గర్భగుడిలోకి నీళ్ల చేరుకోవడంతో ప్రధాన అర్చకులు రఘురామశర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి.. సప్తనది జలాలకు హారతి ఇచ్చారు. మధ్యాహ్నానికి శివలింగం పూర్తిగా నీటిలో మునిగింది. రోజంతా నీటిమట్టం పెరుగుతూనే ఉండటంతో గుడి సగభాగం వరకు నీటిలో మునిగిపోయింది. శ్రీశైలం బ్యాక్ వాటర్ లెవెల్స్ ప్రస్తుతం 840 అడుగుల ఎత్తులో ఉన్నాయి. శ్రీశైలం డ్యాం నిర్మాణం నుంచి జూన్ నెలలోనే సంగమేశ్వరుడు జలాధివాసం కావడం ఇదే మొదటిసారి. ప్రతి సంవత్సరం ఆగస్టు నుంచి అక్టోబర్ మధ్యలో సంగమేశ్వర ఆలయం నీటిలో మునిగిపోయేది.


నీటిలో మునిగిన సంగమేశ్వరస్వామి శివలింగం

నేడు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: ఇటీవల జరిగిన ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు సోమవారం విడుదలవనున్నాయి. ఫలితాలు అధికారిక వెబ్‌సైట్‌లో మధ్యాహ్నం 12 గంటలకు అందుబాటులో ఉంటాయని ఇంటర్ బోర్డ్ ఓ ప్రకటనలో తెలిపింది. వార్షిక పరీక్షల్లో ఫెయిల్ అయిన, ఫస్టియర్ ఇంప్రూవ్‌మెంట్ కోసం కలిసి, రెండేళ్లకు సంబంధించి దాదాపు 5 లక్షల మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.







మహనీయులారా మన్నించండి

నేటి తరం యువతలో స్ఫూర్తి రగిలించాలనే ఉద్దేశంతో వివిధ రంగాల్లో లబ్ధప్రతిష్టులైన మహనీయుల విగ్రహాలను విశాఖ సాగరతీరంలో దశాబ్దాల కిందట ఏర్పాటుచేశారు. ఈ నెల 21 నుంచి విశాఖ బీచ్ రోడ్డు వేదిక జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ విగ్రహాలను శుభ్రం చేసి రంగులు వేయిస్తున్నారు. మహనీయుల విగ్రహాలను ఎంతో జాగ్రత్తగా నిచ్చెన వేసుకుని శుభ్రం చేసి రంగులు వేయాల్సి ఉండగా వాటి ప్రాధాన్యత తెలియని కార్మికులు ఇలా ఆ విగ్రహాలపైకి ఎక్కి రంగులు వేస్తున్నారు. దీన్ని చూసి ఆ దారిన పోయేవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఆధ్యాత్మికం

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ సేవా సంఘం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 91,720 మంది స్వామివారిని దర్శించుకోగా 44,678 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.80 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణ వెంకటేశ్వర స్వామి జన్మ నక్షత్రమైన శ్రవణ గడియల్లో అర్చనలు చేశారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనాన్ని అధిరోహించి మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు.

కిటకిటలాడిన బోయకొండ



చౌడేపల్లె: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన బోయకొండ గంగమ్మ దీవెనల కోసం భక్తులు ఆదివారం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు వివిధ వాహనాల్లో రావడంతో బోయకొండ జన సంద్రంగా మారింది. ఒక్క రోజే సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు అధికారులు వెల్లడించారు.

అప్పన్న ఆలయంలో వడాయితీ సంప్రోక్షణం



సింహాచలం: మిథున సంక్రమణాన్ని పురస్కరించుకుని సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వడాయితీ సంప్రోక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రోక్షణం చేశారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలకు స్నపన తిరుమంజనం అనంతరం శీతలోపచారాలు జరిపారు. సాయంత్రం మాడవీధుల్లో ఉత్సవమూర్తులకు తిరువీధిని వైభవంగా నిర్వహించారు.



క్యాన్సర్‌కు కళ్లెం

విశాఖలో అడ్వాన్స్‌డ్ క్యాన్సర్ కేర్ యూనిట్

విశాఖ సిటీ: క్యాన్సర్ కర్కశమైనది. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ కబళిస్తోంది. అటువంటి మహమ్మారి పీచమనచడానికి విశాఖ లో అడ్వాన్స్‌డ్ క్యాన్సర్ కేర్ బ్లాక్ సిద్ధమవుతోంది. ఇప్పటికే ఉత్తరాంధ్ర, ఒడిశా రాష్ట్రాల క్యాన్సర్ బాధితులకు వైద్య సేవలు అందిస్తున్న అగనంపూడి ప్రాంతంలో ఉన్న హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్(హెచ్‌బీసీహెచ్ఆర్‌సీ)లో నూతన భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దేశంలోనే అత్యుత్తమ స్పెషలైజ్డ్ క్యాన్సర్ చికిత్సా కేంద్రాల్లో ఒకటిగా నిలిచేలా దీన్ని తీర్చిదిద్దనున్నారు. ప్రధానంగా పీడియాట్రిక్, హెమటోలింఫాయిడ్(శిశు, రక్త) క్యాన్సర్ల చికిత్స, పరిశోధనలకు సంబంధించి అతి పెద్ద కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు.

హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో బ్లాక్

- ఎనిమిది అంతస్తుల్లో 3.9 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు
- 2027 నాటికి అందుబాటులోకి అత్యుత్తమ, అధునాతన వైద్య సేవలు
- టాటా మెమోరియల్ సెంటర్‌కు ఐసీఐసీఐ బ్యాంక్ రూ.550 కోట్లు విరాళం
- ఇంటెన్సివ్ కీమో, బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, అధునాతన రేడియేషన్‌థెరపీ ఇలా మరెన్నో..

ఏటా 3 వేల మందికి చికిత్స అందించేలా..

ఐసీఐసీఐ ఫౌండేషన్ బ్లాక్ ఫర్ చైల్డ్ అండ్ బ్లడ్ క్యాన్సర్ భవనాన్ని 8 అంతస్తుల్లో సుమారు 3.9 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. ఈ కొత్త భవనంలో 555 పడకలు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం అగనంపూడిలో ఉన్న హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో గత మూడేళ్లుగా రోజూ కొత్తగా సుమారు 200 మంది పీడియాట్రిక్ క్యాన్సర్ రోగులు, 350–400 మంది హెమటోలింఫాయిడ్ క్యాన్సర్ పేషంట్లు వైద్య సేవలు పొందుతున్నారు. కొత్త బ్లాక్ అందుబాటులోకి వచ్చిన తర్వాత బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో పాటు ప్రస్తుత వైద్య సేవలను గణనీయంగా విస్తరించేందుకు, అలాగే ఇమ్యునోథెరపీకి వెసులుబాటు కలగనుంది. మరో 3 వేల మంది క్యాన్సర్ రోగులకు చికిత్స అందించే అవకాశం ఉంటుంది. ఈ కొత్త బ్లాక్‌ల్లో అధునాతన వైద్య సదుపాయాలు, పరిశోధన విభాగాలు ఉండనున్నాయి. పెరుగుతున్న క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 2027 నాటికి ఈ కొత్త బ్లాక్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ఉన్నారు.



క్యాన్సర్ రోగులకు అనేక సేవలు

ఈ కొత్త బ్లాక్ ద్వారా క్యాన్సర్ రోగులకు అనేక వైద్య సేవలు అందనున్నాయి. ఇందులో ఇంటెన్సివ్ కీమోథెరపీ, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, అధునాతన రేడియేషన్ థెరపీ, కార్ టీ–సెల్ థెరపీ లాంటి అధునాతన ఇమ్యునోథెరపీలు, మూడు లీనియర్ యాక్సిలరేటర్లు, ఎంఆర్ఐ, సీటీ అండ్ పెట్ స్కాన్లతో పాటు అత్యంత ఆధునిక మెడికల్ ఇమేజింగ్, డయాగ్నోస్టిక్స్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. అలాగే ఇందులో 14 బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ గదులు, 14 ఐసీయూలు, 5 ఆపరేటింగ్ థియేటర్లు, పరిశోధనల కోసం ప్రయోగశాలలు, చికిత్స ప్లానింగ్, శిక్షణ కోసం జాయింట్ డిస్కషన్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. పీడియాట్రిక్, హెమటోలింఫాయిడ్ క్యాన్సర్లకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స, బ్లడ్ సెంటర్, పౌష్టికాహారం, పునరావాసం లాంటి సేవలు అందనున్నాయి.

టీఎంసీకి ఐసీఐసీఐ రూ.550 కోట్లు విరాళం

ఈ భారీ క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి ఐసీఐసీఐ బ్యాంక్ భారీ విరాళాన్ని టాటా మెమోరియల్ సెంటర్(టీఎంసీ)కు ప్రకటించింది. బ్యాంకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) నిధులు రూ.550 కోట్లతో ఈ అడ్వాన్స్‌డ్ క్యాన్సర్ కేర్‌ని నిర్మిస్తోంది. దేశంలో క్యాన్సర్ కేర్‌కు సంబంధించి విశాఖ, నవీ ముంబై, న్యూ చండీగఢ్‌లో కొత్తగా మూడు టీఎంసీ కేంద్రాల ఏర్పాటుకు ఐసీఐసీఐ బ్యాంక్ రూ.1,800 కోట్లు విరాళం ఇస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో రూ.550 కోట్లతో విశాఖలో శిశు, రక్త క్యాన్సర్ చికిత్సకు తూర్పు దేశంలోనే అతిపెద్ద అత్యుత్తమ మెడికల్ టెక్నాలజీతో అధునాతన ఆస్పత్రి నిర్మాణానికి పూనుకున్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఐసీఐసీఐ బ్యాంక్ చైర్మన్ ప్రదీప్ కుమార్ సిన్హా(ఫైల్)

ర్యాగింగ్ నంబరు 165 @ 2024

- ఉత్తరప్రదేశ్‌లో అత్యధికం..రెండోస్థానంలో బిహార్
- కేరళ ఆదర్శం ..ఒక్క కేసుకే పరిమితం
- వైద్య కళాశాలల్లో నమోదైన ర్యాగింగ్ ఫిర్యాదుల గణాంకాలను వెల్లడించిన కేంద్రం

సాక్షి, అమరావతి: దేశ వ్యాప్తంగా వైద్యకళాశాలల్లో గతేడాది నమోదైన ర్యాగింగ్ ఫిర్యాదుల గణాంకాలను కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నివేదించింది. దేశ వ్యాప్తంగా 2024లో మొత్తం 165 కేసులు నమోదైనట్లు వెల్లడించింది, ఈ నివేదిక ప్రకారం అత్యధిక ఫిర్యాదులు నమోదైన రాష్ట్రంగా ఉత్తరప్రదేశ్ మొదటిస్థానంలో నిలవగా, రెండో స్థానంలో బిహార్ ఉంది. ఉత్తర ప్రదేశ్‌లో 33, బిహార్‌లో 17 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే జాబితాలో తొమ్మిదో స్థానంలో ఉంది. ఏపీతో పాటు హరియాణా, ఉత్తరాఖండ్‌లో గతేడాదిలో చెరో ఆరు ర్యాగింగ్ ఘటనలు చోటు చేసుకున్నాయని నివేదిక వెల్లడించింది. తెలంగాణ, గుజరాత్, ఢిల్లీ, జమ్మూ కశ్మీర్‌లో చెరో మూడు కేసులు నమోదై 12వ స్థానంలో నిలిచాయి. ర్యాగింగ్ నివారణలో కేరళ ఆదర్శనీయంగా నిలిచింది. కేవలం ఒకే ఒక్క ఫిర్యాదుకు మాత్రమే పరిమితమైందని కేంద్రం తెలిపింది.

కళాశాలలు, ఆసుపత్రులు, హాస్టళ్ల సహా క్యాంపస్‌లోని పలు ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుతో పాటు సంస్థలలోని వివిధ ప్రదేశాల్లో ర్యాగింగ్ నిరోధక పోస్టర్లు హోర్డింగ్‌లను ప్రదర్శిస్తున్నట్లు పేర్కొంది. ర్యాగింగ్‌పై విద్యార్థులు ఫిర్యాదు చేసేందుకు జాతీయ వైద్య కమిషన్ ప్రత్యేక పోర్టల్‌ని ఏర్పాటు చేసిందని స్పష్టం చేసింది.

2024లో వైద్య కళాశాలల్లో రాష్ట్రాల వారీగా నమోదైన ర్యాగింగ్ ఫిర్యాదుల వివరాలివీ..

రాష్ట్రం పేరు	ఫిర్యాదుల సంఖ్య
ఉత్తరప్రదేశ్	33
బిహార్	17
రాజస్థాన్	15
మధ్యప్రదేశ్	12
మహారాష్ట్ర	10
ఛత్తీస్‌గఢ్	8
తమిళనాడు	8
జార్ఖండ్	8
హరియాణ	6
ఆంధ్రప్రదేశ్	6
ఉత్తరాఖండ్	6
పశ్చిమబెంగాల్	5
అసోం	4
కర్నాటక	4
ఢిల్లీ	3
గుజరాత్	3
తెలంగాణ	3
జమ్మూ-కాశ్మీర్	3
పంజాబ్	2
కేరళ	1





సా... గుతున్న ఆధునికీకరణ

తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ (హెచ్చెల్సీ)లో రూ.35.06 కోట్లతో జరుగుతున్న ఆధునికీకరణ పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. కాలువకు నీరొచ్చేలోపు పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు. ఇప్పటికే తుంగభద్ర జలాశయం బోర్డు సమావేశమై నీటి కేటాయింపులు కూడా చేసిన నేపథ్యంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హెచ్చెల్సీ పనుల్లో అంతులేని జాప్యం

- టీబీ డ్యాం నుంచి నీరు విడుదలయ్యే నాటికి పనులు పూర్తి కావడం కష్టమేనంటున్న రైతులు

రాయదుర్గం: హెచ్చెల్సీ పరిధిలో ఆధునికీకరణ పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా కణేకల్లు చెరువు వద్ద 3వ స్లూయిస్, హెచ్ఎల్ఎంసీ 147 కిలోమీటరు వద్ద ఔట్‌ఫాల్ రెగ్యులేటర్, 137వ కిలోమీటరు వద్ద అండర్ టన్నెల్ మరమ్మతులు, 169 కిలోమీటరు వద్ద డీఎల్ఆర్‌బీ నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. అయితే, 115 నుంచి 130 కిలోమీటర్ దాకా చేపడుతున్న లైనింగ్ పనుల్లో వేగం కనిపిస్తున్నా, కణేకల్లు చెరువులో ఒకటో కిలోమీటర్ వద్ద స్లూయిస్, 147/395 కి.మీ వద్ద అవుట్ ఫాల్ రెగ్యులేటర్, 137/702 కి.మీ వద్ద అండర్ టన్నెల్, 165.028 కి.మీ వద్ద, 169/400, 189/126, 155/181, 115/167, 117/794 కిలోమీటర్ల వద్ద జరుగుతున్న వంతెన పనుల్లో జాప్యం చేస్తున్నారు. కొన్నిచోట్ల కాంక్రీట్ పనులు ప్రారంభించగా, మరికొన్ని చోట్ల నేటికీ మట్టి పనుల్లోనే ఉండిపోయారు. యూటీ, స్లూయిస్ పనులు మందకొడిగా సాగుతున్నాయి. క్లిష్టమైన కాంక్రీట్ పనులు 30 శాతం కూడా దాటలేదు. సాధారణంగా జూలై ఆఖర్లో ఆయకట్టుకు నీరు విడుదల చేస్తారు. ఇప్పటిలాగే చేస్తూ పోతే ఆ లోపు పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు.

18.396 టీఎంసీల కేటాయింపు..

టీబీ బోర్డు ఇటీవల సమావేశమైంది. క్రస్ట్ గేట్ల మార్పులు, ఇతర మరమ్మతుల కారణంగా డ్యాంలో ఈ ఏడాది 120 టీఎంసీల నీటి లభ్యత ఉండవచ్చని అంచనాకు వచ్చారు. హెచ్చెల్సీ వాటాగా 18.396 టీఎంసీలు కేటాయించారు. గతేడాదితో పోల్చితే 7.964 టీఎంసీలు తగ్గించడం గమనార్హం. ఇలాంటి పరిస్థితుల్లోనూ ఆధునికీకరణ పనులు నత్తతో పోటీ పడుతుండటంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యతపై అనుమానాలు..

నీటి విడుదల తేదీ దగ్గర పడేకొద్దీ కాంట్రాక్టర్లు పనులు హడావుడిగా చేపడతారు. ఈ నేపథ్యంలో పనుల్లో నాణ్యతపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏ మాత్రం తేడా వచ్చినా తమ కష్టమంతా నీటిపాలుకాక తప్పదని ఆందోళన చెందుతున్నారు.

గడువులోపు పూర్తి చేయిస్తాం

సాధ్యమైనంత వరకు గడువులోగా పనులు పూర్తిచేసేలా కృషి చేస్తాం. కాంట్రాక్టర్లపై ఒత్తిడి పెంచుతాం. ప్రతి పని నాణ్యతగా ఉండేలా చూస్తాం. యూటీ నిర్మాణాలు ఆగిపోతే పైపులు ఏర్పాటు చేయించి ఆయకట్టుకు ఇబ్బందుల్లేకుండా సాగు నీరందిస్తాం.

– వెంకటేశ్వర్లు, హెచ్ఎల్సీ ఈఈ



రికార్డుల కొబ్బరి

కొబ్బరి రూ.18,500.. కురిడీ రూ.27 వేలకు చేరిక

- పచ్చికాయకు అనూహ్య డిమాండ్
- మూడు నెలలుగా ఆశాజనకంగా ధర
- భారీగా ఎగుమతులు

సాక్షి, అమలాపురం/అంబాజీపేట: కొబ్బరి ధరలు రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తున్నాయి. కురిడీ కొబ్బరి ధర కనీవినీ ఎరుగని స్థాయిలో పెరిగి ఆల్‌టైమ్ రికార్డు నమోదు చేయగా.. పచ్చి కొబ్బరి కాయ సైతం ఆల్‌టైమ్ హైరికార్డులు సృష్టిస్తోంది. అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌లో వెయ్యి కొబ్బరి కాయల ధర రూ.17,500 నుంచి రూ.18.500 పలుకుతోంది. పచ్చి కొబ్బరికి ఈ స్థాయి ధర రావడం ఇదే మొదటిసారి. మరోవైపు కురిడీ కొబ్బరి సైతం కురిడీ రూ.27 వేలకు చేరింది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 1.80 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతోంది. ఒక్క అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోనే 1.10 లక్షల ఎకరాల్లో కొబ్బరిసాగవుతోంది. గత ఏడాది నుంచి పచ్చికాయ, ముక్కుడు కాయ (నిల్వకాయ) వెయ్యి కాయల ధర రూ.10 వేలకు తగ్గలేదు. తరువాత ఈ ధర పెరుగుతూ వస్తోంది. గత నెలలో వీటి ధర రూ.16 వేలకు చేరింది. ఇదే గరిష్ట ధర అనుకున్నారు. అయితే.. రైతులు, వ్యాపారుల అంచనా దాటి కొబ్బరి కాయ ధర రూ.17,500 నుంచి రూ.18,500 వరకూ పెరగడం గమనార్హం. పచ్చి కొబ్బరికి ఈ స్థాయి ధర రావడం మార్కెట్‌లో ఇదే మొదటిసారి. ఉత్తరాదిలోని గుజరాత్, హరియాణ,, మహారాష్ట్రతో పాటు బిహార్, ఉత్తరప్రదేశ్‌లకు పచ్చికాయ అధికంగా ఎగుమతి అవుతోంది.





కురిడీకి రికార్డు స్థాయి ధర

కురిడీ కొబ్బరి సైతం మార్కెట్‌లో రికార్డు స్థాయి ధర పలుకుతోంది. పాత కాయలలో (8 నెలలకు పైబడి నిల్వ ఉన్న) గండేరా రకం (పెద్ద రకం) వెయ్యి కురిడీ కొబ్బరి కాయల ధర రూ.27 వేలకు చేరడం రికార్డు. గతంలో దీని సగటు ధర రూ.14 వేలు మించేది కాదు. ఇక గటగట (చిన్నకాయ) ధర రూ.25 వేలుగా ఉంది. కొత్త కాయల్లో గండేరా రూ.26 వేలు, గటగట రూ.24 వేల వరకు పెరగడం విశేషం.

నిల్వలు లేకపోవడమే కారణం

- ఏడాది కాలంగా రైతుల వద్ద, వ్యాపారుల వద్ద కొబ్బరి నిల్వ ఉండటం లేదు. గతంలో దింపు తీసిన కొబ్బరి రెండు, మూడు నెలలపాటు రైతుల వద్దనే ఉండేది. ధరలు ఆశాజనకంగా ఉండడంతో వారం వ్యవధిలోనే ఎగుమతి అవుతోంది. ఫలితంగా నిల్వలు తగ్గిపోయి కొబ్బరి, కురిడీ కొబ్బరికి డిమాండ్ గణనీయంగా పెరిగింది.
- ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఉత్తరాదికి కొబ్బరి కాయ ఎగుమతులు పెరిగిన కారణంగా మార్చి నెల నుంచి గోదావరి జిల్లాల కొబ్బరికి డిమాండ్ ఏర్పడింది. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో దిగుబడి గణనీయంగా తగ్గింది. తమిళనాడు నుంచి జాతీయ మార్కెట్‌కు ఎగుమతి అయ్యే కొబ్బరిలో మూడోవంతు కూడా అందుబాటులో లేకుండా పోయింది. స్థానిక కొబ్బరి డిమాండ్ పెరగడానికి ఇది కారణమైంది.
- మార్చి నుంచి మే నెలాఖరు వరకూ ఎకరాకు సగటున 1,200 కాయల వరకూ దిగుబడి వస్తోంది. తరువాత అది తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం సగటు దిగుబడి 700 కాయల వరకూ ఉంది. ఇది కూడా ధరల పెరుగుదలకు ఒక కారణమైంది.
- ఇంత ధర ఉన్నా రైతులు వెంటనే అమ్మడం లేదు. ధర మరింత పెరిగే అవకాశముందనే అంచనాతో ఆచితూచి విక్రయిస్తున్నారు.



ఇండిపెండెన్స్‌డే రోజు గాంధీజీ హృదయ్‌కుంజ్...ఆ తర్వాత... రోజుకొకటిగా అనేక ప్రదేశాలు.
దేశఐక్యత ప్రతీక స్టాచ్యూ ఆఫ్ యూనిటీ... గాంధీజీ కారాగారం అగాఖాన్ ప్యాలెస్.
మరాఠాల శౌర్యానికి ప్రతీక శనివార్‌వాడా... వావ్ అనిపించే గుజరాత్ మెట్ల బావులు...
అదాలజ్ కా వావ్... పఠాన్‌లోని రాణీ కీ వావ్... దక్కన్ కోసం శంభాజీ నగర్ మినీ తాజ్‌మహల్.
బౌద్ధ చిత్రాల అజంత గుహలు... శిల్పాల ఎల్లోరా... ఝాన్సీలో వీరాంగణ లక్ష్మీబాయ్ కోట.
సంక్రాంతి వేడుకల రామ్‌రాజా టెంపుల్. మొధేరాలో సూర్యుడి మెత్తని కిరణాలు.
ఈ టూర్‌లో మినిమమ్ గ్యారంటీలివి. మన భారతం బంగారు భారతం. అందుకే... ఇది స్వర్ణ భారత్ యాత్ర.

బంగారు భారతం

స్వర్ణిమ్ భారత్ యాత్ర (సీడీబీజీ 30). ఇది పది రోజుల టూర్. ఆగస్ట్ 14న మొదలై 23వ తేదీతో పూర్తవుతుంది. ఇందులో అహ్మదాబాద్, మొధేరా, పూనే, ఔరంగాబాద్, ఓర్చా, ఝాన్సీ ప్రదేశాలు కవర్ అవుతాయి.
టూర్ కోడ్... SWARNIM BHARAT YATRA (CDBG30)

మొధేరా డ్యాన్స్ ఫెస్టివల్‌లో కథక్ డ్యాన్సర్ నమ్రతా రాయ్ ప్రదర్శన

1వ రోజు

రాత్రి ఏడు గంటలకు ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ రైల్వే స్టేషన్‌కు చేరాలి. ఎనిమిది గంటలకు రైలు అహ్మదాబాద్‌కు బయలుదేరుతుంది. రాత్రి భోజనం రైల్లోనే.

2వ రోజు

ఉదయం రైల్లోనే టీ, రిఫ్రెష్‌మెంట్, బ్రేక్‌ఫాస్ట్ పూర్తయిన తర్వాత పదకొండు గంటలకు అహ్మదాబాద్ స్టేషన్‌కు చేరుతుంది. రైలు దిగి హోటల్ గదిలో చెక్ అవ్వాలి. మధ్యాహ్న భోజనం తర్వాత సబర్మతి ఆశ్రమం, అదాలజ్ కా వావ్, సాయంత్రం సబర్మతి రివర్‌ఫ్రంట్ విహారం తర్వాత హోటల్‌కు చేరాలి. భోజనం, బస అక్కడే.



సబర్మతి రివర్ ఫ్రంట్

సబర్మతి తీరాన హృదయ్‌కుంజ్


అహ్మదాబాద్‌లో గాంధీజీ నివసించిన ఆశ్రమం సబర్మతి నది తీరాన ఉండడంతో సబర్మతి ఆశ్రమం అనే పేరు వ్యవహారంలోకి వచ్చింది. కానీ గాంధీజీ తన ఇంటికి పెట్టుకున్న పేరు 'హృదయ్ కుంజ్'. ఐదెకరాల్లో విస్తరించిన ఆశ్రమంలో గాంధీజీ నివసించడానికి ఒక భవనం, వంట కోసం, భోజనాల కోసం, స్వాతంత్ర్య సమరయోధుల సమావేశాల కోసం అనేక భవనాలను నిర్మించారు. ఇప్పుడు కొన్ని భవనాలను మ్యూజియంగా మార్చారు. ఇక రివర్ ఫ్రంట్ అంటే సబర్మతి తీరాన సూర్యోదయం, సూర్యాస్తమయాల వీక్షణను, వాకింగ్‌కి అనువుగా డెవలప్ చేసిన కారిడార్. మన స్వాతంత్ర్యదినోత్సవం నాడు దేశానికి స్వాతంత్ర్యం కోసం పోరాడిన గాంధీజీ ఆశ్రమాన్ని, స్వాతంత్ర్య పథక రచనలు జరిగిన ప్రదేశాన్ని సందర్శించిన అనుభూతి అనిర్వచనీయమైనది.



గాంధీజీ ఆశ్రమం

వావ్... ఇది బావి

అదాలజ్ కా వావ్. ఇది మెట్ల బావి. ఐదంతస్థుల నిర్మాణం. వర్షాకాలంలో మూడు అంతస్థులు దిగితే నీటిని అందుకోవచ్చు. వేసవిలో ఐదంతస్థుల కిందికి దిగితే కానీ నీరందదు. బయట ఎంత వేడి ఉన్నప్పటికీ ఈ బావి దగ్గర చల్లగా ఉంటుంది. మంచి గాలి వీస్తూ ఆహ్లాదంగా గడపవచ్చు. ఇది గుజరాత్ రాజధాని నగరం గాంధీనగర్‌కు సమీపంలో ఉంది. మధ్యయుగంలో విదేశాలతో వర్తక వాణిజ్యాలు నిర్వహించే వ్యాపారులు, పర్యాటకులు ఈ ప్రదేశం నుంచి రాకపోకలు సాగించేవారు. వారి సౌకర్యార్థం రాణి రుడాబాయి క్రీ.శ 1498లో దీనిని నిర్మించారు. ఇక్కడ పండుగలకు సంప్రదాయ వేడుకలు నిర్వహిస్తారు.



అదాలజ్ కా వావ్

3వ రోజు



సూర్య దేవాలయం

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత ఎనిమిదిన్నరకు రోడ్డు మార్గాన మొధేరాకు ప్రయాణం. మొధేరా సూర్యదేవాలయ వీక్షణం. లంచ్ తర్వాత పఠాన్‌కు ప్రయాణం. రాణీ కీ వావ్ విహారం తర్వాత అహ్మదాబాద్‌కు వచ్చి హోటల్‌లో భోజనం, బస.

పుష్పవతి తీరాన సూర్యదేవాలయం

మొధేరాలోని సూర్యదేవాలయం అద్భుతమైన నిర్మాణం. దీని ఆర్కిటెక్చర్ గొప్పతనాన్ని వివరించాలంటే ఒక గ్రంథమే అవుతుంది. గుర్జర శైలి నిర్మాణం ఇది. దీనిని క్రీ.శ 11వ శతాబ్దంలో సోలంకి రాజవంశానికి చెందిన మొదటి భీమదేవుడు నిర్మించాడు. ఆలయం ఎదురుగా పెద్ద నీటి కొలను, దాని చుట్టూ జామెట్రికల్ డిజైన్‌తో నిర్మించిన మెట్లు మనదేశ నిర్మాణ కౌశలానికి నిదర్శనాలు.

సరస్వతి తీరాన రాణీ కీ వావ్

రాణీ కీ వావ్ చూస్తే నోరెళ్ల బెట్టి వావ్ అనాల్సిందే. ఇది పఠాన్ నగరంలో సరస్వతి నది తీరాన ఉంది. పఠాన్ నగరం మొధేరాకి 35 కిమీల దూరాన ఉంది. స్టెప్ వెల్ నిర్మాణాల్లో పతాకస్థాయి నిర్మాణం ఇది. ఈ గోడలకున్న శిల్పాలు, రాతిలో చెక్కిన డిజైన్‌లు చూపుతిప్పుకోనివ్వవు. ఈ గోడల మీదున్న డిజైన్‌లను చేనేతకారులు చీరల మీద నేస్తారు. యునెస్కో ఈ నిర్మాణాన్ని పదేళ్ల కిందట హెరిటేజ్ సైట్‌గా గుర్తించింది.



రాణీ కీ వావ్

4వ రోజు



బ్రేక్‌ఫాస్ట్ తర్వాత అహ్మదాబాద్‌లోని హోటల్ గదిని చెక్ అవుట్ చేసి రైల్వే స్టేషన్‌కు చేరి రైలెక్కాలి. తొమ్మిదిన్నరకు రైలు ఏక్తానగర్‌కు బయలుదేరుతుంది. లంచ్ రైల్లోనే. ఒంటిగంటకు రైలు దిగి స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వీక్షణానికి వెళ్లాలి. అక్కడ షో చూసి, వెనక్కి వచ్చి రైలెక్కాలి. రాత్రి భోజనం రైల్లోనే. రాత్రి పది గంటలకు రైలు ఖడ్కీ (పూనే) స్టేషన్‌కు బయలుదేరుతుంది.

నర్మద తీరాన ఐక్యత నిర్మాణం

సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ మన దేశానికి భౌగోళిక రూపాన్నిచ్చిన ఆర్కిటెక్ట్. నర్మద నది తీరాన ఉన్న స్టాచ్యూ ఆఫ్ యూనిటీ దాదాపు ఆరువందల అడుగుల విగ్రహం. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహం. ఇది పటేల్ నూటయాభైవ జయంతి ఏడాది. పటేల్ విగ్రహం తయారీకి శిల్పికి ఒక డిజైన్ ఇవ్వడానికి చరిత్రకారులు, కళాకారులు, విద్యావేత్తల బృందం పని చేసింది. ఈ విగ్రహం ఉన్న ప్రదేశం పేరు కెవాడియా. ఇక్కడి రైల్వేస్టేషన్‌కి అదే పేరు. ఇప్పుడు దీనిని ఏక్తానగర్‌గా మార్చారు.

5వ రోజు

ఉదయం టీ, బ్రేక్‌ఫాస్ట్ తర్వాత తొమ్మిది గంటలకు రైలు ఖడ్కీ స్టేషన్‌కు చేరుతుంది. రైలు దిగి ఆగాఖాన్ ప్యాలెస్ సందర్శనానికి వెళ్లాలి. హోటల్‌లో చెక్ ఇన్ అయ్యి, మధ్యాహ్న భోజనం తర్వాత కాస్బా గణపతి, లాల్ మహల్, శనివార్ వాడాల్లో పర్యటించి హోటల్‌కు చేరాలి. రాత్రి భోజనం, బస అక్కడే.



ఆగాఖాన్ ప్యాలెస్

మూలనది తీరం గాంధీజీ కారాగారం

అగాఖాన్ ప్యాలెస్ పూనేలో ఉంది. క్విట్ ఇండియా ఉద్యమకాలంలో మహాత్మా గాంధీ, కస్తూర్బా గాంధీ, సరోజినీ నాయుడుతోపాటు అనేక మంది స్వాతంత్ర్య సమరయోధులు ఇక్కడ కారాగార శిక్షను అనుభవించారు. కస్తూర్బా గాంధీ ఇక్కడే తుదిశ్వాస వదిలారు. ప్యాలెస్ ప్రాంగణంలో కస్తూర్బా సమాధి, గాంధీజీ చితాభస్మ సమాధి ఉన్నాయి. ప్యాలెస్‌లో క్విట్ ఇండియా ఉద్యమ చిహ్నంగా విగ్రహం ఉంది.

ఛత్రపతుల కోట శనివార్ వాడా

శనివార్ వాడా మరీ ప్రాచీనమైనదేమీ కాదు, 18వ శతాబ్దపు నిర్మాణం. సరైన నిర్వహణ లేక కొంతకాలం కళ తప్పింది. ఇప్పుడు ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిర్వహణలోకి వచ్చిన తరవాత కళను సంతరించుకుంటోంది. ఇది ఏడంతస్థుల నిర్మాణం. మరాఠా వీరుల శౌర్యానికి ప్రతీకగా పీష్వా మొదటి బాజీరావ్ విగ్రహం ఉంది. ఢిల్లీలోని మొఘల్ పాలకులకు ఎదురు నిలబడి దీటుగా బదులిస్తున్నట్లు ఉండాలనే ఉద్దేశంతో ఈ కోటను ఉత్తరాభిముఖంగా నిర్మించాడు ఛత్రపతి షాహు.



శనివార్ వాడా

6వ రోజు

ఆరవ రోజు: ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్ పూర్తి చేసుకుని హోటల్ గది చెక్ అవుట్ చేసి ఎనిమిది గంటలకంతా భీమశంకర్ జ్యోతిర్లింగ దర్శనానికి బయలుదేరాలి. దారిలో లంచ్ చేసుకుని, ఆ తర్వాత ఆలయ దర్శనం చేసుకుని ఖడ్‌కీ రైల్వేస్టేషన్‌కు చేరి రైలెక్కాలి. భోజనం, బస రైల్లోనే. రైలు రాత్రి పది గంటలకు ఛత్రపతి శంభాజీ నగర్ (ఔరంగాబాద్)కు బయలుదేరుతుంది.

ప్రకృతి ఒడిలో భీమశంకరుడు

ద్వాదశ జ్యోతిర్లింగాల్లో భీమశంకర్ ఒకటి. ఇది పూనేకి 50 కిలోమీటర్ల దూరాన సహ్యాద్రి పర్వత శ్రేణుల్లో దట్టమైన అడవిలో ఉంది.

7వ రోజు

ఉదయం టీ, రిఫ్రెష్‌మెంట్, బ్రేక్‌ఫాస్ట్ పూర్తయిన తర్వాత రైలు ఛత్రపతి శంభాజీ నగర్‌కు చేరుతుంది. రైలు దిగి బీబీ కా మఖ్బారా వీక్షణానికి వెళ్లాలి. ఆ తర్వాత హోటల్ గదిలో చెక్ ఇన్, లంచ్. ఆ తర్వాత ఎల్లోరా గుహలు చూసుకుని ఘృష్ణేశ్వర్ జ్యోతిర్లింగ దర్శనానికి వెళ్లాలి. రాత్రి భోజనం, బస హోటల్‌లో.

శంభాజీ నగర్ మినీ తాజ్‌మహల్



బీబీ కా మఖ్బారా

మరాఠా సామ్రాజ్యాన్ని ఏలిన రెండవ ఛత్రపతి శంభాజీ భోసాలే పేరుతో ఔరంగాబాద్ నగరానికి శంభాజీ నగర్ అని పేరు పెట్టారు. ఇక్కడ ఔరంగజేబు మనుమడు అజమ్ షా తన తల్లి దిల్‌రాస్ బాను బేగం కోసం తాజ్ మహల్ నమూనాలో నిర్మించిన బీబీ కా మఖ్బారా (మినీ తాజ్‌మహల్) పెద్ద టూరిస్ట్ అట్రాక్షన్. ఇక్కడ పాన్ ఫేమస్. స్టార్ పాన్ షాప్ నుంచి అరబిక్ దేశాలకు పాన్‌లు ఎగుమతి అవుతాయి. అత్యంత ఖరీదైన ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ పాన్ ధరలు వేలల్లో ఉంటాయి. ఈ టూర్ గుర్తుగా తక్కువలో తక్కువగా వచ్చే పాతిక రూపాయల పాన్ అయినా రుచి చూడాలి.

8వ రోజు



అజంతా గుహలు

బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హోటల్ గది చెక్ అవుట్ చేసి రోడ్డు మార్గాన అజంతా గుహలకు వెళ్లాలి. అజంతా గుహల సందర్శన తర్వాత మధ్యాహ్న భోజనం, ఆ తర్వాత భుసావల్ రైల్వే స్టేషన్‌కు వెళ్లి రైలెక్కాలి. రైలు సాయంత్రం ఆరు గంటలకు ఝాన్సీకి బయలుదేరుతుంది. రాత్రి భోజనం, బస రైల్లోనే.

బౌద్ధ చిత్రాల అజంత


ఎల్లోరా– అజంతా గుహలు మనదేశంలో బౌద్ధం పరిఢవిల్లిందని చెప్పడానికి మనకున్న గొప్ప చారిత్రక ఆధారాలు. యునెస్కో ఈ గుహలను వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తించింది. ఇందులో కొన్ని గుహలు చైత్యాలు. అంటే ప్రార్థన మందిరాలు. కొన్ని విహారాలు... అంటే నివాస ప్రదేశాలు. రంగురంగుల పెయింటింగ్స్ కోసమే ఈ గుహలకు వెళ్లాలి. ఎల్లోరా గుహల్లో శిల్పాలుంటాయి. అజంతాగుహలు చిత్రాలకు ప్రసిద్ధి.

9వ రోజు


ఉదయం టీ, బ్రేక్‌ఫాస్ట్ తర్వాత ఏడుగంటలకు రైలు వీరాంగణ లక్ష్మీబాయ్ ఝాన్సీ రైల్వే స్టేషన్‌కు చేరుతుంది. రైలు దిగి ఓర్చాలో హోటల్ గదికి వెళ్లి రిఫ్రెష్‌మెంట్ తర్వాత చెక్ అవుట్ చేయాలి. ఓర్చాలో ఉన్న రామ్ రాజా టెంపుల్, చతుర్భుజ టెంపుల్, జహంగీర్ మహల్ చూసుకుని లంచ్ తర్వాత ఝాన్సీ వైపు సాగిపోవాలి. ఝాన్సీ కోట, మ్యూజియం సందర్శన తర్వాత ఝాన్సీ రైల్వే స్టేషన్‌కు చేరుకుని రైలెక్కాలి. రైలు రాత్రి తొమ్మిది గంటలకు ఢిల్లీ, సఫ్దర్‌జంగ్ స్టేషన్‌కు బయలుదేరుతుంది. రాత్రి భోజనం, బస రైల్లోనే.

ఉత్తరాదిలో సంక్రాంతి వేడుక

రామ్ రాజా మందిర్... ఇది మధ్యప్రదేశ్ రాష్ట్రం, ఓర్చా పట్టణంలో ఉంది. ఓర్చా టెంపుల్‌గా వ్యవహారంలోకి వచ్చింది. ఈ ఆలయంలో ఏటా శైవ, వైష్ణవ పర్వదినాలతోపాటు మకర సంక్రాంతి వేడుకలు కూడా నిర్వహిస్తారు, రాముడి ఆలయం. రాముడి ఆలయం అంటే ధనుర్ధారియై సీతాలక్ష్మణ సమేతంగా అడవుల బాట పట్టిన కోదండ రాముడి రూపమే ఉంటుంది. ఇక్కడ మాత్రం రాముడు రాజు హోదాలో పూజలందుకుంటున్నాడు. ఇక్కడ ఉన్న శిల్పాల సముదాయాన్ని చూస్తే అరణ్యవాసం, రామరావణ యుద్ధం పూర్తయిన తర్వాత అయోధ్యకు వచ్చి పట్టాభిషేకం చేసుకున్న రాముడిని తలపిస్తుంది. ఆలయ నిర్మాణం కూడా అంతఃపురాన్ని పోలి ఉంటుంది.



రామ్ రాజా మందిర్



కోట దగరి గార్డెన్‌లోని ఝాన్సీ లక్ష్మీబాయ్ విగ్రహం

ఝాన్సీ కోటలో రాణిమహల్

ఝాన్సీ కోట శత్రుదుర్భేద్యంగా ఉంటుంది. కానీ ప్యాలెస్‌లు నిరాడంబరంగా ఉంటాయి. చతుర్భుజి ఆకారంలో రెండతస్థుల భవనం, మధ్యలో బావి, ఫౌంటెయిన్, లాన్, గదుల్లోపల గోడలకు చక్కటి పెయింటింగులతో ఝాన్సీ రాణి లక్ష్మీబాయ్ ప్యాలెస్ అందంగా ఉంటుంది. బ్రిటిష్ సైన్యంతో పోరాడిన ధీర మహిళ లక్ష్మీబాయ్. ఆమె యుద్ధంలో పాల్గొనడానికి సిద్ధమై, బిడ్డను వీపుకు కట్టుకుని కోట గోడ మీద నుంచి అమాంతం గుర్రం మీదకు దూకిన ప్రదేశాన్ని చూపిస్తారు. ఝాన్సీలో ప్రభుత్వం నిర్వహిస్తున్న మ్యూజియంలో టెర్రకోట బొమ్మలు, లోహపు బొమ్మలు, ఆయుధాలు, శిల్పాలు, చేతిరాత ప్రతులు, చిత్రలేఖనాలు, బంగారు, వెండి, రాగి నాణేలు, లోహపు విగ్రహాలు, దుస్తులను చూడవచ్చు.

10వ రోజు

ఉదయం ఆరు గంటలకు రైలు ఢిల్లీలోని సఫ్దర్‌గంజ్ స్టేషన్‌కు చేరుతుంది. టీ తర్వాత రైలు దిగడంతో పర్యటన పూర్తవుతుంది.

- వాకా మంజులారెడ్డి,
సాక్షి, ఫీచర్స్ ప్రతినిధి




ఝాన్సీ కోట



ఝాన్సీ కోటలో రాణిమహల్



ఝాన్సీ మ్యూజియంలో ఝాన్సీ లక్ష్మీబాయ్ వివాహ దృశ్యం



మీ వ్యాపారాన్ని మెరుగుపరచుకోడానికి ముందు మిమ్మల్ని మీరు మెరుగుపరచుకోండి.
- ఇదోవు కొయనికన్, ప్రఖ్యాత రచయిత

చిన్న ఖర్చుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి; ఒక చిన్న లోపం కూడా పెద్ద నౌకను ముంచేస్తుంది.
- బెంజమిన్ ఫ్రాంక్లిన్ అమెరికన్ తత్వవేత్త

ఆటుపోట్లకే అధిక చాన్స్



- ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతల ఎఫెక్ట్
- బీవోజే, ఫెడరల్ రిజర్వ్ పాలసీలపై కన్ను
- రుతుపవనాలు, ద్రవ్యోల్బణ గణాంకాలు కీలకం
- దేశీ స్టాక్ మార్కెట్ల ట్రెండ్‌పై నిపుణుల అంచనాలు

అంతర్జాతీయంగా రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతలు ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లపై ప్రభావాన్ని చూపనున్నాయి. మరోపక్క ఫైనాన్షియల్ మార్కెట్లలో అత్యంత కీలకమైన బ్యాంక్ ఆఫ్ జపాన్, ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమీక్షలు చేపట్టనున్నాయి. దేశీయంగా చూస్తే రుతు పవన కదలికలు, టోకు ధరల గణాంకాలు ఈక్విటీ మార్కెట్లను ప్రభావితం చేయనున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. వివరాలు చూద్దాం...
– సాక్షి, బిజినెస్ డెస్క్

అనూహ్యంగా ఆర్‌బీఐ రెపో రేటును 0.5 శాతం తగ్గించడంతో తొలుత జోరందుకున్న దేశీ స్టాక్ మార్కెట్లు గత వారం చివర్లో డీలా పడ్డాయి. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధ భయాలు సెంటిమెంటును దెబ్బతీశాయి. ఈ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో ఈ వారం సైతం మార్కెట్లపై ప్రభావం పడనున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. మధ్యప్రాచ్యంలో ఆందోళనలు తలెత్తడంతో ఇప్పటికే ముడిచమురు ధరలు బలపడ్డాయి. వారాంతాన బ్రెంట్ చమురు బ్యారల్ 78 డాలర్లను తాకగా.. పసిడికి డిమాండ్ పెరిగింది. విదేశీ మార్కెట్లో ఔన్స్ బంగారం 3450 డాలర్లను దాటేసింది. 3,500 డాలర్ల చరిత్రాత్మక గరిష్టంవైపు పరుగు తీస్తోంది. దీంతో ప్రధానంగా విదేశీ అంశాలు ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లలో ట్రెండ్‌ను నిర్దేశించనున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్లు ఆటుపోట్ల మధ్య కదలవచ్చని అంచనా వేశారు.

వడ్డీ రేట్లపై కన్ను

బ్యాంక్ ఆఫ్ జపాన్ రేపు(17న) పాలసీ సమీక్షను చేపట్టనుంది. మే నెల సమావేశంలో స్వల్పకాలిక వడ్డీ రేటును 0.5 శాతంవద్దే కొనసాగించేందుకు నిర్ణయించింది. 2008 తదుపరి గరిష్ట స్థాయిలో వడ్డీ రేట్లు కదులుతున్నాయి. మరోవైపు యూఎస్ ఫెడరల్ రిజర్వ్ సైతం బుధవారం(18న) పరపతి నిర్ణయాలు ప్రకటించనుంది. గత నెలలో చేపట్టిన సమీక్షలో ఫండ్స్ రేట్లను యథాతథంగా 4.25–4.5 శాతం వద్దే కొనసాగించేందుకు ఎఫ్‌వోఎంసీ నిర్ణయించింది. వాణిజ్య సుంకాల నేపథ్యంలో తలెత్తిన గ్లోబల్ అనిశ్చితి, యూఎస్ ఆర్థిక మందగమనం, ధరల హెచ్చుతగ్గుల నేపథ్యంలో రేట్ల కోతకు తొందరపడబోమని ఫెడ్ చైర్మన్ జెరోమీ పావెల్ పేర్కొన్నారు. వెరసి అంతర్జాతీయంగా అత్యంత ప్రాముఖ్యత గల కేంద్ర బ్యాంకుల రేట్ల నిర్ణయాలపై ఇన్వెస్టర్లు దృష్టిపెట్టనున్నట్లు జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్, ఆల్మండ్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ సేల్స్ హెడ్ కేతన్ వికమ్ తెలియజేశారు.

గణాంకాల తీరు

మే నెలకు చైనా పారిశ్రామిక ప్రగతి గణాంకాలు నేడు(16న) విడుదలకానున్నాయి. మార్చిలో నమోదైన 7.7 శాతం నుంచి ఏప్రిల్‌లో 6.1 శాతానికి తగ్గింది. ఏప్రిల్ రిటైల్ అమ్మకాలు 5.9 శాతం నుంచి 5.1 శాతానికి నీరసించాయి. యూఎస్ మే రిటైల్ అమ్మకాలు 17న వెల్లడికానున్నాయి. మార్చిలో నమోదైన 1.7 శాతం నుంచి తగ్గి ఏప్రిల్‌లో 0.1 శాతానికి పరిమితమయ్యాయి. జపాన్ మే వాణిజ్య గణాంకాలు 18న వెల్లడికానున్నాయి. ఏప్రిల్‌లో వాణిజ్య లోటు 116 బిలియన్ జపనీస్ యెన్‌లకు దిగివచ్చింది. ఏప్రిల్‌లో జపాన్ ద్రవ్యోల్బణం 3.6 శాతంకాగా.. మే వివరాలు 20న తెలియనున్నాయి. దేశీయంగా మే టోకు ధరల ద్రవ్యోల్బణం(డబ్ల్యూపీఐ) గణాంకాలు 16న వెలువడనున్నాయి. ఏప్రిల్‌లో డబ్ల్యూపీఐ 2.05 శాతం నుంచి వెనకడుగువేసి 0.85 శాతానికి పరిమితమైంది.

ఇతర అంశాలు

దేశీయంగా రుతుపవన కదలికలతోపాటు.. విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల తీరు, టోకు ధరలు సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా వివరించారు. ప్రపంచ మార్కెట్లలో నెలకొనే ట్రెండ్‌తోపాటు.. రంగాలవారీగా వెలువడే వార్తలు దేశీయంగా ట్రెండ్‌ను నిర్దేశించనున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా పేర్కొన్నారు.

గత వారమిలా...

ఆర్‌బీఐ లిక్విడిటీ పెంపు చర్యలు, గ్లోబల్ ఆందోళనల మధ్య గత వారం(9–13) దేశీ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ నికరంగా 1,070 పాయింట్లు(1.3 శాతం) క్షీణించి 81,119 వద్ద నిలిచింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 284 పాయింట్లు(1.1 శాతం) నీరసించి 24,719 వద్ద ముగిసింది. ఈ బాటలో బీఎస్ఈ మిడ్ క్యాప్ 1 శాతం, స్మాల్ క్యాప్ 0.1 శాతం స్థాయిలో వెనకడుగు వేశాయి.



సాంకేతికంగా...

సాంకేతికంగా చూస్తే ఈ వారం నిఫ్టీకి 24,600 పాయింట్ల వద్ద సపోర్ట్ కనిపించవచ్చు. ఈ స్థాయిని కోల్పోయి 24,500 దిగువకు చేరితే అమ్మకాలు ఊపందుకోవచ్చని అంచనా. 24,450 వద్ద మరోసారి మద్దతు లభించవచ్చు. ఎగువముఖంగా చూస్తే 25,350 వద్ద రెసిస్టెన్స్ ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే ఇండెక్స్ 25,600వరకూ బలపడవచ్చని విశ్లేషకులు అంచనా వేశారు.

ఎస్ఎన్‌బీపీసీఎల్ కొనుగోలు పూర్తి చేసిన ఐటీసీ

ముంబై: ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఐటీసీ రూ.472.50 కోట్లకు శ్రేష్ఠ నేచురల్ బయోప్రొడక్ట్స్ లిమిటెడ్ (ఎస్ఎన్‌బీపీఎల్) కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసింది. ఈ విషయాన్ని కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. సేంద్రియ ఆహారోత్పత్తుల విభాగం విస్తరణలో భాగంగా ఐటీసీ ఎస్ఎన్‌బీపీఎల్‌లో 100% వాటా కొనుగోలు ఒప్పందం కుదుర్చుకుంది. ముందస్తుగా రూ.400 కోట్లను, ఆ తర్వాతి 24 నెలల్లో మిగతా రూ.72.50 కోట్లను చెల్లించనున్నట్లు డీల్ చేసుకుంది. ఎస్ఎన్‌బీపీఎల్... 24 మంత్ర ఆర్గానిక్ బ్రాండుపై సేంద్రియ ఆహార ఉత్పత్తుల తయారీ, విక్రయాలను నిర్వహిస్తుంది.

హీరో ఫిన్‌కార్ప్ నిధుల సమీకరణ

ప్రీఐపీవో ప్లేస్‌మెంట్‌తో రూ. 260 కోట్లు

న్యూఢిల్లీ: హీరో మోటోకార్ప్ ఫైనాన్షియల్ సరీ్వసుల విభాగం హీరో ఫిన్‌కార్ప్ రూ. 260 కోట్లు సమీకరించింది. ఐపీవో ముందస్తు ప్లేస్‌మెంట్ కింద ఈ పెట్టుబడులను సమకూర్చుకుంది. దీంతో పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించదలచిన రూ. 2,100 కోట్లను తాజాగా రూ. 1,840 కోట్లకు కుదించింది. వెరసి రూ. 3,408 కోట్ల సమీకరణకు ఐపీవో చేపట్టనుంది. తొలుత హీరో మోటోకార్ప్ ఎన్‌బీఎఫ్‌సీ రూ. 3,668 కోట్ల ఐపీవో ప్రణాళికలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇష్యూలో భాగంగా ప్రస్తుత వాటాదారులు రూ. 1,568 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనున్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-6-2025	
విశాఖ	550-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	500-00
విజయవాడ	515-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

నేటి నాన్నకు.. 'మల్టీ అసెట్' బాసట





రోహిత్ మట్టూ,
హెడ్ (రిటైల్ సేల్స్), యాక్సిస్ మ్యుచువల్ ఫండ్

నేటి తరంలో తండ్రులు ఏకకాలంలో అనేక పాత్రలను పోషించాల్సి వస్తోంది. కుటుంబం.. ఉద్యోగ బాధ్యతలను చూసుకోవడం, పిల్లల ఉన్నత చదువుల కోసం ప్రణాళికలు వేస్తూనే ఆర్థిక భద్రతకు ప్లానింగ్ చేయడం, మరో ఇంటిని కొనుగోలు చేయడం, విహారయాత్రల ప్లానింగ్, తల్లిదండ్రుల బాగోగులు చూసుకోవడం, రిటైర్మెంట్ కోసం ప్రణాళికలు వేసుకోవడం ఇలా అనేకానేక బాధ్యతలను నిర్వర్తించాల్సి వస్తోంది. ఇలాంటి వైవిధ్యమైన అవసరాలను తీర్చాలంటే సంప్రదాయ పద్ధతిలో పొదుపు చేస్తే సరిపోదు. దీని కోసం నిర్దిష్ట లక్ష్యంతో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. అందుకే ఫాదర్స్ డే సందర్భంగా తమకిష్టమైన వారి భవిష్యత్తును తీర్చిదిద్దే క్రమంలో ఆధునిక తండ్రులకు బాసటగా ఉంటున్న మల్టీ అసెట్ ఫండ్స్‌పై ఒకసారి దృష్టి పెట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

నేటి తరం తండ్రుల్లో ఈ కేటగిరీ ఇంతగా ప్రాచుర్యం పొందడానికి కారణాలేమిటంటే..

వైవిధ్యం

వివిధ బాధ్యతలు తలో వైపునకు లాగేసే పరిస్థితుల్లో వివిధ సాధనాలవ్యాప్తంగా తమ పెట్టుబడులను రీబ్యాలెన్స్ చేసుకునేందుకు లేదా వేర్వేరు ఫండ్స్‌ను నిర్వహించుకునేందుకు నాన్నలకు తగినంత సమయం ఉండటం లేదు. మల్టీ-అసెట్ ఫండ్స్ ఈ విధులను ఆటోమేటిక్‌గా నిర్వహిస్తాయి. దీనితో పెట్టుబడుల కేటాయింపు, రిస్కుల సర్దుబాటు సముచితమైన విధంగా ఉంటుంది.

డైనమిక్‌గా కేటాయింపులు

మల్టీ అసెట్ ఫండ్స్ కూడా క్రియాశీలకంగా ఉంటాయి. స్థూల ఆర్థిక సూచీలు, మార్కెట్ సెంటిమెంట్, వేల్యుయేషన్లను బట్టి చాలా మటుకు ఫండ్స్ మేనేజర్లు వ్యూహాత్మకంగా కేటాయింపులను మారుస్తూ ఉంటారు. వృద్ధి, మందగమన దశల్లో ఇన్వెస్టర్లు సమర్థవంతంగా ముందుకెళ్లేందుకు ఇది సహాయకరంగా ఉంటుంది.

> **మల్టీ-అసెట్ ఫండ్స్ అంటే ..**
>
> ఇవి కనీసం మూడు వేర్వేరు ఆర్థిక సాధనాల్లో, అంటే ఈక్విటీలు, డెట్ ఇన్‌స్ట్రుమెంట్స్, పసిడిలాంటి కమోడిటీల మేళవింపులో ఇన్వెస్ట్ చేస్తాయి. కొన్ని కొంత వరకు రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు (రీట్స్) లేదా ఇంటర్నేషనల్ ఈక్విటీల్లోనూ ఇన్వెస్ట్ చేయడం ద్వారా అంతర్జాతీయంగా పెట్టుబడులు పెట్టే సౌలభ్యాన్ని కూడా అందిస్తాయి. ఇక్కడ డైవర్సిఫికేషన్ అనేది ఇక్కడ కీలకాంశం.

సరళతరంగా ప్రణాళికలు

పదేళ్ల తర్వాత పిల్లల చదువుల కోసం పొదుపు చేయడం కావచ్చు లేదా ముందస్తుగానే రిటైర్ అయ్యేందుకు అవసరమైన నిధి సమకూర్చుకోవడం.. లక్ష్యం ఏదైనా సరే సరళతరమైన పెట్టుబడి మార్గాన్ని ఈ ఫండ్స్ అందిస్తాయి. ఒక్కో లక్ష్యం కోసం అనేకానేక పోర్ట్‌ఫోలియోలను నిర్వహించుకోవాల్సిన బాదరబందీ లేకుండా, తమ రిస్కు సామర్థ్యాలు, కాలవ్యవధిని బట్టి వైవిధ్యమైన ఒకే సాధనంలో సిప్ చేయడం సులభతరంగా ఉంటుంది.

వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోవడం.. రిస్కులను అధిగమించడం

ఈక్విటీ ఆధారిత వ్యూహాలు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతూ ఉంటాయి. డెట్ ఆధారిత పోర్ట్‌ఫోలియోలనేవి ద్రవ్యోల్బణానికన్నా తక్కువగా రాబడులు అందించే అవకాశాలు ఉన్నాయి. ఇక పుత్తడిని తీసుకుంటే ఎక్కువగా సంక్షోభ సమయాల్లోనే మాత్రమే మెరుస్తుంది. కానీ వీటన్నింటినీ సమతూకంలో మేళవించి, సరిగ్గా నిర్వహించుకోగలిగితే, దీర్ఘకాలంలో అర్థవంతమైన రాబడులను అందిస్తాయి. షాక్‌లు కూడా తగ్గుతాయి. కాలక్రమేణా ఆర్థిక స్థిరత్వ సాధనను లక్ష్యంగా పెట్టుకున్న వారు రిస్కులకు తగ్గ వృద్ధి అవకాశాలను పొందేందుకు ఈ వ్యూహం అనుకూలంగా ఉంటుంది.

అనిశ్చితిలోనూ నిశ్చింత

పెట్టుబడుల పోర్ట్‌ఫోలియో సముచిత స్థాయిలో వైవిధ్యంగా ఉండటంతో పాటు ప్రొఫెషనల్స్ నిర్వహణలో ఉంటుందనే విషయం తెలియడం వల్ల ఎంతో నిశ్చింతగా ఉంటుంది. ఫండ్ మేనేజర్లు ఎప్పటికప్పుడు అంతర్జాతీయ మార్కెట్లను పరిశీలిస్తూ, లోతైన పరిశోధనలు చేస్తూ, ఆర్థిక ధోరణులను విశ్లేషిస్తూ, రిస్కులను తగ్గించి రాబడులను పెంచే విధంగా పోర్ట్‌ఫోలియోను క్రియాశీలకంగా రీబ్యాలెన్స్ చేస్తూ ఉంటారు. దీనితో వివిధ రకాల పెట్టుబడులను వేర్వేరుగా పరిశోధించి, ఎంచుకుని, ఇన్వెస్ట్ చేసేందుకు బోలెడంత సమయం వెచ్చించాల్సిన భారం తండ్రులకు కాస్త తగ్గుతుంది. ఇటు కెరియర్లు అటు కుటుంబ బాధ్యతల మధ్య నిరంతరం పరుగులు తీసే తండ్రులకు ఈ విధానం ఎంతో ఉపశమనంగా ఉంటుంది. మార్కెట్ హడావుడి గురించి ఆందోళన చెందకుండా వారు ప్రతి క్షణాన్ని ఆస్వాదించేలా, తమ పిల్లల క్రికెట్ గేములు.. సైన్స్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టేలా మల్టీ-అసెట్ ఫండ్స్ సహకరిస్తాయి.

నేటి నాన్న ఏదో కాస్త పొదుపు లేదా ప్యాసివ్ ఇన్వెస్టింగ్‌కి మాత్రమే పరిమితం కావడం లేదు. కుటుంబం నేటి ఆనందాలను కోల్పోకుండా చూసుకోవడంతో పాటు భవిష్యత్తులోనూ సురక్షితంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకునేందుకు అన్ని విషయాలూ తెలుసుకుని, చురుగ్గా వ్యవహరిస్తూ, తగిన పెట్టుబడి సాధనాల్లో ఇన్వెస్ట్ చేసేందుకు సన్నద్ధంగా ఉంటున్నారు. మల్టీ అసెట్ ఫండ్స్ ఇలాంటి సమతూకాన్నే ప్రతిఫలిస్తాయి. సంరక్షకుడిగా, ప్రణాళిక కర్తగా, భాగస్వామిగా, అన్నింటికీ మించి ఒక పేరెంట్‌గా వివిధ పాత్రలను పోషించే తండ్రులకు సమగ్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన పెట్టుబడి ఆప్షన్‌గా మల్టీ అసెట్ ఫండ్స్ ఉపయోగపడతున్నాయి.

ఇలా తమ కోసమే కాకుండా రాబోయే తరాల కోసం కూడా ఆర్థికంగా కొత్త బాటలు వేస్తున్న తండ్రులందరికీ హ్యాపీ ఫాదర్స్ డే!

ప్రత్యామ్నాయ పెట్టుబడులకు డిమాండ్

- ఏఐఎఫ్ ఏయూఎం రూ.5.38 లక్షల కోట్లు
- 2024–25 క్యూ4లో 32 శాతం పెరుగుదల

న్యూఢిల్లీ: ప్రత్యామ్నాయ పెట్టుబడి సాధనాలకు (ఏఐఎఫ్/ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్) ఆదరణ పెరుగుతోంది. వీటి నిర్వహణలోని ఆస్తులు 2025 మార్చి త్రైమాసికం చివరికి రూ.5.38 లక్షల కోట్లకు దూసుకెళ్లాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం చివరికి ఉన్న రూ.4.07లక్షల కోట్లతో పోల్చి చూస్తే 32 శాతం పెరిగినట్టు సెబీ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అధిక ధనవంతులు, ఫ్యామిలీ ఆఫీస్‌ల అస్సెట్ అలోకేషన్‌లో (పెట్టుబడుల కేటాయింపులు) స్పష్టమైన మార్పును ఈ గణంకాలు సూచిస్తున్నాయి. ఈక్విటీ మార్కెట్లో అస్థిరతలు పెరిగిపోవడం, అంతర్జాతీయంగా స్థూల ఆర్థిక పరిస్థితుల్లో మార్పు నేపథ్యంలో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను మరింత వైవిధ్యం చేసుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వడమే ఏఐఎఫ్ ఆస్తుల వృద్ధికి దోహదపడినట్టు పెట్టుబడి సలహా సేవల సంస్థ 'మల్టీ యాక్ట్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్' వెల్లడించింది. సంప్రదాయ ఈక్విటీ, డెట్ పెట్టుబడులకే పరిమితం కావడం నుంచి ఇతర సాధనాల వైపు ఇన్వెస్టర్లు మళ్లుతున్నారనడానికి నిదర్శనంగా పేర్కొంది. ముఖ్యంగా హై నెట్‌వర్త్ ఇన్వెస్టర్లు (హెచ్ఎన్ఐలు/ధనవంతులు), అల్ట్రా హెచ్ఎన్ఐలు ఏఐఎఫ్ విభాగం వైపు మొగ్గు చూపిస్తున్నారని తెలిపింది. ఏఐఎఫ్ ఫండ్స్ కిందకు ప్రైవేటు ఈక్విటీ, హెడ్జ్ ఫండ్స్, ప్రైవేటు క్రెడిట్, ఇతర సంప్రదాయేతర పెట్టుబడి సాధనాలు వస్తాయి. మార్కెట్లు అస్థిరతలకు గురైన సందర్భాల్లో ఏఐఎఫ్ పెట్టుబడులు స్థిరత్వంతోపాటు, అధిక రాబడులు అందించడం వీటి పట్ల ఆసక్తి పెరగడానికి కారణంగా మల్టీ యాక్ట్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ నివేదిక తెలిపింది.

వైవిధ్యం–హెడ్జింగ్

''ఫ్యామిలీ ఆఫీసులు పెట్టుబడులను దీర్ఘకాల దృష్టితో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. కనుక ఇతర ఇన్వెస్టర్లతో పోల్చితే ప్రైవేటు పెట్టుబడుల్లో వీరి భాగస్వామ్యం ఎక్కువగా ఉంటోంది''అని ఈ నివేదిక తెలిపింది. ముఖ్యంగా వైవిధ్యంతోపాటు ద్రవ్యోల్బణం నుంచి పెట్టుబడులకు హెడ్జింగ్ వంటివి ఏఐఎఫ్ పెట్టుబడుల వృద్ధికి కారణాలుగా పేర్కొంది. సాధారణంగా ఏఐఎఫ్‌లను కేటగిరీ –1, 2, 3లుగా విభజిస్తుంటారు. ఆరంభ స్థాయి వెంచర్ క్యాపిటల్, ప్రైవేటు ఈక్విటీ, ప్రైవేటు క్రెడిట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, లాంగ్-షార్ట్ హెడ్జ్ వ్యూహాలతో ఏఐఎఫ్‌లు పనిచేస్తుంటాయి. ఈ భిన్నమైన అవకాశాల ద్వారా ఈక్విటీ, డెట్ మార్కెట్లలోని అస్థిరతలను హెచ్ఎన్ఐలు అధిగమించగలుగుతారని, రిస్కును మెరుగ్గా నిర్వహించగలరని ఈ నివేదిక వివరించింది. భిన్న మార్కెట్ సైకిల్స్‌ను సమర్థవంతంగా అధిగమించే విధంగా వారి పోర్ట్‌ఫోలియో నిర్మాణం ఉంటుందని తెలిపింది. భారత్‌లో 10 మిలియన్ డాలర్లకు పైగా ఆస్తులు కలిగిన వారు 85,698 మంది ఉన్నట్టు నైట్‌ఫ్రాంక్ గ్లోబల్ వెల్త్ రిపోర్ట్ 2025 ఇటీవలే వెల్లడించింది.

డిడక్షన్లు... కాగితాలు.. కావాలి

కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు



ఐటీఆర్ 1, ఐటీఆర్ 4లలో కొన్ని మార్పులు చేశారు. ఈ మార్పులన్నీ మనం దాఖలు చేసే 2024–25 ఆర్థిక సంవత్సరానికి వర్తిస్తాయి. ఈ మార్పుల ప్రకారం మీరు క్లెయిం చేసే ప్రతి డిడక్షన్‌కి సంబంధించిన పూర్తి వివరాలు అప్‌లోడ్ చేయాలి. ఇన్నాళ్లు డిడక్షన్ ఎంతో రాసిస్తే వదిలేసేవారు. ఇక నుంచి పూర్తి వివరాలు ఇవ్వాల్సిందే. దీని ప్రకారం ఒక్కొక్క డిడక్షన్, దానికి సంబంధించిన కాగితాలు/వివరాలు ఏమిటో తెలుసుకుందాం. మీ దగ్గర పూర్తి వివరాలు లేనిదే ఫారం నింపలేరు.

ఇంటి అద్దె అలవెన్సు.. బేసిక్ జీతం. ఇంటి అద్దె అలవెన్సు ఎంత చేతికి వచ్చింది. మీరు అద్దె ఎంత చెల్లించారు. అద్దె ఎవరికి ఇచ్చారు. ఎలా ఇచ్చారు. అంటే నగదా..? బ్యాంకు ద్వారానా..? రశీదులు మొదలైనవి

80 ఇ.. ఇంతకుముందే తెలుసుకున్నాము. ఈ సెక్షన్ క్రింద ఎన్నో అంశాలున్నాయి. ముఖ్యంగా పాలసీ నెంబరు చెప్పాలి. అలాగే మిగతా ఇన్వెస్ట్‌మెంట్లకు, డాక్యుమెంటు ఐడెంటిఫికేషన్ నెంబరు రాయాలి. మిగతా వాటి గురించి ఇక్కడ ప్రస్తావించలేదు కానీ క్లెయిం చేసే ముందు కాగితాలు సిద్ధంగా పెట్టుకోవాలి. చెల్లింపు తేదీలు, అది ఏ సంవత్సరానికి సంబంధించినదో చాలా ముఖ్యం. ఈ సెక్షన్‌లో డిడక్షన్లు చెల్లింపు జరిగిన సంవత్సరంలోనే బెనిఫిట్ ఇస్తారు.

80 ఈ.. ఇది మెడికల్ ఇన్సూరెన్స్‌కి సంబంధించినది. ఇన్సూరెన్స్ కంపెనీ పేరు, పాలసీ నెంబరు వివరాలు ఇవ్వాలి.

80 ఉ... ఇది విద్యా రుణానికి సంబంధించినది. ఏ బ్యాంకు నుంచి రుణం తీసుకున్నారు..? లోన్ అకౌంటు నెంబరు.., మంజూరు తేది .. ఎంత రుణం తీసుకున్నారు.. ఇంకా ఎంత రుణం చెల్లించాలి .. ఇలా వివరాలన్నీ తెలియపరచాలి.

80 ఉఉ... ఇంటి కోసం రుణం తీసుకుంటే కొన్ని షరతులకు లోబడి రూ.50,000 డిడక్షన్ ఇస్తారు. ఈ రుణానికి సంబంధించి బ్యాంకు, లోన్ అకౌంటు నెంబరు, మంజూరు లెటర్ తేదీ, ఎంత రుణం తీసుకున్నారు..? ఇంకా ఎంత రుణం మిగిలి ఉంది. ఇవన్నీ వివరాలు చెప్పాలి.

80 ఉఉఉ... ఇది ఎలక్ట్రిక్ వెహికల్ లోన్‌కి సంబంధించినది. బ్యాంకు పేరు ఏమిటి..? లోన్ అకౌంటు నెంబరు, లోన్ ఎంత, వెహికల్ రిజిస్ట్రేషన్ నెంబరు, లోన్ మొత్తం ఎంత..? మొదలైన వివరాలు ఇవ్వాలి.

80 ఈఈ... ఇది కొన్ని నిర్దేశిత జబ్బుల ట్రీట్‌మెంట్‌కి సంబంధించినది. ఆ నిర్దేశిత జాబితాలోంచి ఏ జబ్బు వచ్చింది.? దానికైన ఖర్చు.., హాస్పిటల్‌కి చెల్లించిన మొత్తం ఎంత? తదితర పూర్తి వివరాలు తెలిపాలి.

ఇప్పటికీ 80 ఈ, 80 ఈఈ, 80 ఎ, 80 ఎఎ, 80 ఎఎఅ, 80 ఎఎఇ, 80 ఛీఛీఅ, 80 సెక్షన్లకు సంబంధించిన వివరాలు అడుగుతున్నారు. ఈ మార్పులతో అన్ని విషయాలు సేకరిస్తున్నారన్నమాట. ఒకప్పుడు మన మీద అభిమానం, నమ్మకం, మంచి విశ్వాసంతో మొత్తాన్ని తెలియజేయమనేవారు. దీనిని ఆసరా తీసుకుని అన్ని సెక్షన్ల ప్రకారం అర్హత ఉన్నంత క్లెయిమ్‌ల కోసం జనాలు ఎగబడుతున్నారు. అద్దె ఇంట్లో లేకుండా అద్దె క్లెయిమ్ చేసే ఉద్యోగస్తులు ఎందరో ఉన్నారు. భార్యభర్తలు ఒకే ఇంట్లో ఉంటూ ఇద్దరూ విడిగా వారి వారి అస్సెస్‌మెంట్లలో హెచ్ఆర్ఏ క్లెయింలు చేసే 'మేడ్ ఫర్ ఈచ్ అదర్స్' ఎంతోమంది ఉన్నారు. ఒక్క హెచ్ఆర్ఏ విషయంలోనే డిపార్ట్‌మెంట్ వారు విశ్వరూపాన్ని ప్రదర్శిస్తే కొంప కొల్లేరు అయిపోతుంది. అలాగే దొంగ స్కూల్ ఫీజుల రశీదులు .. పిల్లలు లేని వారు కూడా దొంగ రశీదులు పెడ్తున్నారు. జీవిత బీమా చెల్లించకపోయినా ప్రీమియంలు చెల్లించినట్లు వ్రాయడం, లేని చెల్లింపులు, లేని ఇన్వెస్ట్‌మెంట్లు, లేని అంగవైకల్యం దొంగ పత్రాలు సృష్టించి తద్వారా క్లెయిమ్‌లు పొందడం లాంటివి చేసేవారున్నారు. డిపార్ట్‌మెంట్ చాలా స్ట్రిక్ట్‌గా ఉందని తిట్టి, ప్రచారం చేసి డిపార్ట్‌మెంట్ వారి మీద అపవాదాలు వేసి, పిడివాదన చేసి, వాదనలు, ప్రతివాదనలు చేసి, పన్నుభారం తగ్గించుకునే కోతరాయుళ్లకి వాతలు తప్పవు.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

ఒక్కటే ఫండ్.. అన్ని చోట్లా పెట్టుబడులు

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మల్టీ అస్సెట్ ఫండ్



పెట్టుబడులు ఎప్పుడూ కూడా తగినంత వైవిధ్యంతో ఉండాలి. దీనివల్ల అస్థిరతలను మెరుగ్గా ఎదుర్కోవచ్చు. ఇలా పెట్టుబడులకు మంచి వైవిధ్యాన్ని ఇచ్చేవే మల్టీ అస్సెట్ ఫండ్స్ ఈ విభాగంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మల్టీ అస్సెట్ ఫండ్ పనితీరు విషయంలో నంబర్ 1గా కొనసాగుతోంది. ఈక్విటీ మార్కెట్లో ఇటీవలి కాలంలో భారీ దిద్దుబాటును చూశాం. మరీ ముఖ్యంగా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగంలో స్టాక్స్ విలువల పతనం లార్జ్‌క్యాప్ కంటే మరింత అధికంగా ఉంది. ఇలా ప్రతీ పెట్టుబడుల విభాగంలోనూ వివిధ కాలాల్లో ఆటుపోట్లు ఉంటుంటాయి. అందుకే పెట్టుబడులు అన్నింటినీ ఒకే చోట ఉంచేయకూడదు. రాబడులు, రిస్క్‌కు అనుగుణంగా వివిధ సాధనాల మధ్య వైవిధ్యం చేసుకోవాలి. నిపుణుల సాయంతో ఈ పనిని మల్టీ అస్సెట్ ఫండ్స్ సులభతరం చేస్తాయి. కనుక అన్ని రకాల ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియోలో వీటిని చేర్చుకోవచ్చు.

రాబడులు..

గడిచిన ఏడాది కాలంలో ఈ పథకం 14.53 శాతం రాబడిని ఇన్వెస్టర్లకు అందించింది. మూడేళ్ల కాలంలో పనితీరును గమనిస్తే వార్షిక రాబడి 22 శాతంగా ఉంది. ఐదేళ్లలోనూ ఏటా 27.23 శాతం, ఏడేళ్లలో 17.18 శాతం, పదేళ్లలో 15.69 శాతం చొప్పున వార్షిక రాబడిని ఈ పథకం డైరెక్ట్ ప్లాన్ అందించింది. మల్టీ అస్సెట్ ఫండ్ విభాగం సగటు రాబడి గత ఏడాది కాలంలో 12 శాతంగా, మూడేళ్లలో 17.55 శాతం, ఐదేళ్లలో 19.89 శాతం, ఏడేళ్లలో 11.53 శాతం, పదేళ్లలో 10.78 శాతం చొప్పునే ఉండడం గమనించొచ్చు. అంటే మల్టీ అస్సెట్ ఫండ్ విభాగంతో పోల్చితే ఈ పథకమే వివిధ కాలాల్లో 7 శాతం వరకు అధిక రాబడులను అందించినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ పథకం 2002లో ప్రారంభం అయింది. మొదట్లో రెగ్యులర్ ప్లాన్ ఒక్కటే అందుబాటులో ఉండేది. రెగ్యులర్‌ప్లాన్‌లో ఆది నుంచి చూస్తే వార్షిక రాబడి 21 శాతంగా ఉంది. రెగ్యులర్ ప్లాన్‌లో ఫండ్స్ సంస్థలు మధ్యవర్తులకు కమీషన్ చెల్లిస్తాయి. డైరెక్ట్ ప్లాన్‌లో అలాంటివేమీ ఉండవు. కనుక దీర్ఘకాలంలో ఒక శాతం వరకు డైరెక్ట్‌ప్లాన్ లోనే అధిక రాబడి అందుకోవచ్చు.

పెట్టుబడుల విధానం

పేరులో ఉన్నట్టు ఈ పథకం ఒకటికి మించిన అస్సెట్‌లలో (పెట్టుబడి సాధనాలు) ఇన్వెస్ట్ చేస్తుంటుంది. ఈక్విటీలకు 10 నుంచి 80 శాతం వరకు కేటాయింపులు చేస్తుంది. అలాగే, డెట్ సాధనాలకు 10 శాతం నుంచి 35 శాతం వరకు, బంగారం ఈటీఎఫ్‌లకు 0–10 శాతం వరకు, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లకు (రీట్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్)లకు 0–10 శాతం మధ్య కేటాయింపులు చేస్తుంటుంది. దాదాపు అన్ని రకాల సాధనాల్లోనూ పెట్టుబడులు పెట్టుకోగల సౌలభ్యం ఈ ఒక్క పథకం ద్వారా సాధ్యపడుతుంది. సెబీ నిబంధనల ప్రకారం మల్టీ అస్సెట్ ఫండ్స్ మూడు అంతకంటే ఎక్కువ సాధనాల్లో.. కనీసం 10 శాతం చొప్పున పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. కానీ, ఈ పథకం అన్ని ముఖ్య సాధనాల్లోనూ ఎక్స్‌పోజర్‌కు వీలు కల్పిస్తోంది.



పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో 57,485 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో ఈక్విటీల్లో 49 శాతం వరకు ఇన్వెస్ట్ చేయగా, డెట్ సాధనాలకు 14.17 శాతం కేటాయించింది. కమోడిటీల్లో (బంగారం, వెండి) 11.3 శాతం, రియల్ ఎస్టేట్ సాధనాల్లో 1.45 శాతం చొప్పున పెట్టుబడులు కలిగి ఉంది. 23.95 శాతం మేర నగదు నిల్వలు కలిగి ఉండడం గమనార్హం. ఈక్విటీల్లోనూ రిస్క్ తక్కువగా ఉండే లార్జ్‌క్యాప్ కంపెనీల్లో 84 శాతం పెట్టుబడులు పెట్టింది. మిడ్‌క్యాప్‌లో 13.39 శాతం, స్మాల్‌క్యాప్‌లో 1.63 శాతం చొప్పున పెట్టుబడులు ఉన్నాయి. డెట్‌లో అధిక శాతం రిస్క్ తక్కువ సాధనాల్లోనే ఇన్వెస్ట్ చేసింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
ఐసీఐసీఐ బ్యాంక్	4.20
రిలయన్స్ ఇండస్ట్రీస్	3.82
మారుతి సుజుకీ	3.60
ఎల్‌అండ్‌టీ	2.79
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	2.63
ఎస్‌బీఐ కార్డ్స్	2.57
ఎన్‌టీపీసీ	2.14
టీసీఎస్	2.05
యాక్సిస్ బ్యాంక్	2.02
ఇన్ఫోసిస్	1.86

‘లార్డ్’ బవుమా

దక్షిణాఫ్రికా సారథిపై ప్రశంసల జల్లు

‘కోటా’ వల్లే కొనసాగుతున్నాడనే విమర్శలు... ఆటగాడిగానూ అర్హత లేని వాడికి సారథ్యమా అనే విసుర్లు... సోషల్ మీడియాలో లెక్కకు మిక్కిలి మీమ్స్... కొన్నాళ్ల క్రితం ఆ ఆటగాడి పరిస్థితి ఇది! కానీ వాటన్నింటిని లెక్క చేయని ఆ ప్లేయర్... ‘పక్షి కన్నుకు గురి పెట్టిన పార్థుడిలా...’ లక్ష్యాన్ని మాత్రమే స్వప్నించాడు. దాని కోసమే తపించాడు. అహర్నిశలు దానికై సర్వశక్తులు ధారపోశాడు. ఎట్టకేలకు దాన్ని సాధించాడు. తమ దేశాభిమానులు సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న ఐసీసీ ట్రోఫీని అందించి... అందరికీ ప్రీతిపాత్రుడయ్యాడు.

లార్డ్స్ బాల్కనీలో ఐసీసీ గద చేతబూని సగర్వంగా చిరు దరహాసం చేసిన ఆ ఐదడుగుల నాలుగు అంగుళాల ప్లేయరే తెంబా బవుమా. ‘బ్లాక్ ఆఫ్రికన్’ కాబట్టే జట్టులో చోటు దక్కిందనే విమర్శల దశ నుంచి... 27 ఏళ్ల తర్వాత దక్షిణాఫ్రికాకు ఐసీసీ ట్రోఫీ అందించిన సారథిగా ఇప్పుడు ఎక్కడ చూసినా అతడి పేరు మారుమోగుతోంది. ప్రధాన జట్లతో ఆడకుండానే ఫైనల్ చేరారనే విమర్శలకు తనదైన శైలిలో జవాబిచ్చిన బవుమా... తుదిపోరులో తమ మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు కంగారూలు ‘చోకర్స్’ అంటూ స్లెడ్జింగ్‌కు దిగినా వాటిని పట్టించుకోకుండా ముందుకు సాగుతూ జట్టుకు అపురూప విజయాన్ని అందించాడు. సఫారీ జట్టును ప్రపంచ టెస్టు చాంపియన్‌గా నిలిపిన బవుమా ప్రస్థానాన్ని ఓసారి పరిశీలిస్తే...

- సాక్షి క్రీడావిభాగం





డ్రెస్సింగ్ రూమ్‌లో గదతో బవుమా

లార్డ్స్ వేదికగా జరిగిన ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లో... దక్షిణాఫ్రికా ముందు 282 పరుగుల విజయ లక్ష్యం నిలిచింది. స్కోరు బోర్డుపై 70 పరుగులు చేరేసరికి రెండు వికెట్లు నేలకూలాయి. 27 ఏళ్ల తర్వాత ఐసీసీ ట్రోఫీ చేజిక్కించుకోవాలంటే సఫారీ జట్టుకు ఇంకా 212 పరుగులు చేయాల్సిన పరిస్థితి. అప్పుడు లార్డ్స్ లాంజ్ రూమ్ నుంచి దక్షిణాఫ్రికా సారథి తెంబా బవుమా చిట్టి చిట్టి అడుగులు వేస్తూ మైదానంలో అడుగు పెట్టాడు. అప్పటి వరకు పేసర్లు పండగ చేసుకున్న పిచ్ అది. అందులోనూ మిచెల్ స్టార్క్, జోష్ హాజల్‌వుడ్, ప్యాట్ కమిన్స్ వంటి ఆరున్నర అడుగుల ఆజానుబావుల భీకర బౌలింగ్. ఒక ఎండ్‌లో మార్క్‌రమ్ పోరాడుతున్నా... అతడికి సహకరించే వారేరి అనే అనుమానాలు. గతేడాది ఆరంభంలో కేప్‌టౌన్ వేదికగా భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన టెస్టులోనూ మార్క్‌రమ్ ఒంటరి పోరాటంతో సెంచరీ చేసినా అతడికి అండగా నిలిచే వారు లేక సఫారీ జట్టు ఘోర పరాజయం ఎదుర్కొంది. లార్డ్స్‌లోనూ దాదాపు అదే ప్రమాద ఘంటికలు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు రానున్న వారిలో పెద్దగా అనుభవం ఉన్న వాళ్లు లేరు. ఇలాంటి దశలో బవుమా తన కెరీర్‌లో అత్యుత్తమం అనదగ్గ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. అప్పటి వరకు 63 టెస్టులాడినా... కేవలం నాలుగు శతకాలే సాధించిన అతడు... లార్డ్స్‌లో ఆణిముత్యంలాంటి అర్ధ సెంచరీతో మార్క్‌రమ్‌కు అండగా నిలిచాడు. ఆసీస్ పేసర్లు బాడీలైన్ బౌలింగ్‌తో పరీక్ష పెడుతున్నా... ప్రత్యర్థులు తన ఎత్తును అదునుగా చేసుకొని బౌన్సర్లతో బెంబేలెత్తిస్తున్నా ఏమాత్రం వెరవలేదు. క్రీజులో అడుగుపెట్టిన కాసేపటికే కండరాలు పట్టేసినా... మైదానం వీడితే క్షణాల్లో మ్యాచ్‌ను లాగేసుకోవడంలో సిద్ధహస్తులైన కంగారూలకు అవకాశం ఇవ్వకుండా నొప్పిని పంటిబిగువున భరిస్తూనే మార్క్‌రమ్‌కు అండగా నిలిచాడు. దీంతో స్వేచ్ఛగా ఆడిన మార్క్‌రమ్ జట్టును విజయ తీరాలకు చేరువ చేశాడు.

సార్థక నామధేయుడు

తెంబా బవుమా పేరు వెనక ఒక చరిత్ర ఉంది. దక్షిణాఫ్రికా స్థానిక జులూ భాషలో తెంబా అంటే ‘ఆశ’ అని అర్థం. అందుకు తగ్గట్లే ఎప్పుడూ ఆశావహ దృక్పథంతోనే ఉండే బవుమా... ‘పొట్టి వాడు గట్టివాడు’ అని తన చేతలతో నిరూపించాడు. ఐసీసీ ట్రోఫీ ఫైనల్లో ఆస్ట్రేలియాతో తలపడాలంటే... ఆట ఆరంభానికి ముందే ప్రత్యర్థి మానసికంగా కుంగిపోవడం ఖాయం. అలాంటిది డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన కంగారూలను కంగుతినిపిస్తూ బవుమా జట్టును నడిపిన తీరుపై ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ‘చోకర్స్’ ముద్రను చెరిపేస్తూ... ‘క్రికెట్ మక్కా’ లార్డ్స్‌లో తమ జట్టును సుదీర్ఘ ఫార్మాట్‌లో విశ్వవిజేతగా నిలిపిన అతడి నాయకత్వ సామర్థ్యాన్ని విమర్శకులు సైతం కొనియాడుతున్నారు. గతంలో విరాట్ కోహ్లి మాదిరిగా ‘అతి సంబరాల’తో విమర్శల పాలైన బవుమా... డబ్ల్యూటీసీ ఫైనల్లో కైల్ వెరీన్ విన్నింగ్ రన్స్ కొట్టిన తర్వాత ముఖాన్ని అరచేతుల్లో దాచుకొని... కళ్లలో నీటి చెమ్మ కనిపించకుండా ముభావంగా కూర్చుండిపోయాడు. సహచరులంతా సంబరాల్లో మునిగి తేలుతుంటే... భారీ బరువేదో భుజస్కంధాలపై నుంచి దించేసుకున్నట్లు నింపాదిగా లేచి అందరితో కలిసిపోయాడు.

‘లాంగా’ నుంచి లార్డ్స్ వరకు...

దక్షిణాఫ్రికా మూడు రాజధానుల్లో ఒకటైన కేప్‌టౌన్‌లో నల్లజాతీయులు అధికంగా నివసించే ‘లాంగా’లో బవుమా క్రీడా ప్రస్థానం ప్రారంభమైంది. పదేళ్ల ప్రాయంలో వీధుల్లో క్రికెట్ ఆడుతూ... గల్లీకొక మైదానం పేరుతో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసిన బవుమా... పదకొండేళ్లకు స్పోర్ట్స్ స్కాలర్‌షిప్ దక్కించుకున్నాడు. ఆ తర్వాత కఠోర శ్రమ, నిత్యం నేర్చుకోవాలనే తపనతో ఆటను మెరుగు పర్చుకున్నాడు. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సమీప బంధువు సూచనలు పాటిస్తూ ఒక్కో మెట్టూ ఎదుగుతూ జాతీయ జట్టు వరకు చేరుకున్నాడు. ప్రతీక్షణం నిరూపించుకోవాల్సిన కఠిన పరిస్థితులను ఎదురొడ్డి వచ్చిన అవకాశాలను అతడు సద్వినియోగ పర్చుకున్నాడు. కెరీర్ ఆరంభంలో పెద్దగా ఆకట్టుకోలేకపోవడంతో జట్టులో అతడి స్థానానికి భరోసా లేకపోయింది. అయితే డీన్ ఎల్గర్ రిటైర్మెంట్ అనంతరం అనూహ్యంగా సారథిగా ఎంపికైన తెంబా... ఆ తర్వాత చక్కటి ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. 2023–25 డబ్ల్యూటీసీ సర్కిల్‌లో జట్టు పగ్గాలు అందుకున్న బవుమా... కెప్టెన్‌గా ఆడిన తొలి 10 టెస్టుల్లో ఓటమి ఎరగని రికార్డు సృష్టించాడు. ఈ క్రమంలో ఆటగాడిగానూ మెరుగైన ప్రదర్శన కనబర్చాడు. 13 ఇన్నింగ్స్‌ల్లో 59.25 సగటుతో 711 పరుగులు చేశాడు. అందులో 2 సెంచరీలు, 5 అర్ధసెంచరీలు ఉన్నాయి. భాగస్వామ్యాలకు పెట్టింది పేరైన బవుమా... ఈ డబ్ల్యూటీసీ సర్కిల్‌లో 60.35 పార్ట్‌నర్‌షిప్ సగటుతో అందరికంటే అగ్రస్థానంలో నిలిచాడు. ‘గత కొన్నేళ్లుగా తెంబా జట్టును సమర్థవంతంగా నడుపుతున్నాడు. ఫైనల్లో నా ప్రదర్శన వెనక అతడి ప్రోద్బలం ఎంతో ఉంది. కండరాలు పట్టేసిన స్థితిలో పరుగు తీయడం ఇబ్బందిగా మారినా మైదానాన్ని వీడకుండా పోరాడాడు. కీలక పరుగులతో ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచి చిరస్మర విజయంలో కీలకపాత్ర పోషించాడు’ అని తన సారథిపై మార్క్‌రమ్ ప్రశంసలు కురిపించాడు.

నిస్వార్థ నాయకుడు...

జట్టు ఓడితే ఆ బాధ్యత తాను వహించి... గెలిస్తే సహచరులకు ఆ క్రెడిట్ ఇచ్చేవాడే అత్యుత్తమ నాయకుడు. ఈ కోవలో చూస్తే బవుమాకు 100కు 100 మార్కులు పడతాయి. ఫైనల్లో తన అసమాన ప్రదర్శనను పక్కనపెట్టి... రబాడ, ఇన్‌గిడి, మార్క్‌రమ్ పోరాటంతోనే జట్టు విజయం సాధించిందని చెప్పిన గొప్ప మనసు బవుమాది. ‘జట్టంతా సమష్టిగా రాణిస్తేనే నిలకడగా విజయాలు సాధించడం సాధ్యమవుతుంది. మా టీమ్ అందుకు నిదర్శనం. ఒకరిని ఒకరు ప్రోత్సహించుకోవడంలో మేమెప్పుడూ ముందుంటాం. ఒకరి విజయాలను మరొకరం ఆస్వాదిస్తాం. అప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయి. ప్రతి రోజు మెరుగయ్యేందుకు ప్రయత్నించడమే మా విజయ లక్ష్యం’ అని బవుమా అన్నాడు. అతడు అన్నట్లుగానే 2023–25 డబ్ల్యూటీసీ సర్కిల్‌ను పరిశీలిస్తే... దక్షిణాఫ్రికా జట్టు ఏ ఒక్క ఆటగాడి ప్రదర్శనపైనో అతిగా ఆధారపడలేదు. మొత్తం 13 మ్యాచ్‌ల్లో తొమ్మిది మంది వేర్వేరు ఆటగాళ్లు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డులు అందుకున్నారంటే సఫారీ జట్టు ‘టీమ్ వర్క్’ ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు.

27 ఏళ్ల తర్వాత ఐసీసీ ట్రోఫీ గెలిచిన సఫారీ బృందం

- జట్టును ముందుండి నడిపించిన బవుమా
- ఫైనల్లోనూ అసమాన పోరాటంతో ‘గద’ కైవసం

అందరిని కలుపుకుంటూ...

మార్క్‌రమ్, బెడింగ్‌హామ్, స్టబ్స్ వంటి తెల్ల జాతీయులు, కేశవ్ మహరాజ్, ముత్తుస్వామి వంటి భారత సంతతి ఆటగాళ్లు, రబాడ, ఇన్‌గిడి వంటి నల్ల జాతీయులు కలగలిపి ఉన్న దక్షిణాఫ్రికా జట్టును బవుమా చక్కగా నడిపించాడు. ‘విభిన్న నేపథ్యాల వాళ్లమైనా... జట్టుగా మేమంతా ఒక్కటే. సమష్టి ప్రదర్శనకు దక్కిన చక్కటి ఫలితమిది’ అని మ్యాచ్ అనంతరం బవుమా పేర్కొన్నాడు. ‘బ్లాక్ లైవ్స్ మ్యాటర్’ ఉద్యమం సమయంలో జట్టు సహచరుడు క్వింటన్ డికాక్ మోకాళ్లపై నిల్చునేందుకు నిరాకరించిన నోరు మెదపని బవుమా... ఎన్నో అడ్డంకులను దాటుకుంటూ దక్షిణాఫ్రికా జట్టుకు ఐసీసీ ట్రోఫీ అందించిన తొలి నల్లజాతి సారథిగా చరిత్రకెక్కాడు. మైదానం బయట కూడా మంచి మానవతావాదిగా గుర్తింపు తెచ్చుకున్న బవుమా... ప్రస్తుతం నిరుపేద పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించేందుకు ప్రత్యేకంగా ఒక ఫౌండేషన్ నడుపుతున్నాడు. వాళ్లకు ఇష్టమైన రంగంలో రాణించేందుకు ఈ సంస్థ సహకారం అందిస్తోంది.



సహచరుడు మార్కో యాన్సెన్‌తో బవుమా

మారియా మాయ

క్వాలిఫయర్ హోదాలో బరిలోకి దిగి విజేతగా నిలిచిన జర్మనీ ప్లేయర్

లండన్: అందరి అంచనాలను తారుమారు చేస్తూ జర్మనీ సీనియర్ ప్లేయర్ తాతియానా మారియా క్వీన్స్ క్లబ్ ఓపెన్ డబ్ల్యూటీఏ–500 టోర్నీలో సంచలనం సృష్టించింది. క్వాలిఫయర్ హోదాలో బరిలోకి దిగిన 37 ఏళ్ల మారియా చివరకు చాంపియన్‌గా అవతరించింది. టైటిల్ గెలిచే క్రమంలో మారియా టాప్–15లోని నలుగురు క్రీడాకారిణులను ఓడించడం విశేషం. ఈ నలుగురిలో ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ మాడిసన్ కీస్ (అమెరికా) కూడా ఉండటం గమనార్హం. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 86వ ర్యాంకర్ మారియా 6–3, 6–4తో ప్రపంచ 15వ ర్యాంకర్ అనిసిమోవా (అమెరికా)పై విజయం సాధించింది. విజేతగా నిలిచిన మారియాకు 2,18,000 డాలర్ల (రూ. 1 కోటీ 87 లక్షలు) ప్రైజ్‌మనీతో పాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



బీసీసీఐ సిబ్బందికి స్థిరమైన భత్యం

ఇకపై రోజుకు రూ. 10 వేలు చెల్లింపు

న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తమ కిందిస్థాయి సిబ్బందికి చెల్లించే రోజువారీ భత్యానికి సంబంధించి కొత్త టోర్నమెంట్ అలవెన్స్ పాలసీని అమలు చేయనుంది. ఇన్నాళ్లు బోర్డు ఉద్యోగులు, సిబ్బందికి నాలుగు రోజుల స్వల్పకాలిక ప్రయాణానికి రూ. 15 వేలు ఇచ్చేది. అదే ఐపీఎల్, డబ్ల్యూపీఎల్‌లాంటి దీర్ఘకాలిక టోర్నీల కోసం రోజుకు రూ. 10 వేలు చెల్లించేది. దీంతో పాటు అదనంగా ఏకమొత్తం చెల్లింపుల్లో భాగంగా రూ. 7500 ఇచ్చేది. ఇప్పుడు ఈ మూడింటిని రద్దు చేసిన బోర్డు ఫైనాన్స్ విభాగం... రోజుకు రూ. 10 వేల ప్రయాణభత్యాన్ని ఖరారు చేసింది. ఇందులో రూ. 3500 పన్ను తగ్గించి రూ. 6500 చెల్లిస్తుందని బోర్డు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. అంటే ఎవరైనా మీడియా, బోర్డు అధికారులు టోర్నమెంట్ కోసం 70 రోజుల ప్రయాణం చేయాల్సిన అవసరమొస్తే అతనికి రూ. 7 లక్షలు భత్యంగా చెల్లించనున్నారు. ఈ 70 రోజుల్లో కొన్ని రోజులు తప్ప 60 శాతానికి మించి ప్రయాణం చేస్తే అంతే మొత్తంలో ఇస్తారు. కనీస రోజులే ప్రయాణిస్తే మాత్రం 40 శాతం మాత్రమే చెల్లింపులు చేస్తారని బోర్డు వర్గాలు తెలిపాయి. ఈ జనవరి నుంచి ప్రయాణ భత్యం బకాయిపడిన బోర్డు తమ కిందిస్థాయి ఉద్యోగులకు ఈ కొత్త పాలసీ ప్రకారం చెల్లిస్తుంది. విదేశీ పర్యటలనకు వెళ్లే కిందిస్థాయి సిబ్బందికి రోజుకు 300 డాలర్లు (రూ.25,875) చొప్పున, బోర్డు కార్యవర్గ సభ్యులకు (అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు, కోశాధికారి తదితరులు) రోజుకు 1000 డాలర్లు (రూ.86,252) చొప్పున చెల్లిస్తారు.

రసెల్‌కు పోల్ పొజిషన్

మాంట్రియల్ (కెనడా): ఫార్ములావన్ కెనడియన్ గ్రాండ్‌ప్రి క్వాలిఫయింగ్ రేసులో మెర్సిడెస్ డ్రైవర్ రసెల్ పోల్ పొజిషన్ సాధించాడు. ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్ పదో రేసులో భాగంగా జరిగిన క్వాలిఫయింగ్ సెషన్‌లో బ్రిటన్ డ్రైవర్ రసెల్ 1 నిమిషం 10.899 సెకన్లలో ల్యాప్‌ను పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచాడు. ప్రధాన రేసును అతడు పోల్ పొజిషన్‌తో ప్రారంభించనున్నాడు. రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (1 నిమిషం 11.059 సెకన్లు), మెక్‌లారెన్ డ్రైవర్ పియాస్ట్రి (1 నిమిషం 11.120 సెకన్లు) వరుసగా రెండో, మూడో స్థానాల్లో నిలిచారు. మెర్సిడెస్‌కే చెందిన మరో డ్రైవర్ ఆంటోనెలి (1 నిమిషం 11.391 సెకన్లు) నాలుగో స్థానం దక్కించుకోగా... ఏడుసార్లు ప్రపంచ చాంపియన్, ఫెరారీ డ్రైవర్ లూయిస్ హామిల్టన్ (1 నిమిషం 11.526 సెకన్లు) ఐదో ‘ప్లేస్’లో నిలిచాడు. రేసు ఆరంభంలో వెర్‌స్టాపెన్, పియాస్ట్రి వాయు వేగంతో దూసుకెళ్లినా... ఆఖర్లో వారిని అధిగమించిన రసెల్ పోల్ పొజిషన్ దక్కించుకున్నాడు. 24 రేసుల ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 9 రేసులు ముగియగా... డ్రైవర్స్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో 186 పాయింట్లతో పియాస్ట్రి అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. 176 పాయింట్లతో నోరిస్ రెండో స్థానంలో, 137 పాయింట్లతో వెర్‌స్టాపెన్ మూడో స్థానంలో ఉన్నారు. హామిల్టన్ 71 పాయింట్లతో ఆరో ‘ప్లేస్’లో కొనసాగుతున్నాడు.



కెనడా స్టార్ స్విమ్మర్ మెకింటోష్‌తో రసెల్

కెనడియన్ గ్రాండ్ ప్రి క్వాలిఫయింగ్ ఈవెంట్

డ్రైవర్	జట్టు	టైమింగ్
రసెల్	మెర్సిడెస్	1:10.899 సెకన్లు
వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	1:11.059 సెకన్లు
పియాస్ట్రి	మెక్‌లారెన్	1:11.120 సెకన్లు
ఆంటోనెలి	మెర్సిడెస్	1:11.391 సెకన్లు
హామిల్టన్	ఫెరారీ	1:11.526 సెకన్లు
అలోన్సో	ఆస్టన్ మార్టిన్	1:11.586 సెకన్లు
నోరిస్	మెక్‌లారెన్	1:11.586 సెకన్లు
లెక్‌లెర్క్	ఫెరారీ	1:11.682 సెకన్లు
హడ్జర్	రేసింగ్ బుల్స్	1:11.867 సెకన్లు
అల్బన్	విలియమ్స్	1:11.907 సెకన్లు

విజేత యు ముంబా

అహ్మదాబాద్: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) ఆరో సీజన్‌లో యు ముంబా జట్టు చాంపియన్‌గా అవతరించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో యు ముంబా జట్టు 8–4 గేమ్‌ల తేడాతో జైపూర్ పేట్రియాట్స్ జట్టుపై గెలిచింది. ఈ రెండు జట్లు తొలిసారి ఫైనల్ చేరుకోగా... యు ముంబా జట్టును టైటిల్ వరించింది. యు ముంబా జట్టులో బెర్నాడెట్ జాక్స్ (రుమేనియా), లిలియన్ బారేడెట్ (ఫ్రాన్స్), యశస్విని ఘోర్పడే, అభినంద్, ఆకాశ్‌పాల్, స్వస్తిక ఘోష్, ప్రతీక్, అనన్య (భారత్) సభ్యులుగా ఉన్నారు. జైపూర్ జట్టులో తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజతోపాటు భారత్‌కే చెందిన జీత్‌చంద్ర, ప్రీతా వర్తికర్, త్రిశాల్ సూరపురెడ్డి, శ్రేయ, యశాంశ్ మలిక్, కనక్ ఝా (అమెరికా), బ్రిట్ ఈర్లాండ్ (నెదర్లాండ్స్) సభ్యులుగా ఉన్నారు.



బగ్గీలో బ్రదర్స్



బ్రిటన్ యువరాజు విలియం కుమారులు ప్రిన్స్ జార్జ్ (కుడివైపు), ప్రిన్స్ లూయిస్ శనివారం లండన్లో ఓ కార్యక్రమానికి ఇలా గుర్రపుబగ్గీలో వెళ్లారు

నాన్న మురిపెం



పశ్చిమబెంగాల్‌లోని నదియాలో కూతురిని భుజాలపై ఎత్తుకుని ముద్దు చేస్తూ మురిసిపోతున్న ఓ తండ్రి

బ్రిడ్జికి సిల్వర్‌జూబ్లీ



ఇది స్వీడన్‌లోని మాల్మోలో ఉన్న ఒరెసండ్ బ్రిడ్జి. ఆదివారం దీనికి పాతికేళ్లు నిండిన సందర్భంగా జనం డెన్మార్క్ నుంచి స్వీడన్ దాకా ఇలా ఉత్సాహంగా 'బ్రిడ్జి రన్'లో పాల్గొన్నారు.

గల్వాన్ గాయానికి ఐదేళ్లు

మన నిరాయుధ జవాన్లపై చైనా దొంగ దెబ్బ

- అయినా వెనుదీయక వణికించిన జవాన్లు
- కల్నల్ సంతోష్ సహా 20 మంది వీరమరణం
- చివరి క్షణాల దాకా పోరాడిన సంతోష్ బాబు

గల్వాన్ లోయ ఘర్షణ. నిరాయుధులైన భారత జవాన్లపై చైనా సైనికులు చేసిన సాయుధ దాడి. మూడు వందలకు పైగా సైనికులు దొంగ దెబ్బ తీసినా.. భారత జవాన్లు వెన్ను చూపలేదు. ప్రాణాలకు ఎదురొడ్డి పోరాడారు. ఈ వీరోచిత పోరాటంలో 20 మంది భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారు. దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిన ఈ గల్వాన్ ఘర్షణ జరిగి జూన్ 15తో ఐదేళ్లయింది. ఇది భారత్, చైనా మధ్య సంబంధాలను తీవ్రంగా దెబ్బతీసింది. ఈ ఐదేళ్లలో వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి మన సరిహద్దు రక్షణ, వ్యూహాల్లో భారీ సంస్కరణలు చోటు చేసుకున్నాయి. సరిహద్దులో మౌలిక సదుపాయాలను పునరుద్ధరించడమే కాదు.. సైనిక సంసిద్ధతను కూడా భారత్ పెంచింది. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు ఇటీవల కాస్త మెరుగుపడ్డాయి.

ఐదేళ్లలో అభివృద్ధి

గల్వాన్ ఘటన తరువాత మన ఆర్మీ వాస్తవాధీన రేఖ వెంబడి, ప్రత్యేకించి తూర్పు లడఖ్‌లో సాయుధ దళాలను అధిక మొత్తంలో పెంచింది. అలాగే.. యుద్ధ పరికరాలను కూడా మోహరించింది. నిఘా వ్యవస్థను పటిష్టం చేసింది. గల్వాన్ సంఘటన ముఖ్యంగా మౌలిక సదుపాయాల విస్తరణ జరిగింది. కేంద్రం 2024లోనే రూ.2,236 కోట్ల విలువైన 75 ప్రాజెక్టులను పూర్తి చేసింది. ఇక 2025–26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రక్షణ శాఖకు రూ.6.81 లక్షల కోట్లు కేటాయించింది. ఇది గతేడాది కంటే కంటే 9.53% ఎక్కువ. ఇందులో రూ.7,146 కోట్లు సరిహద్దు రహదారుల సంస్థ (బీఆర్ఓ)కు కేటాయించారు. వీటితో లడఖ్, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, హిమాచల్ ప్రదేశ్ వంటి వ్యూహాత్మక ప్రాంతాల్లో రోడ్లు, వంతెనలు నిర్మించారు. వీటిలో ఉమ్లింగ్ లా (19,024 అడుగులు) వద్ద ప్రపంచంలోనే ఎత్తైన మోటారు రహదారి నిర్మాణంతోపాటు ప్రస్తుతం నిర్మిస్తున్న న్యోమా ఎయిర్‌ఫీల్డ్, షింకు లా మధ్య సొరంగం కూడా ఉన్నాయి. ఈ ఐదేళ్లలో వాస్తవాధీన రేఖ వెంబడి డిజిటల్ ల్యాండ్‌స్కేప్ కూడా మారిపోయింది. భారత సైన్యం, భారతీ ఎయిర్‌టెల్ సంయుక్తంగా గల్వాన్, డెమ్‌చోక్‌తో సహా లడఖ్‌లోని మారుమూల గ్రామాలను 4జీ నెట్‌వర్క్‌ను అనుసంధానించారు. ఇది టెలిమెడిసిన్, డిజిటల్ విద్య, ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేర్చడానికి తోడ్పడింది. అంతేకాదు.. దీనివల్ల పర్యాటక రంగం అభివృద్ధి చెంది, స్థానికుల జీవనోపాధిని మెరుగుపడింది.

దౌత్యంలో పురోగతి...

దౌత్య పరంగానూ ఇరు దేశాలు పురోగతిని సాధించాయి. 2020 నుంచి ఇప్పటివరకూ వివిధ స్థాయిల్లో 30 దశలకు పైగా చర్చలు జరిగాయి. అనేక ఘర్షణ పాయింట్ల నుంచి సైనాన్ని ఉపసంహరించుకున్నారు. జూలై 2020లో గల్వాన్, ఫిబ్రవరి 2021లో పాంగోంగ్ త్సో, ఆగస్టు 2021లో పీపీ17ఏ (గోగ్రా–హాట్ స్ప్రింగ్స్), సెప్టెంబర్ 2022లో పీపీ15, అక్టోబర్ 2024లో డెమ్‌చోక్, డెప్సాంగ్‌లలో చైనా తమ శిబిరాలను తొలగించింది. వీటితోపాటు అత్యున్నత స్థాయి దౌత్య సమావేశాలు జరిగాయి. ఈ ఫలితంగా మానస సరోవర్ యాత్ర పునఃప్రారంభమైంది. ఇక ఈనెల 12న భారత పర్యటనకు వచ్చిన చైనా విదేశాంగ మంత్రి సన్ వీడాంగ్‌తో విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలతోపాటు ఇరు దేశాల మధ్య నేరుగా విమాన సేవలను తిరిగి ప్రారంభించే అంశాన్ని కూడా చర్చించారు. వీసాను సులభతరం చేయడంతోపాటు మీడియా మార్పిడి, 75 సంవత్సరాల భారతదేశం–చైనా దౌత్య సంబంధాల స్మారక వేడుకలపైనా చర్చించారు. అయితే... ఆయా ప్రాంతాల నుంచి సైన్యాన్ని పాక్షికంగా ఉపసంహరించి నప్పటికీ భారత్ అప్రమత్తంగానే ఉంది. వాస్తవాధీన రేఖ వెంబడి నిఘా కొనసాగిస్తోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఆ రోజు ఏం జరిగింది?

భారత్–చైనా సరిహద్దులోని గల్వాన్ నది కీలకమైన ప్రాంతం. ఇక్కడ చైనా బలగాలు వాస్తవాధీన రేఖను దాటి ముందుకొచ్చాయి. వారిని మన జవాన్లు అడ్డుకోవడంతో పలుమార్లు ఘర్షణ జరిగింది. పరిస్థితి తీవ్రమవ్వడంతో సమావేశమైన ఇరు దేశాల ఆర్మీ అధికారులు బలగాలను వెనక్కి రప్పించాలని నిర్ణయించారు. గల్వాన్‌లోని భారత భూభాగంలో చైనా ఏర్పాటు చేసిన శిబిరాలను పరిశీలించేందుకు బిహార్ రెజిమెంట్ కమాండింగ్ అధికారి, తెలంగాణకు చెందిన కల్నల్ సంతోష్ బాబు జవాన్లతో కలిసి వెళ్లారు. చైనా తన శిబిరాలను తొలగించకపోవడంతో సంతోష్ బృందం వాటిని నేలమట్టం చేసింది. దాంతో చైనా సైనికులు మన జవాన్లపై దాడికి దిగారు. వంద మంది కూడా లేని భారత జవాన్లపై 300 మందికి పైగా చైనా సైనికులు దాడికి తెగబడ్డారు. అయినా ఈ దొంగ దెబ్బను మనవాళ్లు తెగువతో ఎదుర్కొన్నారు. జూన్15న సాయంత్రం మొదలైన మారణకాండ అర్ధరాత్రి దాకా సాగింది. అక్కడ ఆయుధాలు వాడకూడదన్న ప్రోటోకాల్‌ను మన సైనికులు పాటించగా చైనా ముష్కరులు మాత్రం ముందే ఏర్పాటు చేసుకున్న ఇనుప రాడ్లతో దాడికి దిగారు. గాయపడ్డ మన సైనికులను గల్వాన్ నదిలో తోసేశారు. ఈ క్రమంలో కమాండింగ్ అధికారి కల్నల్ సంతోష్ తీవ్ర గాయాలపాలయ్యారు. అయినా యుద్ధమైదానం వీడలేదు. తోటి జవాన్లను వెన్నంటి నడిపించారు. ఈ ఘర్షణలో ఆయనతో పాటు 20 మంది జవాన్లు ప్రాణాలర్పించారు. చైనా కూడా భారీగా సైనికులను కోల్పోయింది. ఆ సంఖ్యను అధికారికంగా ఇప్పటికీ వెల్లడించలేదు. 41 మంది గాయపడ్డారని ప్రకటించింది. చైనా 41 మంది సైనికులను కోల్పోయినట్లు రష్యా, ఆస్ట్రేలియా పరిశోధన తేల్చింది.



కేరళలో అత్యవసరంగా ల్యాండయిన బ్రిటన్ యుద్ధ విమానం

తిరువనంతపురం: బ్రిటన్‌కు చెందిన యుద్ధ విమానం శనివారం రాత్రి కేరళలోని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. బ్రిటన్‌కు చెందిన విమాన వాహక నౌక నుంచి భారత తీరానికి సుమారు 100 నాటికల్ మైళ్ల దూరంలో గగనతలంలో ఉండగా యుద్ధ విమానం ఎఫ్–35లో సాంకేతిక సమస్య తలెత్తాయి. శనివారం రాత్రి 9:30 గంటల సమయంలో తిరువనంతపురం విమానాశ్రయ అధికారులను అత్యవసర ల్యాండింగ్ కోసం అనుమతి కోరారు. విమానాశ్రయంలో వెంటనే ఎమర్జెన్సీ ప్రకటించి, విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. యుద్ధవిమానాలు దారి మళ్లడం సాధారణంగా జరిగేదేనని, ల్యాండింగ్‌కు అవసరమైన సౌకర్యాలు కల్పించామని భారత వాయుసేన (ఐఏఎఫ్) తెలిపింది. సంబంధిత ఏజెన్సీలతో సమన్వయం చేస్తున్నామని వెల్లడించింది. ప్రస్తుతం విమానం తిరువనంతపురం విమానాశ్రయంలోనే ఉంది. ఈ అత్యవసర ల్యాండింగ్‌పై బ్రిటన్ రక్షణ శాఖ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

డాక్టర్ డెత్ కేసు.. 21 ఏళ్లకు కీలక నిందితుడి అరెస్ట్



డాక్టర్ డెత్

న్యూఢిల్లీ: సీరియల్ కిల్లర్ దేవేందర్ శర్మ(67) అలియాస్ 'డాక్టర్ డెత్'సన్నిహితుడొకరిని 21 ఏళ్ల తర్వాత ఉత్తరప్రదేశ్ పోలీసులు అరెస్ట్ చేశారు. రెండు దశాబ్దాలకు పైగా దొరక్కుండా తిరుగుతున్న రాజేందర్ అలియాస్ రజువా(59)ను అలీగఢ్‌లోని కాసింపూర్‌లో ఈ నెల 14న పట్టుకున్నామని పోలీసులు ఆదివారం తెలిపారు. మారుమూల ప్రాంతంలోని ఓ గదిలో మారుపేరుతో ఉంటూ పంప్‌హౌస్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ఇతడిని ఎట్టకేలకు గుర్తించామన్నారు. దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన 2004 నాటి ఈ కేసులో కిడ్నాప్, హత్య, సాక్ష్యాలను మాయం చేయడం వంటి నేరాలకు పాల్పడిన ఇతడిని పరారీలో ఉన్న నేరగాడిగా కోర్టు ప్రకటించిందన్నారు. అప్పటి కేసులో అరెస్టయిన దేవేందర్ శర్మ 2023లో పెరోల్‌పై బయటకు వచ్చి అదృశ్యమయ్యాడు. దీంతో ఢిల్లీ పోలీసులు రాజస్తాన్‌లోని దౌసాలో ఉండగా మే 19వ తేదీన పట్టుకున్నారు. ఆయుర్వేద వైద్యుడైన దేవేందర్ శర్మ అలియాస్ డాక్టర్ డెత్ మాయమాటలు చెప్పి ట్యాక్సీ, ట్రక్కుల్లో ప్రయాణించేవాడు. వారు ఏమరుపాటుగా ఉన్న సమయంలో వారిని దారుణంగా చంపేసి, ఆ వాహనాన్ని అమ్మేసేవాడు. మృతదేహాలను యూపీలోని కాస్‌గంజ్ ప్రాంతంలో హజారా కాల్వలో మొసళ్లకు ఆహారంగా వేసేవాడు. ఆధారాలు దొర్కకుండా చేసేవాడు. ఈ విధంగా తన ముఠాతో కలిసి 2002–2004 మధ్య కాలంలో సుమారు 50 మందిని పొట్టనబెట్టుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాదు, 1990–2000 సంవత్సరాల మధ్య కాలంలో కిడ్నీ రాకెట్‌ను కూడా ఇతడు నడిపాడు. బాధితులకు తెలియకుండానే ఇతడు 125కు పైగా కిడ్నీలను అవసరమైన ఆస్పత్రులకు, దళారులకు అమ్మినట్లు తేలింది. కిడ్నీ రాకెట్‌లో రాజేందర్ అలియాస్ రజువా పాత్ర కూడా ఉందని దేవేందర్ శర్మ పోలీసుల విచారణలో వెల్లడించాడు. ఢిల్లీ, రాజస్తాన్, హరియాణాల్లో నమోదైన వేర్వేరు ఏడు హత్య కేసుల్లో ఇతడిని కోర్టు దోషిగా నిర్ధారించి జీవిత కారాగారంతోపాటు ఒక కేసులో గుర్‌గావ్ కోర్టు మరణ శిక్ష సైతం విధించింది.

27 కోట్ల చిన్నారులు బడిబయటే

ఐరాస ప్రపంచ విద్యా నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: 2025లో ప్రపంచవ్యాప్తంగా 27.2 కోట్ల మంది చిన్నారులు పాఠశాల విద్యకు నోచుకోవడం లేదని యునెస్కో అంచనా వేసింది. వీరిలో 11 శాతం, అంటే 7.8 కోట్ల మంది ప్రాథమిక పాఠశాల విద్యకు, 15 శాతం, 6.4 కోట్ల మంది సెకండరీ స్కూల్ విద్యకు, 31 శాతం, 13 కోట్ల మంది ప్రాథమికోన్నత పాఠశాల విద్యకు దూరమయ్యారని వివరించింది. ప్రాంతీయ, ప్రపంచ సగటుల ఆధారంగా ఈ డేటాను తయారు చేసినట్లు గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ టీం(జెమ్) తెలిపింది. అఫ్గానిస్తాన్‌లో బాలికా విద్యపై నిషేధంతోపాటు వివిధ దేశాల్లో యుద్ధాలు, అంతర్యుద్ధాలు, అస్థిరతల నేపథ్యంలో పూర్తి స్థాయి గణాంకాలు అందలేదని చెప్పింది.



నక్సలిజానికి ఆఖరు రోజు మార్చి 31: అమిత్ షా

లక్నో: 2026 మార్చి 31వ తేదీకల్లా దేశంలో నక్సలిజాన్ని సమూలంగా తుడిచిపెట్టేస్తామని హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. గత 11 ఏళ్లలో ప్రధాని మోదీ సారథ్యంలో దేశం సురక్షితంగా మారిందన్నారు. అప్పట్లో 11 రాష్ట్రాల్లో ప్రబలంగా ఉన్న మావోయిజం బెడద ఇప్పుడే కేవలం మూడే జిల్లాలకు పరిమితమైందని చెప్పారు. నా ప్రకటనను గుర్తుంచుకోండి, 2026 మార్చి 31వ తేదీ నాటికి దేశంలో నక్సలిజమనేదే ఉండదు'అని అమిత్ షా స్పష్టం చేశారు. ఆదివారం ఆయన లక్నోలో నూతనంగా పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. గతంలో కుల ప్రాతిపదికగా పోలీసు ఉద్యోగ నియామకాలు జరిగేవని ఆరోపించారు. అహ్మదాబాద్, ఢిల్లీ, ముంబై, జైపూర్, కోయంబత్తూర్..ఇలా నిత్యం ఏదో ఒక చోట ఉగ్రదాడులు జరిగేవని, కశ్మీర్ విషయం వేరుగా చెప్పాల్సిన పనే ఉందేది కాదని వ్యాఖ్యానించారు. నేడు సాంకేతికత, పారదర్శకతే గీటురాయిగా తాము పోలీసులు ఎంపికలు చేపట్టామన్నారు. ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు కంట్రోల్ రూంలు, కమాండ్ సెంటర్లు, సంచార ఫోరెన్సిక్ యూనిట్లను అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు.

కశ్మీర్‌కు మళ్లీ పర్యాటక కళ



ఆదివారం జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకుల ఆటవిడుపు

- ఆదివారం తెరుచుకున్న పర్యాటక స్థలాలు
- స్వాగతించిన స్థానికులు, పర్యాటకులు


అనంత్‌నాగ్: పహల్గాం ఉగ్రదాడితో మూసేసిన జమ్మూకశ్మీర్‌లోని పర్యాటక స్థలాలు మళ్లీ తెరుచుకున్నాయి. బేతాబ్ వాలీ, ది సిరీన్ వెరినాగ్, కోకేర్‌నాగ్, అచాబల్ మొఘల్ గార్డెన్‌తోపాటు పహల్గాంలోని అనేక పార్కులను ఆదివారం తిరిగి ప్రారంభించారు. ఎనిమిది ప్రముఖ పర్యాటక స్థలాలను పర్యాటకులకోసం తిరిగి ప్రారంభిస్తున్నట్టు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా శనివారం ప్రకటించిన తరువాత.. వీటిని మళ్లీ తెరిచారు. ఈ నిర్ణయాన్ని స్థానికులు, రాజకీయనాకులు, పర్యాటకులు స్వాగతించారు. పహల్గాం ఉగ్రవాద దాడి తరువాత వీటిన్నంటినీ తాత్కాలికంగా మూసివేశారు. ఆదివారం తిరిగి తెరవడంతో పర్యాటకులు ఆయా ప్రదేశాలకు తరలి వస్తున్నారు. 'ప్రభుత్వ నిర్ణయం సరైనది. పర్యాటకం లేకపోతే, స్థానికులు ఎలా బ్రతుకుతారు? ప్రభుత్వ చొరవ బాగుంది. పర్యాటక ప్రదేశాలు తగిన భద్రతతో తిరిగి తెరుచుకున్నాయి. ప్రతి ఒక్కరూ ఇక్కడ పర్యటించి, పర్యాటకానికి మద్దతు ఇవ్వాలి'అని పర్యాటకులు విజ్ఞప్తి చేశారు. దీనిని స్థానిక రాజకీయ నాయకులు సైతం స్వాగతించారు. ఇతర నగరాలు, ఇళ్ల తరహాలోనే ఇప్పుడు కశ్మీర్ కూడా సురక్షితమని, కశ్మీర్‌కు తరలిరావాలంటూ పర్యాటకులకు పిలుపునిచ్చారు. 'పర్యాటక స్థలాలు తెరుచుకున్నాయి. అమర్‌నాథ్ యాత్ర కూడా త్వరలో ప్రారంభం కానుంది. రాబోయే కాలంలో, అన్ని ఇతర పర్యాటక ప్రదేశాలు కూడా తెరుచుకుంటాయి. పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. ఇది సానుకూల సంకేతం. ఈ యాత్రలను విజయవంతం చేయడమే జమ్మూకశ్మీర్ ప్రజలుగా మా ముందున్న కర్తవ్యం''అని పహల్గామ్ ఎమ్మెల్యే అల్తాఫ్ కలూ వ్యాఖ్యానించారు.

కశ్మీర్‌ను అత్యధికంగా పర్యాటకులు వేసవిలోనే సందర్శిస్తారు. అలాంటిది ఏప్రిల్ 23న ఉగ్రదాడి తరువాత పరిస్థితి మారిపోయింది. స్థానికులకు జీవనోపాధిని, అధిక ఆదాయాన్నిచ్చే వేసవి కాలం ముగిసిపోయింది. వర్షాకాలం ప్రారంభమైంది. శీతాకాలం వచ్చేలోపు పర్యాటకుల సందర్శన పెరుగుతుందని వారి ఆకాంక్షిస్తున్నారు. బక్రీద్ తరువాత నుంచి కశ్మీర్‌కు పర్యాటకులు వస్తున్నా.. పార్కులు మూసి వేసి ఉండటంతో కొంత నిరాశతో వెనుదిరిగారు. అయితే.. పార్కులను తిరిగి ప్రారంభించడంతో పరిస్థితి మారుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గత 10 రోజుల్లో ఇతర రాష్ట్రాల నుండి కొంత మంది పర్యాటకులు పహల్గామ్‌కు వచ్చారని చెబుతున్నారు. ఈ కొన్ని నెలలయినా.. కశ్మీర్‌కు పర్యాటకులు వస్తారని, తమ నష్టాలు కొంతైనా పూడ్చుకోగలుగుతామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జూలై 3 నుంచి ప్రారంభమయ్యే అమర్‌నాథ్ యాత్రకు పెద్ద సంఖ్యలో యాత్రికులు వస్తారని పోనీవాలాలు ఆశిస్తున్నారు. ఇక దక్షిణ కశ్మీర్ రిసార్టుల్లో పర్యాటక వ్యాపారం ఇప్పుడిప్పుడే సాధారణ స్థితికి చేరుకుంటోంది. ఈద్ సెలవుల తర్వాత గొర్రెల కాపరుల లోయ సందర్శనలు ప్రారంభమయ్యాయి. సాధారణ రోజుల్లో ఉండే రద్దీకంటే తక్కువగా ఉండటంతో చాలా విలాసవంతంగా ఫీలవుతున్నామని పర్యాటకులు చెబుతున్నారు. పహల్గాం స్థానికులు పర్యాటకులపై చూపిన ప్రత్యేక శ్రద్ధ, వారి సేవలు, అత్యంత తక్కువ ధరలపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులను గుంజిళ్లు తీయించినందుకు టీచర్‌కు కేరళ సర్కార్ నోటీసు

తిరువనంతపురం: విద్యార్థినుల చేత గుంజిళ్లు తీయించినందుకు ప్రభుత్వం ఉపాధ్యాయురాలికి నోటీసులు జారీ చేసింది. ఈ ఘటన కేరళలోని కాటన్‌హిల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగింది. పాఠశాల ముగిసిన అనంతరం జాతీయ గీతం ఆలపిస్తారు. కార్యక్రమం జరుగుతుండగానే కొందరు విద్యార్థినులు తరగతి గదినుంచి బయటికి వెళ్లిపోయారు. అది చూసిన టీచర్ వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. జాతీయగీతం పాడుతుండగా వెళ్లిపోయిన విద్యార్థినులను గుంజిళ్లు తీయించారు. దీంతో ఆయా విద్యార్థినులు స్కూల్ బస్సును మిస్సయ్యారు. తమ పిల్లలు రోజూకంటే ఆలస్యంగా ఇంటికి రావడంతో వారిని ప్రశ్నించిన తల్లిదండ్రులకు విషయం తెలిసింది. ఇది విద్యాశాఖ దృష్టికి వెళ్లడంతో ఎలాంటి వివరణ లేకుండానే విద్యాశాఖ మంత్రి శివన్‌కుట్టి ఆదివారం ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయితే.. జిల్లా విద్యాశాఖాధికారి నివేదిక మేరకు.. నోటీసులు జారీ చేశామని ఆయన పేర్కొన్నారు.

సర్కోజీ 'లీజియన్ ఆఫ్ ఆనర్' గౌరవం రద్దు



పారిస్: అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్న ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీకి గతంలో ఇచ్చిన 'లీజియన్ ఆఫ్ ఆనర్ మెడల్'ను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. లీజియన్ ఆఫ్ ఆనర్ నిబంధనలను అనుసరించి ఈ చర్య తీసుకున్నట్లు ప్రభుత్వం ఒక డిక్రీ ద్వారా ప్రకటించింది. 2007–2012 మధ్య కాలంలో ఫ్రాన్స్ అధ్యక్షుడిగా పనిచేసిన సర్కోజీపై పదవి నుంచి వైదొలగినప్పటి నుంచి తీవ్ర అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. 2021లో ఓ అవినీతి కేసులో కోర్టు ఆయన్ను దోషిగా తేల్చింది. న్యాయమూర్తికి లంచం ఇవ్వజూపినట్లు వచ్చిన ఆరోపణలు నిజమేనని 2023లో మరో కోర్టు ధ్రువీకరించింది. ఆయన కదలికలను పోలీసులు పసిగట్టేందుకు ఎలక్ట్రానిక్ బ్రేస్‌లెట్ ధరించాలని ఓ కోర్టు ఇచ్చిన తీర్పును ఫ్రాన్స్ అత్యున్నత న్యాయస్థానం నిలిపివేసింది. లీజియన్ ఆఫ్ ఆనర్‌ను పోగొట్టుకున్న రెండో అధ్యక్షుడిగా సర్కోజీ నిలిచారు. కాగా, ఫ్రాన్స్ రాజకీయాల్లో మాజీ అధ్యక్షుడు సర్కోజీ ఇప్పటికీ కీలకంగానే ఉన్నారు.

ఐసీయూలో బీజేపీ ఎంపీ అభిజిత్

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌కు చెందిన బీజేపీ ఎంపీ అభిజిత్ గంగోపాధ్యాయ(63) అనారోగ్యంతో ఆస్పత్రి పాలయ్యారు. అసౌకర్యంగా ఉందని తెలపడంతో కుటుంబసభ్యులు శనివారం కోల్‌కతాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలోని ఐసీయూలో చేర్పించారు. ఆయన ఆరోగ్యం విషమంగా ఉన్నప్పటికీ ప్రస్తుతం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. గంగోపాధ్యాయ ఆరోగ్య పరిస్థితిని వైద్యుల బృందం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందన్నారు. కలకత్తా హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న గంగోపాధ్యాయ గతేడాద మార్చిలో ఉద్యోగానికి రాజీనామా చేసి, అనంతరం బీజేపీలో చేరారు. 2024 ఎన్నికల్లో తామ్లుక్ లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందారు.

సీనియర్‌ను కాల్చి చంపిన బీఎస్ఎఫ్ జవాన్

న్యూఢిల్లీ/కోల్‌కతా: సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) క్యాంపులో చోటుచేసుకున్న వాగ్వాదం ఓ జవాను ప్రాణం తీసింది. పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలోని ధులియాన్ క్యాంపులో చోటుచేసుకుంది. శనివారం ఉదయం 10.30 గంటల సమయంలో కానిస్టేబుల్ శివం కుమార్ మిశ్రా, హెడ్ కానిస్టేబుల్ రతన్ సింగ్ షెకావత్(56) మధ్య వాదులాట తలెత్తింది. మిశ్రా తన వద్ద సర్వీస్ రైఫిల్‌తో షెకావత్‌పై కాల్పులు జరిపారు. ఘటనలో షెకావత్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పట్టుబడిన మిశ్రాపై సైనిక కోర్టులో విచారణ జరుపుతామని బీఎస్ఎఫ్ తెలిపింది. వీరి మధ్య తగాదాకు కారణాలను వివరించలేదు. రాజస్తాన్‌లోని జైపూర్‌కు చెందిన షెకావత్ 1989లో సర్వీసులో చేరారు. ప్రస్తుతం, మిశ్రాతో కలిసి 119వ బెటాలియన్‌లో పనిచేస్తున్నారు.

విదేశీ టూర్లు సరే.. మణిపూర్ వెళ్లేదెప్పుడు?

ప్రధాని మోదీకి కాంగ్రెస్ ప్రశ్న

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన మూడు దేశాల పర్యటనపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. విదేశీ పర్యటనల విషయంలో ఉత్సాహం, శక్తి, ఆసక్తి చూపే ప్రధాని మోదీ మణిపూర్ బాధితులను ఎందుకు పరామర్శించడానికి ఎందుకు లేదని ప్రశ్నించింది. అక్కడి ప్రజల వేదనకు అంతే లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. 2023 మేలో ప్రధానిగా పగ్గాలు చేపట్టాక ఇది 35వ విదేశీ పర్యటన అని తెలిపింది. మణిపూర్ విషయంలో ప్రధాని అనుసరిస్తున్న తీరు చాలా బాధాకరంగా ఉందని ఆక్షేపించింది. అదేవిధంగా, భారత్, కెనడాల మధ్య బంధాన్ని ఎంతో దృఢమైందంటూ 2015లో ప్రధాని మోదీ ప్రకటించిన వీడియోను కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఇప్పుడేమో జీ7 శిఖరాగ్రానికి మోదీని కెనడా ప్రధాని కార్నీ ఆలస్యంగా ఎందుకు ఆహ్వానించాల్సి వచ్చిందని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో బీజేపీ నేతలు గొప్పలు చెప్పుకోవడం మానుకోవాలని హితవు పలికారు.

25 నుంచి ఇండియా స్పేస్ కాంగ్రెస్

న్యూఢిల్లీ: దేశంలో కొత్తగా ప్రారంభమైన ప్రైవేట్ అంతరిక్ష రంగం పురోగతి, ఎదురవుతున్న సవాళ్లను చర్చించే ఉద్దేశంతో ఇండియా స్పేస్ కాంగ్రెస్(ఐఎస్‌సీ)ఈ నెల 25 నుంచి ఢిల్లీలో ప్రారంభం కానుంది. ప్రతిష్టాత్మక ఈ కార్యక్రమానికి ఇటలీ, నార్వే, ఆస్ట్రేలియా, హంగరీ తదితర 40 దేశాల నుంచి విధాన నిర్ణేతలు, దౌత్యాధికారులు, పరిశ్రమల ప్రముఖులు హాజరవుతారు. 'పయోనీరింగ్ ఇన్నోవేషన్ ఇన్ స్పేస్ టెక్: ఇండియాస్ జర్నీ టువార్డ్స్ గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్స్'ఇతివృత్తంగా మూడు రోజుల పాటు సాగే ఈ కార్యక్రమాన్ని శాట్‌కామ్ ఇండస్ట్రీ అసోసియేషన్(సియా)–ఇండియా నిర్వహిస్తోంది. భారత్–పశ్చిమాసియా–యూరప్ ఎకనామిక్ కారిడార్(ఐమెక్)లో భారత్ సహకారంపై ప్రత్యేకంగా చర్చా కార్యక్రమాలను సైతం చేపడతామని సియా–ఇండియా ప్రెసిడెంట్ పావులూరి సుబ్బారావు వెల్లడించారు.



జిప్ లైన్ తెగి బాలికకు తీవ్రగాయాలు

సిమ్లా: మనాలీలో విహార యాత్ర విషాదానికి దారి తీసింది. బాలిక జిప్‌లైనింగ్ చేస్తుండగా తీగ తెగిపోవడంతో కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన 12 ఏళ్ల త్రిషా బిజ్వే కుటుంబంతో కలిసి గత వారం మనాలీ పర్యటనకు వెళ్లింది. ఆమె మనాలీలో ప్రత్యేక ఆకర్షణ అయిన జిప్‌లైనింగ్ చేస్తుండగా తీగ తెగింది. దీంతో 30 అడుగుల లోతులో ఉన్న లోయలో పడిపోయింది. అక్కడ బండరాళ్లు ఉండటంతో బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సమీపంలో ఉన్న చండీగఢ్‌లోని మెడికల్ కాలేజీకి, తరువాత నాగ్‌పూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం బాలిక పరిస్థితి విషమంగా ఉంది.

రాజ్యాంగ సవరణలు - ముఖ్యాంశాలు

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ



1వ సవరణ
(అమల్లోకి వచ్చిన తేదీ: 1951, జూన్ 18)

- సవరించిన ప్రకరణలు: 15, 19, 85, 87, 174, 176, 341, 342, 372, 376.
- కొత్తగా చేర్చినవి: 31 ఎ, 31 బి ప్రకరణలు, షెడ్యూల్ 9.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ముఖ్యాంశాలు:

1. స్వేచ్ఛ, సమానత్వ, ఆస్తి హక్కులపై ప్రజా ప్రయోజనం దృష్ట్యా నియంత్రణ విధించారు.
2. భూ సంస్కరణలకు సంబంధించిన అంశాలను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చారు. ఈ షెడ్యూల్‌లో చేర్చిన అంశాలు న్యాయ సమీక్ష పరిధిలోకి రావు. అసెంబ్లీల సమావేశ కాలాలు, న్యాయాధికారుల నియామకాలు.

2వ సవరణ (1953, మే1)

- సవరించిన ప్రకరణ- 81
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు:

1. ఇది పార్లమెంటులో రాష్ట్రాలకు కేటాయించిన సీట్ల (స్థానాలు) మార్పుకు సంబంధించిన సవరణ.

3వ సవరణ (1955, ఫిబ్రవరి 22)

- ఏడో షెడ్యూల్‌ను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు:
- ముడిపత్తి, ఆహార ధాన్యాల ఉత్పత్తి, పశువులకు సంబంధించిన అంశాలను ఉమ్మడి జాబితాలోకి మార్చారు.

4వ సవరణ (1955, ఏప్రిల్ 27)

- సవరించిన ప్రకరణలు: 31, 31 ఎ, 305. తొమ్మిదో షెడ్యూల్‌ని కూడా సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ముఖ్యాంశాలు:

1. భారత ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వాలు స్వాధీనం చేసుకున్న ఆస్తులకు ఇచ్చే నష్ట పరిహారాన్ని కోర్టుల పరిధికి వెలుపల ఉంచారు.

5వ సవరణ (1955, డిసెంబర్ 24)

- ప్రకరణ 3ను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ముఖ్యాంశాలు
- రాష్ట్రపతి.. రాష్ట్రాల భౌగోళిక సరిహద్దులు, పేర్లను మార్చే బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి ముందు రాష్ట్రాల అభిప్రాయం కోసం పంపిస్తారు. వాటిపై సమాధానం చెప్పేందుకు రాష్ట్రాలకు నిర్ణీత సమయం ఇస్తారు.

6వ సవరణ (1956, సెప్టెంబర్ 11)

- సవరించిన ప్రకరణలు- 269, 286.
- ఏడో షెడ్యూల్‌లోని 1వ జాబితా, 2వ జాబితాకు సవరణలు చేశారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు

1. అంతర్రాష్ట్ర వాణిజ్యంపై పన్నులు విధించే అధికారం పార్లమెంటుకు ఉంటుంది.

7వ సవరణ (1956, నవంబర్ 1)

- సవరించిన ప్రకరణలు: 1, 49, 80, 81, 82, 131, 153, 158, 168, 170, 171, 216, 217, 220, 222, 224, 230, 231,232,371. కొత్తగా చేర్చిన ప్రకరణలు: 258 ఎ, 290 ఎ, 350 ఎ, 350 బి, 372 ఎ , 378 ఎ. తొలగించిన ప్రకరణలు: 238, 242, 243, 259, 278, 306, 379, 391.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు

1. రాష్ట్రాల పునర్విభజన ద్వారా 14 రాష్ట్రాలు, 6 కేంద్రపాలిత ప్రాంతాలను ఏర్పాటు చేశారు.
2. లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్ర శాసనసభల స్థానాల మార్పు.
3. హైకోర్టులో తాత్కాలిక అదనపు న్యాయమూర్తుల నియామకానికి అవకాశం కల్పించారు.
4. కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన అంశాల్లో మార్పులు చేశారు.
5. ఆంధ్రప్రదేశ్, పంజాబ్, బొంబాయి రాష్ట్రాలకు సంబంధించి కొన్ని ప్రత్యేక అంశాలు చేర్చారు.
6. ఒకే వ్యక్తిని ఒకటి లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు గవర్నర్‌గా నియమించే అవకాశం కల్పించారు.

8వ సవరణ (1960, జనవరి 5)

- సవరించిన ప్రకరణ: 334
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ముఖ్యాంశాలు:
- షెడ్యూల్ కులాలు, తెగలు, ఆంగ్లో ఇండియన్లకు లోక్‌సభ, శాసనసభల్లో కేటాయించిన స్థానాలను 1970 వరకు పొడిగించారు.

9వ సవరణ (1960, డిసెంబర్ 28)

- మొదటి షెడ్యూల్‌ను సవరించారు.
- పశ్చిమబెంగాల్ ఆమోదించింది.
- ముఖ్యాంశాలు:
- బేరూబరీ ప్రాంతాన్ని పాకిస్తాన్‌కు బదిలీ చేయడానికి ఈ సవరణ చేశారు.

10వ సవరణ (1961, ఆగస్టు 11)

- ప్రకరణ 240తో పాటు మొదటి షెడ్యూల్‌ను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ముఖ్యాంశాలు
- దాద్రానగర్ హవేలీని కేంద్రపాలిత ప్రాంతంగా భారతదేశంలో విలీనం చేశారు.

11వ సవరణ (1961, డిసెంబర్ 19)

- సవరించిన ప్రకరణలు: 66 (1), 71 (3)
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.

ముఖ్యాంశాలు:
- రాష్ట్రపతి/ఉప రాష్ట్రపతి ఎలక్టోరల్ కాలేజీకి సంబంధించిన అంశాలను సవరించారు. రాష్ట్రపతి ఎలక్టోరల్ కాలేజీలో ఖాళీలు ఉన్నాయనే నెపంతో ఎన్నికలను వాయిదా వేయరాదు.

12వ సవరణ (1961, డిసెంబర్ 20)

- ప్రకరణ 240తోపాటు మొదటి షెడ్యూల్‌ను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు
- గోవా, డామన్-డయ్యూలను భారత్‌లో విలీనం చేశారు.

13వ సవరణ (1963, డిసెంబర్ 1)

- కొత్తగా ప్రకరణ 371ఎ చేర్చారు.
- నాగాలాండ్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.

14వ సవరణ (1962, డిసెంబర్ 28)

- 239 ఎ, 241 ప్రకరణలతోపాటు 1, 4 షెడ్యూళ్లలోని అంశాలను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ముఖ్యాంశాలు

పాండిచ్చేరి (ప్రస్తుతం పుదుచ్చేరి)ని కేంద్ర పాలిత ప్రాంతంగా భారతదేశంలో చేర్చుకున్నారు. అలాగే ఈ కేంద్రపాలిత ప్రాంతానికి ప్రత్యేక శాసనసభను, మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. హిమాచల్‌ప్రదేశ్, మణిపూర్, త్రిపుర, గోవాలకు శాసనసభలను, మంత్రివర్గాన్ని ఏర్పరిచారు.

15వ సవరణ (1963, అక్టోబర్ 5)

- సవరించిన ప్రకరణలు: 124, 128, 217, 222, 224, 226, 297, 311, 316 . నూతనంగా ప్రకరణ 224 ఎ చేర్చారు. 7వ షెడ్యూల్‌ను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు

1. హైకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచారు.
2. హైకోర్టులో పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులను పునర్నియమించే అవకాశం కల్పించారు.
3. హైకోర్టు పరిధిని విస్తరించారు.
4. ఉద్యోగుల తొలగింపునకు సంబంధించి రాష్ట్రపతి, గవర్నర్ అధికారాలను సవరించారు.

16వ సవరణ (1963, అక్టోబర్ 5)

- 19, 84, 173 ప్రకరణలను, 3వ షెడ్యూల్‌ను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు

ప్రకరణ 19లోని స్వేచ్ఛా హక్కుపై పరిమితులు. ఎంపీ, ఎమ్మెల్యే, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పదవీ ప్రమాణ స్వీకార ప్రక్రియలో మార్పు.

17వ ప్రకరణ (1964, జూన్ 20)

- ప్రకరణ 31 ఎ, 9వ షెడ్యూల్‌ని సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ఎస్టేట్ పద నిర్వచనాన్ని మార్చారు. వ్యవసాయ భూములను స్వాధీనం చేసుకుంటే మార్కెట్ విలువ చెల్లించాలి.

18వ సవరణ (1966, ఆగస్టు 27)

- ప్రకరణ 3ని సవరించారు.
- ప్రకరణ 3లోని 'రాష్ట్రం' అనే మాటను పునర్నిర్వచించారు. పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్‌లను పునర్వ్యవస్థీకరించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.

19వ సవరణ (1966, డిసెంబర్ 11)

- సవరించిన ప్రకరణ-324
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ముఖ్యాంశాలు

ఎన్నికల వివాదాలకు సంబంధించి ఎన్నికల ట్రిబ్యునల్ ఏర్పాటు.

20వ సవరణ (1966, డిసెంబర్ 22)

- నూతనంగా ప్రకరణ 233 ఎ చేర్చారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.

ముఖ్యాంశాలు:
- ఈ సవరణ ద్వారా జిల్లా జడ్జీల నియామక ప్రాతిపదికను రాజ్యాంగంలో చేర్చారు.

21వ సవరణ (1967, ఏప్రిల్ 10)

- ఎనిమిదో షెడ్యూల్‌ను సవరించారు.
- సింధీని 15వ అధికార భాషగా 8వ షెడ్యూల్‌లో చేర్చారు.

22వ సవరణ (1969, సెప్టెంబర్ 25)

- 244 ఎ, 371 బి, 275 (1ఎ) ప్రకరణ లను కొత్తగా చేర్చారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- మేఘాలయను స్వతంత్ర ప్రతిపత్తి గల ప్రాంతంగా ఏర్పాటు చేశారు.
- అసోం రాష్ట్రానికి కొన్ని ప్రత్యేక ప్రాధాన్యాలు కల్పించారు.

23వ సవరణ (1970, జనవరి 23)

- 330,332,333,334 ప్రకరణలను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల్లో షెడ్యూల్ కులాలు, తరగతులు, ఆంగ్లో ఇండియన్ల రిజర్వేషన్లను 1980 వరకు పొడిగించారు.

24వ సవరణ (1971, నవంబర్ 5)

- 13, 368 ప్రకరణలను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు
- ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ భాగాన్నయినా సవరించే అధికారాన్ని పార్లమెంటుకు కల్పించారు.

25వ సవరణ (1972, ఏప్రిల్ 20)

- సవరించిన ప్రకరణ-31.
- కొత్తగా చేర్చిన ప్రకరణ- 31 సి.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు
- 'నష్టపరిహారం' అనే పదం స్థానంలో 'కొంత మొత్తం' అనే పదాన్ని చేర్చారు. ఆదేశిక నియమాల్లోని 39 (బి), (సి) అమలుకు చట్టాలు చేస్తే వాటిని న్యాయస్థానాలు ప్రశ్నించరాదు.

26వ సవరణ (1971, డిసెంబర్ 28)

- సవరించిన ప్రకరణ-366; నూతనంగా చేర్చిన ప్రకరణ- 363 ఎ; తొలగించిన ప్రకరణలు- 291, 362.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- రాజవంశస్తులకు ఇచ్చే రాజభరణాలు, ప్రత్యేక సదుపాయాలను రద్దు చేశారు.

27వ ప్రకరణ (1972, ఫిబ్రవరి 15)

- 239 ఎ, 240 ప్రకరణలను సవరించారు; నూతనంగా ప్రకరణ 371 సి చేర్చారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ఈశాన్య రాష్ట్రాలను పునర్వ్యవస్థీకరించారు. ప్రకరణ 371 సి ప్రకారం మణిపూర్‌కు మంత్రిమండలి, అసెంబ్లీని ఏర్పాటు చేశారు.

28వ ప్రకరణ (1972, ఆగస్టు 29)

- నూతనంగా ప్రకరణ 312 ఎని చేర్చి.. ప్రకరణ 314ను తొలగించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ఇండియన్ మాజీ సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు గల ప్రత్యేక హక్కులు, హోదాలను తొలగించారు.

29వ సవరణ (1972, జూన్ 9)

- తొమ్మిదో షెడ్యూల్‌ను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- కేరళ రాష్ట్ర భూ సంస్కరణల చట్టాన్ని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చారు.

30వ సవరణ (1973, ఫిబ్రవరి 27)

- సవరించిన ప్రకరణ - 133
- సుప్రీంకోర్టుకు అప్పీలుకు వెళ్లేందుకు గల రూ.20 వేల పరిమితిని తొలగించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.

31వ సవరణ (1973, అక్టోబర్ 17)

- సవరించిన ప్రకరణలు - 81, 330, 332.
- లోక్‌సభ సీట్ల సంఖ్యను 525 నుంచి 545కు పెంచారు. కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్యను 25 నుంచి 20కి తగ్గించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.

32వ సవరణ (1974, జూలై 1)

- 371 ఎ ప్రకరణను సవరించి.. కొత్తగా 371 డి, 371 ఇ ప్రకరణలను చేర్చారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ఆరు సూత్రాల పథకాన్ని చేర్చారు.
- 371-ఇ ప్రకారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారు.

33వ ప్రకరణ (1974, మే 19)

- సవరించిన ప్రకరణలు- 101, 190.
- పార్లమెంటు, శాసనసభ్యుల రాజీనామా పత్రాన్ని సభాధ్యక్షుడు తప్పనిసరిగా ఆమోదించాలనే నిబంధనను తొలగించారు. సభ్యుడు ఇష్టపూర్వకంగా/స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నాడని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే స్పీకర్ లేదా ఛైర్మన్ రాజీనామాను ఆమోదించాలి.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.

34వ ప్రకరణ (1974, సెప్టెంబర్ 7)

- తొమ్మిదో షెడ్యూల్‌ను సవరించారు.
- తొమ్మిదో షెడ్యూల్ అధికార పరిధిని పెంచారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.

35వ సవరణ (1975, మార్చి 1)

- 80, 81 ప్రకరణలను సవరించి.. కొత్తగా ప్రకరణ 2 ఎ చేర్చారు.
- సిక్కింకు సహ రాష్ట్ర హోదా కల్పిస్తూ పదో షెడ్యూల్‌ను కొత్తగా చేర్చారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.

36వ సవరణ (1975, ఏప్రిల్ 26)

- నూతనంగా ప్రకరణ 371 ఎఫ్ చేర్చి.. ప్రకరణ 2ఎను తొలగించారు.
- సిక్కింకు పూర్తిస్థాయి రాష్ట్ర ప్రతిపత్తి కల్పించారు. సిక్కిం 22వ రాష్ట్రంగా ఏర్పడింది. పదో షెడ్యూల్‌ను తొలగించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.

37వ సవరణ (1975, మే 3)

- నూతనంగా 239ఎ, 240 ప్రకరణలు చేర్చారు. కేంద్ర పాలిత ప్రాంత హోదా గల అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రదేశ్ కౌన్సిల్ స్థానంలో లెజిస్లేటివ్ అసెంబ్లీ, కౌన్సిలర్ల స్థానంలో మంత్రిమండలి ఏర్పాటు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.

38వ సవరణ (1975, ఆగస్టు 1)

- సవరించిన ప్రకరణలు: 123, 213, 239 బి 352, 356, 359, 360.

ముఖ్యాంశాలు:
1. రాష్ట్రపతి, గవర్నర్, లెఫ్టినెంట్ గవర్నర్ జారీచేసే ఆర్డినెన్స్‌లు కోర్టుల అధికారాల పరిధిలోకి రావని తీర్మానించారు.
2. రాష్ట్రపతి విధించే అత్యవసర పరిస్థితిని కోర్టుల అధికార పరిధి నుంచి తప్పించారు. న్యాయ సమీక్షకు గురికాదు.

- రాష్ట్రాల ఆమోదం పొందింది.

39వ సవరణ (1975, ఆగస్టు 10)

- 71, 329 ప్రకరణలతో పాటు తొమ్మిదో షెడ్యూల్‌ను సవరించారు.
- రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి , లోక్‌సభ స్పీకర్ ఎన్నికకు సంబంధించిన అంశాలు న్యాయసమీక్ష పరిధిలోకి రావు.
- తొమ్మిదో షెడ్యూల్‌లో నూతన చట్టాలను చేర్చారు.రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.

40వ ప్రకరణ (మే 27, 1976)

- 31 బి, 297 ప్రకరణలతో పాటు 9వ షెడ్యూల్‌ను సవరించారు.
- తన అధికార పరిధిలోని భౌగోళిక జలాలపై భారతదేశానికి పూర్తి హక్కు ఉంటుంది. దీనికి సంబంధించిన చట్టాలు చేసే అధికారాన్ని పార్లమెంటుకు కట్టబెట్టారు.
- తొమ్మిదో షెడ్యూల్‌లో నూతన చట్టాలను చేర్చారు.

చేప కాలేయ నూనెలో ఉండే విటమిన్‌లు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
బయాలజీ

ప్రాక్టీస్ టెస్ట్

1. రాజుకు రే చీకటి ఉందని డాక్టర్ నిర్ధారించాడు. మరి రాజు కిందివాటిలో దేనికి సంబంధించి ఉంటాడు?
   1) ఎక్కువ వెలుతురు, రాత్రుల్లో వస్తువు లను చూడలేడు.
   2) రంగు వస్తువులను, పగటిపూట వస్తువులను చూడలేడు.
   3) తక్కువ వెలుతురులో, రాత్రిపూట వస్తువులను చూడలేడు.
   4) రాత్రిపూట వస్తువులను చూస్తాడు, పగటిపూట వస్తువులను చూడలేడు.
2. మలేరియా పరాన్నజీవి జీవిత చక్రానికి సంబంధించి సరైంది?
   1) లైంగిక చక్రం దోమలో జరుగుతుంది. అలైంగిక చక్రం మానవుడిలో జరుగుతుంది.
   2) లైంగిక, అలైంగిక చక్రాలు మానవుడి లో జరుగుతాయి.
   3) అలైంగిక చక్రం దోమలో జరుగుతుంది. లైంగిక చక్రం మానవుడిలో జరుగు తుంది.
   4) లైంగిక, అలైంగిక చక్రాలు అవకాశాన్ని బట్టి వేటిలోనైనా జరగవచ్చు.
3. అండకోశానికి సంబంధించిన కణాలే ఒక దానితో ఒకటి సంయోగం చెంది ఏర్పడే కణం?
   1) సంయుక్త బీజం
   2) ద్వితీయ కేంద్రకం
   3) అంకురచ్ఛదం
   4) ప్రతిపాద కణం
4. మొక్క ఆహార కర్మాగారంగా దేన్ని పేర్కొంటారు?
   1) విత్తనం 2) అండకోశం
   3) వేరు 4) పత్రం
5. ప్రొజెస్టిరాన్ హార్మోన్ పని?
   1) గ్లైకోజన్‌ను గ్లూకోజ్‌గా మార్చడం.
   2) గాయిటర్ రాకుండా కాపాడడం.
   3) గర్భాశయ పెరుగుదల, జరాయువు ఏర్పడడం.
   4) నపుంసకత్వం రాకుండా ఉండడం.
6. సహజ శత్రువులైన కీటకాలను ప్రవేశపెట్టి కలుపు మొక్కలను నాశనం చేసే పద్ధతి?
   1) బ్రాడ్‌కాస్టింగ్ పద్ధతి
   2) జీవక్రియా విధాన పద్ధతి
   3) భౌతిక పద్ధతి
   4) రసాయన పద్ధతి
7. స్పర్శ గ్రాహకాలు ఏ భాగాలపై ఎక్కువగా ఉంటాయి?
   1) వేళ్ల కొనలపై
   2) నొసటి ప్రాంతంలో
   3) పెదవులపై 4) 1, 3
8. కిందివాటిలో ఏ రుచికి చెందిన గ్రాహకాలు నాలుక వెనుక భాగంలో ఉంటాయి?
   1) తీపి 2) ఉప్పు
   3) పులుపు 4) చేదు
9. పాములు వాటి శాస్త్రీయ నామాలకు సంబంధించి సరైన జత?
   ఎ) తాచుపాము - రస్సెల్స్ వైపర్
   బి) కట్లపాము - ఓఫియోఫెగస్ హెన్న
   సి) ఎకిస్ కారినేటా- సాస్కేల్ వైపర్
   డి) రక్తపింజర- బంగారస్ ఫాసియేటస్
   1) ఎ, సి 2) సి, డి
   3) బి, డి 4) ఎ, డి
10. చిన్న పిల్లల్లో అతి సామాన్యంగా కలిగే చర్మ వ్యాధి గజ్జిని కలిగించే క్రిమి ఏ వర్గానికి చెందింది?
    1) ప్లాటి హెల్మింథిస్ 2) ప్రోటోజోవా
    3) ఆర్థ్రోపొడా 4) నిమటిహెల్మింథిస్
11. కిందివాటిలో వేటిని బయోఎరువులుగా ఉపయోగిస్తారు?
    1) ఆకుపచ్చ శైవలాలు
    2) నీలి ఆకుపచ్చ శైవలాలు
    3) గోధుమ వర్ణపు శైవలాలు 4) పైవన్నీ
12. 'రూబియోలా' అనే మరో పేరు కలిగిన వ్యాధి?
    1) ఆటలమ్మ 2) తట్టు (పొంగు)
    3) పోలియో (శిశు పక్షవాతం)
    4) గవద బిళ్లలు
13. అలిసిపోవడం, శ్లేష్మంతో కూడిన దగ్గు, బరువు తగ్గడం వంటి లక్షణాలను గుర్తించిన డాక్టర్ ఆ వ్యాధిగ్రస్తుడికి ఏ వ్యాధి ఉంది అని నిర్ధారిస్తాడు?
    1) కుష్ఠు 2) క్షయ
    3) మలేరియా 4) కోరింత దగ్గు
14. కిందివాటిలో ఏ రెండు ప్రవచనాలు సరైనవి?
    ఎ) చింతకాయ, మామిడి, నిమ్మ మొదలైన వాటిని పొగబెట్టడం ద్వారా నిల్వ చేస్తారు.
    బి) బ్యాక్టీరియా వేగంగా వృద్ధి చెందడానికి తగిన ఉష్ణోగ్రత 20°C- 40°C
    సి) ఈస్ట్‌లు ఆమ్ల ద్రావణంలో వృద్ధి చెందుతాయి.
    డి) ఎప్లోటాక్సిన్ కాలేయాన్ని పాడు చేస్తుంది.
    1) ఎ, బి 2) సి, డి
    3) బి, డి 4) ఎ, సి
15. మంచి కలపను ఇచ్చే ఇండియన్ రోజ్‌వుడ్ శాస్త్రీయ నామం?
    1) టిక్టోనియా గ్రాండిస్
    2) షొరియా రొబస్టా
    3) డాల్‌బర్జియా లాటిఫోలియా
    4) అజార్డికా ఇండికా
16. కేన్సర్‌కు సంబంధించి కిందివాటిలో ఏది సరైన జత?
    1) మాలిగ్నెంట్ - ఊపిరితిత్తులు ప్రమాదకరం కావు.
    2) కార్సినోమా-ఉపకళా కణాలకు వచ్చే కాన్సర్
    3) అపాయం చేయని వ్రణాలు - కార్సి నోమా
    4) ఇతర భాగాలకు సోకే గడ్డలు-బినైన్ గడ్డలు.
17. గోళ్లు, రోమాలు, కొమ్ములు వంటి జంతు నిర్మాణాలు ఏ కణజాలం నుంచి తయారవుతాయి?
    1) సంయోజక కణజాలం
    2) కండర కణజాలం
    3) అస్థి కణజాలం
    4) ఉపకళా కణజాలం
18. ప్రౌఢ మానవుడిలో ఉండే కుంతకాల సంఖ్య?
    1) 4 2) 8
    3) 10 4) 12
19. మానవుడి జీర్ణ క్రియలో సెల్యులోజ్ తంతువుల ఉపయోగం కానిది?
    1) ఆహారానికి బరువును చేకూర్చడం.
    2) పేగులో ఆహారం సులువుగా జారేట్లు చేయడం.
    3) ప్రొటీన్‌ల జీర్ణ క్రియలో ఉపయోగపడడం.
    4) జీర్ణమైన పోషకాలను సమర్థవంతంగా పీల్చుకునేటట్లు చేయడం.
20. ఇతర జంతువులతో పోల్చినప్పుడు నెమరువేసే జంతువుల్లో గ్లూకోజ్ మట్టం ఏ విధంగా ఉంటుంది?
    1) అతి ఎక్కువగా 2) సమానంగా
    3) అతి తక్కువగా 4) కొలవలేం
21. ఈ కిందివాటిలో ఏది ఆంత్ర రసంలో మాత్రమే ఉంటుంది?
    1) ఎమిలాప్సిన్ 2) ట్రిప్సిన్
    3) ఎంటిరోకైనేస్ 4) కీమోట్రిప్సిన్
22. కిందివాటిలో ఏ జీవి నీలం రంగు రక్తాన్ని కలిగి ఉంటుంది?
    1) వానపాము 2) కప్ప
    3) నత్త 4) బొద్దింక
23. కిందివాటిలో కీటకాహారి మొక్క కానిది?
    1) డ్రాసిరా 2) నెపంథిస్
    3) డైమోనియా 4) కస్కుటా
24. పత్ర రంధ్రాలు తెరుచుకోవడం, మూసుకోవడం కిందివాటిలో ఏ చర్యపై ఆధారపడి ఉంటాయి?
    1) విసరణ 2) బాష్పోత్సేకం
    3) కిరణజన్యసంయోగక్రియ
    4) వేరు పీడనం
25. కిందివాటిలో ఏ జీవి ద్రవ రూపంలో ఉన్న ఆహారాన్ని మాత్రమే తీసుకుంటుంది?
    1) నత్త 2) వానపాము
    3) ఈగ 4) చేప
26. సాధారణంగా శాఖాహార జంతువుల్లో ఏ దంతాలు లోపిస్తాయి?
    1) కుంతకాలు 2) రదనికలు
    3) చర్వణకాలు 4) అగ్రచర్వణకాలు
27. కిందివాటిలో ఏ జీవి విసర్జక పదార్థంగా యూరికామ్లాన్ని విసర్జిస్తుంది?
    1) కప్ప 2) చేప
    3) వానపాము 4) బొద్దింక
28. పట్టుపురుగులు-గొంగళి పురుగులు కిందివాటిలో ఏ రకం భక్షక విధానానికి ఉదాహరణ?
    1) ఏకరక భక్షణ 2) బహుళరక భక్షణ
    3) జాంతవ భక్షణ 4) సర్వ భక్షణ
29. చేప కాలేయ నూనెలో ఉండే విటమిన్‌లు?
    1) A, D 2) B, C
    3) E, K 4) C, D
30. కంఠ బిలంపై మూతలా పని చేసే నిర్మాణం?
    1) నాలుక 2) పటలిక
    3) కొండ నాలుక 4) ఉపరికుల

సమాధానాలు

1) 3	2) 1	3) 2	4) 4	5) 3
6) 2	7) 4	8) 4	9) 2	10) 3
11) 2	12) 2	13) 2	14) 3	15) 3
16) 2	17) 4	18) 2	19) 3	20) 3
21) 3	22) 3	23) 4	24) 2	25) 3
26) 2	27) 4	28) 1	29) 1	30) 3

కుద్రేముఖ్ నేషనల్ పార్క్ ఎక్కడ ఉంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
జాగ్రఫీ

- 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా వన్య ప్రాణుల సంరక్షణను రాష్ట్ర జాబితా నుంచి ఉమ్మడి జాబితాలోకి మార్చారు.
- మన దేశంలో అంతరించిపోతున్న జంతువుల సంరక్షణకు 'వన్య మృగ సంరక్షణ చట్టం ప్రకారం (1972)' అనేక కార్యక్రమాలు అమలుచేస్తున్నారు.

అవి..

1. ప్రాజెక్టు టైగర్ - 1973
2. ప్రాజెక్టు క్రోకడైల్ - 1975
3. ఆపరేషన్ సీ టర్టిల్ - 1975
4. ప్రాజెక్టు ఎలిఫెంట్ - 1992
5. ప్రాజెక్టు స్నో లెపర్డ్ - 2009

- దేశంలో అంతరించిపోతున్న పులులను సంరక్షించేందుకు 1973, ఏప్రిల్ 1న ప్రాజెక్టు టైగర్/ఆపరేషన్ టైగర్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది.
- టైగర్ టాస్క్ ఫోర్స్ సిఫార్సుల మేరకు దేశంలో జాతీయ పులుల సంరక్షణ అధీకృత సంస్థ (ఎన్టీసీఏ) ఏర్పడింది. ఇది 'ప్రాజెక్టు టైగర్', టైగర్ రిజర్వ్‌ల నిర్వహణను పునర్వ్యవస్థీకరించడంలో భాగంగా ఏర్పడింది. దేశంలో ప్రస్తుతం 58 టైగర్ రిజర్వులు ఉన్నాయి.
- దేశంలో తొలిసారిగా ఏర్పాటుచేసిన టైగర్ రిజర్వ్ బందీపూర్ టైగర్ రిజర్వ్ (కర్ణాటక).
- **దేశంలో అతి పెద్ద టైగర్ రిజర్వ్:** నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ (రాజీవ్‌గాంధీ టైగర్ రిజర్వ్).
- **దేశంలో అతి చిన్న టైగర్ రిజర్వ్:** ఒరంగ్ టైగర్ రిజర్వ్ (అసోం).
- **దేశంలో ఏర్పాటైన 48వ టైగర్ రిజర్వ్:** రాజాజీ టైగర్ రిజర్వ్ (ఉత్తరాఖండ్).
- **49వ టైగర్ రిజర్వ్:** ఒరంగ్ టైగర్ రిజర్వ్ (అసోం).
- **50వ టైగర్ రిజర్వ్:** కమ్లాంగ్ టైగర్ రిజర్వ్ (అరుణాచల్‌ప్రదేశ్).
- దేశంలో ప్రస్తుతం పులుల సంఖ్య 3,682
- ప్రస్తుతం దేశంలో పులుల లెక్కింపునకు ఉపయోగిస్తున్న పద్ధతి GIS (Global Imaging Satellite System). ప్రతి నాలుగేళ్లకోసారి పులులను లెక్కిస్తారు.
- పులులు ఎక్కువగా ఉన్న రాష్ట్రం కర్ణాటక. తర్వాతి స్థానంలో ఉన్నది ఉత్తరాఖండ్.
- పులుల సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతం కజిరంగ (అసోం).



2. **ప్రాజెక్టు క్రోకడైల్:** ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ) సహకారంతో ఈ ప్రాజెక్టు భారతదేశంలో 1975లో ప్రారంభమైంది.

- దేశంలో అత్యంత వేగంగా అంతరిస్తున్న మొసళ్ల జాతి ఘరియల్. వీటిని చంబల్ వన్యప్రాణి కేంద్రం (National Chambal Gharial Wildlife Sanctuary)లో సంరక్షిస్తున్నారు. ఇది మధ్యప్రదేశ్‌లో ఉంది.
- మొసళ్ల సంరక్షణకు తమిళనాడులో 'మద్రాస్ క్రోకడైల్ బ్యాంక్ ట్రస్ట్' ఉంది.

3. **ఆపరేషన్ సీ టర్టిల్:** దీన్ని మన దేశంలో 1975లో ప్రారంభించారు.

- దేశంలోని తాబేళ్ల సంరక్షణ ప్రాంతాలు..
  1. **గహిర్మాత బీచ్:** ఇది ఒడిశాలో ఉంది. ఇక్కడ సంరక్షిస్తున్న తాబేళ్ల జాతి ఆలివ్ రిడ్లే. వీటిని మన దేశంలో నక్షత్ర తాబేళ్లు అంటారు.
  2. **ట్యుటికోరిన్ బీచ్:** ఇది తమిళనాడులో ఉంది. ఇక్కడ సంరక్షిస్తున్న తాబేళ్ల జాతి హాక్స్‌బిల్.

3. **ప్రాజెక్టు ఎలిఫెంట్:** ఏనుగుల సంరక్షణకు 8వ పంచవర్ష ప్రణాళికా కాలం (1992-97)లో 'ప్రాజెక్టు ఎలిఫెంట్'ను ప్రారంభించారు.

- ప్రస్తుతం దేశంలో దాదాపు 33 ఎలిఫెంట్ రిజర్వ్‌లు ఉన్నాయి. ఎలిఫెంట్ సెన్సస్ (2017) ప్రకారం 23 రాష్ట్రాల్లో 27,312 ఏనుగులు ఉన్నాయి. అత్యధికంగా కర్ణాటకలో 6,049 ఏనుగులు ఉన్నాయి. తర్వాతి స్థానంలో అసోం (5,719), కేరళ (3,054) ఉన్నాయి. ప్రాంతాల వారీ చూస్తే దక్షిణ భారతంలో అత్యధికంగా 11,960 ఏనుగులు ఉన్నాయి.

4. **ప్రాజెక్ట్ స్నో లెపర్డ్ (మంచు చిరుత):** మన దేశంలో మంచు చిరుతల సంరక్షణకు 2009, జనవరి 20న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

- ఇందులో భాగంగా ఐదు రాష్ట్రాల్లో మంచు చిరుతలను కాపాడుతున్నారు. అవి..
  1. జమ్ముకశ్మీర్ 2. హిమాచల్‌ప్రదేశ్
  3. ఉత్తరాఖండ్ 4. ఉత్తరప్రదేశ్
  5. అరుణాచల్‌ప్రదేశ్

దేశంలోని వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు

గతంలో అత్యధిక జీవ వైవిధ్యం గల భౌగోళిక ప్రాంతాలు ప్రస్తుతం మానవ కార్యకలాపాల వల్ల ప్రమాదకర పరిస్థితిలో ఉంటే వాటిని ఎకలాజికల్ హాట్‌స్పాట్స్ అంటారు.

భారత్‌లోని ప్రధాన హాట్‌స్పాట్స్..

1. ఈశాన్య హిమాలయ ప్రాంతం.
2. పశ్చిమ కనుమలు.
3. ఇండో-బర్మా ప్రాంతం.

- జన్యుపరమైన తేడాలు, జాతుల్లో వైవిధ్యం, ఆవరణ వ్యవస్థలో భిన్న గుణాలన్నింటినీ కలిపి జీవవైవిధ్యం అంటారు.

(లేదా)

ఒక ప్రదేశంలోని వివిధ జీవజాతుల సంక్లిష్ట సహచరమే జీవవైవిధ్యం.

- జీవ వైవిధ్యం అనే పదాన్ని 1986లో అమెరికా శాస్త్రవేత్త వాల్టర్ రోసెన్ ప్రతిపాదించారు.
- ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం మే 22
- మన దేశంలో జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ (ఎన్‌బీఏ) చెన్నైలో ఉంది. బయలాజికల్ డైవర్సిటీ యాక్ట్ (2002) అమల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2003లో ఎన్‌బీఏను ఏర్పాటు చేసింది.
- జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం రెండు రకాల వ్యూహాలను రూపొందించింది. అవి..
  1. ఆవాసాంతర రక్షణ
  2. ఆవాసేతర రక్షణ

1. **ఆవాసాంతర రక్షణ:** ఏదైనా ఒక భౌగోళిక ప్రాంతంలో అంతరించిపోయే ప్రమాదం ఉన్న జీవజాతులను అవే సహజ సిద్ధ పరిసరాల్లో సంరక్షించడాన్ని ఆవాసాంతర రక్షణ అంటారు. ఇందులో భాగంగా చేపట్టే కార్యక్రమాలు..
   1. బయోస్పియర్ రిజర్వ్‌లు
   2. జాతీయ పార్కులు
   3. వన్య మృగ సంరక్షణ కేంద్రాలు
2. **ఆవాసేతర రక్షణ:** ఏదైన ఒక భౌగోళిక ప్రాంతంలో అంతరించిపోయే స్థితిలో ఉన్న జీవ జాతులను వాటి సహజసిద్ధ పరిసరాలకు వెలుపల మానవ ప్రమేయంతో సంరక్షించే విధానాన్ని ఆవాసేతర రక్షణ అంటారు. ఇందులో భాగంగా చేపట్టే కార్యక్రమాలు..
   1. జంతు ప్రదర్శనశాలలు, బొటానికల్ గార్డెన్ల ఏర్పాటు.
   2. జన్యు బాంకుల ఏర్పాటు.
   3. బీజద్రవ్య బ్యాంకుల ఏర్పాటు.

1. **బయోస్పియర్ రిజర్వ్‌లు(జీవావరణ మండలాలు):** జీవరాశుల మధ్య సమగ్రతను కాపాడటం, పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య అధ్యయనం, జీవవైవిధ్య పరిరక్షణ తదితర లక్ష్యాల సాధనకు ప్రభుత్వం బయోస్పియర్ రిజర్వ్‌లను ఏర్పాటు చేసింది.

- బయోస్పియర్ రిజర్వ్‌ల సరిహద్దును పార్లమెంట్ నిర్ణయిస్తుంది. వీటిలో పర్యటనకు ఎలాంటి అనుమతులూ ఉండవు. కానీ పరిశోధనకు ప్రోత్సాహం ఉంటుంది.
- మన దేశంలో తొలి బయోస్పియర్ రిజర్వ్‌ను 1986లో నీలగిరి ప్రాంతంలో (తమిళనాడు) ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మన దేశంలో 18 బయోస్పియర్ రిజర్వ్‌లు ఉన్నాయి.
- మన దేశంలో చివరిసారిగా (2011లో) పన్నా బయోస్పియర్ రిజర్వ్‌ను ప్రకటించారు. ఇది మధ్యప్రదేశ్‌లో ఉంది.
- యునెస్కో జాబితాలో చేర్చిన భారత బయోస్పియర్‌ల సంఖ్య పది.

2. **జాతీయ పార్కులు:** వృక్ష, జంతు జాతులను; ప్రకృతి సముదాయాన్ని సంరక్షించి అభివృద్ధి చేసే ప్రాంతాలను జాతీయ పార్కులు అంటారు. ఉదా: కుద్రేముఖ్ (కర్ణాటక).

- మన దేశంలో 1936లో తొలి జాతీయ పార్క్ (Hailey National Park)ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దీన్ని జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్‌గా వ్యవహరిస్తున్నారు. ఇది ఉత్తరాఖండ్‌లో ఉంది.

బయోస్పియర్ రిజర్వ్‌లు	ఉన్న ప్రాంతం
1. నీలగిరి (1986)	తమిళనాడు/కేరళ/కర్ణాటక
2. నందాదేవి (1988)	ఉత్తరాఖండ్
3. నోక్రెక్ (1988)	మేఘాలయ
4. మానస్ (1989)	అసోం
5. సుందర్‌బన్స్ (1989)	పశ్చిమబెంగాల్
6. గల్ఫ్ ఆఫ్ మన్నార్ (1989)	తమిళనాడు
7. గ్రేట్ నికోబార్ (1989)	అండమాన్, నికోబార్
8. సిమ్లిపాల్ (1994)	ఒడిశా
9. దిబ్రూ-సైఖోవా(1997)	అసోం
10. దిహంగ్-దిబంగ్ (1998)	అరుణాచల్ ప్రదేశ్
11. పంచమర్హి (1999)	మధ్యప్రదేశ్
12. కాంచనగంగ (2000)	సిక్కిం
13. అగస్త్యమలై (2001)	కేరళ/తమిళనాడు
14. అచానక్‌మర్-అమర్ కంటక్ (2005)	ఛత్తీస్‌గఢ్ మధ్యప్రదేశ్
15. గ్రేట్ రాణ్ ఆఫ్ కచ్ (2008)	గుజరాత్
16. కోల్డ్ డెజర్ట్ (శీతల ఎడారి) (2009)	హిమాచల్ ప్రదేశ్
17. శేషాచలం కొండలు (2010)	ఆంధ్రప్రదేశ్
18. పన్నా (2011)	మధ్యప్రదేశ్

They act just like human beings!



Directions (Q. No. 1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. When we moved (1)/ we have to put (2)/ our furniture in storage (3)/ for a while. (4) No error (5)
2. She knows that (1)/ child (2)/ had been telling (3)/ stories again. (4) No error (5)
3. The only stipulation is (1)/ that the topic you choose (2)/ must be related (3)/ to yours studies. (4) No error (5)
4. We are learning to (1)/ step back from ourselves (2)/ and identity (3)/ our strengths and weaknesses. (4) No error (5)
5. Books provides (1)/ with ideas (2)/ and a stimulus (3)/ for play. (4) No error (5)
6. Children from (1)/ certain backgrounds tend for (2)/ stereotyped by (3)/ their teachers. (4) No error (5)
7. The team coach (1)/ forced to step into stop (2)/ the two athletes from (3)/ coming to blows. (4) No error (5)
8. She stationed (1)/ at the window (2)/ to await for (3)/ his return. (4) No error (5)
9. The procession (1)/ made it's stately progress (2)/ through the streets (3)/ of the city. (4) No error (5)
10. The remains (1)/ of the building (2)/ stand as a stark remainders (3)/ of the fire. (4) No error (5)

Directions (Q. No. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. These _____ are intended to smooth the ___ to a peace treaty.
    1) negotiations; path
    2) talks; pavement
    3) arbitration; road
    4) dialogues; process
    5) confrontations; dispute
12. We tried to contact all ___ students, but one or two ____ the net.
    1) former; missed
    2) passed; forgotten
    3) failed; overlooked
    4) previous; forgot
    5) former; skip
13. The findings of the report _____ slanted in favour of the manufacturers.
    1) are been 2) were been
    3) had been 4) has been
    5) is been
14. The rise in _____ is a clear _____ that the government's policies are not working.
    1) popularity; signature
    2) population; progress
    3) prices; signal
    4) people; symptom
    5) places; pause
15. Chest pains can be a _____ of heart problems.
    1) recurring tension
    2) warning signal
    3) mounting pressure
    4) indicator 5) pulsation

Directions (Q. No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. As with people some monkeys are lazy, like those who sleep all day in the zoo, and some are industrious, like the little fellows who collect pennies for the organ-grinder.
B. If you invite them to dinner, they can sit quite comfortably in real chairs and use a knife and fork exactly as you.
C. As a matter of fact, Monkeys are like people, when certain kinds of monkeys are domesticated, they act just like human beings.
D. They smoke cigars, drink beer and look almost human when dressed.
E. Sometimes he even leads them in singing, first howling some weird notes, then signaling his companions to join in the chorus.
F. In speaking of monkeys which act like human beings, mention should be made of the Brazilian monkey which often balances himself on the top of a tree and makes a speech to the monkeys below him.

16. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) D
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) F

Directions (Q. No. 21 - 25): Which of the phrases (1), (2), (3) and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error, mark (5) No correction required as your answer.

21. When I arrived, I have the sensation that she had been expecting me.
    1) has 2) will have
    3) will be having 4) had
    5) No correction required
22. We are concrete seeking new ways of expanding our membership.
    1) evidently 2) firstly
    3) vastly 4) currently
    5) No correction required
23. You will perhaps discover, that practice does help, that success does come with effort and determination and a positive mindset.
    1) has come
    2) will come
    3) would come
    4) will be coming
    5) No correction required
24. The brightest persons in a class are not always the good students.
    1) comparable2) winner
    3) best 4) active
    5) No correction required
25. I hired a cleaning lady who comes in twice a month and is now in disposable.
    1) indisposable 2) indisputable
    3) indispensable 4) incorrigible
    5) No correction required

Directions (Q. No. 26-30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

Delivering mail to small villages in India was once a difficult, **perilous** and exciting job. The postman traveled on foot, often wading through swamps or crawling through jungles in order to reach the many villages on his route.

The Indian mailman might sometimes encounter a fierce tiger or panther along the way, yet the only weapon he carried was a sharp spear. He never went to work without his bells, which he would shake in order to **ward off** evil spirits. Wild animals or evil spirits, nothing ever interrupted his work.

The Indian letter carrier was an honoured and respected person; he was treated with great courtesy. So wise he thought to be that he was frequently called upon to solve the village disputes.

It is certainly evident that only a very brave man would take a job that **compelled** him to fight off wild animals in order to get his work done. You can understand why everyone in India looked upon the man who delivered mail as a true national hero.

26. Which statement is true?
    a. Mailmen in India were considered heroes.
    b. Some people in India used to believe in evil spirits.
    1) Only a 2) Only b
    3) Both a and b
    4) Neither a nor b
    5) Either a or b
27. Which statement is false?
    a. The letter carrier was often asked to settle disputes in the villages that he visited.
    b. An Indian mailman used to carry modern weapons as protection against wild animals.
    1) Only a 2) Only b
    3) Both a and b
    4) Neither a nor b
    5) Either a or b
28. The synonym of **ward off** is
    1) Encourage 2) Protest
    3) Keep 4) Deflect
    5) Depend
29. The antonym of **perilous**
    1) Hazardous 2) Bounty
    3) Terrifying 4) Harmless
    5) Detrimental
30. The antonym of **compelled**
    1) Obliged 2) Constrained
    3) Bound 4) Chained
    5) Liberated

Directions (Q. No. 31-40): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

A professor at an eastern college _____ (31) that the special sense the visually challenged people _____ (32) on is connected in some way with ___ (33) hearing. The professor _____ (34) described 1500 tests in which blind people and people with normal sight, but blindfolded, _____ (35) to avoid walking into walls. The visually challenged passed the tests with greater ____ (36) than those who could see. The blind would _____ (37) forward confidently, sensing the wall when they were as much as fifteen feet _____ (38) it. They claimed that their ears sent them a warning _____ (39) that the wall was near. This seems quite possible, for when their ears were covered so that they could not hear; they often ran right _____ (40) the wall. You can imagine how valuable this strange power must be to the blind. Do you think that it is nature's way of making up to them for their lost sight?

31. 1) believes 2) deem
    3) judge 4) accept 5) doubt
32. 1) grasp 2) depend
    3) relay 4) reel
    5) realize
33. 1) there 2) they
    3) their 4) them 5) that
34. 1) lately 2) newly 3) just
    4) recently 5) freshly
35. 1) attempt 2) attempting
    3) attempts 4) will attempt
    5) attempted
36. 1) ease 2) difficulty
    3) effort 4) relieve
    5) alleviate
37. 1) stepping 2) stride
    3) tramp 4) tumble
    5) amble
38. 1) through 2) thorough
    3) from 4) away 5) apart
39. 1) memo 2) letter
    3) meaning 4) message 5) point
40. 1) inside 2) outside
    3) inwards 4) in 5) into

Directions (Q. No. 41-42): choose the wrongly spelt word from the five options given.

41. 1) Cemetery 2) Scenary
    3) Scenario 4) Composure
    5) Predicament
42. 1) Stationery 2) Stationary
    3) Impeccabal 4) Juggernaut
    5) Delicious

Directions (Q. No. 43-45): In each of the following four sets of words a set is either synonymous or antonymous, identify that set and mark your answer.

43. 1) Luscious; Sacrilege
    2) Prophecy; Luxurious
    3) Somersault; Impediment
    4) Obnoxious; Abhorrent
    5) None of these
44. 1) Atrocious; Oblige
    2) Entourage; Tourist
    3) Ensemble; Entangle
    4) Pilfer; Embezzle
    5) None of these
45. 1) Ensconce; Shelve
    2) Acrimonious; Corrigible
    3) Sanctimonious; Succulent
    4) Corrigendum; Adjudicate
    5) None of these

Answers

1) 2; 2) 1; 3) 4; 4) 3; 5) 1; 6) 2; 7) 2; 8) 3; 9) 2; 10) 3; 11) 4; 12) 1; 13) 3; 14) 3; 15) 2; 16) 4; 17) 2; 18) 5; 19) 3; 20) 1; 21) 4; 22) 4; 23) 5; 24) 3; 25) 3; 26) 3; 27) 2; 28) 4; 29) 4; 30) 5; 31) 1; 32) 2; 33) 3; 34) 4; 35) 5; 36) 1; 37) 2; 38) 3; 39) 4; 40) 5; 41) 2; 42) 3; 43) 4; 44) 4; 45) 1.